కురుమద్దాలి విజయలక్ష్మి



# హిమసుందరి

# హిమ సుందరి

___కురుమద్దా లి

విజయలక్ష్మి

"ఏమిటి విషయం?" అన్నట్లు కనుబొమలు ఎగరేసి, స్కూటర్ లాక్ చేస్తూ అడిగాడు రామకృష్ణ.

"ఏముంది?" అంది సీత.

"మామ్మగారితో బాగా కాలక్షేపం అవుతున్నట్లు ఉంది?"

"నా కాలక్షేపం సంగతి అలా ఉంచండి. మీరేమిటి - ఇవాళ ఇంటికి తొందరగా వచ్చారు?"

"హా - హతవిధీ!"

"ముందా నాటకాల భాష, ఓవర్ ఏక్షన్ మానేసి- విషయానికి రండి!"

"ఆఫీస్ నుంచి భర్త తొందరగా ఇంటికి రాకపోతే భార్య బాధపడుతుంది. నాలాంటి భార్యావిధేయుడు బిఫోర్ టైము అఘోరిస్తే - వచ్చినందుకు సంతోషించక - ముందే ఎందుకు వచ్చారంటూ కళ్ళెర్రజేస్తే - తల పట్టుకుని హా - హతవిధీ! అంటే తప్పయిందా?"

"నేను కళ్ళు ఎర్రజేశానా?" సీత రామకృష్ణ ముఖంలో ముఖంపెట్టి మరీ అడిగింది.

"మరి నీ కళ్ళు ఎర్రగా ఉన్నాయి కదా!"

"ఉదయం తలంటి పోసుకుంటుంటే కుంకుడు పులుసు కళ్ళల్లో పడి కళ్ళు ఎర్రబడ్డాయి."

"ఆ విషయం నాకేం తెలుసు? అయినా అసలే పెద్ద కళ్ళు. ఆ కళ్ళని అలా తెరిచి పెట్టుకుని తలంటి ఎవరు పోసుకోమన్నారుట?"

"నేను కళ్ళు తెరుచుకుని పోసుకున్నానో - కళ్ళు మూసుకుని పోసుకున్నానో మీరు చూశారా?"

"నన్నెప్పుడయినా అలాంటి సీను చూడనిచ్చావా! ఓ సమయంలో భర్తముందు పూర్తిగా సిగ్గు విడిచేసిన భార్య స్నానం చేసేటప్పుడు మరికొన్ని సందర్భాలలో భర్తని దూరంగా...."

"సెన్సార్!" అరిచింది సీత.

రామకృష్ణ సీరియస్ గా ముఖంపెట్టి - "కష్టపడి సినిమా తీసినవాళ్ళు సెన్సార్ బోర్డ్ వాళ్ళని ఎందుకు తిడతారో ఇప్పుడు అర్ధమయింది, నిజాన్ని వాళ్ళు భరించలేరు. నీవూ అంతే!" కోపంగా అని బెడ్ రూమ్ లోకి వెళ్లాడు.

సీత "హూ" అంది. పైటకి దుమ్ము, ధూళి లేకపోయినా కోపంతో గట్టిగా విదిలించి, విసవిస నడుస్తూ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

రామకృష్ణ, సీతా మనోహరి మూడు నెలలనుంచి కలసి కాపురం చేస్తున్న కొత్త దంపతులు. కలసి ఉంటే కలదు సుఖం అన్నది వాళ్లకి ఈ మూడు నెలల బట్టి తియ్యటి అనుభవం. పోట్లాడుకుని విడిపోయి, కోపంతో పళ్ళు నూరుకుని ఆ తర్వాత కలుసుకుంటే ఆ ఆనందం, ఆ అనుభవం, ఆ అనుభూతి మా గొప్పగా ఉంటాయని ఓ దిక్కుమాలిన గొప్ప తెలుగు నవలలో రామకృష్ణ, సీతామనోహరి చదివారు. వాళ్లకి ఇంతవరకూ ఏ విషయంలో పోట్లాటరాలేదు, కోపమూ రాలేదు. ఆలాంటప్పుడు కోపంతో విడిపోయి కలుసుకుని, ఆ మధురం ఎలా చవి

చూడాలి? అందుకే తోచీ తోచనమ్మ తోడికోడలి పుట్టింటికి వెళ్ళినట్లు వీళ్ళిద్దరూ ఆ కొత్త అనుభవం చవి చూడాలని ఎవరికి వారే శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

ఆ ప్రయత్నంలో భాగమే ఇప్పుడు జరిగింది.

రామక్రిష్ణ ఆఫీస్ డ్రస్ మార్చేసి, మధుర ప్రింట్స్ ఉన్న లుంగీ, మల్లె పూవురంగు లాల్చీ ధరించి వంటింట్లో కి వచ్చి డైనింగ్ టేబిల్ ముందు కుర్చీలో కూర్చుంటూ "లాభం లేదు సీతా!" అన్నాడు.

"నిజమే!" అంది సీత.

"మనకీ జన్మకి కోపం రాదు."

"వస్తుంది పరాయి వాళ్ళమీద.... అంతేగాని- మీ మీద నాకు, నామీద మీకూ మటుకు కోపం రాదు."

"అంతేనా?" దిగాలు పడిపోతూ అడిగాడు రామకృష్ణ.

"ఈ జన్మకి ఇంతే. దేనికయినా యోగం ఉండాలి. పెట్టి పుట్టాలి" విచారంగా ముఖంపెట్టి భారంగా పలికింది.

క్షణకాలం బరువుగా నడచిపోయింది.

ఇరువురూ ఒకరినొకరు ప్రేమగా చూసుకుంటూ ఫక్కున నవ్వుకున్నారు.

"ఈ రోజు టిఫెన్ ఏమిటి?" రామకృష్ణ అడిగాడు - నిమ్మకాయని కోస్తున్న సీతను చూస్తూ.

"చాలా తెలుగు నవలల్లో రచయిత్రులు రాసేదే" చెప్పింది సీత.

"ఏమిటి ఉప్మానా!" రామకృష్ణ అరకిలో ఆముదం పుచ్చుకున్నవాడిలా డీలాపడిపోతూ అన్నాడు.

"తగిన జీడిపప్పు తగిలించే చేశానులెండి డోంట్ వర్రీ.... ఈ ఇంట్లో ఉప్మా చేసి నెలా పదకొండు రోజులు అయింది. ఓరోజు దోశ, మరో రోజు ఇడ్లీ, ఆ తర్వాత ఊతప్పం, నిమ్మకాయ పులిహోర, మసాలా పకోడి, న్యూడిల్స్, రొట్టె, ఆటాబోండా, పెరుగు గారే, కట్ లెట్, పునుగులు - ఇన్ని రకాలు చేసి పెట్టాను. వీటన్నిటి మధ్య ఓరోజు ఉప్మా చేస్తే ఎందుకండీ - అలా దివాలా తీసినవాడిలా ముఖం పెడతారు?" అంటూ సీత ఉప్మాప్లేట్లు రెండు తీసుకు వచ్చి భర్తకి ఒకటి ఇచ్చి తానొకటి తీసుకుంది.

ముందుగా ఉప్మాలోని జీడిపప్పు ఏరుకుని తింటూ "నాకు తెలియక అడుగుతాను - చాలామంది రైటర్స్ తమ నవలల్లో టిఫెన్ గురించి రాయాల్సి వస్తే తగిన జీడిపప్పు వేసిన ఉప్మా అని రాస్తారు ఎందుకు? వాళ్ళకి అంతకు మించి టిఫెన్ చేయటం రాదా?" అడిగాడు రామకృష్ణ.

"కొందరికి చేయటం రాక - మరికొందరికి జీడిపప్పు దండిగా వేసుకుని ఉప్మా చేసుకు తెనాలన్న ఆశ. జీడిపప్పు కొనలేక కొందరు. ఉప్మా అయితే చేయటం తేలిక. రాయటం తేలిక అని కూడా కావచ్చు. ఉప్మాకి, రచయిత్రికి అసలు సంబంధమే లేదు. మసాలా పకోడీ, బాసుంది, పెరుగు గారె, జాంగ్రీ, ఆలు బోండా, మైసూర్ పాక్ - అంటూ గొప్పగా స్వీటు, హాటు రాసే రచయిత్రి - ఇంట్లో రోజు అలా చేసుకు తింటుందంటారా? అంతా హంబక్!" అంది సీత.

"వాళ్ళిలా అఘోరిస్తే నాకెందుకు గాని - ఇది మాత్రం చాలా అన్యాయం సీతా!" అన్నాడు రామకృష్ణ.

"ఏది- ఉప్మా చేయటమా?"

"ఊహు! ఉప్మా తినటానికి పెట్టి, రకరకాల టిఫెన్ పేర్లు నోరూరేలా చెప్పటం!"

"సారీ అండీ!" అంది సీత, మూతి సున్నాలా అందంగా చుట్టి.

"ఎంత అందంగా వుందో!" అన్నాడు రామకృష్ణ.

"ఏమిటి, ఉప్మానా!"

"ఉహూ! నీ మూతి."

సీత కిల కిల నవ్వింది.

"ఇలా నీవు నా హృదయం కదలిపోయేలా కిలకిల నవ్వుతూ నా ఎదురుగా కూర్చుంటే ఉప్మా ఏం ఖర్మ - విషం కూడా అమృతంలా పుచ్చుకోగలను." స్పూనుకి, నోటికి చక చక పని కల్పిస్తూ అన్నాడు రామకృష్ణ.

"నిమ్మకాయ తక్కువ అయిందేమో - పైత్యం ప్రకోపించింది" అంటూ మరోసారి కిలకిల నవ్వింది సీత.

## 2

సాధారణంగా ప్రతి ఆడపిల్లకి కాపురానికి రాంగానే అత్తవారిల్లు అనబడే ఆ కొత్తచోట ఇమడడానికి కాస్త టైము పడుతుంది. కొందరికి చిన్న సమస్యలు ఎదురయితే - మరికొందరికి పెద్ద సమస్యలు భయంకరంగా కనిపిస్తాయి.

అత్తవారింట్లో వాతావరణందేముంది - అత్త, మామ, మరిది, ఆడబడుచు, బావగారు, తోడికోడలు- రకరకాల మనస్తత్వాలు - సూటిపోటీ మాటలు, వాళ్ళ పద్ధతులు - ఇలా ఎన్నో సమస్యలు! అన్నింటినీ ఎదుర్కోవాల్సి వస్తుంది

సీతకి అత్తగారి ఇల్లు ఉంది దాని తాలూకా మనుషులూ ఉన్నారు. అయితే అత్తవారిల్లు పల్లెటూరిలోనూ, ఆడబదుచు పెళ్ళయి బొంబాయిలోను, ఓ బావగారు కలకత్తాలోనూ - అలా తలా ఒక

చోట ఉన్నారు.

సీత భర్తతో పాటు విజయవాడలో ఉంది.

సీతామనోహరి, రామకృష్ణ ఇద్దరే ఇద్దరు. మూడో ప్రాణిగా కుక్క, పిల్లిలాంటివి కూడా లేవు.

సీతకి నవలలు, సినిమాలు ఇష్టం.
రామకృష్ణకీ అంతే - సరీగా ఆ రెండే ఇష్టం!

రామకృష్ణ పది గంటలకి భోంచేసి స్కూటర్ మీద రయ్యిన తిరిగి వస్తాడు. వస్తూ ఆఫీసుని వార, మాసపత్రికలు, నవలలు తెస్తాడు.

సీతకి మంచి పనిమనిషి దొరికింది. అంట్లగిన్నెలు కడగటం, ఇల్లు తుడవటం, పంపునీళ్ళు అన్నింట్లో పట్టి నింపటం కాక, ఇంట్లో నేబట్టలు కూడా ఉతుకుతోంది. ఉదయం వచ్చినప్పుడు ఉతికి ఆరేసి- మధ్యాహ్నం వచ్చినప్పుడు తీసి మడతలు కూడా పెట్టి అందిస్తుంది.

సీతకి వంట తప్పించి వేరే పనంటూ లేదు. రామకృష్ణకీ ఆఫీసు తప్పించి వేరే పనిలేదు. దాంతో ఎన్ని సినిమాలు చూసినా - వార, మాస పత్రికలు కరకర నమిలేస్తూ, నవలలు తెగ దిగమింగేస్తూ- ఎన్ని చేసినా సమయం మిగిలిపోతూనే ఉంది.

ఇద్దరూ హాస్యప్రియులు, సరదావాళ్ళు కావటం - పైగా కొత్త కాపురం. దాంతో కోపతాపాలకు, సూటిపోటి మాటలకి వాళ్ళ మధ్య తావులేకుండాపోయింది.

ఓరోజు "నాకేం తోచటం లేదు" అంది సీత.

"నాకూ అలాగే ఉంది" అన్నాడు రామకృష్ణ.

వీళ్ళిలా బోర్ ఫీలవుతున్న సమయంలో ఓ నవల చదివారు. దాంతో భార్యాభర్తలు కోపంతోనూ, అపార్థాలతోను విడిపోయి - ఆ తర్వాత నిజం గ్రహించి దగ్గర అయితే ఆ భార్యాభర్తల కలయిక మహా అద్భుతంగా ఉంటుందని, అది ఎలా ఉంటుంది అన్నది వర్ణింప శక్యంకాదని, అనుభవంలోనే ఆ మధురానుభవం చవిచుడాల్సిందే గాని...... అంటూ ఓ రచయిత్రి తన కలాన్ని నొక్కి రాసి వక్కాణించింది తన నవలలో.

అది చదివి -

"మనమధ్య కోపం చోటుచేసుకుంటే బాగుండును" అంది సీత సీరియస్ గా.

"కోపం కన్నా అపార్థం అయితే బాగుంటుందేమో!" సాలోచనగా అన్నాడు రామకృష్ణ.

"ముందు కోపం చూద్దాము. అది బాగుంటే అపార్థం దాకా వోదాం!" అంది సీత.

"నీ ఇష్టం!" అన్నాడు రామకృష్ణ.

అదే మొదలు వాళ్ళు కోపం గురించి చాలా ట్రై చేస్తున్నారుగాని, అదేం పాపమో - వాళ్లకి కోపగించుకునే విషయాలలో కూడా నవ్వు రావటం మొదలుపెట్టింది. దానికి కారణం వాళ్ళు తొందరలోనే గ్రహించారు. ఫలానా విషయంలో కోపగించుకోవాలని ముందే అనుకోవటం వల్ల - అదేదో నాటకం ఆడినట్లు ఉండి, దాంతో వాళ్ళు నవ్వాపుకోలేకపోయేవారు. దాంతో ఆ సీను రసాభాస అయేది.

ఓరోజు తెలిసిన దూరపు బంధువు వాళ్ళింటికి వచ్చాడు.

"కాఫీ తీసుకురా!" అన్నాడు రామకృష్ణ.

సీత బూస్ట్ కలుపుకు వస్తూ గుమ్మం తగిలి, కప్పుని జారవిడిచింది. ఆ సమయంలో ఎవరూ లెక్కపెట్టలేదు గాని, కప్పు వేయి ముక్కలయి ఉంటుంది. మ్యాప్ బొమ్మ అత్యంత ఆకర్షణీయంగా నేలమీద గీసినట్లు - నేలపాలయిన బూస్ట్ నేలమీద పరచిన ఇండియా మ్యాప్ లా తయారయింది.

"అయ్యయ్యో!" అంది సీత.

"ఎందుకు అయ్యయ్యో! నిమ్మదిగా నడిస్తే ఏంపోయింది? అన్నింటికీ కంగారే! గాజు కప్పేగాక, చిక్కటి కప్పు కాఫీ కూడా నాశనం" అన్నాడు రామకృష్ణ.

"అది కాఫీ కాదు - బూస్ట్!" నెమ్మదిగా చెప్పింది సీత.

"నేను కాఫీ తెమ్మంటే నీవు బూస్ట్ ఎందుకు తెచ్చావు?"

"కాఫీ పొడి లేదు."

"అయిపోతే చెప్పాలని తెలియదా?"

"మర్చిపోయాను."

"మర్చిపోతావు, మర్చిపోతావు! నేనో వెధవని వున్నాగా - నీవేం చెప్పినా తేవటానికి. అసలు మీ ఆడజాతికి భర్త అంటే భయభక్తులు, పిసరంత గౌరవం కూడా లేదు. కాఫీ తెమ్మంటే బూస్ట్ తెస్తారు. బూస్ట్ తెమ్మంటే బోర్నవీటా కలిపి తెస్తారు. అవునంటే కాదనటంలో ఆడజాతిదే అగ్రతాంబూలం!"

"అదికాదు...." గాజు పెంకులు ఏరుతూ అంది సీత.

"అదికాదు, ఇదికాదు- నువ్వు ఏది చెప్పవద్దు. పగలంతా నీవు చేసేపని ఏముంది - మంచమెక్కి దొర్లటం తప్ప! ఇంట్లో ఏం సరుకు నిండుకుందో చూసుకోనక్కరలేదా? అడ్డమయిన వెధవ నవలలన్నీ చదువుతూ, పగటికలలు కంటూ - ఛీ..... ఛీ..... మీలాంటి వాళ్ళని రోజుకోసారి అయినా వీపు సాఫీ చేస్తే గాని మాట వినరు!" కోపంతో ధూం ధాం అంటూ మగాణ్ణి అనే అహం ముఖంనిండా పరుచుకోగా రామకృష్ణ అన్నాడు.

"ఇలా వాగితే నేను మా పుట్టింటికి పోతాను...." చర్రుమని పైకిలేస్తూ అంది సీత.

"పోతే పో! నీవు లేకపోతే నాకు జరగదా?" అన్నాడు రామకృష్ణ.

"పోనీలే బాబూ! ఇంత చిన్న విషయానికి జీవితాంతం కలసి కాపురం చేయవలసిన దంపతులు కొట్టుకోటం ఏం బాగుండలేదు. నాకు బూస్ట్ ఇచ్చినా తాగుతాను, హార్లిక్స్ ఇచ్చినా తాగుతాను. ప్రస్తుతం ఏది వద్దు పొరపాటున కప్పు బద్దలయినంత మాత్రాన అమ్మాయిని నీవు అంతగా కోప్పడటం న్యాయం కాదు. నీవు తొందరపడి కోపగించుకున్నా - అమ్మాయి వెళతానని బెదిరించటమూ సవ్యంగా లేదు" అంటూ చిన్న బుచ్చుకున్న ముఖం వేసుకుని చుట్టం ఏదో చెప్పాడు.

తమ మధ్య చుట్టం అనే మూడో మనిషి ఉన్నట్లు అప్పుడు గుర్తించిన సీత, రామకృష్ణ ముందు తెల్లబోయి, ఆపై తెప్పరిల్లి, బోలెడంత సిగ్గుపడి, ఆపై పక్కున నవ్వారు.

ఈ తఫా తెల్లబోవటం చుట్టం వంతయింది.

సీత మళ్ళీ బూస్ట్ కలుపుకు వచ్చే లోపల రామకృష్ణ సిగ్గుపడుతూ అసలు విషయం చెప్పాడు.

"మీ కోపం దొంగలుతోలా! ఇదెం కోరికర్రా మీకు! సంసారంలో ఏ పొరపొచ్చాలు లేకుండా ఉండాలని ప్రతివాళ్ళూ కోరుకుంటారు. మీరేమో కోపాలు, అపార్థాలు అంటూ కోరరాని కోరికలు కోరుకుంటున్నారు. భార్యాభర్తల మధ్య అపార్థాలు, అనుమానాలు ఉండకూడదు. ఉన్నాయా - అవి ఎంత దూరం లాక్కెళ్ళాలో అంత దూరం లాక్కెళ్ళి సర్వనాశనం చేస్తాయి. సంసారం అంటే అద్దంమీద ఆవగింజ అనుకో - " అంటూ చుట్టంగారు వేడి వేడి బూస్టు తాగుతూ చల్ల చల్లగా చివాట్లు పెట్టాడు.

ఆ సంఘటనతో రామకృష్ణ, సీత సిగ్గు తెచ్చుకున్నారు.

చుట్టంగారు వెళ్ళిం తరువాత "నీవు ఆయన్ని మర్చిపోయావా?" అన్నాడు రామకృష్ణ.

"కోపంతో వెలిగిపోతున్న మీ మోము చూస్తూ పరిసరాలు మర్చిపోయాను!" ముద్దు ముద్దుగా చెప్పింది సీత.

"నేనూ అంతే సీతా! కోటి సూర్యుళ్ళ కాంతి నీ మనోహరమయిన మోము నందు ప్రతిబింబిస్తుంటే- నిన్ను కోప్పడుతూ నన్ను నేనే మర్చిపోయాను!" రామకృష్ణ చెప్పాడు.

"ఈరోజు నుంచీ ఉత్తుత్తి నాటకాలు మన మధ్య వద్దు బాబూ!" అంది సీత.

"నీ ఇష్టమే నా ఇష్టమమ్మా సీతామనోహరి!" అన్నాడు రామకృష్ణ.

అది జరిగింతరువాత వాళ్ళెప్పుడూ ఉత్తుత్తి కోపాలు కొని తెచ్చుకోలేదు.

వాళ్ళ కోరిక వద్దనుకుంటున్న సమయంలో ముందు ముందు తీరనుంది. వాళ్ళ పాలిట అది పెద్ద శిరోవేదన. సంసారం అన్న తర్వాత కొన్ని తప్పవు మరి.

# 3

"నాకు హేమామాలిని, ధర్మేంద్ర జంట ఇష్టం. వాళ్ళున్న పిక్చర్ కి వెళదాము" అంది సీత.

"నాకు రేఖ, అమితాబ్ ల పిక్చర్ ఇష్టం. దానికి వెళదాం" అన్నాడు రామకృష్ణ.

"ఊహు, నేను రాను."

"నేనక్కడికి మహా వస్తున్నట్లు-"

"హేమామాలిని చూస్తూ కూర్చోవచ్చు."

"రేఖ చూపులు చాలు - చూస్తూ కూర్చోటానికి....."

"గడకర్రలా అమితాబ్...."

"సత్రకాయలా ధర్మేంద్ర లేడూ!"

ఇద్దరూ కాసేపు వాదులాడుకున్నారు. సీతామనోహరికి, రామకృష్ణకీ చెరో జంట ఇష్టం. ఆ సాయంత్రం పిక్చర్ కి వేళదామనుకున్నారు. ఫలానా జంట ఉన్న ఫలానా పిక్చర్ కి వెళదామని కాసేపు వాదించుకుని - చివరికి మీ ఇష్టం అంటే మీ యిష్టంలో దిగారు.

"హేమామాలిన్ని చూడటానికి వస్తాలే" అంటే - రేఖను చూడటానికి నేను రెడీ అయితే!" అంది సీత.

ఇలా పరస్పరం గౌరవించుకున్నారు గాని - ఒక అభిప్రాయానికి రాలేకపోయారు. దాంతో రూట్ మార్చి - ఏకాభిప్రాయానికి వచ్చి తెలుగు సినిమాకి బయలుదేరారు.

సీత, రామకృష్ణ స్కూటర్ ఎక్కి ఆఘమేఘాల మీద హాలు దగ్గరకు వచ్చేసరికి - భారతదేశం జనాభా మొత్తం ఆ హాలులో దూరి తలదాచుకున్నట్లు - హాలు నిండింది అన్న బోర్డు అందంగా దర్శనం ఇచ్చింది.

వీళ్ళు అర్జంటుగా తిరుగు టపాలో బయలుదేరుతుంటే వాడెవడో బ్లా కులో నాలుగు టిక్కెట్లు ఉన్నాయన్నాడు.

"రెండు చాలు. అదే మహాప్రసాదం!" అని టిక్కెట్లు పుచ్చుకుని హాలులో దూరారు.

హాలులో వరసగా నాలుగు సీట్లు ఉన్నాయి. అయితే అవి గోడపక్కగా ఉన్నాయి.

చివరి సీట్లలో కూర్చోటం సీతకి ఎంత వళ్ళుమంటో - రామకృష్ణకీ అంతే - అంతకి అంత వళ్ళుమంట.

అదే సమయంలో మరో భార్యా, భర్త వచ్చారు. టిక్కెట్స్ మీద ఉన్న నెంబరు ప్రకారం అయితే సీతా వాళ్లకి గోడపక్క సీట్లు వచ్చాయి.

అంభంలో కుంభం - ఆదివారంలో సోమవారం సామెత గుర్తు తెచ్చుకుని సీత గొణగబోయింది.

అంతలో వచ్చినాయన రామకృష్ణతో "మేము ఇటు కూర్చుంటాము. మీరు అటు కూర్చుంటారా?" అని మర్యాదగా అడిగాడు.

సమయానికి చేతిలో దండ లేదు గాని- ఉన్నట్లయితే రామకృష్ణ అతగాడి మెడలో వేసి, గట్టిగా ఆలింగనం చేసుకుని గాడంగా ముద్దు పెట్టుకునేవాడే!

మహాప్రసాదం లాంటి మాట వాడితే అతగాడికి అర్థం కాదేమోనని, ఒక్క ముక్కలో ఓకే అనేశాడు రామకృష్ణ.

ఆ జంట అటు - ఈ జంట ఇటు కూర్చున్నారు.

తెరమీద న్యూస్ రీలు అయిపోయి - డాం డాం చప్పుళ్ళతో తుపాకీ రాముడు సినిమా మొదలయింది. తుపాకీ రాముడు వాల్ పోస్టర్ల మీద కొందరు కొంటె కుర్రాళ్ళు "తు" మీద పెడ, బురద పులుమి ఆ సినిమా పేరు మార్చిపారేశారు.

అది గుర్తొచ్చి రామకృష్ణ కి నవ్వు వచ్చింది.

తుపాకీ రాముడు సినిమాలో ఆడపిల్లలంతా పిచ్చి పట్టినట్లు హీరో చుట్టూ తిరుగుతూ నన్ను పెళ్ళి చేసుకోమని ఒకతి, పెళ్ళాడటం ఇష్టం లేకపోతే ఒక్కసారి నా కోర్కె తీర్చమని మరొకతే ఏకంగా అతగాడి మీదపడి

ముద్దు పెట్టుకుంటూ వేరే ఒకతి. ఇలా వేషాలు వేస్తుంటారు. హీరోతుపాకి రాముడు తాను ఏక పత్నీ వ్రతుడినని, శిలవంతుడినని చెపుతూ - ఆడపిల్లల తొంట్లమీద దరువేస్తూ, జబ్బ పట్టుకుని మీదకి గుంజుకుంటూ బుగ్గలు పిండుతూ, ద్వందార్థం మాటలు విసురుతూ వెర్రి గంతులతో హాలు హోరేత్తిస్తున్నాడు

"అదృష్టం అంటే అలా ఉండాలి!" కళ్ళు పత్తి కాయల్లా చేసుకుని, తెరమీద నుంచి దృష్టి మళ్లించకుండా అన్నాడు రామకృష్ణ.

"ఎలా?" అడిగింది సీత.

"ఆడవాళ్ళందరినీ ఎలా నలిపి పారేస్తున్నాడో చూడు" అన్నాడు రామకృష్ణ.

"అది అదృష్టమా?"

"కాదా?"

"అలా అయితే ఓ పని చేయండి. నే పక్కన లేకుండా చూసి ప్రాక్టికల్ గా అలాంటి పనులు చేసి చూడండి."

"చావగొట్టి చెవులు మూస్తారు. అయినా నేను రామనామదేయుడిని. ఏక పత్నివ్రతుడిని."

"మంచిది మరి అలాంటప్పుడు దిక్కుమాలిన సీనులు చూసి గుటకలు మింగకూడదు - అందునా అందమయిన పెళ్ళాం పక్కన ఉన్నప్పుడు వెర్రి మొర్రి వేషాలు అసలు వేయకూడదు!" సీత సన్నసన్నగా చివాట్లు పెట్టింది.

"గుర్తుంచుకుంటాను - " అన్నాడు రామకృష్ణ.

రామకృష్ణ కి గాని, సీతా మనోహరికి గానీ ఊరికే కూర్చుంటే బొత్తిగా తోచదు. పక్క పక్కన ఉన్నారంటే కిచ కిచ లాడుకోవాల్సిందే.

తమ మాటలు ఎవరయినా వింటారేమోనని తల, తల పక్కకు చేర్చి కువ కువ లాడుకుంతుంటే- వెనుకనున్నాయన బొత్తిగా మంచి, మర్యాద లేకుండా "తలలు సరిగా పెట్టుకోండి" అన్నాడు కాస్త గట్టిగానే.

దాంతో వీళ్ళిద్దరూ సిగ్గుపడి, ఎవరి తల వాళ్ళు సరీగా పెట్టుకుందే కాక - ఆ ఘళాన నోరు మూసుకున్నారు.

దాంతో వీళ్ళలో కొత్త విషయం అర్ధమయింది - తమ పక్కన ఉన్న జంట కూడా ఏదో మాట్లాడుకుంటున్నదని.

పక్కవాళ్ళ మాట వినటం మహా పాపం అని రామకృష్ణకి, సీతకి తెలుసు. అదేం పాపమో గాని, పనిగట్టుకు వినకపోయినా వాళ్ళ మాటలు వచ్చి వీళ్ళ చెవుల్లో దూరుతున్నాయి.

తెరమీద దొంగల స్థావరంలో దొంగ పిల్లిలా ప్రవేశించిన తుపాకీ రాముడు దొంగపిల్లిలా చడీ, చప్పుడు కాకుండా నడుస్తున్నాడు. అందువల్ల వాయిద్యాల చప్పుడు లేదు. దానివల్ల వాళ్ళ మాటలు వినపడుతున్నాయి. పైగా వాళ్ళు పరిసరాలు మరచి మాట్లాడుకుంటున్నారు

"క్రితం వారమూ అంతే - సినిమా మధ్యలో తీసుకు వెళ్ళారు. ఈ ఒక్కసారికి...." ప్రాధేయపూర్వకంగా అంటున్నది భార్య.

"పేరు చూడబోతే ఉత్తమ ఇల్లాలు- సీన్ లు చూడబోతే అన్నీ సెక్స్ దృశ్యాలే అందువల్ల ఆ సినిమా మధ్యలోంచి లేచిరాక తప్పలేదు. జన్మనిచ్చిన దేవత సినిమాకని వస్తే అది ఎప్పుడో పోయిందని చెప్పారు. డైలీ పేపరులో మాత్రం సినిమా ఉన్నట్లు రాసి తగలేట్టారు. లే లే - వెళదాం!"

"ఈ సినిమాలో సెక్స్ లేదుకదండీ!"

"సెక్స్ లేదా! వాడు ఆడపిల్లలమీద అందిన చోటల్లా దరువు వేస్తుంటే ఛీ...... ఛీ..... ఇలాంటివి చూసే సగంమంది ఆడవాళ్ళకి వికృతమైన కోరికలు పుట్టేది. పద పద చాలా నీతివున్న సినిమా అని ఆ గడ్డే కొడుకు చెపితే వచ్చాను. నేను వెళుతున్నాను....." అంటూ అతను లేచాడు.

ఆమె లేచి నిండా పమిటి కప్పుకుని తల వంచుకుని అతని వెనుకే బైటికి వెళ్ళిపోయింది.

రామకృష్ణకి ఏమీ పట్టలేదు గాని సీతకి మాత్రం వాళ్ళంతా కారం రాచుకున్నట్లు అనిపించింది.

సినిమా పూర్తి అయిందాకా ఇంటికి వచ్చి భోజనం పూర్తి అయిందాకా మౌనంగా వున్న సీత బెడ్ రూమ్ లోకి వచ్చిం తరువాత ఏమాత్రం ఆలస్యం చేయకుండా అడిగింది. "మీకేమనిపించింది?"

"ఏదో కాలక్షేపంగా చూశాము. అంతే ఇలాంటి సినిమాలు గురించి స్పెషల్ గా అనిపించటాలు ఉండవ్!" అంటూ రామకృష్ణ సీత చెయ్యి పుచ్చుకుని దగ్గరగా కూర్చోపెట్టుకున్నాడు.

సీత మంచం మీద జరిగి కూర్చుని "నేను దిక్కుమాలిన తుపాకీ రాముడి గురించి అడిగానా?" అంది.

"మరి దేన్నీ గురించి ఏదేదో అనిపించటం! ఓహో అమ్మాయిగారి అందాల గురించా!"

"కాదు..... కాదు..... కాదు......"

"అలా అరవకు సీతా! ఇరుగు పొరుగు వింటే నిన్ను నే కొడుతున్నారనుకుంటారు. అర్ధరాత్రి మద్దెల దరువులా, సరేలే అలా కోపంగా చూడక విషయం చెప్పు."

విషయమేమిటో భర్తకి అర్ధం కాలేదని సీత గ్రహించింది.

"సినిమా హాల్లో ఆ మొగుడు పెళ్లాల మాటలు విన్నారు కదా! వాళ్ళ మాటలు విని మీకేమనిపించింది?"

"ఓహో వాళ్ళ సంగతా?"

"ఆ వాళ్ళ సంగతే."

"లోకంలో సవాలక్ష రకాలు. వాళ్ళలో వీళ్లో కళ్ళు"

"అంతేనా?" నీరుగారిపోతూ అంది సీత.

"అంతే మరి" నవ్వుతూ అన్నాడు రామకృష్ణ.

"నిజంగా ఏమి అనిపించలేదా!" అనుమానం తీర్చుకోటానికి అడిగింది సీత.

"అందుట్లో అనిపించటానికి ఏముంది? సరే నీకేమనిపించిందిట?"

"నరికిపోగులు పెట్టాలనిపించింది."

"ఎవరిని?" నవ్వాపుకుంటూ అడిగాడు రామకృష్ణ.

"ఇద్దరిని."

"అదేం పాపం?"

"భార్యకి సినిమా చూడాలని వుండదా? ఆమెకి కోరికలు వుండకూడదా! భర్త అభిరుచులే భార్య అభిరుచులు కావాలా అతగాడు నుంచోమంటే నుంచుని కూర్చోమంటే కూర్చుని ఇలాంటి మగవాళ్ళని భర్త అనరు? పతిదేముడని అసలే అనరు."

"మరేమంటారుట?" ఆవేశంగా అంటున్న సీతకి అడ్డు తగులుతూ అడిగాడు రామకృష్ణ.

"పింజారి వెధవ అనాలి మళ్ళీ మాట్లాడితే నికృష్టుడు అనాలి. అతగాడికి సినిమా చూడాలనిపిస్తే ఒంటరిగా వెళ్ళి చూసి అఘోరించవచ్చు కదా తోడు పెళ్ళాం కావాలి. సినిమాలో అసభ్యమైన దృశ్యాలు కానరాంగానే పద

పద ఇలాంటివి చూస్తే ఆడవాళ్ళు చెడిపోతారంటూ గొర్రెని తోలుకెళ్లినట్లు తోలుకెల్లటం. ఈ బుద్ధి వున్న మగవాళ్ళని నరికి పోగులుపెట్టాలి. అంతేకాదు. తనకో వ్యక్తిత్వం లేక అతగాడి వెర్రి మొర్రి వెధవ బుద్ధి కి తల వగ్గుతున్న ఆమెని కూడా నరికిపోగులు పెట్టడంలో ఎంత మాత్రం తప్పులేదు."

"ఆవేశంలో చాలా ముద్దు వస్తావ్ సీతూ!" అన్నాడు రామకృష్ణ.

"కాసేపు దూరంగా ఉండి మాట్లా డండి" విసుక్కుంది సీత.

"సరే తల్లీ!" అన్నాడు రామకృష్ణ దూరం జరుగుతూ.

సీత ఎంత మంచి పిల్లో రామకృష్ణకి బాగా తెలుసు. సీతకి లోకానుభవం తక్కువ. ఎవరికో అన్యాయం జరిగితే అది తనకే జరిగినట్లు గంగ వెర్రులెత్తి గంతులు వేస్తు ంది. ముఖ్యంగా స్త్రీ జన పక్షపాతి. స్త్రీ పురుషులు సమానంగా మంచిగా ఉండాలని పరస్పరం గౌరవించుకోటం అభిరుచుల్ని మన్నించుకోటం ఉత్తమ లక్షణమని ఏదేదో అంటుంటుంది. బుద్ధి మంతుడిలాగా వింటాడు రామకృష్ణ.

"ఇంకా వాళ్ళ విషయమే ఆలోచిస్తు న్నావా సీతా!" కొద్ది సేపు ఆగి నెమ్మదిగా అడిగాడు రామకృష్ణ.

"సినిమా చూశానన్న మాటేగాని సినిమాలోని ఒక్క సంఘటన గుర్తుకు రావటం లేదు. పాపం ఆ అమ్మాయే గుర్తుకు వస్తు న్నది. గట్టిగా సినిమా చూసే యోగం కూడా లేదు ఏం బతుకో!"

"నీవు ఈ ఒక్క సంఘటన చూసి యింతగా చలించిపోయావ్. వెంకట్రావ్ మాష్టారి ఫార్స్. దశరధరామయ్య భార్య సంగతి చెపితే.....

"వాళ్లెవరు?" ఆతృతగా అడిగింది సీత.

"నీవు కనీ వినీ వూహించని కధలు వాళ్ళవి వాళ్ళ కధలు గాధలు వినిపిస్తా ను. అవి విన్నావంటే సినిమా హాల్లో నిదంపతుల గోల వినిపిస్తా ను. అవి విన్నావంటే సినిమా హాల్లో నిదంపతుల గోల మర్చిపోతావ్. వాళ్ళ

ఫార్స్ వినాలంటే ఇలా లాభం లేదు. నీవు నా ఒడిలో తల పెట్టుకుని పడుకోవాలి. అప్పుడు నీ తల ప్రేమతో నిమురుతూ విషయం చెపుతాను."

"ఇదో వేషం. విషయమంటూ ఏది లేదు నెమ్మది నెమ్మదిగా కబుర్లలోకి దింపి..... ఆ తర్వాత....

"ప్రామిస్. వాళ్ళ జీవిత కథలు చెప్పటం తప్పించి నీ ఇష్టం లేనిది ఒక్కడుగు ముందుకు వేయను సరేనా?"

సీత భర్త ముఖంలోకి గుచ్చి చూసి "సరే మీ మాట నమ్ముతున్నాను" అంది. రామకృష్ణ ఒడిలో తల పెట్టుకుని పడుకుంది.

సీత ముఖంమీద పడి దోబూచులాడుతున్న ముంగురులతో ఆటలాడుకుంటూ "నీకు తల బిరుసు జాస్తి సీతూ!" అన్నాడు రామకృష్ణ.

"తుమ్మెద రెక్కలా నల్లగా నిగ నిగ లాడటమే గాక నా తలకట్టు బాగా వత్తు బిరుసును" అంది సీత.

"నేనన్నది అది కాదులే!"

"మరి.....?"

"తలజుట్టు బిరుసుగా వున్న వాళ్లకి తల బిరుసు గూడా చాలా ఎక్కువగా ఉంటుందిట"

"మా గొప్ప సత్యం కనిపెట్టారులెండి. ఇంతోటి గొప్ప విషయం గొడ్లకాచే బుడ్డోడు కూడా చెప్పగలడు. నా తలకున్న శిరోజములు బిరుసేమో గానీండి నా తల బిరుసుతనం నాకేం లేదు. మాటలు తప్పుదారి పట్టించటానికి ఇదో వేషం. వెంకట్రావ్ మాష్టారి కథ దశరథ రామయ్య కథ కానీండి" సీత గదమాయించింది.

"తప్పదా?"

"తప్పదు."

"ఏం చేస్తాను చేసుకున్న వారికి చేసుకున్నంత చెపుతాను విను" అన్నాడు రామకృష్ణ.

వళ్ళో సర్దుకు పడుకుంటూ "చెప్పండి." అంది సీతా మనోహరి.

"సీతా!"

"ఊ....."

"సీతూ!"

"ఊ...."

"హా సీతే!"

రామకృష్ణ వడిలో తల పెట్టుకుని పడుకున్న సీతా మనోహరి కోపంతో చర్రున లేచింది. లేస్తూ నే దండకం చదివింది.

"స్త్రీ జాతికి అసలు బుద్ధి లేదు. మగవాడి నరనరాన తరతరాలుగా నమ్మించి మాయమాటలు చెప్పి మోసగించి తన పబ్బం గడుపుకుని ఇంతగా ద్రోహం చేస్తు న్నా స్త్రీ మోసపోతూనే వుంది. ఎంత చదువులు చదివి ఏం లాభం? ఎన్ని విద్యలు నేర్చి ఏమి లాభం? ఎంత పెద్ద పదవిలో ఉండి ఏం లాభం? అక్కడికి స్త్రీ జాతి కళ్ళు తెరిచేలా ఓ పాట ఉండనే ఉంది రాదేనమ్మ చెలీ రాదేనమ్మా ఈ మగవాడి మాటలు నమ్మ రాదేనమ్మా అని........

"అవును గాని సీతా! ఇప్పుడు ఇక్కడ ఏమన్నా జరిగిందా?" చాలా అమాయకంగా అడిగాడు రామకృష్ణ.

"వేషాలు వేయకండి" చిర చిర లాడుతూ అంది సీత.

"నేను కూర్చున్న వాడిని కూర్చున్నట్లే వున్నాను. నావి వేషాలా?"

"మరి నాదా?"

"దండకం లాంటిది చదివావు కదా! ఇంతకీ నేను వాళ్ళ సంగతి చెప్పనేలేదు మగవాళ్ళ మోసాలు ఎలా చెప్పగలిగావు?"

"ఏమి తెలియనట్లు వేషాలు వేయకండి."

"అబ్బబ్బ, నాకేమీ తెలియంది వేషాలు వేషాలు అంటే ఎలా సీతా!"

"మీరు వెంకట్రావ్ మాష్టారి విషయం చెపుతానన్నారు."

"అవును అన్నాను."

"వడిలో పడుకుంటే చెపుతానన్నారు. పిచ్చి చేష్టలు చేయనని మాట ఇచ్చారు. అవునా?"

"అవును."

"మరి సీతా సీతూ సీతే అంటూ ఆ గోల ఏమిటి? ఆ వేషాలు ఏమిటి?" సీత సీరియస్ గా అడిగింది.

రామకృష్ణ ఫక్కున నవ్వాడు.

"సీతా! నీకు మాట యిచ్చాను. మాట తప్పుతూ చేతులకి పని కల్పించానా? లేదు కదా! నీ అందమైన మోముని చూస్తూ హా సీతే అని ఒకటికి రెండుసార్లు అన్నానే అనుకో అది మాట తప్పటమా? అసలు నేను అలా ఒకటికి రెండుసార్లు సీతా! అని నీ నామస్మరణ చేశానో అనుకో అది ప్రేమ కాని వేషం మోసం ఎలా అవుతుంది.

నేనేమన్నా వెంకట్రావ్ మేష్టారు లాంటి వాడినా! బయటికెళ్లినప్పుడల్లా పెళ్ళాన్ని ఇంట్లో పెట్టి బయట తలుపు తాళం వేసి.....

"ఏమిటి మీరనేది?" సీత నిర్ఘాంతపోతూ అడిగింది.

"నువ్వుత్త పిచ్చిపిల్లవు సీతా! ఓ విధంగా నీవు లోకం తెలియని అమాయకురాలివి" అనుకున్న రామకృష్ణ మృదువుగా అన్నాడు. "నీకు తెలియని విషయాలు చాలా వున్నాయి సీతా! అవన్నీ చెప్పి అనవసరంగా ఈ రాత్రికి నీ మనసు పాడు చేసిన వాణ్ణి అవుతానేమో?"

"అదేం లేదు చెప్పండి" అంది సీత ఆతృత పడిపోతూ.

"అయితే నీవు నా వడిలో తల పెట్టుకుని పడుకుంటేనే....."

"మీరు పిచ్చివేషాలు వేయనంటేనే......"

"సరే" రామకృష్ణ బుద్ధిగా తల తిప్పుతూ అన్నాడు.

సీతా మనోహరి బెడ్ ఎక్కి రామకృష్ణ వడిలో తల పెట్టుకుని పడుకుని "ఊ..... కానీండి" అంది.

"వెంకట్రావ్ మాష్టారు తల వంచుకుని నడుస్తూ నెమ్మదిగా మాట్లాడుతూ ఏ భీషజాలు లేని మనిషిలా ఉంటాడు. దురలవాట్లు కూడా లేవు. పరుల విషయాలలో అనవసరంగా తల దూర్చడు. కాని భార్య విషయంలోనే!"

"ఏమిటి భార్య విషయంలో మరీ మెతకా?" సీత మహా ఆతృతతో అడిగింది.

"అలా అడ్డు తగలకు చెపుతున్నా కదా?" అని మృదువుగా కోప్పడి మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు రామకృష్ణ.

"వెంకట్రావు మాష్టారు యొక్క వినయ విధేయతలు చూసి లోకం అంతా పొరపడింది. నెమ్మదిగాను, వినయ విధేయతలతో వున్నవాళ్ళు అందరి విషయంలోనూ, అన్నిట్లో నూఓకేరకంగా వుంటారనుకోటం చాలా పొరపాటని ఓ సంఘటన ద్వారా ఇరుగు పొరుగు గ్రహించారు.

వెంకట్రావు మాష్టారు చేసే ఉద్యోగం కూడా కాలేజీలో లెక్చరర్. ఆయన భార్య పేరు మీనాక్షి. మొదట్లో ఈ మీనాక్షి విషయంలో ఇరుగు పొరుగు చాలా పొరపాటు పడ్డారు. మీనాక్షి ఎత్తుగా, లావుగా వుండేది. పని గట్టుకుని ఎవరితో మాట్లాడేది కాదు. ఎవరితో పరిచయం పెంచుకునేది కాదు. ఎవరయినా ఎదురయితే ముఖం తిప్పుకునేది. లేకపోతే ముఖం దించుకునేది. ఇహ ఆమెతో సంభాషణ ఇలా వుండేది.

"వంటయిందాండీ!"

"ఊ....."

"మాష్టారు ఇంకా ఇంటికి రాలేదా?"

"ఉహూ!"

"పనంతా పూర్తి అయిందా!"

"ఊ......"

"రండి- మా యింట్లో కూర్చుందాము."

"ఉహూ!"

"మాస్టారు వచ్చిం తరువాత వెళుదురు గాని. ఎప్పుడూ మా యింటికి రారు. రండి"

ఉహూ!"

మీనాక్షి తో మాట్లాడాలిఅంటే యిలా అన్నమాట. ఊ..... ఆ..... ఉహూ..... లు తప్పించి మరొక్క అక్షరం ఎక్కువ చేర్చి మాట్లాడేదికాదు. దాంతో అందరూ మీనాక్షికి గర్వం అని అపార్థం చేసుకున్నారు. మీనాక్షి ముందు వెంకట్రావ్ మాస్టారు సన్నగా, పొట్టిగా, బక్క ప్రాణిలా వుండేవాడు.

ఇరుగు పొరుగు పరిచయస్తులు అందరూ మీనాక్షితో పచ్చికొట్టినట్లు మాటలు తగ్గించారు. మీనాక్షి వాళ్ళను చూసి ముఖం తిప్పుకోటం కాదు - వాళ్ళే మీనాక్షిని చూసి ముఖం తిప్పుకుని పోవటం ప్రారంభించారు. ఇలా కొంతకాలం జరిగింతరువాత ఓరోజు అసలు విషయం బయటపడింది అందుకే పెద్దలన్నారు - ఏ విషయమయినా గాని, ఎవరి గురించి అయినా గాని తెలిసీ తెలియకుండా ఓ నిర్ధారణకి రాకూడదు - అపార్థం చేసుకోకూడదనీను.

ఆ రోజు మీనాక్షిని పేరంటం పిలవటానికి ఒకావిడ వచ్చింది. ఆ సమయంలో తలుపులు వేసి ఉన్నాయి. తలుపు తట్టటానికి తలుపుపై చేయి వేయబోయింది. ఇంతలో లోపల నుంచి భయంకరంగా మూలుగు వినపడింది. పేరంటానికి పిలవటానికి వచ్చిన ఆమె ఏ విషయం అర్థంగాక అలా నిలబడిపోయింది. అప్పుడు లోపల నుంచి ఇలా మాటలు వినపడ్డాయి.

"ఏం నొప్పిగా వుందా?" ఇది వెంకట్రావ్ మాస్టారి స్వరం.

అమ్మా అన్న ఆక్రందన చిన్నగా వినిపించింది.

అది మీనాక్షి కంటస్వరం. కేక బయటికి రాకుండా బలవంతాన నోరు మూసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

"కూరలవాడిని చూసి నువ్వెందుకు నవ్వావు?"

"నేను నవ్వలేదండీ!"

"బుడి బుడి రాగాలు తీస్తూ ఏడిచావంటే కారం నీ కళ్ళల్లో పోస్తాను జాగ్రత్త. నీ బుద్ధి వక్రం అని తెలిసే ఇన్ని జాగ్రత్తలు వహించాను. వాడుకగా కూరల దానిని పెడితే- దానికి జ్వరం అని దాని భర్త వస్తున్నాడు కదా! అలా అని నాతో చెప్పావా! ఉహూ - వాడి దగ్గరే నాలుగు రోజుల బట్టి కూరలు కొంటుంటివి పైగా వాడు నిమ్మకాయ పచ్చడి అడిగాడని, మహా ఆప్యాయంగా గిన్నెడు పచ్చడి పెడితివి ....."

"వాడికి కాదు - పెళ్ళానికి కావాలంటేను పెట్టాను."

"అలాగా! మరి వాడితో కబుర్లు ఏమిటిట.....?"

"బాగా జ్వరం తగ్గిందా అన్నాను. పాత నిమ్మకాయ లేదు. ఇది కొత్త నిమ్మకాయ. ఎక్కువగా తింటే జలుబు చేస్తుందని చెప్పాను."

"ఇంకా ఏమి చెప్పావు?"

"ఏమి చెప్పలేదు. ఇంతలో మీరు వచ్చారు."

"ఒహో! నేను రాకపోతే యింకా మాట్లాడేదానివన్నమాట.....!"

"అదికాదు......"

"నోరుముయ్యి! నీ బులిబుచ్చికం కబుర్లు నమ్ముతాననే అనుకుంటున్నావా! నీ జాతకంలో స్పష్టంగా వుంది - మగవాడిని చూడంగానే నీలో వింత వింత కోరికలు కలిగి, మదపిచ్చితో ప్రవర్తిస్తావని. నీ విషయంలో ఇంత జాగ్రత్త పడ్డా- రాజుగారి పెళ్ళాం అన్నీ వుండి, గుర్రాల శాలని ఊడ్చేవాడి మోజులో పడి చాటుగా వాడిని కలుసుకున్నట్లు - అన్నీ ఉంది నీవు కూరలవాడిని మరిగి, నేను లేని సమయం చూసి వాడితో యికయికలు - పకపకలు. అసలు నీకు....."

మీనాక్షి కెవ్వుమంది.

"ఏం- నెప్పిగా ఉందా? చేత్తో కొడితేనే భరించలేవు. చెప్పుతో కొడితే యింకేం భరిస్తావు సుకుమారీ! కూరల వాడితే తిరిగేటంత కమ్మగా లేదా?" వ్యంగ్యంగా అంటున్నాడు వెంకట్రావ్ మాస్టారు.

"వదలండి. మీకు దండం పెడతాను." బాధతో గిల గిలలాడినట్లు గమీనాక్షి కంటం వినిపించింది.

అంతవరకూ కళ్ళకు ప్రత్యక్షంగా కానవచ్చేలా వెంకట్రావ్ మాస్టారు కథ చెప్పి - "ఇది నిజంగా జరిగిన ఓ అనుమానం మొగడి కథ సీతా!" అన్నాడు రామకృష్ణ.

సీతామనోహరి తెరుకోటానికి నిమిషం పట్టింది.

"మీరు చెప్పింది నిజమే కదూ!" సీత అడిగింది.

"నిజం సీతా! కేవలం జాతకాన్ని నమ్మి - పెళ్ళాన్ని అన్నీ రకాల బాధలు పెట్టేవాడు." రామకృష్ణ నొక్కి చెప్పాడు.

"అయ్యో సీతా! నన్నే అనుమానిస్తు ంటివా! నామాటలను శంకించుచుంటివా? రాముడిని అనుమానం మొగుడు అన్నారు గాని, ఈ కలియుగమందున భర్తని అనుమానించేది ధర్మపత్ని సీతయే! అకటా! ఏమి కష్టము!"

"ముందా నాటకాల భాష చాలించండి"

"నాటకాలు కావు. కాకపోతే సరదాగా ఆ భాష వాడాను - అంతే!"

"అసలు మీకీ విషయం ఎలా తెలుసు?"

"మా అమ్మ, మా పక్కింటి పిన్నిగారు, అత్తయ్య గారె, రోజూ సమావేశం అయి, మీనాక్షి కష్టం గురించి చెప్పుకునేవారు. అందుకే మీనాక్షి ఇరుగుపొరుగుతో అంటీముట్టనట్లు ఉండేది విషయం తెలియక ముందు మీనాక్షిని అందరూ ఆదిపోసుకున్నారు. పేరంటానికి పిలవటానికి వెళ్ళిన ఆవిడ వల్ల ఈ రహస్యం బయటపడింది. అక్కడ నుంచి ఆ వీధిలో ఆడవాళ్ళంతా ఓ కన్ను వెంకట్రావ్ మేస్టారి యింటిపై వేశారు. వెంకట్రావ్ మాష్టారు ఇంట్లో ంచిబయటకేల్లె టప్పుడుఆమెని యింట్లో పెట్టి బైట తాళం వేసుకుని వెళ్ళేవాడు......"

"ఛా......" అంటూ చీత్కారం చేసింది సీత.

"నీవు ఛా అన్నా, ఛీ అన్నా ఇది సత్యం" అన్నాడు రామకృష్ణ.

"ఆ తర్వాత ఏమైంది?"

"ఓ రోజు స్టవ్ అంటుకుని మరణించింది కాని - స్టవ్ పొరపాటున కూడా అంటుకోలేదు. ఇది వెంకట్రావ్ మాస్టారి పని. మీనాక్షి రెండు రోజులు నరకయాతన పడి మరణించింది."

"క్షణం క్షణం చచ్చేబదులు ఒకేసారి పోవటం ఆమె జీవితానికి విముక్తి వెంకట్రావ్ విషయం అందరికీ తెలిసి, ఎలా వూరుకున్నారు? నలుగురూ కలసి ఆయన కాళ్ళు చేతులు విరగకోట్టా ల్సింది. లేకపోతే పోలీసులకి పట్టించాల్సింది!" సీత ఆవేశంగా అంది.

"మాష్టారు కాళ్ళు విరగగోడితే అందరి పీకల మీదకీ రావటం తప్పించి ప్రయోజనం ఏముంది? పోలీసులకి విషయం చెప్పి పట్టిద్దా మాఅంటే - మీనాక్షి చావుబతుకుల మధ్య కొట్టు కుంటూ కూడా ప్రమాదానికి కారణం నా అశ్రద్ధ. మావారి మధ్య, నా మధ్య ఎటువంటి పోరాపోచ్చాలూ లేవని స్టేట్ మెంటు ఇచ్చింది."

సీత నిర్ఘాంతపోయింది.

"నిజం?!"

"సీతా! నీవు ఇలా మాటిమాటికీ నిజమా అంటూ అనుమానం వెళ్ళగక్కుతుంటే - ఇది నిజమా అని నాకే అనుమానం వస్తు న్నది. నీకు లోకం తెలియదు సీతా! రకరకాల మనుషులు - రకరకాల కధలు."

"మీనాక్షిలాంటి వాళ్ళు వుంటారా అండీ?" అమాయకంగా అడిగింది సీత.

"పరాయి దేశాల సంగతి నాకు తెలియదు గాని సీతా! ఈ దేశంలో మాత్రం వుంటారు - ఈ పవిత్ర భారతం దేశంలో మాత్రమే పతివ్రతలు వుంటారు."

"మీనాక్షి ఎందుకు ఆ పని చేసింది?"

"ఏ పని?"

"తనని మంటల్లో కి తోసిన మొగుడిని రక్షించటం."

"ఇంతటితో తనకి విముక్తి ప్రసాదించినందుకేమో!"

"మీకంతా వేళాకోళంగా వున్నట్లు ంది"

"వేళాకోళం కాదు. ఇలాంటి త్యాగాలు నాకూ నచ్చవు. మీనాక్షి అలా ఎందుకు చేసింది. అంటే ఏం చెప్పను? స్త్రీ మనసు అగాధం అని, సముద్రం కన్నా లోతని- అదని, యిదని అంటారు కదా పెద్దలు....."

"సరేలెండి! ఆ తర్వాత ఆ మాష్టారు ఏమయారు?"

"పెళ్ళాం చావంగానే మీదపడి భోరున ఏడిచాడు. కిందపడి దొర్లుతూ కన్నీరు మున్నీరుగా విలపించాడు. జరిగిందానికి పశ్చాత్తా పంతో ఏడుస్తున్నాడు కాబోలు అనుకున్నారు. ఏడాది తిరక్కముందే మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు."

"అలాంటి దౌర్భాగ్యుడికి పిల్లనెవరు యిచ్చారు?"

"ఆడపిల్లను కన్న తల్లీ, తండ్రీ!"

"పాపం! ఆ పిల్లదాని బతుకు కూడా అలాగే అయిందా?"

"ఊహూ! ఆరు నెలలు మాష్టారుతో కాపురం చేసి, రిబ్బెన్ లు, ఊదొత్తు లు సైకిలు మీద పెట్టు కుని వీధి వీధి తిరిగి అమ్మే జహంగీర్ అనే కుర్రాడితో ఓ మంచి ముహూర్తం చూసుకుని లేచిపోయింది."

"ఆహా ఎంత మంచిపని చేసింది!" సీతామనోహరి సంతోషపడిపోతూ అంది.

"ఇది మంచిపనా!" రామకృష్ణ తెల్లబోయాడు.

"చాలా మంచిపని. మాష్టారు తలతీసినంత పని. నేరం చేయని మీనాక్షి చావుకన్నా గొప్ప తీర్పు. నన్నడిగితే ఇలాంటి మగవాళ్ళకి బుద్ధి రావాలంటే ఏ కసాయి వాడినో తీసుకుని లేచిపోవటమే కాదు- మాస్టారు ఎదురింట్లో నే కాపురం పెట్టా లి దాంతో మాస్టారు లాంటి వాళ్లకి బుద్ధి వస్తు ంది!" సీత ఆవేశంగా అంది.

"పిచ్చి సీతా! నీకు ఆవేశం తప్ప ముందు చూపు లేదు. ఆడది యిలా మాట్లా డితే లోకం తాటాకులు కడుతుంది. నీ మంచితనం, అమాయకమయిన బుద్ధి నాకు తెలుసు గాబట్టి నిన్ను అర్థం చేసుకున్నాను. అందరి ఎదుట అనేవు."

"ఏం అంటే?"

"నవ్వుతారు."

"నవ్వనివ్వండి!" మొండిగా అంది సీత.

"నీ ఇష్టం! నీకు లేని బాధ నాకెందుకు?" ఆ ప్రసక్తి అంతటితో తుంచేస్తూ అన్నాడు రామకృష్ణ.

"తర్వాత మాస్టారు ఏమయ్యారు? సన్యాసుల్లో కలసిపోయాడా? ఆత్మహత్య చేసుకున్నాడా?"

"రెండూ చెయ్యలేదు. మూడోపెళ్ళి చేసుకున్నాడు ఈ పిల్ల మీనాక్షిలాగా చావలేదు- రెండోపెళ్ళాం లాగా లేచిపోలేదు. కొన్నాళ్ళు కాపురం చేసి, యిద్దరి పిల్లలను కూడా కంది. మూడో పెళ్ళాం పరమగయ్యాలిట. వెంకట్రావు మాస్టారుని మధ్య మధ్య కొడుతుండేది."

సీత చిన్నపిల్లలా ఆనందం వ్యక్తం చేస్తూ చప్పట్లు కొట్టింది. :భలే భలే" అంది.

అది చూసి రామకృష్ణ కి నవ్వు వచ్చింది.

"కధ అయిపోయిందిగా - ఇంక పడుకుందామా సీతూ!" ముచ్చటపడుతూ అడిగాడు రామకృష్ణ.

"కుదరదు" అంది సీత. ఆ అన్నతీరు కూడా టాట్, వల్లకాదు- అని అరిచినట్లు అనిపించింది.

"ఏమయింది సీతా?"

"ఏమీ కాలేదు- మీరు మాట తప్పారు."

"నేను మాట తప్పానా! లేదే?"

"లేదే కాదు - గుర్తులేదే అనండి."

"గుర్తులేదే!"

"వెంకట్రావు మాష్టారు కధ, దశరధరామయ్య కధ చెపుతానని ఒక్క కధ మాత్రమే చెప్పారు."

"ఓ..... అదా! గ్రాంధిక భాషలో చెప్పాలంటే- ఇప్పటికే కాలాతీతం అయింది. సీతే! నా ప్రాణ మనోహర్!"

"చాలించండి. మీరు ఏ భాషలో చెప్పినా ఈ సీత కరిగి నీరు కాదు." వస్తు న్న నవ్వుని బిగబట్టుకుని సీత సీరియస్ గా అంది.

"ఉత్త నల్లరాయి!"

"నల్లరాయి, కటిన శిల, రేగటి మట్టి లాంటి తిట్లు ఆఖరుకి తిడుదురుగాని - కధ కానీండి. ఇలా నాన్చారంటే మీకే నష్టం."

అదీ నిజమేననిపించింది రామకృష్ణకి. "సరే, విను" అన్నాడు.

"సరే...... వింటాను..... కానీండి....." అంది సీత మొగుణ్ని ఏడిపిస్తు న్నాను కదా అని ముసిముసినవ్వులు నవ్వుకుంటూ.

# 5

"అనగనగా ఓ దశరధుడు......" రామకృష్ణ కధ మొదలుపెట్టాడు.

"ఆయన పేరు దశరధరామయ్య అన్నారు!" సీత అడిగింది.

"అన్నాను. పేరు అదే! కథలో పేరంతా చెపితే కాలాతీతం అవుతుందని తగ్గించాను."

"సరే, కానీండి."

"రామకృష్ణ సీతవేపు కోపంగా చూసి, మళ్ళీ మొదలుపెట్టాడు.

"ఈ దశరథుడు వెంకట్రావ్ మాస్టారు లాంటి వాడు కాదు. పెళ్ళాం విషయంలో చాలా విచిత్రంగా ప్రవర్తించేవాడు. సాయంత్రం కాంగానే రెండు రూపాయలకి తక్కువ కాకుండా మల్లె పూలుతెచ్చేవాడు. అలాగే నేతి మిటాయిలు కొనుక్కొచ్చేవాడు. ఇంటికి రాంగానే ఏ విషయంలోనో తుస్సున కోపం వచ్చేది. పూల పొట్లాన్ని వీధిలోకి గిరవాటేసేవాడు. అరకిలో మిటాయిని అడుక్కునే వాడికో, కనపడ్డ పిల్లలకో పెట్టేసేవాడు....."

"అదేం పిచ్చి?" అంది సీత.

"పిచ్చి, గిచ్చి ఏమిలేదు. అందరితో బాగా ఉండేవాడు. పెళ్ళాంముందే ఈ గోల. ఓరోజు కంది పచ్చడి ఇష్టం నూరు అన్నాడు. ఆమె అమృతంలా కంది పచ్చడి చేసింది. దేనికో పెళ్ళాంమీద కోపం వచ్చింది ఆయనకి. పచ్చడి తీసుకెళ్ళి వీధిలో పారేశాడు."

"మీరు మరీ వింతగా చెపుతున్నారు కోపం వస్తే కొట్టేను, తిట్టేను. తినేది పారేసుకుంటారా?" అంది సీత.

"దశరథుడి విషయంలో అదే తమాషా. బయటవాళ్ళ విషయంలో మామూలుగానే వుండేవాడు. పెళ్ళాం విషయంలోనే యిలా ప్రవర్తించేవాడు. పెళ్ళాం తన మాట కాదు అందంటే చాలు - కల్లు తాగిన కోతిలా గెంతేవాడు. ఓరోజు సినిమాకి వెళదాం అన్నాడు. ఇంగ్లిషు సినిమా నాకంతగా నచ్చాడు, రాను అంది. అంతే - ఇంట్లో ఉన్న కుర్చీ, పీటని విరగ్గొట్టి, ఆ తర్వాత గాజు గ్లాసులని పప్పు పప్పుగా నూరాడు. భర్త చేసే ఈ నష్టాలు భరించలేక - ఆమె అన్నింటికీ సరే ననటం నేర్చుకుంది."

"ఇలాంటి వాళ్ళు కూడా ఉంటారా!" సీత ఆశ్చర్యపోతూ అడిగింది.

"ఉంటారు. ఎవరిదాకానో ఎందుకు - దశరథుడు వున్నాడు కదా!"

"నాదో అనుమానం....."

"ఇలా మాటిమాటికీ అనుమానాలు బయటపెట్టవద్దు సీతా! నీ అర్థంలేని అనుమానాలతో ఎప్పుడో మనం, మన సంసారం బజారున పడుతుంది- పడతాము."

"పెళ్ళాం అనుమానం వ్యక్తం చేస్తే - సంసారం వీధిన పడుతుందా! చాల్లెండి! ఎవరయినా వింటే నవ్విపోతారు. ఇంతకీ నా అనుమానం ఏమిటంటే- కాలాతీతం అవుతుంది అనుకుంటూ దశరథుడి కథ క్లుప్తంగా ముగించారేమోనని......"

"ఇలాంటి అనుమానాలు అయితే ఫరవాలేదు. వెంకట్రావు మాస్టారుకి పెద్ద కథ వుంది. దశరథుడికి ఓకే పెళ్ళాం ఓకే కథ. నీవు సినిమా హాలులో ఆ భార్యాభర్తలని చూసి అతగాడి ప్రవర్తనకి బాధపడుతుంటే - లోకంలో రకరకాల వాళ్ళు వున్నారు అంటూ వీళ్ళిద్దరి కథలు చెప్పాను. భార్యని మాటలతో ప్రతి నిమిషం బాధపెట్టేవారూ, చీటికి మాటికి కొట్టేవాళ్ళు, ఆఖరికి హత్య చేసేవారు - ఎన్నో రకాల మనస్తత్వాలు. మనం చూడటం, వినటం తప్పించి ఏమీ చేయలేము. ఎవరి ఖర్మకెవరు కర్తలు! అనుకోటం అన్నింటికన్నా బెస్ట్ పని.

రామకృష్ణ చెప్పిందంతా విని "ఎన్నిరకాల మొగవాళ్ళండీ!" అంది సీత.

"ఆడవాళ్ళు కూడా అన్నీ రకాలు ఉంటారు. కాకపోతే మగాళ్ళకి జరిగినట్లు ఆడాళ్ళకి జరగదు - అంతే!" అన్నాడు రామకృష్ణ.

"ఇంకా మీకు చాలా సంసారాలు తెలుసా?" సీత అడిగింది.

"చాలా దాంపత్యాల కథలు తెలుసు!" రామకృష్ణ గొప్పగా చెప్పాడు.

"అయితే చెప్పరా!" గోముగా అడిగింది సీత.

"ఇప్పుడా?"

"ఇప్పుడే."

"కాలాతీతం..... కాలాతీతం....."

"కాలాతీతం అయితే కొంపేమీ మునగదు. నాకు నిద్ర రావటం లేదు."

"నీకు నిద్ర రాకపోతే జోల పాడతాను. ప్రేమ వూసులాడుకుందం పడి దొర్లుదాం. ఇంకేదేదో చేద్దాం. వెయ్యిన్నొక్క రాత్రులు కథల్లా గా- లోకంలో ఉన్న దంపతుల కథలన్నీ నన్ను చెప్పమంటే ఎలా? ఎలా?" రామకృష్ణ వాపోయాడు.

"నాకు ఆ కథలన్నీ వినాలని వుందండీ!" ముద్దు లోలుకుతూ పలికింది సీత.

"వినాలని వుంటే రోజుకొకటి చెపుతాను. ఈ పూట రెండు చెప్పాను. నీవు మాట్లా డరాదు- ఆ..... అంతే!"

"అంతేనా!"

"అంతే!"

"రేపు చేపుతారుగా!"

"చెపుతాను."

"సరే, ఇంతకీ సినిమా హాలులో భార్యాభర్త ఏ రకం అంటారు? మాష్టారు రకమా? దశరధుడి రకమా?"

"ఈ తఫా మనం ఏదో ఒక సినిమాకి అఘోరిస్తే- ఆ మొగుడూ పెళ్ళాం కూడా అదే సినిమాకి అఘోరిస్తే - వాళ్లనే అడుగుదాము మీరేం రకమూ అని....." రామకృష్ణ కోపం దిగమింగుతూ అన్నాడు.

"అంత కోపం దేనికండీ!" ముద్దుగా అడిగింది సీత.

"కాలాతీతం...... కాలాతీతం....."

"ఈ మగవాళ్ళందరికీ పెళ్ళాం విషయంలో తలావొక పిచ్చి. మీకు కాలాతీతం పిచ్చి. పెదవి కదిపితే చాలు - అరిగిపోయి గ్రామఫోను రికార్డ్ లాగా కాలాతీతం అంటూ నా చెవిలో తుప్పు రేగగోడుతూ..... కాలాతీతంట - అదేదో తారకమంత్రం అయినట్లు....."

"చూడు సీతామనోహరీ! ఏమీ తెలియనట్లు వేషాలు వేయకు. కథ చెప్పటం పూర్తికాంగానే మీ ఇష్టం అన్నావు. ఆ తర్వాతేమో అదని, ఇదని టైం వేస్ట్ చేస్తు న్నావు. రౌతు మెతగ్గా ఉంటే, గుర్రం ఎగిరెగిరి దూకిందట. ఏ విషయంలో మెతగ్గా వున్నా ఫరవాలేదు గాని, ఈ విషయంలో మగాడు మెతగ్గా వుండరాదు" అంటూ రామకృష్ణ సీతని దగ్గరగా తీసుకున్నాడు.

"అవునేను. అసలే కాలాతీతం అయింది" అంటూ సీత కిలకిల నవ్వింది.

# 6

మధ్యాహ్నం పనిమనిషి వస్తుందో, రాదో అనుకుంటూ కూర్చుంది సీతామనోహరి.

అప్పుడు సమయం నాలుగు కావచ్చింది.

రోజు పనిమనిషి మూడు గంటలకల్లా వచ్చి, నాలుగు లోపల పని పూర్తి చేసుకుని వెళుతుంది.

ఇంక లేచి పని చేసుకుందామా అనుకుంటుండగా - పని మనిషి రంగి ఉరుకులు పరుగుల మీద వచ్చి - "బేగి అంట్ల గిన్నెలు వేయండి అమ్మగారూ! వెళ్ళాలి" అంది.

చక్కగా తయారయి కళ కళ లాడుతున్న రంగిని చూసి తెల్లబోయింది సీత. అది చూసి సిగ్గుపడింది రంగి.

ఉదయం రంగి పనిలోకి వచ్చినప్పుడు శోకమూర్తిలా ఉంది. "అదేమిటే రంగీ - అలా ఉన్నావు?" అంటే - కారణం చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది.

"రాత్రి మా ఆయన పీకదాకా తాగి వచ్చాడు. వాడు తాగితే మనిషి కాదు. చేపల కూర వండలేదని, రాంగానే తన్నాడు. వాడు చెప్పినట్లు వినలేదని రాత్రంతా సాధిస్తూ, అరుస్తూ మధ్య మధ్య కొడుతూనే వున్నాడు. మాలావు మగాడు రమ్మనంగానే నేను పక్కలోకి రాలేదుట. 'పోపేకునారి ముఖందానా! మద్రాసెల్లి జయమాలిన్ని తెచ్చుకుంటాను. నీ సవతిగా సిల్కుస్మితని తెచ్చుకుంటాను' అంటూ ఒకటే అరుపులు వాడు నిద్రపోడు - నన్ను నిద్రపోనీయడు.  తాగి వచ్చాడంటే రాక్షసుడే!" అంటూ కళ్ళు తుడుచుకుంది రంగి.

"ఇదే మొదటిసారా తాగటం?" సీత అడిగింది.

"నాలుగు డబ్బులు ఎక్కువ వస్తే చాలు - పికదాకా తాగి రావాల్సిందే!" అంది రంగి - నీరసంగా అంట్లు తోముతూ.

"నీవెలా భరిస్తు న్నావు?"

"ఏం చేయమంటారు - నాతల రాత!"

"తలరాత - మొలరాత అని ఎక్కడా వుండదు. నీవలా భరిస్తుంటే, ఇహపై రోజు తాగి వస్తుంటాడు"

"ఏం చెయ్యమంటారు చెప్పండి - ఆడదాన్ని అయిపోయాను."

ఆడదాన్ని అయిపోయానని రంగి అనంగానే, ఆడపులిలా లేచింది సీతామనోహరి.

"ఆడదానిలోని ఈ అలుసే మగవాడు కనిపెట్టి ఆడిస్తున్నది. ఆడదయితేనేమిటి - మనిషి కాదా? పశువా? తర తరాల నుంచీ. యుగ యుగాల నుంచీ స్త్రీ ఇలా అన్నింటికీ తలవంచుకు పోబట్టే- మగజాతి యిలా విర్రవీగిపోతున్నది. నీ మొగుడు మొదటిసారి తాగి వచ్చినప్పుడే గట్టి వార్నింగ్ ఇవ్వాల్సింది. ఈ తఫా తాగి వస్తే మర్యాద దక్కదు - ఐ డోంట్ కేర్! నీ దోవ నీది - నాదోవ నాది అనాల్సింది" ఆవేశంగా అంది సీత.

"అదెలా కుదురుతుందమ్మా!" అంది రంగి.

"ఎందుకు కుదరదు? చక్కగా కుదురుతుంది. నీ మొగుడు రిక్షా బండీ వేస్తున్నాడు. నీవు నాలుగిళ్ళలో పని చేస్తున్నావు. వాడు పొమ్మంటే నీవు లేకపోతే బతకలేనా అనటం, ఇవతలికి వచ్చేయటం."

"అదెలా కుదురుతుందమ్మా?" అంది రంగి.

"నీకు ఎంత చెప్పినా అర్థం కావటం లేదు. నీవు సంపాయిస్తున్నావు. వాడు సంపాదిస్తున్నాడు అవునా?"

"అవును."

"ఇంకేమి మహారాణిలా బతకొచ్చు. నాలుగిళ్ళలో పాచిపని చేసుకుంటున్నావు. అన్నం దొరుకుతుంది. కాఫీ యిస్తున్నాము. నాలుగురమ్మగార్లు చీరలు యిస్తారు. జీతం రాళ్ళు సగం ఖర్చు చేసుకున్నా సగం వెనకేసుకోవచ్చు. ప్రతినెలా ఎంతో కొంత బ్యాంకులో దాచుకుందువు గాని. అలా పొదుపుగా దాచుకోవటం వల్ల కొన్నేళ్ళకి అదే పెద్ద మొత్తం అవుతుంది. కావాలంటే వడ్డీ డబ్బు వాడుకోవచ్చు. అదీ అవసరం లేకపోతే ఫిక్సడ్ వేసుకుంటే అయిదేళ్ళదాకా తీయకపోతే డబుల్ డబ్బు పెరుగుతుంది."

సీత చెప్పింది కడు శ్రద్ధగా విని "ఏమిటో మీరు చెప్పింది నాకర్థం కాలేదు" అంది రంగి.

కిటికీలో అద్దం పెట్టుకుని దాని ఎదురుగ కుర్చీలో కూర్చుని స్విష్ బ్లేడుతో గడ్డం గీచుకుంటున్న రామకృష్ణకి సీత చెప్పింది విని నవ్వు వచ్చింది. బలవంతాన నవ్వు ఆపుకోటం వల్ల గడ్డం తెగటం కూడా జరిగింది.

"అందుకే అన్నారే రంగీ! ప్రతివాళ్ళూ చదవను రాయను నేర్చుకుని వుండాలని సరే చదువు సంగతి తర్వాత చూద్దాం. ముందు నీ మొగుడిని గట్టిగ అడుగు. ఇదే లాస్ట్ వార్నింగ్ అని చెప్పు. ఈ తఫా తాగి వస్తే నీ దోవ నీది నా దోవ నాది అని గట్టిగ చెప్పు అంతేకాదు. మరోసారి తాగి వస్తే యివతలికి వచ్చేసేయి. నీ కాళ్ళ మీద నీవు బతకలేవా ఏమి?"

"అదే చూస్తున్నానమ్మగారూ? నేను వాడితో విసిగిపోయాను" అంది రంగి.

సీతకి మహా సంతోషం వేసింది. ఆ సంతోషంలో విజ్రుంభించిపోయి. ఆడవాళ్ళ అశక్తత మగవాళ్ళ దౌర్జన్యం గురించి చిన్న లెక్చర్ యిచ్చింది.

రంగికి అర్థం అయిందో కాలేదో గాని తలొంచుకుని పని పూర్తి చేసి నీరసం మొహం వేసుకుని వెళ్ళిపోయింది.

"పాపం రంగి విషయం చూశారా!" రంగి వెళ్ళింతరువాత రామకృష్ణ అంది సీత.

ఏమీ ఎరగనట్లు ఏంటట? అన్నాడు రామకృష్ణ.

రామకృష్ణకి అన్నం వడ్డిస్తూ వివరంగా చెప్పింది సీత. "వాడి మాటలు విన్నారా! జయమాలినిని తెచ్చుకుంటాడుట. వాడి ముఖానికి అది జరిగే పనేనా? ఈ మాట జయమాలినితో అంటే వాడి మూతి పళ్ళు రాలేలా ఎడంకాలితో తంతుంది" అని కూడా చెప్పింది.

"వీడి ముఖానికి జయమాలిని కావాల్సి వచ్చిందన్న మాట!" రామకృష్ణ నవ్వుతూ అన్నాడు.

"తాగుబోతు వెధవ ఇంకా నయం పైకెళ్ళి రంభని తీసుకొస్తానని అనలేదు" అంది సీత.

రామకృష్ణకి ఆఫీసు టైము కావటంతో ఎక్కువ సమయం మాట్లాడటానికి లేకపోయింది. భోంచేయటంతోనే వెళ్ళిపోయాడు ఆఫీసుకి.

రాత్రంతా నిద్రలేదు. పైగా మొగుడు కొట్టాడు. దాంతో రంగికి వళ్ళు నొప్పులో జ్వరమో వచ్చి వుంటాయి. మధ్యాహ్నం పనిలోకి వచ్చింది. ఉరుకులు పరుగుల మీద పనిచేయటం మొదలుపెట్టింది.

సీత కొద్దిసేపు చూసి "సాయంత్రం ఎక్కడికైనా వెళుతున్నావా?" అంది.

"అవునమ్మగారూ! హిందీ సినిమాకి" సిగ్గుపడుతూ చెప్పింది రంగి.

సినిమా కెళతానని చెప్పటానికి సిగ్గెందుకు పడాలో సీతకి అర్ధం కాలేదు. "హిందీ సినిమా నీకర్ధం కాదుగా?" అని మాత్రం అడిగింది.

"ఆడికి హిందీ సినిమాలంటే మా చెడ్డ ఇష్టం అమ్మగారూ! నాకర్ధం కాదని చెపితే చాలా పెద్ద యాక్టర్లు వున్నారు పెద్ద క్లాసుకి వెళ్ళి పక్కపక్కన కూర్చుందాం నేను కధ చెపుతుంటాను అన్నాడు."

"ఎవరు మీ ఆయనే?"

"ఊ"

"వాడడిగితే మాత్రం నీవెందుకు సినిమాకి వెళ్ళాలి? రాత్రే కదా తాగొచ్చి నానా గొడవ చేసి తన్నింది?"

"నిజమేనమ్మగారూ!"

"ఏమిటే నిజం! సినిమాకి రమ్మని అడిగితే మాత్రం నీవలా వెళ్ళిపోవటమేనా? ఎంత మొగుడైతే మాత్రం రమ్మనటం ఆలస్యం పరుగెత్తు కు వెళ్ళటమేనా? నీకో మనసు అభిప్రాయం వుండవా!"

రంగి ఏదో గొణిగింది.

సీతకి ఆ మాట ఏదో అర్థం కాలేదు.

"నీవలా మెత్తగ వుండోద్దని చెప్పానా లేదా? తాగి వచ్చి కొట్టిందే గాక జయమాలిన్ని తెచ్చుకుంటానని కూడా అన్నాడు."

"అలా అంటాడు అంతే అమ్మగారూ! నన్ను ఏడిపించటానికి రకరకాల మాటలు అంటాడు. వీడి ముఖానికి జయమాలిని కాదు కదా వాళ్ళింట్లో పనిమనిషి కూడా రాదు. ఓ చుక్క తాగంగానే నరంలేని నాలుక తిరగబడుతుంది." రంగి నవ్వుతూ చెప్పింది.

రంగి వ్యవహారం చూస్తు ంటే సీతకి అనుమానం వచ్చింది. మొగుడు మాట ఎత్తంగానే యిదింతగ ముచ్చట పడుతుందేమిటబ్బా! అనుకుంది.

"రంగీ!"

"ఊ....."

"రాత్రి నీ మొగుడు తాగొచ్చి కొట్టాడు కదూ?"

"కొట్టా డు."

"వాడు తాగటం మానడు. నేనింకా వాడితో కాపురం చెయ్యలేను. అని నా దగ్గర కళ్ళనీళ్ళు పెట్టు కున్నావు కదూ?"

అమ్మగారు అంత సీరియస్ గా ఎందుకడుగుతున్నారో అర్థంగాని రంగి "ఎందుకమ్మగారూ?" అంది.

"అడిగిందానికి సమాధానం చెప్పు. నీ మొగుడు రాత్రి తాగి వచ్చి నిన్ను కొట్టాడా లేదా?"

"వాడితో యింక కాపురం చేయలేను అని అన్నావా లేదా?"

"అన్నాను."

"మరి ఉదయం నాతో చెప్పుకుని అంత బాధపడ్డదానివి ఈ మధ్యాహ్నానికే మారిపోయి మొగుడు రమ్మనగానే టింగురంగా అని తయారయి సినిమాకి పోవటమేనా?"

"అదికాదు....." మళ్ళీ రంగి నసిగింది.

సినిమా చూడాలని అంత పిచ్చిగా ఉంటే నేను డబ్బు ఇస్తాను. ఇటు నుంచి ఇటే నీకిష్టమైన తెలుగు సినిమాకి వెళ్ళిరా. మీ ఆయన మాట విననట్లు అవుతుంది."

"సినిమా పిచ్చి కాదండీ. రాత్రి జరిగిందానికి వాడు బాధపడి మధ్యాన్నం బతిమిలాడాడు. నా కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు."

"దాంతో నీవు కరిగిపోయ్యావ్ అవునా?" సీత కరుకుగ అడిగింది.

"నేనేం పిచ్చిదాన్నిటండీ! గంటసేపు బతిమిలాడిం తరువాత యింక ఆది బాధ చూడలేక సరేనన్నాను. తాగొచ్చిం తరువాత అలా చేస్తానని తెలియదే. నిన్ను ఏ విషయంలోనైనా బాధపెట్టానుటే రంగీ! నీ వంటే నాకు చచ్చే ప్రేమ. తాగిన మైకంలో ఏమీ తెలిసి చావదు. బుర్ర పనిచేయదు. అంటూ లబలబ లాడాడు."

రంగి ముద్దుగ చెపుతుంటే సీతకి వళ్ళు మండింది. "వాడు లబ లబ లాడాడు నీవు గబ గబ తయారయావు అంతేనా?" అంది.

"అయితే ఏం చేయమంటారు?" కోపం దిగమింగి అడిగింది.

"మగాడి సంగతి నీకు తెలియదు. అందితే జుట్టు అందకపోతే కాళ్ళు అంటారు. మనం ప్రతిది నమ్మి అన్నింటికీ కరిగిపోతుంటే మగవాళ్ళని పట్టశక్యం కాదు కొట్టినా తిట్టినా భార్య తన కాళ్ళదగ్గరే పడి వుంటుందన్న అహంతో చాలామంది మగవాళ్ళు....." సీత పడి నిమిషాలపాటు కామా ఫులిష్టాపులు లేకుండా మగవాళ్ళ అహంకారం ఆడవాళ్ళ తెలివి తక్కువ తనం గురించి లెక్చ్చారిచ్చింది.

సీత చెప్పిందంతా విని "అదేమో నాకు తెలియదు అమ్మగారూ! కొట్టినా తిట్టినా వాడు పరాయివాడు కాదు నా మొగుడు. నిజం చెప్పాలంటే అమ్మగారూ! కొట్టింది మొగుడు కాబట్టి పడ్డాను. అదే పరాయి మగాడు తన్నటానికి నామీదకొస్తే ఊరుకుంటానా ఆది కాళ్ళు చేతులు ఫెళ ఫెళ విరిచి పొయ్యిలో పెడతాను" అంది రంగి.

"ఇప్పుడు నీ మొగుడంటే నీకు పిసరంత కోపం కూడా లేదా?"

"మొగుడిమీద పెళ్ళానికి కోపమేంటమ్మా!"

"నిన్ను చావచితక కొట్టాడు కదా?"

"జరిగిందానికి చాలా బాధపడుతున్నాడు కదా!"

"మరోసారి తాగి వచ్చాడే అనుకో.....?"

"అనుకోటం ఏమిటమ్మగారూ! నెలకొకసారైనా వాడికి తాగంది తోచదు. తాగి రావటం తన్నటం మామూలే."

"నీవు బాధపడుతూ ఏడ్వటం మామూలే. అంతేనా!" సీత గుర్తు చేస్తు న్నట్లు అంది.

"దెబ్బలు తగిలి వళ్ళు నెప్పులు చేస్తే కాస్త కళ్ళనీళ్ళు పెట్టుకుంటాను. అంతే వాడు నా మొగుడు కాకపోయాడా నేను వాడి పెళ్ళాన్ని కాకపోయానా! ఈ మధ్యాన్నం రిక్షా యజమాని దగ్గర ముప్పైరూపాయలు అప్పు తెచ్చాడు. ఎవరికోసం, నాకోసం సినిమా చూపిస్తున్నాడు. హోటల్లో చాపలకూరతో అన్నం పెట్టిస్తున్నాడు రూపాయి పూలు, జర్దా కిళ్ళీ, మిఠాయి. గాక గాజులు నకిలీ గొలుసు కొని పెడతానన్నాడు. యిదంతా ఎవరికోసం నా కోసమే కదా! రేపు ఆ ముప్పై రూపాయలు తీర్చుకోటానికి రాత్రింబవళ్ళు రెక్కలు ముక్కలయేలా రిక్షా తొక్కుతాడు. అయినా మీకు తెలియంది ఏముంది అమ్మగారూ! పెద్దవాళ్ళు అంటారు మొగుడు పెళ్ళాల పోట్లాట అద్దంమీద ఆవగింజట..... మీతో కబుర్లు చెపుతుంటే ఇట్ట ఒక్క క్షణాన పనైంది. వస్తానమ్మగారు. వాడు కళ్ళల్లో వత్తు లేసుకుని నాకోసం ఎదురు చూస్తుంటాడు" సీత పెదవి కదిపే లోపలే రంగి మాట్లాడటం శలవు తీసుకుని వెళ్లటం జరిగింది.

సీతామనోహరి కొద్దిసేపుదాకా తేరుకోలేదు.

"మొగుడు పెళ్ళాల పోట్లాట అద్దంమీద ఆవగింజ."

"మొగుడు పెళ్ళాల మధ్య పోట్లాట అద్దంమీద ఆవగింజ."

"నా మొగుడు నన్నుగాక ఎవరిని కొడతాడు?"

"పరాయి మగాడు తన్నటానికి వస్తే వూరుకుంటానా?"

రంగి అన్న మాటలు పదే పదే గుర్తొచ్చాయి. సీతకి ఏ పని చేయబుద్ధి కాలేదు. రామకృష్ణ ఆఫీసు నుంచి వచ్చేసరికి ఆర్. కె. వాళ్ళ గులాబ్ జామూన్ చేసి అటుకుల పులిహోర చేద్దామనుకుంది. అవీ చేయ్యబుద్ధి కాలేదు. రంగి గురించి ఆలోచిస్తూ పడక్కుర్చీలో అతుక్కుపోయి పడుకుంది.

# 7

రామకృష్ణ ఆఫీసు నుంచి యింకో పది నిమిషాల్లో రానున్నాడు.

సీత పడక్కుర్చీలోంచి లేచింది.

"ఉదయమనగ భోంచేసి ఆఫీసుకి వెళ్లారు. ఆకలితో నక నక లాడుతుంటారు. స్వీటు హాటు రెండు రకాలు చేద్దామనుకున్నాను. ఈ రంగి గోల కాదు కాని, మైండ్ పాడయింది." అనుకున్న సీత చాకు అందుకుంది టక టక ఉల్లిపాయలు టమేటాలు కేరెట్ అల్లం పచ్చిమిర్చి తరిగింది.

అన్ని ముక్కలూ వేసి ఉప్మా తయారు చేసి, కొద్దిగా మసాలా పౌడర్ దానిమీద చల్లింది. ఈ మధ్యనే ఓ వారపత్రికలో మసాలా ఉప్మా అని ఒకామె రాసింది. అది చదివి సీత ఆ విధంగా మసాలా ఉప్మా చేసింది. ఆ ఉప్మా సీతకి, రామకృష్ణకి బాగా నచ్చింది.

ఇప్పుడు తేలికగా రామకృష్ణ ఇంటికి వచ్చేసరికి ఆ ఉప్మాయే చేసింది సీత.

రామకృష్ణ యింటికి వచ్చాడు. సీతని చూస్తూనే "అమ్మాయిగారు ఉషారుగా లేరు ఏమిటబ్బా!" అనుకున్నాడు.

రామకృష్ణ కాళ్ళు చేతులూ కడుక్కుని, డ్రస్ మార్చుకుని వచ్చేసరికి సీత రెండు ప్లేట్లలో ఉప్మా సర్దింది.

"రంగి చూశారా - ఎంత పని చేసిందో!" రామకృష్ణ ముందు ఉప్మా ప్లేటుపెట్టి అంతవరకూ దాచుకున్న మాటని వదిలింది సీత.

"కొంపదీసి మొగుడు కొట్టినందుకు ఏ అఘాయిత్యం అయినా చేసుకుందా?" రామక్రిష్ణ ఆదుర్దాగా అడిగాడు.

"ఊహూ!"

"మరేం జరిగింది?"

"అదీ, మొగుడూ కలసి సినిమాకి వెళ్లారు."

రామక్రిష్ణ ఫక్కున నవ్వాడు. దాంతో పొలమారింది.

సీత కోపంగా చూసింది. అదే మరొకసారి అయితే తన చేత్తో రామకృష్ణ తలమీద మృదువుగా కొట్టి - "ఎందుకంత తొందర. ముందు మంచినీళ్ళు తాగండి. మీ బామ్మకి మీరు ముద్దుల మనవడు కదా - ఆమె తలుచుకుంటున్నారు కాబోలు!" అనేది. ఇప్పుడు సీత అలాంటి పనులేమీ చేయలేదు.

రామకృష్ణ తన చేత్తో నే తన తలమీద కొట్టుకుని, అరగ్లాసు మంచినీళ్ళు తాగి "ఏది, మళ్ళీ చెప్పు - ఏం జరిగిందో?" అన్నాడు.

"రంగి తన మొగుడితో సినిమాకి వెళ్ళింది." సీత చెప్పింది.

"దాని మొగుడుతో అది సినిమాకి వెళ్ళింది. అందులో చెప్పుకోతగ్గ వింత ఏముంది - రంగి పరాయిదాని భర్తతో వెళితే ఆశ్చర్యపడాలి కాని!" అన్నాడు రామకృష్ణ.

సీత కోపంగా చూసింది.

"చూడమ్మాయ్! అలా చిర చిర లాడితే లాభంలేదు. విషయమేమిటో చెప్పు."

"పొద్దుటి విషయం మీకు గుర్తులేదా?"

"గుర్తు తెచ్చుకోండి."

రామకృష్ణ కాస్త ఆలోచించి గుర్తు తెచ్చుకున్నాడు. "రంగి ఉదయం నీతో ఏడుస్తూ ఏదో చెప్పింది - ఆ విషయమేనా?" అడిగాడు.

సీత ముఖం ఆనందంతో విప్పారింది.

"ఆ.....ఆ.....ఆ విషయమే. రాత్రి వాడు తాగొచ్చి కొట్టాడుట. నీవేం నాకక్కరలేదు, జయమాలిన్ని తెచ్చుకుంటానని కూడా అన్నాడుట. ఇంక వాడితో కాపురం చేయనని చెప్పి, కళ్ళనీళ్ళు పెట్టుకుంది. అలాంటిది ఈ మధ్యాన్నం గజ్జెల గుర్రంలా తయారయి వచ్చింది....." అంటూ రంగి విషయం చెప్పింది సీత.

రామకృష్ణ సాంతం విని,ఉప్మాతోపాటు సీత చెప్పిన విషయం కూడా చప్పరిస్తూ "పోనిలే సీతా!వాళ్ళిద్దరూ యే పొరపొచ్చాలు లేకుండా కలిశారు.మనం చెయ్యవలసింది సంతోషించడం-అంతవరకే!"అన్నాడు చాలా తేలిగ్గా.

"ఏమిటి,మళ్ళీ చెప్పండి"అంది సీత.

మళ్ళీ చెప్పాడు రామకృష్ణ.

"ఎంత తేలిగ్గా చెప్పారండి?"అంది సీత.

"అవును.అంతేగా మరి!"అన్నాడు రామకృష్ణ చెయ్యి కడిగేసుకుంటు

"అంతే మీకు అర్థమయింది."

"అంటే?"

"మీకు అర్థమయ్యిందో కాలేదో నాకు తెలియదు కానీండి -నాకు మటుకు చాలా భాధగా వుంది."

"వాళ్ళిద్దరూ కలసి సినిమాకి వెళ్ళినందుకేనా!"

"అమ్మయ్య!ఇప్పటికి అర్థం చేసుకున్నారు!"సీత త్రుప్తిపడుతూ అంది.

రామకృష్ణ పక్కున నవ్వాడు.నవ్వడం అయిపోయిం తరువాత "పిచ్చి సీత!"అన్నాడు ఆప్యాయంగా.

"నాకేం పిచ్చి లేదు!"సీత కోపంగా చూసింది.

"వాళ్ళిద్దరూ హాయిగా సినిమాకెళితే మధ్యలో నీకెందుకు సీతా భాధ?"

ఇంతేనా మీకర్థమయింది -అన్నట్లు చూసింది సీత.

"చెప్పు సీతా!"

"రంగి మొగుడు రాత్రి తాగొచ్చి కొట్టాడు రంగిని.కాని,వాడి తప్పు వాడికి తెలుసు కాబట్టి-రంగిని బతిమిలాడి సినిమాకి తీసుకువెళ్ళాడు ....."

"బస్ ..."అన్నాడు రామకృష్ణ.

"మీ బస్సునీ ,రైలుని అక్కడే ఆపండి.రంగిని కొట్టిందేగాక-జయమాలిన్ని తెచ్చుకుంటానన్నాడు.అప్పుడు రంగి హృదయం ఎంత నోభిక్షి వుంటుంది! దిక్కుమాలిన మొగుడుతో కాపురం చేయనని చెప్పిన రంగి,ఎలా ఆత్మభిమానం వదులుకుని సినిమాకి వెళ్ళింది? దానికి ఆత్మాభిమానం లేక కాదు - లోకం నవ్వుతుందన్న భయం, సమాజం ఎత్తి పొడుస్తుందన్న కించ, భర్త లేకుండా బతకలేనేమోనన్న పిరికితనం! తరతరాలుగా, యుగయుగాలుగా స్త్రీ ఎందుకు అణిగి మణిగి వుంటున్నది? విషపు కత్తులు లాంటి సమాజం - గంటుముళ్ళులాంటి భర్త....."

"హా సీతే! పురుష ద్వేషిణే!" అన్నాడు రామకృష్ణ.

"మధ్యలో ఏమిటి గోల! నేను అన్యాయం అయిపోతున్న ఆడకూతుళ్ళ గురించి మాట్లాడుతున్నా గాని, పురుష ద్వేషంతో మాట్లాడటంలేదు. నాకు పురుషుల రాక్షసచర్యల మీద కోపంగాని- పురుషులమీద లేదు!" సీత తీవ్రంగా అంది.

"భార్యాభర్తల బంధం చాలా బలమైంది సీతా! ఒక భార్యా, భర్త చిన్న సంఘటనతో ఆవేశంగా విడిపోతే విచారించాలి గాని - మబ్బులు విడిపోయి, వారి మధ్య పోట్లాటసమసిపోయి కలసి వుంటే మనం సంతోషించాలి....." అంటూ రామకృష్ణ గంటసేపు చెప్పింది చెప్పకుండా చెప్పగలడు. కానీ ప్రస్తుతం సీతామనోహరి కోపం, ఆవేశం నిండా భోంచేసి వుంది కాబట్టి, ఇప్పుడు మాట్లాడి ప్రయోజనం లేదనుకున్నాడు.

రంగికేదో తీరని అన్యాయం జరిగిపోయినట్లు సీత అనుకుంటున్నది గాని, ఆ అన్యాయం ఎలాంటిది? ఎంతవరకూ సమంజసం అన్నది సీతకి తెలియదు. ఈ విషయం రామకృష్ణకి బాగా తెలుసు.

సీతామనోహరి తల్లి, తండ్రి దగ్గర బహుగారాబంగా పెరిగింది. తండ్రి స్త్రీజనోద్ధరణసంఘ అధ్యక్షుడు. ఆయన గురువు గుడిపాటి వెంకటాచలం. ఆయన రచనలు చదివి ప్రభావితం చెందాడు ఈయన. ఏ అబలకైనా అన్యాయం జరిగితే స్త్రీ జనోద్ధరణ సంఘం ఆ అబలపక్క నిలిచి పోరాడుతుంది ఇదంతా సీత చిన్నతనంలో ఒకానొకనాడు. సీత తండ్రికి వయసు మీదపడ్డ తర్వాత అలాంటివి వదిలేసి మామూలుగా వుండిపోయాడు.

ఆ తానులోని పీలికే అన్నట్లు - ఆ తండ్రి కూతురు సీత. అదే గుణగణాలు వచ్చాయి. ఇది బాగా తెలిసిన రామకృష్ణ - సీత మంచితనం, అమాయకత్వం, ఆవేశం తెలుసు కాబట్టి అర్థం చేసుకుని మెలుగుతున్నాడు. ఇప్పుడు కూడా అలాగే.....

"సీతా! నేనో విషయం చెప్పనా?" అన్నాడు రామకృష్ణ వేడి కాఫీ చిన్నగా సిప్ చేస్తూ.

"చెప్పండి" అంది సీత.

"నీవంటే చదువుకున్నావు. ప్రపంచజ్ఞానం కూడా అపారమే. పైగా రక్తంలోనే బానిసత్వం వుందా అన్నట్లు - నేరం చేయకపోయినా తలవోగ్గే తత్వం చాలామందిలో వుంది. ముఖ్యంగా బీదవాళ్ళు, కింద తరగతి వాళ్ళు అణిగి మణిగి వుండే విధానానికి తలవొగ్గి వున్నారు. మనం ఏం చేయగలం? రంగి లేబర్ జాతి స్త్రీ సలహా అన్నది చెప్పగలం. ఇది మంచి, ఇది చెడు- అంతవరకే. రంగి ఖర్మ రంగిది. దాని విషయం వదిలేసెయ్యి!" అన్నాడు రామకృష్ణ, విషయాన్ని అటునుంచి నరుక్కువస్తూ.

"అంతేనా!"

"అంతే!"

"ఈరోజు నా మనసంతా పాడయిపోయింది."

"నేను వూహించగలను. దీనికి ఒకటే మందు."

"ఏమిటో?"

"టింగురంగా అంటూ మనం సినిమాకి వెళ్ళటం."

సీత కాస్త ఆలోచించి "అదే మంచిది. వెళదాం" అంది.

"గుడ్! వెంటనే తయారుకా!" అంటూ రామకృష్ణ లేచాడు.

మరో ఇరవై నిమిషాల తర్వాత రామకృష్ణ, సీతామనోహరి సినిమా హాలుదగ్గర వున్నారు. మరో పది నిమిషాల తర్వాత హాలులో పక్కపక్క కుర్చీలలో కూర్చున్నారు.

అర్థం అపార్థం సినిమా మొదలయింది.

అర్ధం అపార్ధం సినిమా తాలూకా కదా, కమామీషా వీళ్ళకు ముందు తెలియదు. మధ్య మధ్య కబుర్లు చెప్పుకున్నా, శ్రద్ధగా సినిమా మొత్తం చూశారు.

ఇద్దరు మొగుళ్ళు, వాళ్ళ తాలూకా ఇద్దరు పెళ్ళాలు వుంటారు. ఓ భర్త తాగటం, తిరగటం, పేకాడటం- అప్పుడప్పుడు పెళ్ళాం దవడలు వాయగొట్టటం చేస్తు ంటాడు. ఐనా ఆ మహా ఇల్లా లు భర్తని పల్లె త్తు మాటఅనదు. అణిగిమణిగి వుంటుంది. లాస్ట్ సీనులో భార్తా మారిపోయి, మంచివాడు అయి "నన్ను క్షమించు శాంతా!" అంటాడు. వెంటనే శాంత భర్త కాళ్ళమీద పడి 'నన్ను క్షమించండి' అంటుంది. ఆ సినిమాలో హాయిగా ఉద్యోగం చేసుకుంటుంటుంది. దాంతో ఈయన గారు రెండో పెళ్ళి చేసుకున్నారు. దాంతో ఈయనగారు రెండో పెళ్ళి చేసుకున్నారు. ఉద్యోగం చేసే ఆవిడ సిటీ బస్సుకోసం ఎదురుచూస్తూ బస్సు స్టాపులో నుంచుని ఉంటుంది. ఆవిడ ముందునుంచి ఓ జంట ఎవరంటే ఆమె భర్త, ఆ భర్తగారి రెండోభార్య. ఆ తర్వాత మరో స్కూటర్ మీద యింకో జంట రయ్యిన వెళ్ళిపోతారు. వాళ్ళేవరంటే భర్త తాగి తందనాలు ఆడినా క్షమించిన భార్య ఆ జంట.

చివరికి దర్శకుడి నీతి బోధతో తెర వాలుతుంది.

స్త్రీ అమృతమూర్తి, క్షమా ధరిత్రి భర్త చేసిన తప్పులని ఏ స్త్రీ క్షమిస్తు ందో, ఆ స్త్రీ దైవస్వరూపిణి. ఆమెకి చివరికి దక్కుతాయి సుఖశాంతులు. అంటూ ఉదాహరణకి ఇరువురు స్త్రీలనీపోల్చి - బస్సుస్టాపులో నిరాశగా, ఒంటరిగా జీవితంలో తోడు-నీడ లేకుండా నిర్భాగ్యంగా, దౌర్భాగ్యంగా ఎలా నిలిచిందో ఆమెని చూడండి - అంటాడు.

ఇవి దర్శకుడు చెప్పిన చివరి మాటలు.

సినిమా హాలులో జనం అంతా కళ్ళు తుడుచుకుని హాలులోంచి బైటికి వచ్చారు.

రామకృష్ణ, సీతామనోహరి కూడా కళ్ళు తుడుచుకోలేదు గాని, హాలులోంచి బైటికి వచ్చి స్కూటర్ ఎక్కి ఇంటికి వచ్చారు.

ఇంట్లో అడుగుపెడుతూనే -

"దర్శకుణ్ణి నరికిపోగులు పెట్టాలి" అంది సీత.

"అది నీ అభిప్రాయం. జనాభిప్రాయం కాదు. సెంటిమెంటు, నీతులు, త్యాగాలు చిత్రం నిండా గుప్పిస్తే నాలుగు రాళ్ళు రాలతాయని - ఓ విషయాన్ని పట్టుకుని మసి పూసి మారేడుకాయ చేసి చూపిస్తారు. ముఖ్యంగా ఈ ఆడమళయాళమే ఇలాంటి చిత్రాలు ఒకటికి రెండుసార్లు చూసేది-" చల్లగా అంటించాడు రామకృష్ణ.

"సినిమాకి వెళ్ళివస్తే మనసు హాయిగా వుంటుందనుకుంటే అదేం కనిపించలేదు. తలనొప్పి కొని తెచ్చుకోటం" అంది సీత.

"ఆ..... మరే" అన్నాడు రామకృష్ణ.

సీతకి నిజంగానే తలనొప్పి పట్టుకుంది. అందుకే అంతటితో వదిలేసింది. అదే మరొకసారి అయితే చూసి వచ్చిన సినిమాని పట్టుకుని మాటలతో చీల్చి చెండాడి తూర్పార బట్టేది.

ఆ రాత్రికిహ రామకృష్ణ గాని సీత గాని సినిమా గురించి మాట్లాడుకోలేదు

# 8

ఆమె పేరు సరోజ.

సీత వున్న యింటికి మూడిళ్ళ అవతలనే సరోజ వుండేది. ఒకరింట్లో పేరంటం సందర్భంలో ఇరువురు

కలిశారు. ఒకరింటికొకరు ఆహ్వానించుకున్నారు. ఆ తర్వాత ఓ రోజు సరోజ యింటికి వెళ్ళి వచ్చింది సీత.

సరోజ ఇల్లు వున్నంతలో నీట్ గా వుంది. కాని ఆ ఇల్లా లుకి ఏది ఎక్కడ సర్దాలో తెలియనట్లు లేదు. సరోజ అగ్గిపెట్టెలతోను సిగరెట్టు పెట్టెలతోను బొమ్మలు తయారుచేసింది. నేనేనంటూ చూపించింది.

"బొమ్మలు చాలా బాగున్నాయి. సిగరెట్ పెట్టెలు అగ్గిపెట్టెలు పోగుచేయటానికి చాలా శ్రమపడి వుంటారు" అంది సీత.

"మా వారు చైన్ స్మోకరు. ఆయన పెట్టెలు పెట్టెలు ఖాళీ చేస్తుంటారు, నేనేమో ఇలా బొమ్మలు చేస్తుంటాను" నవ్వుతూ చెప్పింది సరోజ.

సీతకి నవ్వు రాలేదు. ముఖం చిట్లించి "అలాగా!" అంది. తర్వాత ఓ పావుగంట కూర్చుని యింటికి వచ్చింది సీత.

ఇది జరిగి వారం అయింది.

సీత ఏదో వారపత్రిక తిరగేస్తుంటే సరోజ వచ్చింది.

సీత ఆనందంగ సరోజని ఆహ్వానించింది.

సీత ఫ్రిజ్ లో వున్న డ్రింక్ వాటర్ లో కమలాలతో నేనే తయారుచేశానని కూడా చెప్పింది.

"చల్లగ పళ్ళరసం తాగేసరిగి ప్రాణం లేచి వచ్చింది. ఫ్రిజ్ వుంటే ఆ యిదే వేరు" అంది సరోజ.

"మీడియం సైజు ఫ్రిజ్ కొనండి. కొన్ని షాపుల్లో వాయిదాల పద్దతి మీద కూడా యిస్తున్నారు" సీత చెప్పింది.

"మా వారి సిగరెట్లకే ఎంత డబ్బు చాలదు. ఇంక ఫ్రిజ్ కొనాల్సిందే" సరోజ నవ్వుతూ చెప్పింది.

"మీరు తలుచుకుంటే మానిపించడం ఓ లెక్కా!"

"ఆయన సంగతి మీకు తెలియదు. మొదట్లో సిగరెట్ పొగ వాసన భరించలేకపోయేదాన్ని. వూరికే కడుపులో తిప్పుతుండేది. ఆయన కూడా ఎందుకో మానేయాలనుకున్నారు. మానేయటానికి నోరు బాగుండక కిళ్ళీ

అలవాటు చేసుకున్నారు.  దరిమిలా వారు సిగరెట్టు మానటం చాతకాలేదు దాంతోపాటు కిళ్ళీ అలవాటు కూడా అయింది. ఒకటికి రెండు ఖర్చు."

సరోజ ఆ విషయం చాలా తేలిగ్గా తీసుకుని చెపుతుంటే సీతకి వింతగా అనిపించింది.

"మీకు సిగరెట్టు పొగ పడదని...... కడుపులో తిప్పేదని...... చెప్పారు!"

"ఆ...... అది మొదట్లో రాను రాను అదే అలవాటు అయింది. అయినా మగవాళ్ళు కాకపోతే ఆడాళ్ళు తాగుతారా సిగరెట్టు?"

సరోజ అలా అనటంతో సీత యింక ఆ విషయం వదిలేసింది. ఆ తర్వాత ఫ్యామిలీ విషయాలు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. తన పెళ్ళిలో మగపెళ్లి వారైన అత్తగారి తరఫున అందరూ గిల్లికజ్జాలు పెట్టుకుని పెళ్ళిపీటల మీద ఎంత గోల చేసింది సరోజ చెప్పింది. పెళ్లికొడుకు బాబాయి కొడుకు యొక్క ఫ్రెండ్ భోజనాల సమయంలో కూర కావాలని రెండుసార్లు చెప్పినా కూర తీసుకుని ఎవరూ రాలేదుట. దాంతో అంతా కోపగించుకుని లేవబోయారుట" భోజనాల మధ్యలో లేవద్దు బాబూ!" తప్పు మాది అని సరోజ తండ్రి కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ పెళ్ళికొడుకు యొక్క బాబాయి కొడుకు యొక్క ఫ్రెండ్ చేతులు పుచ్చుకుని బతిమిలాడాడుట. దాంతో శాంతించారు.

వీళ్ళు గజ గజ లాడుతూ అన్నీ మరీ మరీ అడిగి వడ్డిస్తుంటే ప్రతి పదార్ధం కావాలంటూ నలుగురు తినేంత వేయించుకుని అన్నీ విస్తళ్ళలో వదిలేసి లేచిపోయారుట. ఆడపెళ్ళి వారికి ఏ పదార్థాలు మిగలకపోయేసరికి మళ్ళీ కూరలు పచ్చళ్ళు అన్నీ చేసుకోవాల్సి వచ్చిందట. ఇలా ప్రతిదానికీ పేచిలతో సగానికి సగం నష్టంతో పెళ్లి అయిందిట.

సరోజ తన పెళ్లి ఫార్స్ శశిరేఖా పరిణయం అంత గొప్పదన్నట్లు ఫోజుపెట్టి చెప్పింది.

"ప్రతి విషయాన్ని ఎంత తేలికగా తీసుకుని చెపుతారు? వీళ్ళకేమి అనిపించదా?" అనుకున్న సీత "వాళ్ళలా చీటికిమాటికీ కయ్యాలు పెట్టుకుంటే ఆ సమయంలో మీరేం చేశారు?" కుతూహలంగా అడిగింది.

"నాకు చాలా భయం వేసింది. ఏడుస్తూ కూర్చున్నాను" సరోజ చెప్పింది.

"మగపెళ్ళి వారిమీద అసహ్యం కలగలేదా?"

"అసహ్యం ఎలా కలుగుతుంది? మగపెళ్ళివారు కాకపోతే ఆడపెళ్ళివారు ఎక్కడైనా గోల చేస్తారా?" ఎదురు ప్రశ్న వేసింది సరోజ.

"మగపెళ్ళి వారైతే మాత్రం ఎంతలో వుండాలో అంతలో వుండక్కరలేదా? వాళ్ళలో ఎవరికీ ఆడపిల్లలు లేరా? లేబర్ కూడా పెళ్ళిళ్ళలో యింత అల్లరి చేయరు. ఈ మధ్య రకం ఫామిలీలల్లో నేమిడి మిడి రోగాలు" ఆవేశంగా అంది సీత.

సీత అన్నది సరోజకి అంతగా రుచించలేదు. మౌనం వహించింది. అది గ్రహించిన సీత మరోవేపు నవ్వుతూ తిప్పింది.

అక్కడ కూడా చుక్కెదురైంది సీతకి.

"భర్త అన్న తర్వాత ఎప్పుడో భార్యమీద చేయి చేసుకుంటాడు. అది తప్పంటే ఎలా? ఆడజన్మ అంటే ఏమిటి అణిగిమణిగి వుండటమే కదా! ఓసారి నామతి మరుపుతో మా వారికి కోపం వచ్చి చేయి చేసుకున్నారు. తప్పు నాది అని చెప్పిం తరువాత గాని వారు శాంతించలేదు...." అంటూ సరోజ చెప్పుకుపోయింది.

"నా తల్లీ! చదువుకున్న మూర్ఖురాలివి. శ్రీకృష్ణలీలలు కధ చెప్పినంత రమ్యంగ నీ సంసారం కధ చెపుతున్నావు" అనుకుంది సీత.

మరో అరగంట తర్వాత.

"మావారు ఆఫీసు నుంచి వచ్చేసరికి నేను యింట్లో లేకపోతే చిందులు శివాలు అనుకొండి. మా వారికి కోపం

వచ్చిందా తగ్గటానికి ముచ్చటగ మూడురోజులు పడుతుంది" అని చెప్పి సరోజ వెళ్ళిపోయింది.

ఇది సీతకి చేదు అనుభవం.

సరోజ యిక్కడ వున్న గంటలో గొప్ప మనోహరమైన కథలా తన పెళ్ళి మొగుడు సిగరెట్లు చెంపదెబ్బలు తేలిగ్గా వినిపించి వెళ్ళిందిగాని సీత హరించుకోటానికి చాలా సమయమే పట్టింది.

"లోకంలో సరోజలాంటి ఆడవాళ్ళు కూడా వుంటారన్నమాట?"

రెండుచేతుల మధ్య తలకాయ యిరికించుకుని ఆలోచిస్తూ కూర్చుంది సీతామనోహరి.

# 9

"సాయంత్రం మాంచి హాస్యరసం చిందించే చిత్రరాజం 'ఊరందరికి మొగుడు' వెళదాం" అన్నాడు రామకృష్ణ.

"ఊరందరికి భార్య ఈ పేరుతో ఏ నిర్మాత సినిమా తియ్యలేదా?" సీతామనోహరి సాంబారులోని ములక్కాడలని గరిటతో తీసి రామకృష్ణ కంచంలో వేస్తూ వ్యంగ్యంగా అడిగింది.

"ఖర్మకాలి ఏ నిర్మాత ఊరందరికి భార్య అనే టైటిల్ తో పిక్చర్ తీశాడే అనుకో, మీ ఆడాళ్ళు తెరని చించి పోగులు పెట్టటమే గాక సినిమా హాలుని కూడా తగలబెడతారు."

రామకృష్ణ చెప్పిన తీరుకి కిలకిల నవ్వింది సీత.

"అవతల ఆఫీసు టైం అయిందని హడావిడిగ నేను భోం చేస్తుంటే అలా నవ్వకు" కోప్పడ్డాడు రామకృష్ణ.

"అదేంటమ్మా!" ముద్దుగ అడిగింది సీత.

"నాకు కొలమారుతుంది."

"బాగుంది వేషాలు. బోడిగుండుకి మొకాలుకి ముడిపెట్టినట్లు వుంది. నా నవ్వుకి మీ కొలమారటానికి సంబంధం ఏమిటి?"

"ఏమో నాకలా అనిపించింది" కొంటెగా అన్నాడు.

"దేనినే వేషాలు అంటారు."

"వేషాలు అయితే ఫరవాలేదు. తిట్టులాంటిది అయితే చాలా కష్టం" అంటూ భోజనం ముగించి చేయి కడుక్కున్నాడు రామకృష్ణ.

సీత కూడా భోజనం పూర్తి కావటంతో రామకృష్ణ వెనుకనే బెడ్ రూమ్ లోకి వచ్చింది.

"సాయంత్రం ఊరంతా మొగుళ్ళు పిక్చర్ కి వెళదామా వద్దా చెప్పనేలేదు" రామకృష్ణ బూటు లేసు బిగించుకుంటూ అడిగాడు.

"పేరు మార్చేశాడు!"

"నీ పేరా?"

"ఉహూ పిక్చర్ పేరు."

"ఎవరు?"

"మీరే మహానుభావా! ఊరందరికి మొగుడు అని యిందాక చెప్పారు. ఇప్పుడేమో ఊరంతా మొగుళ్ళు అంటున్నారు."

"అలా అన్నానా?"

"ఆ..... అలాగే అన్నారు."

"ఎందుకన్నానబ్బా?"

"ఏమోనబ్బా!"

"ఇంతలోనే యింత మతిపోయిందా? ఏమిటో నీవిలా దగ్గరగ రా!"

"ఎందుకు?"

"నీ ముఖంలో ముఖంపెట్టి నీ కళ్ళల్లో వెతుకుతాను."

"ఏమిటి?"

"పోయిన మతిని."

రామకృష్ణ డ్రెస్ పూర్తి చేసుకోటం పూర్తి అయింది. సీతని దగ్గరకు తీసుకున్నాడు.

"అయ్యొయ్యో డ్రస్ నలిగి పోతుందండీ?"

"నాకు లేని బాధ నీకెందుకు!"

"మరీ యింత యిది పనికిరాదు."

"భార్యని భర్త ముద్దు పెట్టుకోటం యిదా?"

"ఇది కాకపోతే ఏమిటిట? ఈ ముద్దు పెట్టుకునే సీన్లు సినిమాలలో వుంటాయి. లేకపోతే నవలల్లో వుంటాయి. అంతేగాని నిజజీవితంలో వుండవు" దబాయింపుగ అంది.

"సరేలే" అంటూ సీతని వదిలేశాడు రామకృష్ణ.

"సరేలే అంటే ఏంటి?"

"రేపు ఆఫీసుకెళ్ళేటప్పుడు చెపుతాను."

సీత చిరుకోపం తెచ్చుకుని మూతి సున్నాలా చుట్టి ఆ తర్వాత పెదవి బిగింపులో నవ్వు దాచుకుంది.

రామకృష్ణ బెడ్ రూమ్ లోంచి బైటికి వస్తూ సీత బుగ్గమీద చిరుచిటిక వేశాడు. "సాయంత్రం నేను వచ్చేసరికి రెడీగా వుండు. దిక్కుమాలిన మొగుడికి వెళదాం" అన్నాడు.

సీతామనోహరి కిలకిల నవ్వింది.

రామకృష్ణ స్కూటర్ మీద కూర్చుని టాటా చెప్పి రయ్యిన వెళ్ళిపోయాడు.

"నా మొగుడు ఎంత మంచివాడమ్మా!" అనుకుంది సీత.

ఆ యింటి మొత్తం మీద సీతామనోహరి, రామకృష్ణ ఇద్దరే వుండటం వల్ల అప్పులు, రోగాలు లాంటి బాధలు లేకపోవటం, గిజాటు సంసారం కాకపోవటం - ముఖ్యంగా పరస్పర అనురాగం వారి మధ్య మెండుగా వుండటంతో ఇంతవరకూ వారి మధ్య సరదాలు తప్ప మరేదీ చోటుచేసుకోలేదు.

పూర్తిగా ప్రపంచం తెలియని సీత అలా అని అమాయకురాలు కాదు. అటు పుట్టింట, యిటు అత్తింట బాధలు లాంటివి బొత్తిగా తెలియకపోవటం, చిన్న కష్టంలో కూడా తలదూర్చే అవసరం రాకపోవటం వల్ల సీతకి అనుభవంలో చాలా తెలియవు.

కాశీమజిలీ కథలు చదివి ఆ కాలంలో కీలుగుర్రాలు, మహా మాంత్రికులు, రాక్షసులు వున్నారని అనుకున్నట్లే - ఇప్పుడు సీత తెలుగు సినిమాలు చూసి, తెలుగు నవలలు చదివి ప్రపంచంలో ఆడవాళ్ళు చాలా రకాలుగా నానా కష్టాలు పడుతున్నారు. ఎక్కువ సంసారాలలో భర్తలే భార్యలని కష్టపెడుతున్నారు అనుకుంది.

సీత అలా అనుకోటానికి తోడు ఏ ఇల్లా లినికదిలించినా ఏదో ఒక కష్టాల కథ కానరావటమే.

సీతని బాగా అర్థం చేసుకున్న రామకృష్ణ తరచూ అనేమాట - "సీతా! నీవు అమాయకురాలివయినా గడుగ్గాయివి."

ఈ మాటకర్థం బొత్తిగా తెలియలేదు సీతకి.

రామకృష్ణ ఆఫీసుకి వెళ్ళింతరువాత సీత పావుగంటలో పనంతా పూర్తి చేసుకుంది. ఆ తర్వాత ఏం చేయాలా తెలియక కాలుగాలిన పిల్లిలా యిల్లంతా తిరిగింది. ఏదన్నా జాబ్ చేస్తే ఎలా వుంటుంది? అని కాసేపు ఆలోచించింది. అంత అవసరం కనపడలేదు.

"కాలక్షేపానికి ఏం చేయాలి?" సీత చాలా రకాలుగా ఆలోచించింది.

"కుట్లు, అల్లికలు......"

"పెద్ద బోర్! అయినా బజారునిండా రకరకాలవి దొరుకుతుంటే అదో శ్రమ దేనికి?"

"అగ్గిపెట్టెలు, సిగరెట్టు పెట్టెలు, ఇంజక్షన్ సీసాలతో బొమ్మలు తయారుచేస్తే!"

"అవి ఏమంత అందంగా వుంటాయి కనుక.....!"

"అన్నింటికన్నా బెటర్ - రచనలు చేయటం!"

"నిజమే - అదయినా చేతయి చావాలికదా!"

"ఇంత చదువూ చదివి ఇల్లు అల్లుక్కోటానికాఅన్నట్లు ఆమాత్రం రాయలేనా! డిగ్రీ దాకా చదివి ఇల్లు అలుక్కోటానికా అన్నట్లు - ఆమాత్రం రాయలేదా! డిగ్రీ దాకా చదివినదాన్ని! వార, మాస పత్రికలు కాక, నవలలు తెగ చదివిందానిని - ఓ రచన చేయటం అంత కష్టమా? రచనలంటూ చేస్తే ఇటు కాలక్షేపం, అటు పేరు ప్రఖ్యాతులు, కీర్తి ప్రతిష్టలు.... రాజకీయ నాయకులకి లేని పేరు రచయిత్రులకి వుంది. కనుక కాలక్షేపంగా రచనలు చేయటం మంచిది."

కాసేపు తనలో తాను తర్జన భర్జనపడి, సీతామనోహరి ఓ నిర్ణయానికి వచ్చింది.

అప్పటికప్పుడే కాగితం, కలం తీసుకుంది.

సీతామనోహరి రచయిత్రి కావటమే యింక ఆలస్యం - రచన చేయటానికంటూ కలం పట్టింది కదా!

"టీ తయారు చేసి, ఫ్లాస్క్ లో పోసుకుని పక్కన పెట్టుకుంటే బాగుంటుందేమో!" అనుకుంది సీత.

"భోంచేసి పావుగంట కాలేదు - వేషాలు పోకు" అంది అంతరాత్మ.

టీ తయారుచేయటం అనే ప్రక్రియని తాత్కాలికంగా వాయిదా వేసి, దస్తా తెల్లకాగితాలు టేబుల్ మీద పెట్టి, అవి ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ వాటిమీద పెట్టి, మధ్యలో పెన్నులో యింకు అయిపోతే చిరాకుగా వుంటుంది కాబట్టి - ముందే పెన్నునిండా ఇంకు పోసుకుని, టేబుల్ ని కిటికీ దగ్గరగ జరుపుకుని కుర్చీలో కూర్చుంది సీత.

రాస్తున్నప్పుడు ఆలోచనలు రాకపోతే కాసేపు బుగ్గన చేయి చేర్చుకుని, కిటికీలోంచి బైట కనపడే ప్రకృతి (క్రోటన్స్ మొక్కలు) ని పచ్చపచ్చగా చూస్తే మనసు ఫ్రెష్ గా మారి, మంచి ఆలోచనలు వస్తాయి కదా! - ఇది సీత ఆలోచన.

పెన్నుకున్న క్యాప్ ని తీసిపెట్టి, పెన్ను పట్టుకున్న చేతిని బుగ్గకి చేర్చి, రాయబోయే రచనకి ఏం పేరు పెట్టాలని శూన్యంలోకి సాలోచనగా చూస్తూ ఆలోచించింది. వెంట వెంటనే చాలా పేర్లు తట్టాయి.

అందమైన ఆడపిల్ల.

ఎగిరెగిరి పడిన బంతి.

ఒక అమ్మా నాన్నా కథ.

చితికీ చితకని బతుకులు.

నల్లకాకి, తెల్లపిచ్చుక.

సీతకి నవ్వు వచ్చింది. దాంతో ఆలోచనకి బ్రేక్ పడింది. నల్లకాకి, తెల్ల పిచ్చుక - ఈ కథని చందమామకి

పంపిస్తే సరిపోతుంది. ముందు సాంఘిక నవలలు రాయకుండా, బాల సాహిత్యం రాయటం ఏమిటి? బాల సాహిత్యం రాయటం వల్ల పిల్ల రచయిత్రిగా పేరు వస్తుందేమోగాని, పెద్ద రచయిత్రిగా మటుకు రాదు.

కనుక -

పిల్ల రచనలు ఇప్పుడప్పుడే చేయరాదు.

కనుక -

ఏం రచనలు రాయాలి?

సీతకి ఆ సమయంలో ఓ పెద్ద రచయిత్రి తాను రాసిన నాలుగొందల పేజీల పెద్ద నవలలో ఓచోట రాసిన మాటలు గుర్తుకొచ్చాయి.

"ఏ రచననైనా తేలికగా రాయొచ్చు కాని, క్రైం రచన చేయటం మహా కష్టం. పది నెలలు మోసి పండంటి బిడ్డను కనటం తేలిక. అజ్ఞాతవాసంలో వున్న హంతకుడిని పట్టటము తేలికే - కాని ఒక క్రైం రచన చేయటం మటుకు చాలా కష్టం."

ఇలా రాసుకుంది ఆవిడ. క్రైం రచనల్లో చేయితిరిగిన మహా ఇల్లాలు ఆవిడ. ఖాళీ దొరికినప్పుడల్లా తెగ క్రైం రచనలు వండి పారేసి, పాఠకులకి హాటు హాటుగా వడ్డించేస్తుంది.

కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి.

రాస్తే క్రైం సాహిత్యాన్నే రాయాలి.

అనుకున్న సీతామనోహరి ఎలాంటి క్రైం రాయాలా అని కాస్త ఆలోచించింది. బొత్తిగా ఏ ఆలోచనా రాలేదు. రాసుకుపోతుంటే అదే వస్తుంది- అనుకుని గబగబా రాయటం మొదలుపెట్టింది.

అదేమి వింతో - వంచిన తల ఎత్తకుండా ఏకబిగిన ఓ అరఠావు రాసిపారేసింది. ఒక్కసారి మొదటినుంచీ చదివి, ఆ తర్వాత రాస్తే సరి - అనుకుని, తను రాసింది చదవటం మొదలుపెట్టింది సీత.

అనగా అనగా అభిరామపురంలో అతడు. ఎత్తు గా, లావుగా, కండలుతీరి అందాల సుందరిలా వున్నాడు. అతనో భయంకర హంతకుడు. చాలా హత్యలు చేసి హంతకుడు అయాడు. అతను అన్ని హత్యలు అలా చేసినా, పోలీసులకి దొరకలేదు. అతను హత్యలు చేసేముందు దేముడికి దండం పెడతాడు. దండం పెట్టి హత్యచేస్తే పోలీసులకి పట్టుపడనని ఆ హంతకుడి నమ్మకం. ఆ హంతకుడు నాలుగుసార్లు తిరపతి వెళ్ళి వచ్చాడు. వెళ్లినప్పుడల్లా తలనీలాలు కూడా యిస్తు ఉాడు. హంతకుడు అన్ని హత్యలు చేసినా - ఇంతవరకూ పోలీసులు హంతకుడిని పట్టుకోలేదు. ఉరిశిక్ష వేయలేదు. హంతకుడికి ఉరిశిక్ష వేయాలంటే పోలీసులు ఆ హంతకుడిని పట్టాలి. ఈ జన్మకి హంతకుడిని పోలీసులు పట్టలేరు. హంతకుడు ఈ మధ్య యింకా హత్యలు చేస్తూ నే వున్నాడు. హంతకుడు చేసిన హత్యలు చూసి ప్రజలు - చలికాలంలో చన్నీళ్ళు పోసుకున్నట్లు గజగజ వణికిపోతున్నారు. హంతకుడు చేసిన హత్యలు చూసి ఆబాల గోపాలం- స్త్రీ పురుషులు, చిన్నా పెద్దా, ముసలీ ముతకా చలిజ్వరం వచ్చినప్పుడు కిలో ఐసు గడ్డలు తిన్నట్లు గజగజ వణికేవారు. సి ఐ డీ లు హంతకుడు చేసిన హత్యలు చూసి - శీతాకాలంలో మంచు పర్వతం మీద దిగంబరంగా దొర్లినట్లు గజగజ వణికారు. హంతకుడు ఏ వణుకు లేకుండా హత్యలు చేసేవాడు. ఈ హంతకుడు చేసే హత్యలు......

ఇలా సాగింది సీత రాసింది.

తను రాసింది తనే చదివి - తన తలని తన చేత్తో నే పట్టుకుని ఓ నిట్టూర్పు విడిచింది సీత.

తను రాసింది మరోసారి, మరోసారి చదివి చివరికి లెక్క తీస్తే- రాసింది తక్కువ, హంతకుడు - హత్యలు అన్నమాట పేరా పేరాకి దొర్లినట్లు తెలుసుకుంది. పైగా  క్రైం కధలో అనగా అనగా అభిరామపురం ఏమిటి?  క్రైం కథ రాయటం చాలా కష్టం.

అనుకున్న సీత ప్రస్తు తానికి ఆ కధని పక్కకు పెట్టి రచయిత్రిగా తన పేరు ఏముండాలా అన్న ఆలోచనలో పడింది.

శ్రీమతి సీత.

సీతామనోహరి.

ఉహూ! పేరు మామూలుగా వుంది. పోనీ తన పేరు చివర భర్త పేరు తగిలిస్తే! సీతారామకృష్ణ. ఉహూ, సీతామనోహరీరామకృష్ణ, ఉహూ, సీతారామ్. ఛీ..... మగాడి పేరైకూర్చుంది. అయినా భర్తపేరు తగిలించుకోటం ఏమిటి? ఓపక్క స్త్రీస్వాతంత్రంఅని అఘోరిస్తూ! రచయితలు తమ పేరు చివర పెళ్ళాం పేరు తగిలించుకుంటున్నారా? రచయిత పేరు సుబ్బారావు, అతగాడి భార్య పేరు సర్వమంగళ. ఆ రచయిత ఆదర్శంగా తన భార్యపేరు చివర చేరుస్తూ సుబ్బారావు సర్వమంగళ అని రాసుకోవచ్చు కదా. మగాళ్ళు యిలాంటి పనులు చేయనప్పుడు ఆడాళ్ళు ఎందుకు చేయాలి? చేయకూడదు అనుకుంది సీతామనోహరి సీత! మరీ పూర్వం పేరు పెట్టారు. మనోహరి - యిది బాగుంది. కాని యిప్పటికే మనోహరి అన్న రచయిత్రి ఉంది. 'తన పేరు కలిసే పెన్ నేమ్ ఏదన్నా వుందా?' ఆలోచించింది.

అగ్నిపుత్రి!

మార్వలెస్! ఫెంటాస్టిక్! అమోఘం! అద్భుతం!

అగ్నిపుత్రి అంటే సీత - సీత అంటే తనే! ఎంత మంచి పెన్ నేమ్ దొరికింది!

సీతకి చాలా సంతోషం కలిగింది. ఆ సంతోషం సమయంలో  క్రైం సాహిత్యాన్ని పక్కకు పెట్టి, సాంఘికం రాయటానికి ఆయత్తమైంది.

ఈ తఫా ఆ రచన యిలా సాగింది.

భాగ్యలక్ష్మి చాలా బీదది. వాళ్ళాయన బీదవాడు. భాగ్యలక్ష్మి పిల్లలూ అంతే - బీదవాళ్ళు. పిల్లలు కాన్ మెంటులో చదివేవాళ్ళు తతిమ్మా పిల్లలు మీ అమ్మ బీదది అంటూ ఎక్కిరించేవాళ్ళు. ఆ విషయం పిల్లలు వచ్చి

తల్లితో చెప్పారు. భాగ్యలక్ష్మికి చాలా బాధ వేసింది. భాగ్యలక్ష్మి మరో పదియిళ్ళల్లో పాచిపనికి ఒప్పుకుని, రాత్రింబవళ్ళు పనిచేసి మూడునెలల్లో మూడువేలు సంపాదించింది. ఆ రాత్రి భాగ్యలక్ష్మి నిద్రపోతుంటే ఓ దొంగ ఆ యింటికి కన్నంవేసి లోపలికి వచ్చాడు. గాడ్రేజ్ బీరువాలో దాచిన మూడువేలూ దొంగిలించాడు. డబ్బు దొంగిలించిందే గాక - అదే బీరువాలో వున్న మూడు వెండి కంచాలు, పది శేవర్ల చంద్రహారం, రాళ్ళ గాజులు మొదలయినవి మూటగట్టుకుని వెళ్లాడు. వెళుతూ వెళుతూ, భాగ్యలక్ష్మి భర్త స్కూటర్ ని కూడా తీసుకెళ్ళాడు. భాగ్యలక్ష్మి తెల్లారిలేచి చూసుకుని గుండెలు బాదుకుంది. పోలీసులతో మొరపెట్టుకుంది. భాగ్యలక్ష్మి బీదది కావటంతో పోలీసులు ఆమె మొర ఆలకించలేదు. బీదరికం పాపమా! శాపమా! నేరమా!

సీతకి చెయ్యి నేప్పిపుట్టటంతో రాయటం ఆపి - అంతవరకూ తను రాసింది చదివింది.

"ఇది సాంఘికమూ కాదు, బిదరికమూ కాదు. అకటా వికటా హాస్యకథల పోటీ, ఏ దిక్కుమాలిన పత్రికయినా పోటీ పెడితే, ఈ కథ దానికి పంపిస్తే ఎడిటర్ నవ్వాపుకోలేక ప్రధమ బహుమతి యివ్వటం ఖాయం!" అనుకుంది సీతామనోహరి.

కాదు కాదు - మహా రచయిత్రి అగ్నిపుత్రి.

రాసే విధానం తెలియటం లేదుగాని, మొత్తానికి నేను రాయగలను. రేపటి నుంచీ జాగ్రత్తగా ఆలోచించి రాయాలి. అనుకుంటూ ఆ పూటకి రచనలు చాలించి, కుర్చీలోంచి లేచింది.

సాయంత్రం భర్త యింటికి రాంగానే, తను చేసిన ఘనకార్యం చెప్పాలనుకుంది సీతామనోహరి.

కాని, ఆ సాయంత్రం సీత అనుకున్నది జరగలేదు.

అనుకున్నది అనుకున్నట్లు జరిగితే చెప్పేదేముంది?

# 11

సమయం అయిదు నిమిషాలు తక్కువ అయిదు.

సీత అందంగా తయారయింది.

ఇంతందంగా తయారయిన సీతని రామకృష్ణ కనుక ఆ క్షణాన చూసి ఉంటే "నీవు సీతవి కాదు - రంభా, ఊర్వశి, తిలోత్తమలలో ఒకరివి. వాళ్ళ ముగ్గురూ కాకపోతే రతీదేవివి. అంతేగాని సీతవి మాత్రం కాదు. ఇది నిజం సీతా!" అనేవాడే.

నిజంగా సీత అందంగా తయారయింది.

"సాయంత్రం సినిమాకి వెళదాము. రెడీగా వుండ"మని రామకృష్ణ ఆఫీసుకెళుతూ చెప్పాడు కనుక, సీత రామకృష్ణ వచ్చేలోపల రెడీ అయింది.

సీతామనోహరి ఇంట్లో అన్ని పనులూ చేసుకుని, తయారయింది కాబట్టి యింక చేసే పనేం లేక- ఇంట్లో కి బైటికి కాలుకాలిన పిల్లిలా తిరగటం మొదలుపెట్టింది. అలా కాసేపు తిరిగేసరికి విసుగు, కాళ్ళనొప్పులు రెండూ వచ్చాయి. వరండాలో కుర్చీ వేసుకుని కూర్చుంది. మనసు రచనలమీద పోయింది.

అయిదు నిమిషాలు తక్కువ ఆరు.

వీధిలైటు చమక్కున వెలిగింది.

సీతామనోహరి ఉలిక్కిపడి, వాస్తవంలోకి వచ్చింది.

నలువైపులా పరుచుకుంటున్న చీకట్లు.

ఆ యింట్లో అణువణువునా ఆక్రమించుకున్న చీకటి

సీత లేచి వరండాలో లైటు వేసింది. చేతికున్న వాచిలో టైము చూసుకుంది. ఆ తర్వాత యింట్లో కివెళ్ళి అన్ని లైట్లూ వేసి వచ్చింది.

చెప్పినా టైము కన్నా ముందే యింటికొచ్చేవారు. ఈరోజు ఏమయింది? ఇంతవరకూ యింటికి రాలేదు! ఆఫీసులో లేటు కావటం అన్నది యింతవరకూ జరగలేదు. తన్ని ఏడిపించటానికి తమాషా చేయటానికి గాని, కావాలని గాని ఆలస్యంగా రావటం లేదుకదా! అయినా యింత ఆలస్యమా?

రామకృష్ణ ఆఫీసు నుంచి రావటానికి ఆలస్యం ఎందుకవుతుంది? ఏయే అడ్డంకులు వున్నాయి? అని మరో అరగంట ఆలోచించింది. ఎంత ఆలోచించినా సరి అయిన కారణం స్ఫురించలేదు. ఏడు దాటిపోవటంతో డ్రెస్ మార్చేసింది. రెండో ఆట సినిమాకి వెళ్లరు.

ఎనిమిది దాటింది.

సీతకి భయం పట్టుకుంది.

సినిమాకెళదామనే తొందరలో - స్పీడ్ గా స్కూటర్ మీద యింటికి వస్తుంటే దారి మధ్యలో స్కూటర్ కి యాక్సిడెంట్ కాలేదు కదా!

సీత గుండె ఝల్లు మంది

ఇరుగు పొరుగు కాక, ఆ వీధిలో ఈ మధ్య చాలా మందే పరిచయం అయారు. ఎవరింటికెళ్ళి ఈ విషయం చెప్పినా రామకృష్ణ ఆఫీసుదాకా వెళ్ళివస్తారు. నాలుగు వీధులూ తిరిగి వస్తారు. అవసరం అయితే పోలీసు రిపోర్ట్ ఇస్తారు. కాని ఇప్పుడు అంత అవసరమా? భర్త యింటికి రావటం కాస్త ఆలస్యం అయితే ఇంత కంగారా - అని

వాళ్ళంతా నవ్వితే!

ఏం చేయాలా తెలియక అలా కూర్చుండిపోయింది సీత.

"ఎవరన్నా బలవంతాన సినిమాకి లాక్కెళ్ళారేమో! తప్పనిసరి పరిస్థితులల్లో వాళ్ళతో వెళ్ళారేమో! అంతేకావచ్చు కదా!"

రాత్రి పది గంటలవరకూ చూసి, అప్పుడు ఏదో ఒకటి చేద్దాం అనుకుంది సీత.

కాని-

ఈ లోపలే-

తొమ్మిది అవుతూ ఉండగా -

రామకృష్ణ స్కూటర్ మీద చక్కగా వచ్చాడు.

సీతకి వెర్రి ఆనందం వేసింది. పిచ్చి సంతోషం కలిగింది.

"ఏమండీ! ఏమిటి ఆలస్యం?" రామకృష్ణకి ఎదురు వెళుతూ సీత అడిగింది.

రామకృష్ణ ముఖం బాగా దించుకుని "ఉహుహు! ఒంట్లో బాగుండలేదు" అన్నాడు. అలా అంటూనే వేగంగా బెడ్ రూమ్ లోకి వెళ్ళిపోయాడు.

సీత వీధి తలుపువేసి బెడ్ రూమ్ లోకి వెళ్లేసరికి - రామకృష్ణ డ్రస్ విప్పకుండానే మంచంమీద పడుకుని, నిండా దుప్పటి ముసుగు పెట్టేసుకున్నాడు. పైగా ముడుచుకుని అటు తిరిగి పడుకున్నాడు.

"ఏమైందండీ?" సీత గాభరాగా అడిగింది, అతని పక్కనే కూర్చుంటూ.

"తల పగిలిపోయేటంత తలనొప్పి. బాగా చలిగా వుంది. ఉహుహు!" అన్నాడు రామకృష్ణ.

"చలి జ్వరమేమో! ఏది - చూడనివ్వండి" అంటూ దుప్పటిలోంచి చెయ్యి పెట్టింది సీత.

"వద్దు వద్దు - జ్వరం అంటుకుంటుంది" అన్నాడు రామకృష్ణ మరింత ముడుచుకుపోతూ.

"ఇంతోటి జ్వరం అంటుకుంటే కొంప మునగదులెండి. మీ పక్కన నేను పడుకుంటాను" అంటూ రామకృష్ణ చేతిమీద చెయ్యివేసి - "అరె, చల్లగా వుంది" అంది.

"సీతా! ఇది పైత్య జ్వరం. అలాగే వుంటుంది. కాస్త వేడిగా ఏదన్నా తెచ్చిపెట్టు తల పగిలిపోతున్నది. తలనొప్పి మాత్ర వేసుకుంటాను."

రామకృష్ణ మాట పూర్తి చేయకముందే సీత వంటగదిలోకి పరుగెత్తింది.

సీత అటు వెళ్ళంగానే రామకృష్ణ గబుక్కున మంచం మీదనుంచి లేచి, ఒక్కంగలో అలమర దగ్గరకు వెళ్ళి, అలమరలో వున్న అమృతాంజనం సీసా తీసుకుని రెండో అంగలో మళ్ళీ వచ్చి మంచం ఎక్కాడు. దుప్పటి నిండా బిగించి, అమృతాంజనం సీసా సగం ఖాళీ చేశాడు.

సీత గ్లాసునిండా వేడి వేడిగా హార్లిక్స్ కలుపుకు వచ్చేసరికి రామకృష్ణ పని పూర్తి అయింది.

రెండు డిస్ప్రిన్ మాత్రలు, హార్లిక్స్ యిస్తూ రామకృష్ణని లేపింది సీత.

రామకృష్ణ ఉహుహు అంటూనే కొద్దిగా దుప్పటి తొలగించి, కొద్దిగా పైకిలేచి హార్లిక్స్ అందుకున్నాడు.

అమృతాంజనం వాసన గుప్పున కొట్టింది సీతకి.

"మీరు..... మీరు..... అమృతాంజనం రాచుకున్నారా?" సీత ఎంతగా ఆశ్చర్యపోతూ అడిగింది.

అమృతాంజనం రాచుకోటం సీతకి ఎంత ఇష్టమో - రామకృష్ణకి అంత అయిష్టం. పొరపాటున కూడా ఆ సీసా ముట్టుకోడు.

అమృతాంజనం రాచుకున్నానన్నట్లు తలవూపి, మరోసారి "ఊహుహూ!" అన్నాడు రామకృష్ణ.

రామకృష్ణ అమృతాంజనం రాచుకోటం అన్నది సీతకి ఈ ప్రపంచంలో ఎనిమిదో వింత.

"నన్ను రాయమంటే నేను రాచేదాన్నిగా!" అంది సీత భర్త ముఖాన్ని పరీక్షగా చూస్తూ.

"ఊహుహూ!" అన్నాడు రామకృష్ణ.

అప్పుడు రామకృష్ణ ముఖం వాడిపోయి ఉంది. కళ్ళు ఎర్రగా, కణ కణలాడే నిప్పుల్లా ఉన్నాయి. తలంతా చెదిరిపోయి వుంది. చెమటలు దిగజారుతున్నాయి.

"డాక్టర్ దగ్గరకు వెళదాం!" అంది సీత.

"మాత్ర వేసుకున్నాగా. అదే తగ్గుతుంది" అని ఖాళీ చేసిన గ్లాసుని సీతకిచ్చి, మళ్ళీ దుప్పటి ముసుగుపెట్టాడు రామకృష్ణ

సీతకి ఏం చేయాలో అర్థం కాలేదు.

సరిగా అయిదు నిమిషాలు.

రామకృష్ణ విసురుగా దుప్పటిని అవతలికినెట్టి, ఒక్కగంతులో మంచం మీదనుంచి లేచి నేలమీదకి దిగి,

రెండంగల్లో బాత్ రూమ్ లో భోళ్ళున వాంతి చేసుకున్నాడు.

హార్లిక్స్ తో పాటు ఉదయం తిన్న భోజనం తాలూకా అరిగీ అరగని పదార్థాలు బైటికి వచ్చాయి.

సీతని దగ్గరకు రావద్దన్నాడు రామకృష్ణ. అయినా సీత వినలేదు. బాత్ రూమ్ లో నీళ్ళుకొట్టి, రామకృష్ణకి నీళ్ళు  అందించి వగైరా పనులు చేసింది.

"అమృతాంజనం పేరెత్తితేనే నీకు ఎలర్జీ. అలాంటిది అరసీసా ఖాళీ చేశావు వాంతి రాక ఏమవుతుందిలే!" అనుకున్నాడు రామకృష్ణ.

ఒకసారి వాంతి అయిన తర్వాత మళ్ళీ మళ్ళీ వాంతి వచ్చేటట్లు అనిపించింది. తిక్క, వికారం, తలనొప్పి, నీరసం- చాలా లక్షణాలు ఏర్పడ్డాయి. చెమట అయితే అదేపనిగా కారటమే.

సీత డాక్టర్ దగ్గరకు వెళదాం అంటుంది. నేను రాను అంటాడు రామకృష్ణ.

చివరికి -

ఓ గంట తర్వాత.

రామకృష్ణ నిద్రపోయాడు.

అప్పుడు పావు తక్కువ పదకొండు అయింది.

సీతకి ఏమీ తినబుద్ధి కాలేదు. కాసిని మజ్జిగ తాగి పడుకుంది.

మధ్య మధ్య సీత లేచి చూస్తూనే వుంది.

రామకృష్ణ శరీరం చల్లగా వుంది.

పైగా -

రామకృష్ణ ఆదమరచి నిద్రపోతున్నాడు.

తెల్లా రినిద్ర లేవంగానే చాలా హాయిగా వుంది రామకృష్ణకి.

"ఎలా వుంది?" సీత అడిగింది.

"కాస్త నీరసంగా వుంది. అంతే!" రామకృష్ణ చెప్పాడు.

"తలనొప్పి?"

"అసలు లేదు."

"అమ్మయ్య!" అంది సీత.

ఆ తర్వాత రామకృష్ణ బాత్ రూమ్ కెళ్ళాడు. సీత వంట గదిలోకి దారితీసింది.

మరో పది నిమిషాల తర్వాత-

"నేను ఈ పూట ఆఫీసుకి వెళ్ళను." కాఫీ తాగుతూ చెప్పాడు రామకృష్ణ.

"ఈ విషయం నేనే చెపుదామనుకున్నాను" సీత అంది.

"నాకు తెలుసు అందుకే ఈ ముందు జాగ్రత్త."

సీత నవ్వింది.

రామకృష్ణ నవ్వాడు.

వాళ్ళిద్దరి ప్రాణానికి ఈ ఉదయం ఎంతో హాయిగా వుంది.

"రాత్రి మిమ్మల్ని చూసి చాలా భయపడ్డాను" సీత చెప్పింది.

"నాకు తెలుసు. నిన్ను బాధ పెట్టకూడదని ట్రై చేశాను. కుదరలేదు."

"ట్రై చేశారా?"

"చేశానని చెప్పాకదా!"

"ట్రై చేయటం ఎందుకు?"

"నిన్ను బాధపెట్టకూడదని."

ఇద్దరికి నవ్వొచ్చింది నవ్వుకున్నారు. ఒకరి మొహంలోకి ఒకరు చూసుకుంటూ.

"ఇప్పుడు నేను కొన్ని ప్రశ్నలు అడగబోతున్నాను. మీకేమన్నా అభ్యంతరమా?"

"ఉహూ! శక్తికి, ఉత్సాహానికి, బలానికి, ఆంధ్రా కాఫీని తాగాను కదా! టట్టటాయ్!" అన్నాడు రామకృష్ణ.

"రాత్రి ఎందుకు ఎందుకు ఆలశ్యంగా వచ్చారు?" సీత అడిగింది.

"నిన్ను బాధపెట్టకూడదని ట్రై చేశాను."

"నా ప్రశ్నకు సమాధానం యిదా?"

"యిదే."

"సరేలెండి జోక్స్ తర్వాత అసలు విషయం చెప్పండి. రాత్రి ఎందుకు ఇంటికి ఆలశ్యంగా వచ్చారు?"

"తల తిరగటం కళ్ళు తిరగటం సన్న సన్నగ తలనొప్పి ఆఫీసులోనే మొదలయాయి. యింటికి వచ్చేద్దా మనుకున్నాను....."

"రావాల్సింది" సీత మధ్యలో అడ్డు తగిలి అంది.

"కాస్త రెస్ట్ తీసుకుంటే తలనొప్పి తగ్గుతుంది కదా అని ఆఫీసు పక్కరూమ్ లో పడుకున్నాను. తగ్గలేదు. జవాను చేత టాబ్ లెట్ తెప్పించుకుని మింగాను. అదేదో కొత్తగా వస్తు న్న తలనొప్పి బిళ్ళలు. మత్తు గ నిద్ర పట్టింది. లేచి చూద్దు ను కదా ఎనిమిది కావచ్చింది. లేచి కూర్చున్నానో లేదో వడ్రంగి పిట్ట రెండు కణతల మీద టక్ టక్ అని పొడిచినట్లు విపరీతమైన తలనొప్పి మళ్ళీ మొదలు.

ఓ పక్క నీ గురించి బాధ మరో పక్క తలనొప్పి బాధ. సాయంత్రం సినిమాకి వెళదాం రెడీగ వుండమని నేనే కదా చెప్పాను. నాకు తలనొప్పిగ వుంది వద్దు అంటే ఏమన్నా బాగుంటుందా?"

"ఎందుకు బాగుంటుంది!" అంది సీత.

"ఏమో! నాకు బాగుండదు. ఆశపెట్టి ఆశ నిరాశ చెయ్యటం ఏమన్నా బాగుంటుందా?"

"నిక్షేపంగా బాగుంటుంది. మీకు వంట్లో బాగుండకపోతే సినిమా పోయిందని నేనేమన్నా బాధపడతానా! వెనకటికో సామెత వుంది."

"అది నేను చెపుతాను. కొంపకాలి వకడేడుస్తుంటే నిప్పు దొరక్క పొద్దుటినుంచీ చస్తున్నాను అమ్మయ్య అన్నాడుట వకడు చుట్టకాల్చుకుంటూ. అలానేనా?"

"అలాంటి సామెతేగాని నేను సినిమా పోయిందని బాధపడను."

"నువ్వు పడవు. నాకు బాదే కదా?"

"అలా అని ఆలశ్యంగా వచ్చి నన్ను బాధపెట్టారు."

"తలనొప్పితో నాకంతా అయోమయం అయింది. నిన్ను బాధపెట్టకూడదని ఆలస్యం చేయటం అదే ఆలస్యంగ రావటం తెలివి తక్కువ కదూ?"

"కరెక్ట్"

"మీకు అమృతాంజనం అంటే ఎలర్జీ కదా?"

"ఎస్ మేడమ్!"

"ఆ సీసాని చేత్తో కూడా తాకరు కదా?"

"ఎస్ మేడమ్!"

"మరి మీరెందుకు సగం అమృతాంజనం సీసా ఖాళీ చేసినట్లు?" సీతామనోహరి లా పాయింట్ లాగుతూ అడిగింది.

"ఇందాక నీవే మన్నావు?" రామకృష్ణ సీరియస్ గ అడిగాడు.

"ఏమన్నాను?"

"గుర్తు లేదా?"

"ఉహూ."

"తలనొప్పి ఎక్కువగ ఉండేసరికి అబ్బాయిగారికి బుర్ర బొత్తిగ పని చెయ్యలేదు. అన్నావు."

"అంతమాట అన్నానా!"

"ఆ... పతిదేముడిని పట్టుకుని అంతమాట అన్నావు."

"సారీ అండీ! ఇంతకీ ఈ మాట మీరెందుకు గుర్తు చేసినట్లు?"

"తలనొప్పి ఎక్కువ అయింది. దాంతో బుర్ర తిరుగుడు జాస్తి అయింది. దాంతో నేనేం చేస్తు న్నానో నాకే తెలియకుండా పోయింది. దాంతో అమృతాంజనం ఎడా పెడా పోసుకున్నాను."

సీత కిల కిల నవ్వింది. "పోసుకోటం కాదు మహానుభావా పూనుకోటం."

"పూనుకోటమో రాచుకోటమో ఏదో వక ఘనకార్యం చేశాకదా?" తనూ నవ్వేస్తూ అన్నాడు రామకృష్ణ.

"ఇహ పై తలకాయ పగిలి పోయేటంతగా తలనొప్పి వచ్చినా సరే మీరు అమృతాంజనం ముట్టుకోవద్దు."

"అదేమి?"

"నేనో సత్యం కనుక్కున్నాను."

"సత్యమా!" ఉలిక్కిపడ్డాడు రామకృష్ణ.

"ఎస్. అట్లాంటియిట్లాంటి సత్యం కాదు నగ్న సత్యం. రాత్రి మీకొచ్చిన తలనొప్పి చాలా ఘోరమైందే కావచ్చు కాని మీరు వాంతి చేసుకుంది, తలనొప్పికి కాదు. ఆ రహస్యం నాకు తెలుసు" సీత గంభీర్యంగా అంది.

రామకృష్ణ గుండె దడ దడ లాడింది. పై ప్రాణాలు పైననే పోయినట్లు అయ్యాయి. నిజం గ్రహించిన సీత యింత ప్రశాంతంగ వుంటుందా?

"అదేమిటి బెల్లంకొట్టిన రాయిలా అలా వుండిపోయారు? ఆ రహస్యం ఏమిటి అని అడగండి?" సీత అంది.

"అది...... అది....."

"మీరు తెలుసుకోలేరు లెండి. నేనే చెపుతాను. తలనొప్పి బాధ భరించలేక అమృతాంజనం తలకి వంటికి పక్కలకి పట్టించారు కదా ఆ వాసన పడక కడుపులో తిప్పి వాంతి అయింది యామై కరెక్ట్?"

రామకృష్ణ ప్రాణం కుదుటపడింది. పైకి మాత్రం అమాయకంగా "అంతే అంటావా సీతా!" అన్నాడు.

"మీకు తెలియదు కరెక్ట్ గా అంతే. ఈ తఫా తలనొప్పి వస్తే డాక్టర్ దగ్గరకు పోదాం. ఇంత ఘోరంగా తలనొప్పి వచ్చిందంటే దానికేదో తగిన కారణం వుంటుంది."

"అదీ నిజమేలే" తేలికగా వూపిరి పీల్చుకుంటూ అన్నాడు రామకృష్ణ.

"అమృతాంజనం సీసా జోలికి వెళ్ళారంటే నా మీద ఒట్టే.

"ఇంక వెళతానా? ఓసారి బుద్ధి వచ్చిం తరువాత ఆ సీసాని ముట్టుకోను గాక ముట్టుకోను. పైగా నీవు వట్టు కూడా వేశావు కదా! ఇంక ఆ సీసా పేరెత్తితే వట్టు."

"రాముడు మంచి బాలుడు" అంటూ సీత అందంగ నవ్వింది.

సీత అమాయకత్వం చూస్తు ంటే రామకృష్ణకి "అయ్యో" అనిపించింది. "ఈ పిచ్చి పిల్లనా నేను మోసం చేసింది?" అని క్షణకాలం బాధపడ్డా డు. అంతలోనే తెలివి తెచ్చుకుని "నిప్పులాంటి నిజం సీత భరించలేదు. భరించలేదు. నిజం చెప్పి సీతని బాధపెట్టి సీత అపార్ధం చేసుకుంటే తను బాధపడి ఈ గోలకన్నా నోరు మూసుకోటం వుత్తమం" అనుకున్నాడు.

కాని

రామకృష్ణ చేసింది అదే పెద్ద తప్పు.

దాని ఫలితం ముందు ముందు ఎలాగూ తప్పదు

## 13

ఆ రోజు.

సెకండ్ సాటర్ డే.

రామకృష్ణ యింట్లో నే వున్నాడు

రామకృష్ణ యింటి పట్టు న వుండటం వల్ల ఓ దృశ్యం చూశాడు.

ఆ దృశ్యం!

అతి మనోహరమైనది. అద్భుతమైనది. సృష్టిలో అతి తీయనైనది.

అదేమిటంటే.

ఉదయం రామకృష్ణ వరండాలో ఫేము కుర్చీలో కూర్చుని ఉదయం దినపత్రిక చదువుతున్నాడు. ఆ సమయంలో మామిడికాయలు అమ్మి వచ్చాయి.

పెరట్లో వున్న సీత మామిడికాయల కేక వింటూనే వరండాలోకి పరుగెత్తుకుని వచ్చి మామిడికాయలబ్బాయ్ అంటూ గావుకేక పెట్టింది.

మామిడికాయలు అమ్మే అతను వచ్చాడు.

"రసాలా బంగినపల్లా!" రామకృష్ణ అడిగాడు.

"ఇప్పుడు అవి రావు బాబూ! ఇవి పునాస మామిడికాయలు కాలంగాని కాలంలో కాస్తాయి" చెప్పాడు అతను.

సీత కాయలు బేరం చేసింది. అమ్మే అతను కాయ రెండు రూపాయలు అన్నాడు. సీత కాయ రూపాయకి ఇవ్వమంది. బేరం కుదరలేదు. అతను రెండు రూపాయలకి పది పైసలు పెంచింది. ఆ బేరం అలా అలా సాగి చివరికి అయిదు రూపాయలకి మూడు కాయలు ఖరారు అయింది.

మామిడికాయల అబ్బి మూడుకాయలు అయిదు రూపాయల కిచ్చి వెళ్ళిపోయాడు.

"అయిదు రూపాయలకి రెండున్నర కిలోల వంకాయలు వస్తాయి" రామకృష్ణ అన్నాడు.

"తోటకూర అయితే గంపెడు వస్తుంది" కిల కిల నవ్వుతూ చెప్పింది సీత.

మండిపోతున్న మామిడికాయలు అని ఉదయంలో ఎక్కడన్నా వేశారేమో అని దినపత్రికంతా

తిరగేశాడు రామకృష్ణ. అలాంటి వార్తేలేదు.

ఆ పూట సీత మామిడికాయ పప్పు మామిడికాయ పచ్చడి చేసింది. ప్లేటులో కాస్త ఉప్పు కారం వేసుకుని మామిడికాయ ముక్కలకి అద్దుకుని పర పర నములుతూ ముక్కలని తింది.

రెండోసారి కాఫీ తాగుదామనిపించి రామకృష్ణ వంట గదిలోకి వచ్చేసరికి సీత మామిడికాయ ముక్కలమీద దండయాత్ర చేస్తున్నది

రామకృష్ణ చటుక్కున పక్కకి తప్పుకున్నాడు.

రామకృష్ణ డబ్బుకి ఆలోచించడు. ఎందుకు అంత దండగ పెడతారు. అని అప్పుడప్పుడు సీత అంటుంటుంది. అలాంటి సీత అయిదు రూపాయలు పెట్టి మూడు మామిడికాయలు కొంది.

అంటే

ఏదో వున్నట్లే.

అంత ఖరీదు పెట్టి కొన్నదంటే

ఏదో వున్నట్లే.

పళ్ళు పులిసే పుల్లని ముక్కలు పర పర నమిలి తింటున్నదంటే -

ఏదో వుండకుండా ఎలా వుంటుంది?

కనుక

ఏదో వున్నట్లే.

ఆ..... ఏదో అన్నది.

అది...... అది..... కాదు కదా!

రామకృష్ణ వళ్ళు పులకరించింది.

సీత మామిడికాయ ముక్కలని బెల్లం గడ్డలాగ తింటుంటే అది చూస్తున్న రామకృష్ణ పళ్ళు పులిశాయి. అదే అయి వుంటుంది కనుకనే స్వీట్ తిన్నంత తేలికగా పుల్ల మామిడికాయ ముక్కలని ఉదయానే తినగలుగుతున్నది.

సీతకి అడ్డు తగలకూడదనే వుద్దేశ్యంతో రామకృష్ణ కాఫీ తాగటం వాయిదా వేసి వెళ్ళి వరండాలో కూర్చున్నాడు.

ఈ మధ్య సీత వంట్లో బాగుండలేదండి అదోలా వుందని చెపితే తను హాస్యంగా తీసుకున్నాడు. స్త్రీ అంటే ఏమిటి సిగ్గుల మొగ్గ. ఎంత భర్త అయితే మాత్రం ఈ విషయం నోరు తెరచి ఎలా చెపుతుంది? అయినా మీరు తండ్రి కాబోతున్నారని భార్య చెపితేనే అందం ఆనందం.

సీత తనతో ఈ విషయం చెప్పాలంటే తను ఓర్పు వహించాలి. సీత చెపుతుంది. తను అప్పుడు సినిమాలో లాగా రెండు చేతుల మీద ఎత్తుకుని గిర గిర తిప్పి గుండెకి హత్తుకుని ఆ తర్వాత నెమ్మదిగ బెడ్ మీద పడుకోబెట్టి మీదకి ఒరిగి మృదువుగ ముద్దు పెట్టుకోవాలి. "ఎంత మంచి వార్త వినిపించావు సీతా!" అనాలి. అప్పుడు సీత దోసిట్లో ముఖం దాచుకుంటుంది. బోలెడు సిగ్గుపడుతు.

"మిమ్మల్నే" గట్టిగ అరచి సీత ఎదురుగ కనపడేసరికి రామకృష్ణ తెలివి తెచ్చుకున్నాడు.

సీత కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది.

"ఏమిటి? ఏమైంది? పగటి కలలు కంటున్నారు పరిసరాలు మరిచిపోయి?" కాఫీ కప్పు అందిస్తూ అడిగింది.

"సీతా! నా సీతా?" అంటూ కాఫీ కప్పు అందుకుంటూ సీతని ఆప్యాయంగా చూశాడు రామకృష్ణ.

"ఏమైంది మీకు?" సీత నవ్వుతూ అడిగింది.

"అనుకున్నదేదో అయ్యిందిలే. అది అలా అయ్యిందిలే అంటూ రామకృష్ణ రాగం తీశాడు.

"మొత్తానికి మీకు ఏదో అయింది."

"నాకు కాదు సీతా నీకు."

"నాకా?"

"అవును సీతా! నీలో కొత్త అందాలని చూస్తున్నాను"

"ఉదయాన్నే మీరిలా మాట్లాడుతున్నారంటే మీకు పైత్యం ప్రకోపించినట్లే" అంది సీత.

"నీ యిష్టం సీతా! నీవు తిట్టినా నాకు ఆనందమే" కాఫీ సిప్ చేస్తూ చెప్పాడు రామకృష్ణ.

సీత మూతి మూడు వంకరలు తిప్పి విస విస నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

"రెస్ట్ తీసుకో సీతా! నేను కూడా సాయం చేస్తా సీతా!" అంటూ సీత వెనుకనే తిరిగాడు రామకృష్ణ.

"ఇవాళ ఈయనకి ఏమైంది? తోచక నా వెనుకనే తిరుగుతున్నారులే" యిలా అనుకుంది సీతామనోహరి. ఇరువురు కలసి సినిమాకి వెళ్లారు. సినిమా నుంచి తిరిగి వస్తూ హోటల్లో భోంచేశారు.

ఇంటికి వచ్చిం తరువాత సీత అంది.

"హాయిగా యింట్లో వంటచేసి వస్తా నంటే వద్దంటిరి. దిక్కుమాలిన హోటలు కూడు ఒక్క పదార్థము సరీగలేదు. అన్నీ చప్పగా తగలడ్డా యి. దేశంలో ఉప్పు కారానికి కరువు వచ్చినట్లు బి. పి. పేషంట్లు పెరిగినట్లు వంట చేశాడు. ఇలాంటి తిండి తింటే జనాభా జీవచ్ఛవంలాగా తయారవుతారు. తిండి కలిగితే కండ గలదోయ్ అన్నమాట ఎవరికి గుర్తులేదేమో! నిమ్మకాయ ముక్క పుల్ల పుల్లగా ఓ బద్ద వేశాడు కాబట్టి అది నాలుక్కి రాచుకుంటూ భోం చేయగలిగాను లేకపోతే ఆ కూడు తిన్నందుకు వాంతి ఒక్కటే తక్కువ.....

ఈ విధంగ సాగింది సీత వాక్ ప్రవాహం

విషయం అర్ధం చేసుకోగలిగాడు రామకృష్ణ.

సీతకి తిండి సయించటం లేదు. ఏం చేస్తు ంది? ఖారం ఖారంగాను పుల్ల పుల్లగాను తినాలని వుంది కాబోలు. హోటలు కూడు కమ్మగా చచ్చిందని తను అనుకున్నాడు గాని అది కమ్మగా కాదు. చప్పగా చచ్చింది. అదే యింట్లో అయితే సీత తనకి యిష్టం వచ్చినట్లు చేసుకునేది.

కడుపుతో వున్న వాళ్లకి పుల్లటివి యిష్టం అంటారు. రేపు పుల్లటి పదార్థాలన్నీ తెచ్చి యింట్లో పడేయాలి. పునాస మామిడికాయలు చింతకాయల్లో ఇంకేమన్నా రకాలు వుంటే అవి. నిమ్మకాయలు, పుల్లబచ్చలి కూర....

పుల్లని వస్తు వులు పళ్ళు ఫలాలు అన్నింటి గురించి ఆలోచించాడు రామకృష్ణ.

రాత్రి పడుకునే సమయం అయింది.

సీత అన్ని తలుపులు వేసి బెడ్ రూమ్ లోకి వచ్చింది.

"ప్రేయసీ మనోహరీ సీతామనోహరి......" రాగం తీశాడు రామకృష్ణ.

"ఏమిటి అబ్బాయిగారు చాలా హుషారుగా వున్నారు? సీత అడిగింది మంచం మీద కూర్చుంటు.

"ఇది అల్లా టప్పా విషయమా!" అన్నాడు రామకృష్ణ దొంగపిల్లా నీ విషయం నాకు తెలిసిందిలే అన్నట్లు ఫోజు పెట్టి.

"ఏ విషయం?" అంది సీత.

సీత చెపుతుందేమో అని అప్పటిదాకా చూశాడు రామకృష్ణ. అలాంటి పిచ్చిపని చేయలేదు సీత. అందుకని చూసి చూసి వేచి వేచి యింక రామకృష్ణ రంగంలోకి దిగాడు.

నీవు చేపుతావనుకుంటే నాచేత చెప్పిస్తావేమిటి సీతా?" అన్నాడు రామకృష్ణ.

"నేను చెప్పటం ఏమిటి?"

"అబ్బ ఏమి తెలియనట్లు ఏంటమ్మా?" ముద్దుగా అన్నాడు రామకృష్ణ.

"మిమ్మల్ని చూస్తుంటే నాకో అనుమానం వస్తున్నది"

"ఏమిటి?"

"తీర్థం ఏమన్నా పుచ్చుకున్నారా అని......"

రామ రామ కృష్ణ కృష్ణ రామకృష్ణ రామకృష్ణ ఎంత మాటన్నావ్ సీతాకుమారీ!నేను ఈ జన్మలో తీర్థం పుచ్చుకోటమా! అది కలలో మాట. పైగా యిప్పుడు బాధ్యతలు పెరిగాయి. తండ్రిని కాబోతున్నాను....." నోరు జారినందుకు రామకృష్ణ నాలుక కొరుక్కున్నాడు.

"వ్హాట్!" మంచంమీద యింతెత్తున ఎగిరిపడింది సీత.

"అదికాదు సీతా!" రామకృష్ణ ఏదో చెప్పబోయాడు.

"ఎవతది?"

"ఎవరు!"

"అదే మిమ్మల్ని తండ్రిని చేస్తున్న ఆ మహా ఇల్లాలు"

"ఏం జోకు పేల్చావు సీతూ!" అంటూ పడి పడి నవ్వి  సీతని దగ్గరకు తీసుకుంటూ "నీవు చెప్పకపోయినా నేను గ్రహించాలే" అన్నాడు.

"ఏమిటి గ్రహించారు?" వ్యంగ్యంగా అడిగింది సీత.

"నేను మగవాడినే కావచ్చు సీతా! అలా అని ఆడవాళ్ళ విషయాలు నాకేం తెలియదని అనుకోకు. నీ విషయం ఈ వుదయమే కనిపెట్టాను. ఈ తియ్యని వార్త నీ నోటివెంట వినిపిస్తావేమో అప్పుడు నేను వెంటనే నిన్ను ఎత్తుకుని గిర గిర తిప్పి స్వీట్ కిస్ యిద్దామనుకున్నాను. పోనిలే సీతా! నాకు తెలిసింది కదా అది చాలు, మరీ యింత సిగ్గు పడుతున్నావనుకోలేదు. రేపటినుంచీ....."

సీత అయోమయంగ ముఖంపెట్టి నోరు తెరుచుకు వింటూ వుంటే రామకృష్ణ చెప్పుకుపోతున్నాడు. సీత కొద్దిసేపటిలో తెలివి తెచ్చుకుని "ఆగండాగండి" అంది.

రామకృష్ణ ఆగాడు.

"నా విషయం మీరు గ్రహించారన్నమాట!"

"ఓ....." అన్నాడు రామకృష్ణ.

"ఎలా! ఎలా గ్రహించారు?"

"ఆ మాత్రం తెలుసులేవోయ్."

"అదే ఎలాగో చెప్పరా!" ముద్దు గ అడిగింది సీత.

పెళ్ళాం ముద్దు గ అడిగితే విషయం చెప్పని మొగుడుంటాడా?

"ఉదయం నీవు......"

"ఊ..... ఉదయం నేను......"

"తొందరపడకు చెపుతున్నా కదా? ఉదయం నీవు పుల్లమామిడి ముక్కలు పర పర నమిలి తినటం చూశాను. నీవు తింటుంటే నా పళ్ళు పులిశాయి అనుకో! కడుపుతో వున్న వాళ్ళే కదా పుల్ల పుల్లనివి తింటారు! ఈరోజు అయినా నేను చూశా కాబట్టి సరిపోయింది. నీవు నాలుగు రోజులబట్టి వంట్లో సరిగా లేదని చెపుతూనే వున్నావ్. నేనే గ్రహించలేకపోయాను. సీతా! నీవు చాలా విషయాలలో డేరింగ్ గ వుంటావు గాని ఈ విషయం నాతో చెప్పలేకపోయావు అవునా?" రామకృష్ణ గొప్ప సత్యం కనిపెట్టిన వాడిలా అన్నాడు.

"చూడండి రామకృష్ణ పరమహంసగారూ!" అంది సీత.

"ఆయనెవరు?" అన్నాడు రామకృష్ణ.

"మీరే. మీ పరిశోధనకి మెచ్చి పరమహంస బిరుదు నేనే యిచ్చాలెండి."

"ధన్యుడను మనోహరీ! ధన్యుడను. తండ్రిని కాబోయే ఈ శుభ సమయంలో...."

"ఆపండి. ఆలూ లేదు చూలూ లేదు అల్లు డిపేరు నోమలింగంలా వుంది." "అంటే?"

"లూప్ మాట మర్చిపోయారా?"

"ఇంకా వేయించుకోలేదు కదా!"

"అలా అనుకున్నాము కదా, కడుపుకాయ యింకా అలాంటిది ఏమి రాలేదు. ముందే జాగ్రత్త పడదల్చుకున్నాను. రేపే డాక్టర్ దగ్గరకు వెళదాము పదండి, వక ఏడాది దాకా ఎవరం మాట్లా డవద్దు"

రామకృష్ణకి యింకా ఆశ చావక "ఇప్పటిదాకా యింకా ఆ యిది లేదంటావా సీతా!" అన్నాడు.

"ఆ యిదీ లేదు ఈ యిదీ లేదు."

"మరి మామిడికాయ ముక్కలు పర పర నమలటం......"

"వెనుకటికి మీలాంటి వాడొకడు ఆ వీధిలోకి వెళ్ళే వాళ్ళంతా అందుకే అన్నాడుట సానివాడని ఉద్దేశించి. అలా వుంది మీ వరస. నాకు మామిడికాయ ముక్కలు యిష్టం. అసలు పుల్లగ వుండే ప్రతిది మహా యిష్టం."

"అంతే అంటావా?"

"అంతే ననటమే కాదు, కావాలంటే పందెం అతి పుల్లని మామిడికాయలు అరడజను మీ కళ్ళముందు పర పర నమిలి తింటాను."

"వద్దు వద్దు చెప్పొద్దు నా పళ్ళు పులుస్తు న్నాయి" రామకృష్ణ నవ్వుతూ అన్నాడు.

సీతా మనోహరి మధురంగా నవ్వింది.

# 14

మూడు నెలలు తర్వాత.

రామకృష్ణకి మళ్ళీ తలనొప్పి వచ్చింది. అదే తల అదే తలనొప్పి, అంతా అదే.

"సాయంత్రం ఓ ఫ్రెండ్ ప్రమోషన్ వచ్చిన సందర్భంలో పార్టీ యిస్తు న్నాడు. ఆఫీసు నుంచి అటే వెళ్ళి ఓ గంట ఆలశ్యంగ యింటికి వస్తాను" అని ఉదయం ఆఫీసుకెళుతూ సీతకి చెప్పి వెళ్ళాడు రామకృష్ణ.

ఆ సాయంత్రం.

రామకృష్ణ రానందుకు సీత కంగారేమి పడలేదు. అలా అలా ఎనిమిదయిపోయింది. అయినా సీత కంగారులాంటిది పడలేదు. ఫ్రెండ్స్ సినిమాకి రమ్మని వుంటారు. వీరు వాళ్ళమాట తీసేయలేక వెళ్ళి వుంటారు. అనుకుంది సీత.

తొమ్మిదిన్నర.

సీతకి తోచలేదు. నాలుగొందల పేజీల నవల తీసుకుని కాలక్షేపంగ వుంటుందని చదవటం మొదలుపెట్టింది.

వరండాలో లైటు వేసుకుని మధ్య మధ్య వీధి గేటు చూస్తూ నవల చదువుతున్నది. పావుగంట నవల

చదివేసరికి పరిసరాలు మరచిపోయేటంతగ నవల చదవటంలో మునిగిపోయింది.

పది నలభై.

వీదిగేటు చప్పుడయింది.

రామకృష్ణ వచ్చాడు.

"నేను అనుకున్నదే - సినిమాకి వెళ్లివచ్చారు" అనుకుంది సీత నవల మూసేస్తూ.

రామకృష్ణ స్కూటర్ లాక్ చేసి వస్తు ంటే "ఏ సినిమా!" అంది సీత నవ్వులాంటి పలకరింతో

"తలనొప్పి!" అని చెప్పి - ఎవరో తరుముతున్నట్లు యింట్లో కివెళ్ళిపోయాడు రామకృష్ణ.

"సినిమా పేరు తలనొప్పా? తనకి తలనొప్పా?" అనుకుంటూ సీత యింట్లో కివచ్చింది.

షరా మామూలే అన్నట్లు - మూడు నెలలక్రితం రామకృష్ణ తలనొప్పి వచ్చినప్పుడు ఎలా ప్రవర్తించాడో, ఇప్పుడూ అలాగే.

గుడ్డలైనా మార్చకుండా -

నిండా దుప్పటి ముసుగు బిగించి-

మంచం మీద పడుకుని వున్నాడు.

భర్తకి మళ్ళీ అదే రకం తలనొప్పి వచ్చింది అనుకున్న సీత కంగారుపడింది. ఆదుర్దాగా వెళ్ళి అతని పక్కనే మంచం మీద కూర్చుంది.

"ఏమండీ!"

"మిమ్మల్నే - బాగా తలనొప్పిగా వుందా?"

"ఊ....."

"డాక్టర్ దగ్గరకు వెళదామా?" "ఉహూ!"

"టాబ్ లెట్ యివ్వనా ?"

"ఉహుహు!" అన్నాడు రామకృష్ణ దుప్పటి ముసుగులోంచి.

"తలనొప్పి అయితే దుప్పటి దేనికి - తీయండి." దుప్పటి లాగుతూ అంది సీత.

"చలిగా వుంది సీతా! పైత్య జ్వరం వస్తు ందేమో!" దుప్పటి తీయకుండా అన్నాడు రామకృష్ణ.

సీత దుప్పటిలోంచి చెయ్యిపోనిచ్చి, రామకృష్ణ నుదుటి మీద చెయ్యి వేసింది.

నీళ్ళలో ముంచినట్లు చెమట కారిపోతున్నది.

"జ్వరం లేకుండా చలిగా వుండటం - ఈ చెమట, తలనొప్పి నాకేదో అనుమానంగా వుంది. కొంపముంచి యిదేదన్నా పెద్ద వ్యాధి అయితే?- డాక్టర్ దగ్గరకు వెళదాం పదండి!"

"నాకు ఓపిక లేదు. నేను రాను."

"డాక్టరుని పిలుచుకురమ్మంటారా?"

"ఏమివద్దు. నన్ను విసిగించక వెళ్ళి టాబ్లెట్ వేడి కాఫీ లాంటిది యివ్వు."

"అలాగే! ముందా ముసుగుతీసి మాట్లా డండి"

"చలి. ముందా అమృతాంజనం యిచ్చివెళ్ళు."

"అది రాచుకుంటే మీకు వాంతులవుతాయి."

"ఏం ఫరవాలేదు. విసిగించక యివ్వు సీతా!"

"మీకు రాచుకోటం రాదు. నేను రాస్తా ను."

"వద్దు. ముందు వేడిగా ఏదన్నా యివ్వు."

"మాయదారి తలనొప్పి కాదుగాని - ఈయన ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది" అనుకుంటూ సీత లేచి వెళ్ళింది.

వంట గదిలోకి వెళ్ళంగానే సీతకి అనుమానం వచ్చింది- కాఫీ కావాలో, హార్లిక్స్ కావాలో అని.....

ఆ విషయం రామకృష్ణని కనుక్కోటానికి బెడ్ రూమ్ లోకి వచ్చింది సీత.

రామకృష్ణ అలమర దగ్గర అటుతిరిగి నుంచుని ఉన్నాడు.

సీతకి ఏదో అనుమానం వచ్చి కిటికీ పక్కకి తప్పుకుంది.

రామకృష్ణ అలమరలో చేయిపెట్టి కంగారుగా ఏదో వెతుకుతున్నాడు. చివరికి ఓ డబ్బా తీశాడు.

ఆ డబ్బా గుర్తుపట్టింది సీత.

ఏలకులు, లవంగాలు పోసి పెట్టిన చిన్న స్టీలు డబ్బా.

రామకృష్ణ చెంచాడు ఏలకులు, లవంగాలు చేతిలో వంపుకుని, మొత్తం ఒకేసారి నోట్లో పోసుకుని పరపర నమిలాడు. ఆ తర్వాత ఇష్ అనుకుంటూ గబగబా చెమట అద్దుకున్నాడు. అమృతాంజనం డబ్బాని తీసుకున్నాడు ఆ తర్వాత.

రామకృష్ణ అమృతాంజనం సీసాని చేతులోకి తీసుకున్న విధానం ఎలా వుందంటే- తప్పనిసరి పరిస్థితులలో అశుద్ధాన్ని చేత్తో ఎత్తిపట్టుకున్న తీరుగా.

రామకృష్ణ నాటకం ఆడుతున్నట్లు సీతకి అర్ధమయిపోయింది. ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా భద్రకాళి బెడ్ రూమ్ లో అడుగుపెట్టినట్లు - సీత బెడ్ రూమ్ లోకి వచ్చింది.

సీతని చూడంగానే గతుక్కుమన్నాడు రామకృష్ణ చేతిలో ఉన్న అమృతాంజనం సీసా జారి కిందపడింది.

గబుక్కున ఆ సీసాని తీసుకుంది సీత.

"నీవు యివ్వమంటే యివ్వలేదు. అందుకని నేనే లేచి.....ఉహుహు..... చలి- చలి....." అంటూ రామకృష్ణ మంచం దగ్గరకు రాబోయాడు.

సీత మంచానికి అడ్డుగా నిలిచి "ఆ కుర్చీలో కూర్చోండి. మాట్లాడాలి" అంది గాంభీర్యంగా ముఖంపెట్టి.

"అదికాదు సీతా!" అన్నాడు రామకృష్ణ. ఓ పక్క చెంచాడు లవంగాలు నమిలేసరికి నోరంతా మండిపోతున్నది. దీనికితోడు నిజం బైటపడి పోతుందేమోనని నాలుక పిడచకట్టుకుపోతున్నది.

"ముందు మీరు కూర్చోండి!" అంది సీత.

ఉస్సూరుమంటూ రామకృష్ణ ఓ కుర్చీలో కూర్చుండిపోయాడు.

"మీకు బాగా తలనొప్పిగా వుందికదూ?" గుచ్చి చూస్తు న్నట్లు గమనిస్తూ అడిగింది సీత.

"అదేం ప్రశ్న సీతా!" రామకృష్ణ అమాయకంగా ముఖం పెట్టాడు.

""మీకు బాగా తలనొప్పిగా వుందికదూ! అని అడుగుతున్నాను."

"బాగా ఏమిటి - మహా బాగా వుంటేను. తలకాయ నెప్పితో తల చిట్లిపోతున్నది అసలీ తలనొప్పి తలకాయకి రావాల్సింది కాదు. తలనొప్పి...."

"ఈ తలనొప్పి మూడు నెలలక్రితం వచ్చింలాంటిదే కదూ!"

"అవును. అదే తల - అదే తలనొప్పి అచ్చం అలాగే వచ్చింది."

"మీకు శీత పైత్య జ్వరం కదూ!"

"అవును..... అహ...... కాదు కాదు...... శీత పైత్యజ్వరం వచ్చేటట్లు వుంది. నోరంతా మంట..... అబ్బే..... కాదు కాదు చలి. భరించరాని చలి...... ఉహుహూ....."

"ముందా ఉహుహూలు ఆపండి!" సీత గద్దించింది.

"చలి...... ఉహుహూ- చలి......ఉహుహూ- కప్పుకుని పడుకుంటే గాని.....ఉహుహూ..... తగ్గదు....." అంటూ రామకృష్ణ కుర్చీలోంచి లేవబోయాడు.

"కూర్చోండి!" మళ్ళీ అరిచింది సీత.

"చ.....చ.....చలి!"

"గుప్పెడు లవంగాలు నమిలారు. ఇంకేం చలి. ఈ సరికి వంటికి బాగా వేడి వచ్చి వుంటుంది."

"అది..... అది....."

"చాలించండి మీ నాటకాలు!" మళ్ళీ అరిచింది సీత.

రామకృష్ణ నోరు మూసుకున్నాడు.

"మీకు తలనొప్పి కదూ?"

"నిజం సీతా!" ఆనందంగా చెప్పాడు రామకృష్ణ.

"చాలా ఎక్కువగా వుంది కదూ?"

"అవును సీతా!"

"మీకు తలనొప్పి కదూ?" మళ్ళీ అదే ప్రశ్న వేసింది సీత.

"నిజం సీతా!"

"చాలా ఎక్కువగా వుంది కదూ?"

"అవును సీతా!"

"మీకు తలనొప్పి కదూ?"

"ఏమిటి సీతా! అడిగింది మళ్ళీ మళ్ళీ అడుగుతావ్! నిజంగా తలనొప్పి వచ్చేలా!....." అని రామకృష్ణ నాలుక కొరుక్కున్నాడు.

"నేరస్తులచేత నిజం చెప్పించటానికి సాధారణ పోలీసులు ఉపయోగించే చిన్న ట్రిక్ యిది!" సీత వీలయినంత వ్యంగ్యంగా అంది.

రామకృష్ణ ముఖం చిన్నబోయింది.

"మీకు తలనొప్పి లేదు."

"మీకు చలి లేదు."

"మీకు శీత పైత్యజ్వరం వచ్చే సూచనలు అసలు లేవు."

"మీరు అబద్ధం ఆడుతున్నారు."

"ఆ అబద్ధం ఆడుతున్నారు."

సీత టక టక అడిగింది.

రామకృష్ణ రెండు గుటకలు మింగి చాతగాని నవ్వొకటి నవ్వాడు. "నిన్ను ఏడిపిద్దామని, చాలా పెద్ద తమాషా చేద్దామని గొప్ప ప్లాను వేసుకున్నాను. ఇది జోక్ - అంతే!"

"నమ్మమంటారా?" సీత తిన్నగా చూస్తూ అడిగింది.

"నిజం సీతా! ఇదివరకు నిజంగా తలనొప్పి వచ్చింది. ఈ రోజు ఆ రోజులాగా తమాషా చేద్దామని....."

"రెండో తప్పు అబద్ధాలాడటం - అవునా?" సీత అడిగింది.

రామకృష్ణకి యింకేం మాట్లాడాలో తెలియకుండాపోయింది.

"ఏం జరిగింది? ఎందుకు నాతో అబద్ధాలు చెపుతున్నారు? ఇలా తిన్నగా నా కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడండి" అంటూ సీత రామకృష్ణ దగ్గరకు వచ్చింది.

రామకృష్ణ ముఖం పక్కకు తిప్పుకుని "ఏం లేదు" అన్నాడు ఆ అన్న తీరు కూడా గొణిగినట్లు వుంది.

"ఏం జరిగిందండీ?" సీత రామకృష్ణ భుజమీద చేయివేసి అడిగింది.

రామకృష్ణ పెదవులు బిగించుకుని వుండిపోయాడు.

"మీ పెదవులకేమయింది?" సీత అనుమానంగా అడిగింది.

ఏమీ కాలేదు - అన్నట్లు రామకృష్ణ తల అడ్డంగా తిప్పాడు.

సీత కళ్ళముందు ఫ్లాష్ వెలిగింది. "అదన్నమాట అసలు విషయం" అనుకుంది.

"మీరెందుకిలా అబద్ధాలు ఆడటం - నాటకాలుపోవటం! మీరు నిజం చెప్పకపోయినా మీ నోరు చెప్పింది.జరిగింది నాకు తెలుసు. దాచాలన్నా వాసన దాగదు!" గాంభీర్యంగా అంది.

"తాగాలని తాగలేదు సీతా!" నిజం ఒప్పుకున్నాడు రామకృష్ణ.

"ఎన్ని?"

"ఎన్ని కూడానా - అరపెగ్గు. అది బ్రాందియో, విస్కియో - దాని పేరు కూడా సరీగా తెలియదు." రామకృష్ణ గబగబా చెప్పాడు.

సీత కొయ్యబారిపోయింది.

"మీరు తాగింది సిగరెట్టు కాదూ?" తేరుకుంటూ అడిగింది.

ఈ తఫా కొయ్యబారిపోవటం రామకృష్ణవంతయింది. తను సిగరెట్టు తగినట్లు సీత అనుకుంటున్నది. తనేమో అది గ్రహించక నిజం చెప్పేశాడు. సీతకి అలవాట్లు అంటే మహా భయం. ఓసారి ఓ చెడు అలవాటుకి బానిస అయితే ఆ అలవాటుతో ఇల్లు, వళ్ళు గుల్ల చేసుకుని మొత్తం శాల్తియే ఎగిరిపోతుందేమోనని మహా మహా భయం. సిగరెట్టు తాగడం చెడ్డ అలవాటు అంటుంది. ఇంక తాగుడు దాకా పోతే చెప్పేదేముంది?

సీత ఒక్క మాట కూడా మాట్లా డలేదు గిరుక్కున వెనుతిరిగి ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

రామకృష్ణ నెత్తిన చేతులు పెట్టుకుని అలాగే కుర్చీకి అతుక్కుపోయాడు.

# 15

"సీతా!"

"ఏయ్ సీసా! చంపుతా! నా మాటకి ఎదురు షెప్పావంటే అంతే షంపి పారేస్తా!"

"ఏంటే పీతా! బిరడా తీసిన పీషాకాయ ముఖమూ నీవూను! ఇష్, నా మాటకి ఎదురు షెప్పావంటే, షావగొట్టి షెవులు మూషి. ఆయ్, మాటాడకు. నీకే షెప్పేది. లే లేచి ఈ గళాసులో ఆ సీసాకాయలోది వంపి యివ్వు. ఆ తర్వాత జయమాళిని నృత్యం చెయ్యి. పాట పాడాలి తెలుసా!

కౌగిళి కైలాసము.

నీ కౌగిళి భూలోకము.

రామా! కృష్ణా! రామకృష్ణా! రామకృష్ణా!

రామకృష్ణ మరో సీనులో తాగివచ్చి సీతని చావచితక కొట్టాడు పిల్లలు నలుగురు భయంతో ఆ మూల ఈ మూల నక్కి కూర్చున్నారు. ఎవరి వంటిమీద వున్నాయి. సీత కట్టుకున్న చీరమీద వంద చినుగులు.

రామకృష్ణ మరో సీనులో దగ్గుతున్నాడు. దగ్గి దగ్గి గిద్దెడు రక్తం భోల్లు నవాంతి చేసుకున్నాడు. సీత రామకృష్ణని వళ్ళోకి తీసుకుంది. సీత ఏడుస్తుంటే "ఎందుకు సీతా! ఏడుస్తావు. వకరు వెనుక వకరు ముందు. నేనింకా బతికి వున్నానని భ్రమ పడుతున్నావా? పిచ్చిదానా! నేను ఎప్పుడో చచ్చిపోయాను. నా వంట్లో పారుతున్నది చీము, నెత్తురుకాదు, విస్కీ, బ్రాందీలు." అని మళ్ళీ భళ్లు భళ్ళున దగ్గాడు. ఈ తఫా కూడా మళ్ళీ గిద్దెడు రక్తం పడింది.

అలాగే మరో భయంకరమైన సీను.

ఇంకో సీను.

ఇంకో సీను.......

ఇదంతా నిజంగా జరిగింది కాదు

ఇదంతా ముందు ముందు జరగబోయేది కాదు.

ఇదంతా ముందు ముందు యిలా జరగవచ్చని వూహించుకుంటూ భయపడుతూ సీతామనోహరి ఎక్కి ఎక్కి ఏడుస్తు న్నది

సీతకి మొదటినుంచీ అలవాట్లు అంటే చచ్చేటంత భయం. ఆ తర్వాత అసహ్యం. మనుషులు అలవాట్లకి తొందరగా బానిసలు అవుతారని యింట్లో లక్షాధికారులు కూడా బిక్షాధికారులు కావటం యిల్లు వళ్ళు గుల్ల కావటం, దీర్ఘరోగాలతో మరణించటం. సంసారం వీధికెక్కటం. చెట్టుకొకరు పుట్టకొకరు.......

ఇలాంటి ఆలోచనలు సీత నర నరాన జీర్ణించుకుని వున్నాయి.

రామకృష్ణకి ఏ అలవాట్లూ లేవని తెలిసి చాలా సంతోషించింది. అలాంటిది యిప్పుడు తాగి వచ్చాడు. మూడు నెలల క్రితం కూడా తాగి వచ్చాడు. నోరు వాసన రాకుండా వుండటానికి అమృతాంజనం ముఖమంతా పూసుకున్నాడు. అంతేగాని తాగానని నిజం మాత్రం చెప్పలేదు. సిగరెట్టే దరిద్రం అనుకుంటే అంతకన్నా దరిద్రం తాగుడు తాగటం ఎప్పుడైతే మొదలుపెట్టాడో, అప్పుడే అబద్దాలాడటం నేర్చుకున్నాడు ఒకసారి తాగంగానే అలవాటు అయిపోయింది. తాగింది సిగరెట్టు కూడా కాదు బ్రందియో విస్కియో!

రామకృష్ణ తాగి వచ్చినందుకన్నా అబద్ధం ఆడినందుకు సీత భరించలేనంత బాధ పడుతున్నది పిచ్చి పిచ్చిగ వూహించుకుని బాధ పడుతున్నది. కళ్ళముందు అనేక భయంకర దృశ్యాలు కదలాడుతున్నాయి.

కొద్ది సేపు నెత్తిన చేతులు పెట్టుకుని బాధపడుతూ ఆలోచించాడు రామకృష్ణ. అసలు విషయం సీతతో చెపితే గోల వుండేది కాదు కదా! విషయం తను దాయటం, అది బైటపడటంతో తన పరిస్థితి మహా ఘోరం అయింది. ఇప్పుడు నిజం చెప్పినా సీత నమ్మదు.

ఇప్పుడు సీత ఏం చేస్తు ంది?

తను చెప్పింది నమ్ముతుందా?

నమ్మకపోతే ఏమిటి గతి?

సీత నిర్ణయం ఏమిటి?

ఎలా సీత కోపం పోగొట్టాలి!

అలా ఆలోచిస్తున్న రామకృష్ణ ఉలిక్కిపడ్డాడు.

సీత ఏమైంది?

అవును. సీత ఏమైంది?

కోపంతో గదిలోంచి బైటికి వెళ్ళింది.

చాలా ఆవేశంగ కూడా వెళ్ళింది.

కొంపదీసి ఏ అఘాయిత్యానికైనా పూనుకోలేదు కదా!

రామకృష్ణ వణికిపోతూ కుర్చీలోంచి లేచాడు. జరిగిందానికి నీరసానికో మందు ప్రభావమో మరి వళ్ళు తూలింది.

మందు పనిచేయటం లేదుకదా!

సీతా! అని పిలవబోయి పీషా అని పిలుస్తాడేమో!

రామకృష్ణ భయంతో సీతా! అన్నాడు చిన్నగ. ఎవరి మాట వారికి వినపడ్డా అది సరిగా వుందో లేదో అన్న అనుమానం వస్తే కష్టమే. ఇప్పుడు రామకృష్ణ అదే అనుమానం వచ్చింది. తను సీతా! అన్నాడా షీషా అన్నాడా?

అంతా భ్రాంతియేనా అన్నట్లు రామకృష్ణ తల విదిలించి తడబడే అడుగులతో గదిలోంచి బైటికి వచ్చాడు.

ఎక్కడ చడి చప్పుడు లేదు

రామకృష్ణ గుండె దడ దడ లాడింది. గబ గబ వంట గదిలోంచి వెళ్ళాడు. గ్యాస్ స్టవ్ కట్టేసి వుంది కిరసనాయిలు రెండు లీటర్లు పట్టే టిన్ను నిక్షేపంగా మూల గూట్లో వుంది.

అమ్మయ్య అనుకున్నాడు రామకృష్ణ. దొడ్లో పంపు గాక బావి వుంది. అది గుర్తుకు వచ్చి అటు పరుగెత్తా డు చీకట్లో పెరట్లో నీళ్ళు ఏం కనపడతాయి! మళ్ళీ యింట్లో కిపరుగెత్తు కు వచ్చి టార్చిలైటు తీసుకుని అదే వేగంతో పెరట్లో కివెళ్ళి టార్చిలైటు బావిలోకి వేసి చూశాడు.

బావిలో నీళ్ళు ఏ కదలిక లేకుండా ప్రశాంతంగ కానవచ్చాయి.

అమ్మయ్య అనుకున్నాడు రామకృష్ణ. ఏమో ఏం చెప్పగలం? ఆవేశంతో యుక్తా యుక్త విచక్షణా జ్ఞానం కోల్పోతారు కొందరు. వెనుక చూడకుండా అఘాయిత్యం చేసుకుంటారు. ఆ తర్వాత ఏమనుకుని ఏం ప్రయోజనం!

రామకృష్ణకి తెలుసు. సీతలాంటి స్త్రీ మంచికి ప్రాణం పెడుతుంది. ఆవేశం వస్తే ప్రాణం తీసుకుంటుంది అని......

రామకృష్ణ సీతకోసం పెరడంతా గాలించాడు. ఆ తర్వాత గది గది గాలించాడు.

సీత కనపడలేదు.

సీతాదేవి కానరానప్పుడు శ్రీరామచంద్రుడిలా దుఃఖిస్తూ వీధిలోకి వచ్చాడు రామకృష్ణ.

వరండా మెట్లమీద కూర్చుని మోకాళ్ళ మధ్య తల దూర్చుకుని అశోకవనంలో సీతలా దుఖిస్తు న్నది సీతా మనోహరి.

రామకృష్ణకి చాలా సంతోషం వేసింది. తను కూడా వెళ్ళి మెట్లమీద కూర్చుని "సీతా!" అన్నాడు.

సీతకి దుఃఖం రెట్టింపు అయింది. పెద్దగ ఎక్కిళ్ళు పెట్టింది.

"సారీ సీతా!"

సీత మాట్లా డలేదు

"క్షమించు సీతా!"

అయినా సీత మాట్లా డలేదు

ధైర్యం చేసి సీత భుజం మీద చెయ్యి వేశాడు రామకృష్ణ. ఆ చేతిని విసురుగా తోసేసింది సీత.

ఈ తఫా విసిరికొట్టినా వీలుకానంత గట్టిగా సీత భుజంమీద చేయి వేశాడు రామకృష్ణ "వదలండి" సీత అరిచింది.

"అలా ఏడిస్తే నేను చూడలేను సీతా! నీ కళ్ళల్లో కోటి సూర్యుళ్ళ కాంతులు తప్ప యింతవరకు కన్నీళ్లు చూడలేదు సీతా!" కవిత్వ ధోరణిలో అన్నాడు రామకృష్ణ.

వళ్ళు మండింది సీతకి. నాతో మాట్లా డవద్దు నోరు తెరిస్తే ఘుప్పున కంపు వస్తు న్నది. వెళ్ళండి" అంది. అరిచినంత పనిచేస్తూ.

"సాయంత్రం స్నానం చేయలేదు ఆఫీసు బట్టలు విడవలేదు.

"గొణిగాడు రామకృష్ణ.

తాగినవాళ్ళు తనలో ఏదేదో మాట్లాడుకుంటారన్న సంగతి గుర్తుకొచ్చింది సీతకి. అల ఏదో ఒకటి గుర్తుకు రావటం కాదు గాని రెట్టింపు దుఃఖం వస్తున్నది సీతకి.

"నా తప్పు నాకు తెలుసు సీతా! అసలేం జరిగిందంటే.....!"

సీత లయగా ఎక్కెళ్ళు పెట్టింది.

"లాభం లేదు ఈ స్థితిలో సీతతో నిజం చెప్పి లాభం లేదు. వినదు. మెల్లగా బెడ్ రూమ్ దాకా తీసుకువెళితే.....

"సీతూ! ఇంట్లోకి వెళదాం రా!"

"నేను రాను పొండి."

"ఇక్కడే రాత్రంతా కూర్చుంటావా!"

"దొంగలు వస్తారు."

"పిచాచాలు దెయ్యాలు తిరుగుతుంటాయి."

"సరే నీ ఇష్టం. నీకెలా ఇష్టం అయితే నాకలాగే ఇష్టం. నేను యిక్కడే కూర్చుంటాను."

సీత గబుక్కున లేచి యింట్లో కివెళ్ళింది.

రామకృష్ణ తలుపువేసి తనూ లోపలికి పరుగున వచ్చాడు.

ఈ తఫా సీత బెడ్ రూమ్ లోకి వెళ్ళి మంచానికడ్డంగా బోర్లా పడుకుని దిండులో ముఖం దాచుకుంది.

రామకృష్ణ నెమ్మదిగా వెళ్ళి మంచంమీద ఓ పక్కగా కూర్చున్నాడు. "సీతా!" అన్నాడు నెమ్మదిగా.

"నేను బతికివుండటం మీకిష్టం లేదా?" సీత అరిచింది.

రామకృష్ణ ఆ దెబ్బతో నోరు మూసుకున్నాడు. కోపం తగ్గిం తరువాత మాట్లా డటంమంచిది అనుకున్నాడు. లేచి వెళ్ళి డ్రెస్ విప్పేసి లుంగీ కట్టుకున్నాడు. కాసిని మంచినీళ్ళు తాగి కుర్చీలో కూర్చున్నాడు సీతనే చూస్తూ.

అరగంట తర్వాత-

సీత దుఃఖం ఆగింది.

నోరు మూసుకుని తెల్లా రిందాకా రామకృష్ణ వుండొచ్చు కదా!

ఉంటే కథే లేదు.

సీతని ప్రసన్నురాలిని చేసుకుందామనే తొందరలో.

సీతకి నిజం వినిపిద్దా మనే తొందరలో.

రామకృష్ణ కుర్చీలోంచి లేచి సీత పక్కనే మంచంమీద కూర్చున్నాడు. "సీతా! నే చెప్పేది నమ్మితే నమ్ము లేకపోతే లేదు. కనీసం విను" అన్నాడు.

సీత మాట్లా డలేదు   "ఇది నేను సమర్ధించుకోవడానికి ఏం జరిగింది నీకు తెలియటానికి చెపుతున్నాను. విని అర్ధం చేసుకుంటావో అపార్ధం చేసుకుంటావో ఆపై నీ ఇష్టం. ఇంక చెప్పనా సీతా!" రామకృష్ణ అడిగాడు.

సీత మాట్లా డలేదు షరా మామూలే.

రామకృష్ణ ఓ నిట్టూర్పు విడిచాడు.

సీత నిద్రపోవటం లేదు. ఇంకా కోపంగానే వుంది. భర్త చెప్పేది విని దానిలోని అబద్ధం ఏకు ఏకు పీక్కు పీకు లాగి జాడిద్దా మనుకుంది.

ఈ విషయం ఏది రామకృష్ణకు తెలియదు.

"చెపుతున్నా" అన్నాడు.

అని

చెప్పటం మొదలుపెట్టాడు.

సీత చెవి వొగ్గింది.

"మూడు నెలల క్రితం ఆ రోజు....." రామకృష్ణ చెప్పటం మొదలు పెట్టాడు.

సీతకి పెద్ద అనుమానం వచ్చింది. "ఇది నిషాలో చెపుతున్న కధా? లేక వున్నది వున్నట్లా!" అనుకుంది కాని అడగలేదు.

"..... ఆ రోజు మనం సినిమాకి వెళదాం అనుకున్నాము. మా ఆఫీసులో ఒకతనకి భాగ్యలక్ష్మి లాటరీలో

అయిదువేలు వచ్చింది. అందరికీ అప్పటికప్పుడు ఆఫీసులోనే పక్క రూములో పార్టీ ఇచ్చాడు. ప్యూన్ గ్లాసుల్లో డ్రింక్ తీసుకుని వచ్చాడు. మిరపకాయ బజ్జీలు బాగున్నాయని గట గట తినటంతో నోరు కారం పుట్టింది. కూల్ డ్రింక్ తాగుదామని గ్లాసు ఎత్తి గట గట తాగాను. గొంతుమంట, దగ్గు, నోరంతా చేదు. గబుక్కున గ్లాసు కింద పెట్టాను.

నన్ను చూసి ఫ్రెండ్స్ నవ్వారు. "బ్రదర్! అంత ఆత్రం కూడదు. మందు ఎప్పుడూ గుక్క గుక్కగా తాగాలి" అని ఒకడు.

"చప్పరిస్తూ తాగాలి. నాలుక మొద్దుబారి వగరొగరుగా వుంటుంది. మధ్య మధ్య కారం కారంగా ఏదో ఒక పలుకు నోట్లో వేసుకుని చప్పరిస్తూ వుండాలి బ్రదర్!" అని ఇంకొకడు!

"మందు మజా మనం పుచ్చుకునే విధానంలో వుంది."

"మందు విషయంలోనే వెనకటికో మందేశ్వరరావు చెప్పాడు. నిదానమే ప్రధానం మందే దివ్య ఔషధం."

ఇలా తలో మాట వదిలారు.

నా బుర్ర గిర్రున తిరిగిపోయింది.

"నేను తాగింది మందా!"

ఇదే మాట వాళ్ళని అడిగాను.

వాళ్ళు నవ్వారు. పైగా యిదే మొదటిసారిగా బ్రదర్! మందుచ్చుకోటం అన్నారు. నేను ఇంతవరకూ ఇలాంటిది పుచ్చుకోలేదు. మందుపార్టీ అని చెప్పక్కరలేదా! అని అరిచాను. మసాలా పకోడీలు, మిరపకాయ బజ్జీలు, కూల్ డ్రింక్ తో పార్టీ చేస్తున్నాడనిఅనుకున్నాగాని యిదని తెలిస్తే చస్తే ఈ పార్టీలో కలిసేవాడిని కాను. అంటూ వాళ్ళ మీద ఎగిరాను.

"అబ్బాయిగారి మీద మందు పనిచేస్తు న్నదిరోయ్!"

"శివం పూనినట్లు తూలిపోతున్నాడు."

"మాట చూశావా! తడబడుతున్నది."

"రెండు గుక్కలకే అవుటవుపోయావా నాయనా!"

"భార్యామణి కోప్పడుతుందని భయమా తండ్రీ!" ఇలా తలో మాట వదిలారు. నేను వెంటనే అక్కడ నుంచి వచ్చేశాను.

నేను తూలుతున్నానా! నా మాట తడబడుతున్నదా! నాకేం అర్థం కాలేదు. వెళ్ళి పార్క్ లో కూర్చున్నాను. నా తల తిరుగుతున్నట్లే అనిపించింది. అలా రెండు గంటలు గడిపాను.

ఇంటికి రాకుండా ఎంతసేపని బయట తిరగను? నేను ఇంటికి రాకపోతే నీవు ఆదుర్దా పడతావు. చివరికి ఓ ఉపాయం ఆలోచించాను. నేను దగ్గరకి వస్తే నీవు వాసన పసిగడతావు. నిజం చెప్పినా నీవు నమ్మకపోతే వ్యవహారం చాలా దూరం పోతుంది.

సీతా! నీ విషయం నాకు తెలిసిందే కదా! సిగరెట్టు అలవాటునే భరించలేవు. ఆఖరికి వక్కచూర వేసుకోటం కూడా దురలవాటే అంటావు. అలాంటి నీవు మందు పుచ్చుకున్నానంటే భరించగలవా! అందుకే-

తలనొప్పి అనే అబద్ధము.

అమృతాంజనం రాసుకునే ఫార్స్.

నీకు తెలిసిందే అమృతాంజనం అంటే నాకెంత ఎలార్జియో. నీవెక్కడ వాసన కడుపులో తెమిలింది. దానికి

తోడు నిండా దుప్పటి కప్పనేమో ఆ ముసుగులో ఉక్కిరిబిక్కిరి అయాను. దాంతో తిన్నదంతా వాంతి అయిపోయింది.

ఆ రోజు జరిగింది అది.

ఆపై ఏం జరిగింది నీకు తెలుసు.

ఆ గండం అలా గడిచింది.

ఆ దెబ్బతో మళ్ళీ మిత్రులతో వారం రోజులు మాట్లాడలేదు వాళ్ళు ఎక్కిరించుకోలేదు. వేళాకోళం చేశారు. అయినా నేను పట్టించుకోలేదు. తర్వాత ఆ విషయం మరుగున పడిపోయింది. సీతా! జరిగిందేదో జరిగింది. పనిగట్టుకుని ఈ విషయం నీతో చెప్పి నిన్ను బాధపెట్టి నేను బాధపడి ఎందుకొచ్చిన గోల అని నోరు మూసుకున్నాను.....

జరిగింది వరసగ చెప్పుకుపోతున్న రామకృష్ణకి అనుమానం వచ్చింది. తను చెప్పింది సీత వింటున్నదా లేదా అని.

"విన్నావు కదా సీతా! జరిగిందాంట్లో నా తప్పు ఏమైనా వుందా?" రామకృష్ణ అడిగాడు.

సీత మాట్లాడలేదు పుస్తకం లాగా అలాగే పడుకుని వుంది.

ఇంతకీ సీత నిద్రపోతున్నదా మేలుకున్నదా?

రామకృష్ణ సీత భుజం మీద చేయివేసి కుదుపుతూ "సీతా!" అన్నాడు.

సీత వక్క విదిలింపు విదిలించి కాస్త దూరం జరిగిపడుకుంది.

అమ్మయ్య సీత మేలుకునే వుంది.

రామకృష్ణ సంతృప్తి చెందాడు మళ్ళీ మొదలుపెట్టాడు ఆలస్యం అమృతం విషం అనుకుంటు

"ఆ రోజు జరిగింది చెప్పా కదా సీతా! మరి ఈ రోజుది కూడా చెప్పాలి కదా! లేకపోతే నీకు అనుమానం వస్తుంది నేను మందు పుచ్చుకోను అన్న సంగతి ఫ్రెండ్స్ అందరికి తెలిసిపోయింది. వేళాకోళాలు ఎక్కిరింతలు కొన్నాళ్ళు సాగి వాళ్ళు మర్చిపోయారు. మూడు నెలలు పూర్తి అయాయి.

ఈ రోజు మా ఆఫీసులో వకతనికి ప్రమోషన్ రావటం పార్టీ యిస్తున్నాడని చెప్పటం నీకు తెలిసిందే బ్రదర్! నన్ను బాధపెట్టవద్దు మందు పార్టీ అయితే నేను రాను అని చెప్పాను. అలా యిలా కాదు కచ్చితంగా చెప్పాను.

"చూడు బ్రదర్! కొందరు మందు పార్టీ అడిగారు. మరి కొందరు నీ బోటివాళ్ళు మందు పార్టీ అయితే రాము అని చెప్పేశారు. అందుకని రెండు పార్టీలు యిస్తున్నాను ఓ స్వీటు హాటు రెండు పెగ్గుల మందు. ఆ జాతికి మీ జాతికి స్వీటు హాటు గోల్డ్ స్పాటు. కనుక నీ యిష్టం వచ్చింది తీసుకోవచ్చు" అని చెప్పాడు.

అలాంటప్పుడు అభ్యంతరం ఏముంది? సరేనన్నాను. పార్టీలో పిచ్చివేషాలు వేస్తే తలా నాలుగు చివాట్లు పెట్టి వద్దామనుకున్నాను. కాని వాడు రెండు రకాల పార్టీలు అరేంజ్ మెంటు చేశాడు.

పార్టీ మొదలైంది. నాలాంటి కొందరికి స్వీట్ హాటుతో పాటు కేంపకోలా నీకు తెలిసిందే కదా మామూలు డ్రింకు. స్వీటు హాటు తిని కేంపకోలా తాగాను సరీగా తెలియలేదు గాని వేరే రుచిగా వున్నట్లు అనిపించింది మనం ఎప్పుడూ గోల్డ్ స్పాట్ తాగుతాం. ఒకే ఒక హరీ కాబోలు కేంపకోలా తాగాము. ఆ రుచి నేను మర్చిపోయాను. అది అలాగే వుందేమో అని అనుకున్నానో లేదో -

అక్కడో బాంబు పేలింది.

సీతా! బాంబు అంటే నిజంగా బాంబు కాదు. బాంబు పేలటం లాంటిమాట.

"బ్రదర్! కళ్ళు తిరుగుతున్నాయా? వళ్ళు తూలుతున్నదా? మాట తడబడుతున్నదా? జగమే మాయ పాట ఎత్తుకుంటావేమిటి" తలోమాట అన్నారు. వాళ్ళంతా వకటే ఇక ఇకలు పక పకలు.

"ఏమిటి మీరనేది?" అడిగాను. అప్పటికే నా శరీరం నా ఆధీనం తప్పుతున్నట్లు తెలుస్తున్నది

"బ్రదర్! సగం సీసా కేంపకోలాలో సగం మాత్రమే మందు కలిపాము. డోంట్ వర్రీ" అన్నాడు ఇకిలిస్తూ.

నా బుర్ర రెండు రకాలుగ తిరగటం మొదలుపెట్టింది. ఆవేశంగా లేచివెళ్ళి వాడి పీక పట్టుకున్నాను. అందరూ వచ్చి విడిపించారు.

"మేమేదో వెధవలం అయినట్లు ఆ ఫోజెందుకు బ్రదర్! నీవు తాగుతావో లేదో మాకు తెలియదు. ఆ రోజు ఆఫీసులో పార్టీ యిస్తే మందు దక్కినందుకు సంతోషించక మా అంత దుబారా పనికిమాలిన వెధవలు ఈ ప్రపంచంలో మరొకరు లేనట్లు నీ అంత సుగుణాశీలుడు వేరొకడు లేనట్లు లెక్చరు దంచావు

మందు వకసారి పుచ్చుకుంటే మనిషి చెడిపోయినట్లు కాదు
భార్యా విధేయుడు ఎప్పుడూ బాగుపడడు.

పెళ్ళాం అన్నం పెట్టకపోతే పెనిమిటి వీధిన పడనక్కరలేదు.

మందు మగువ మగాడి జన్మహక్కు.

ఇలా వాళ్ళంతా ఇష్టం వచ్చినట్లు వాగటం మొదలుపెట్టారు. వాళ్ళంతా ఒకటి, నేఒక్కడినీ ఒకటి. విసురుగ యివతలికి రాబోయాను. శరీరం నా అధీనంలో లేకపోయింది. వాళ్ళు నా తిట్లని జోక్ గ తీసుకుని మరింత మందు బలవంతాన నా నోట్లో పోశారు. నాకు గుర్తు లేదు. గుటక వేశానో వాళ్ళ ముఖాన వుమ్మేశానో.

గంటో రెండు గంటలో సోఫాలో పది నిద్రపోయాను. లేచి చూద్దును కదా, సగం మంది కక్కుకుని దానిలోనే పొర్లాడుతున్నారు. కొంతమంది పక్క గదిలో చేరి అద్దెకి తెచ్చిన ఆడదానితో అవసరం తీర్చుకుంటున్నారు.

వాళ్ళంతా పసువుల్లా గాప్రవర్తిస్తు న్నారు నా వూసు ఎవరూ పట్టించుకోలేదు. నేను బైటికి వచ్చేశాను.

రోడ్లన్నీ గంటసేపు షైర్ కొట్టి చాలా తీవ్రంగ ఆలోచించి యింటికి వచ్చాను.

ఈ విషయం నీతో చెప్పాలా వద్దా! యిదే ఆలోచన. చెప్పటం మంచిది కాని నీవు అపార్ధం చేసుకుంటే కష్టం. అందుకే చెప్పలేదు. యింటికి వచ్చిం తరువాత యింతవరకు ఏం జరిగింది నీకు తెలుసు. ఇప్పుడు చెప్పు సీతా! నాది తప్పో వప్పో!" అంటూ రామకృష్ణ మొత్తం వివరించి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

సీత వింది భర్త చెప్పిందంతా.

సీత దీన్ని గురించే ఆలోచించింది.

లీలగ..... ఎక్కడో..... రాంగ్....

"సీతూ!" సీత మాట్లా డకపోయినాప్రేమగా పిలిచాడు రామకృష్ణ.

సీత అతని ప్రేమకి కరిగి నీరయి అమాంతం పైకి లేచి అతని విశాల వక్షస్థలం మీద తలవాల్చుకోలేదు. క్షమించండి మిమ్మల్ని అపార్ధం చేసుకున్నాను. మీ పాదాలకింద (చెంత) యింత చోటు ఇవ్వండి అనలేదు.

సీత చాలా దీర్ఘంగ ఆలోచిస్తు న్నది

రామకృష్ణ మరో రకంగా అర్థం చేసుకున్నాడు.

సీత సిగ్గు పడుతున్నది.

సీత సిగ్గు పడుతున్నది.

సీత పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నది.

అని -

భర్త ఎప్పుడూ భార్య విషయంలో ఓ అడుగు ముందుకు వేస్తుండాలి. సిగ్గు బిడియం స్త్రీకి ఎక్కువ. అందుకని భర్త చనువుగ ఆమెకి చేరువ అవుతుండాలి. తప్పుచేసిన స్త్రీగాని పశ్చాత్తాపంతో కుమిలే స్త్రీగాని నిజం గ్రహించిన తర్వాత కూడా ఏమీ చేయలేక నత్తగుల్లల్లా ముడుచుకుని వుంటుంది. అప్పుడు భర్త ఆమెని దగ్గరకు తీసుకోవాలి. అలా చనువుగ దగ్గరకు తీసుకున్నా ఆమె సిగ్గుతో తోసి వేస్తుంది. అలా అని అప్పుడు ఆ భర్త మిన్నకుండకూడదు. మగతనం ప్రదర్శిస్తూ కాస్త బలవంతానైనా సరే ఆమెని లొంగదీసుకోవాలి.....

ఇలా అని బజారులో రూపాయి పావలాకి దొరికే "భర్త విధులు- కర్తవ్యం" అనే బుల్లి పుస్తకంలో రాసి ఉంది. ఆ పుస్తకాన్ని ఓసారి రామకృష్ణ చదివాడు.

అదిప్పుడు గుర్తుకొచ్చింది రామకృష్ణకి.

అలా యిప్పుడు చేద్దామనుకున్నాడు రామకృష్ణ.

ఆ ప్రయోగం సీతమీద చేస్తే అసలుకే ఎసరు. వ్యవహారం బెడిసికొట్టొచ్చు అని రామకృష్ణకి బొత్తిగా తట్టలేదు.

"ప్రేయసీ! మనోహరీ! నా సీతామనోహరి!" కూని రాగం తీస్తూ రామకృష్ణ సీత భుజంమీద చేయివేశాడు.

సీత కోపంతో గుర్రుమంటూ పైకి లేచింది.

చటుక్కున రామకృష్ణ సీతని కౌగిలిలోకి తీసుకున్నాడు.

# 17

సీతని గాడంగా చుంబించి వదిలేస్తూ "రతీదేవిలాగా వున్నావు సీతూ!" అన్నాడు రామకృష్ణ.

"వదలండి!" అంది సీత భర్త కౌగిలిలోంచి పెనుగులాడుతూ.

భార్య కోపంగా వుంటే ఆమె మాట వినకూడదు. ఆమె ఏమీ మాట్లా డుతున్నా పెడచెవిన పెడుతూ, మీ పని మీరు కానిస్తూ ప్రసన్నురాలిని చేసుకోవాలి - " అని ఆ దిక్కుమాలిన పుస్తకం "భర్త విధులు - కర్తవ్యం" లో రాసి వుంది.

ఇదీ జ్ఞాపకం వుంది రామకృష్ణకు. అలనాటి శ్రీకృష్ణ పరమాత్మలా సీత చుబుకం పట్టుకుని - లాలనగా, ప్రేమగా "ఇదంతా కోపమే!" అన్నాడు. "కోపంలో నీవెంత అందంగా వుంటావో తెలుసా? అచ్చం జయప్రదలా వుంటావు" అని కూడా కొత్త మాట అన్నాడు.

అది భ్రాంతో, నిజమో గాని, రామకృష్ణ నోట్లో ంచిఘుప్పున చెడువాసన వచ్చినట్లయింది సీతకి. "ఛీ...... వదలండి. సిగ్గులేదూ!" అంది గింజుకుంటూ.

"కావాలి కావాలి అంటున్నది మనసు. పొందాలి, పొందాలి అంటున్నది తనువు. నా కళ్ళముందు రతీదేవి నగ్నంగా నాట్యం ఆడుతున్నది. కోపం చాలించి రావోయ్!" అన్నాడు రామకృష్ణ ఖుషీగా నవ్వుతూ.

మనసులోనిదంతా చెప్పేసినందుకు రామకృష్ణకి చాలా ఆనందంగా వుంది. ఆ ఆనందంలో వళ్ళూ పై తెలియని స్థితిలో పడ్డాడు. సీతదంతా పై పై కోపం అనుకుంటూ ఓ అడుగు ముందుకు వేస్తున్నాడు.

ఇదంతా రామకృష్ణ చదివిన ఆ పుస్తకం ప్రభావం.

సీత కూడా ఓ నవలలో చదివింది. పీకదాకా మందు పుచ్చుకున్నవాడు మత్తు గాపడి నిద్ర అన్నా పోతుంటాడు. మగువ పొందుకోసం వెంపర్లాడుతూనైనా వుంటాడు. అలా కోరికతో బుసకొట్టే మగవాడు - కళ్ళు మూసుకుపోయిన కామంతో వళ్ళూ పై తెలియక, ఆడదాని పొందుకోసం ఏమయినా చేస్తాడు, ఎంతకయినా తెగిస్తాడు.

ఇప్పుడు రామకృష్ణ అలా చేస్తున్నడేమోనని సీతకి అనుమానం వచ్చింది. అనుమానం అంటూ వస్తే అది పెనుభూతంగా కానరావటం ఖాయం.

సీత రామకృష్ణని బలంగా విదిలించుకుని, మంచం మీద నుంచి కిందకి దూకింది. "నన్ను ముట్టుకున్నారంటే యిటు నుంచి ఇటే పరుగెత్తి బావిలో దూకుతాను" అంది.

రామకృష్ణ బుర్రతిరిగి యధాస్థానానికి వచ్చింది. బుర్ర తిరుగుడు తగ్గటంతో మామూలు మనిషి అయాడు. సీత నిజంగానే బాగా కోపంగా వున్నదని గ్రహించాడు.

"సీతా! నే చెప్పింది నమ్మటంలేదా?" అన్నాడు రామకృష్ణ.

"నేను పిచ్చిదాన్ని కాదు!" సీత అంది.

"అంటే నేను చెప్పిందంతా అబద్ధం అంటావా?"

"అక్షరం అక్షరం అబద్ధమే!"

"సీతా!" నిర్ఘంతపోయాడు రామకృష్ణ.

"మీరు జోక్స్ బాగా వేయగలరు మాటలు బాగా చెప్పగలరు అని యింతవరకూ అనుకుంటూ వుండేదాన్ని. కథలు కూడా బాగా చెప్పగలరని ఇప్పుడు తెల్సుకున్నాను. మొదటిసారి గ్లాసులో పోసిస్తే కూల్ డ్రింక్ అని

తాగారా! డ్రింక్ ముఖం ఎలా వుంటుందో తెలియదా! ఇన్ని సినిమాలలో చూశాను- బుసబుస సగం గ్లాసు నురుగుతో వుంటుంది. అలా అని నాకే తెలియగా లేనిది - కళ్ళముందు గ్లాసునిండా విస్కీ వుంటే మీకు తెలియలేదా?

విస్కీ కంపు మైలు దూరానికి కొడుతుంటే- అలాంటిది కళ్ళముందు వుంది. గ్లాసుని చేతిలోకి తీసుకున్నారు. ముక్కుదాకా ఆ గ్లాసుని తీసుకు వెళ్ళి నోట్లో పోసుకున్నారు. మీకది కూల్ డ్రింక్ గా అనిపించిందా? సరే - ఆ విషయం ఇంటికి వచ్చి నాతో చెప్పొచ్చు కదా! ఊహు - నేనో పెద్దపులినయినట్లు, బ్రహ్మరాక్షసిగాను వుహించుకున్నారు. అంటే మీ మనసులో ఏదో ఒకమూల నా గురించి యిలాంటి అభిప్రాయం వుందన్నమాట....."

"అదికాదు సీతా!" రామకృష్ణ ఏదో చెప్పబోయాడు.

"నాకేమి చెప్పకండి. మొదటిసారి తెలియక తాగారు. మరి రెండోసారి కూల్ డ్రింక్ సీసాలో వుండబట్టి, కేంపాకోలా అని తాగారు. చాలా బాగుంది. రేపు కూజాలో నీళ్ళు వంపుకుని తాగుతారు. అదీ అంతే- మీకు తెలియకుండా ఎవరో కూజాలో నీళ్ళు తీసేసి, దాంట్లో బ్రాందీ పోసి పెట్టారు, నాకు తెలియక తాగాను అనొచ్చు - ఇలా ఎన్నయినా అనొచ్చు, చెప్పొచ్చు."

"నా మాట వినేది లేదా సీతా!" రామకృష్ణ అడిగాడు.

"వినటమా! హ్హా! ఎవరైనా ఒకసారి మోసపోతారు. రెండుసార్లు మోసపోరు. ఇప్పటికే మీకు అలవాటు అయింది. ఇంకా ముందు ముందు....."

చివరి ప్రయత్నంగా రామకృష్ణ నవ్వు తెచ్చుకుంటూ అన్నాడు - "జరిగిందేదో జరిగింది. గతాన్ని సమాధి కట్టేద్దాము పన్నెండు దాటింది పడుకుందాము సీతా!"

"నాకు తెలుసండీ- నాకు తెలుసు. మందు ప్రభావం! మగువ పొందుకావాలి, కావాలి, అనిపిస్తున్నది కదూ!"

"సీతా!" రామకృష్ణ ఖంగు తిన్నాడు.

"ఎందుకు అరుస్తారు? అవునులెండి - ఉన్నమాట అంటే ఎవరికయినా ఉలుకే. బాగా మందుమీద వున్నారు కదా- మగువ పొందు కావాల్సి వచ్చింది. కాసిని కట్టుకథలు చెప్పి అవసరం తీర్చుకుందురు గాని. అంతేనా!"

అర్ధరాత్రి అంకమ్మ శివాలని - ఓ పక్క ఒంటిగంట కావస్తున్నది మరోపక్క చాలా అలసిపోయి వున్నాడు. నిజం చెప్పినా కూడా అర్థం చేసుకోకుండా వితండవాదం చేస్తున్నది జరిగిందేదో జరిగిందని ప్రేమగా దగ్గరకు తీసుకోబోతే మూర్ఖంగా ప్రవర్తిస్తున్నది రామకృష్ణకి కోపం వచ్చింది. అయినా కోపం వెళ్లగక్కలేదు. చిరాకుగా అన్నాడు-

"సీతా! నీవు పట్టిన కుందేటికి మూడేకాళ్ళు అన్నంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావు"

ఈ మాట చాలు - మరో బాంబు బద్దలు కావటానికి. సీతలాంటి వాళ్లకి కోపంవస్తే ఎదుటివాళ్ళు నోరు మూసుకోటం వుత్తమం. ఎందుకంటే సీతలాంటి వాళ్ళు వెనుకా ముందూ ఆలోచించకుండా మాటకి మాట అంటారు. ఆ తర్వాత నెమ్మదిగా తగ్గిపోయి, ఏళ్ళ తరబడి బాధపడ్డా బాధపడతారు. ఏదీ అనకుండా వుంటే నిమిష నిమిషానికి వాళ్ళే ఆటోమేటిక్ గా తగ్గిపోతారు. అంటేనే వస్తుంది చిక్కంతా.

సీత గుణం రామకృష్ణకి  బాగా తెలుసు. మౌనంగా వుంటే తెల్లారేసరికి అదే తగ్గేది. రామకృష్ణ మనిషే - ఎప్పుడూ ఒకేలాగా ఆలోచించటం ఎవరికీ కుదరదు.

రామకృష్ణ బాగా అలసిపోయి వున్నాడేమో - పెదవి కదిపాడు.

అదే వచ్చింది చిక్కు.

మొదటికే మోసం అయింది.

రామకృష్ణ ఏమన్నాడు - "నీవు మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావుసీతా!" అన్నాడు. అదేమి అంత కానిమాట

కాదు. ఓ భర్త ఓ భార్యని అనరాని మాటేంకాదు.

అయినా -

మాటకి మాట తెగులు, నీటికి నాచు తెగులు

సరీగా ఇప్పుడు అదే జరిగింది.

"అవును. బాగా చెప్పారు. నేను మూర్ఖురాలిని కాబట్టే మీరు అల్లిన కట్టుకథ నమ్మాను!" సీత వ్యంగ్యంగా అంది.

"ఎక్కడ నమ్మావు? నేను ఏం చెప్పినా విపరీతార్థం తీస్తూ ఇంకేదో అంటుంటివి!" రామకృష్ణ చిరాకు అణుచుకుంటూ అన్నాడు.

"మీరేం చెప్పినా.... అంటే అర్థం ఏమిటి? అసలు విషయం దాచి ఏదో ఒకటి చెప్పినా అనే కదా?"

"నీ ఇష్టం. నీవెలా అనుకున్నా సరే - అర్థం చేసుకోనప్పుడు చెప్పేదేముంది?"

"మీరు చెప్పిందాంట్లో నిజమూ, అర్థమూ వుంటే అలాగే ఒప్పుకుందును. మీరు చెప్పిందే నిజం అయితే...... పొరపాటు అంటున్నారు కాబట్టి - నిజం చెప్పేవారు. తలనొప్పి..... అమృతాంజనం..... ఈ దొంగనాటకం ఆడేవారు కాదు."

"నాది.... నాది..... దొంగనాటకమా?"

"ముమ్మాటికీ."

"మంచిది. చాలా గొప్పగా అర్థం చేసుకున్నావు. నిన్ను బాధపెట్టడం యిష్టం లేక, నీవు అపార్థం

చేసుకుంటావేమో అని భయపడి దొంగనాటకం ఆడాల్సి వచ్చింది నీమీద ప్రేమ లేకపోతే యింత నాటకం ఆడేవాడిని కాదు. నిజం చెప్పాలంటే నేను సంపాదిస్తు న్న మగాడిని. తాగి తందనాలాడితే ఏం చేయగలవు? తాగి వచ్చి నానా యాగీ చేస్తూ నీమీద చేయి చేసుకుంటాను. అప్పుడు ఏమీ చేయగలవు?" ఇలా యిదంతా అని చివరికి - "సీతా! నేను అలాంటి వాడిని కాను" అని చేపుదామనుకున్నాడు రామకృష్ణ.

మధ్యలో అందుకుంది సీత-

"ఏమి చేయగలవు అని ఎంత ధీమాగా అంటున్నారండీ! ఎస్ - ఇది పురుష సమాజం! నాలాంటి ఆడది ఏం చేస్తు ంది? మొగుడు తాగొస్తా ను, తంతాను అని ధీమాగా చెపుతుంటే ఏం చేస్తు ంది?- భోరున ఏడుస్తు ంది. ఇప్పుడు నాకు మిగిలింది యిదే. నేను చేసేది యిదే!" అంటూ సీత భోరుమంది ఒక్కసారిగా.

రామకృష్ణ తెల్లబోయాడు.

వాళ్ళు పెళ్ళయి కాపురం పెట్టిం తరువాత వారి మధ్య ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా పోట్లా ట కోపతాపాలు, అపార్థాలు రాలేదు. ఇలాంటి సంఘటన కూడా జరగలేదు. ఏ మాటంటే ప్రసన్నురాలవుతుందో, ఏ మాటంటే ఏడుస్తు ందో - సీత మనసు యింకా పూర్తిగా అనుభవం లేదు రామకృష్ణకయినా.

ఇప్పుడు సీతని సముదాయించాలా!

ఊరుకున్నంత ఉత్తమం లేదని నోరుమూసుకోవాలా!

రామకృష్ణ ఆలోచించాడు- రెండోదే బెటర్ గా అనిపించింది. ఊరుకున్నంత ఉత్తమం - బోడిగుండు అంత సుఖం మరొకటి లేదన్నారు పెద్దలు.  వాళ్ళయినా అనుభవంతో చెప్పిన నగ్నసత్యాలే కదా!

రామకృష్ణ పెద్దవాళ్ళ మాటలకి విలువిస్తా డు.

అందుకే -

రామకృష్ణ టెల్లంకొట్టిన రాయిలా - పెదవులు రెండూ కలిపి కుట్టేసుకున్న వాడిలా మిన్నకుండిపోయాడు.

కాసేపు జలజల కన్నీరు కారుస్తూ, వలవల ఏడిచింది సీతామనోహరి.

ఉన్నట్లుండి -

వాతావరణంలో ఏదో అసహజం చోటుచేసుకున్నట్లు సీతకి తోచింది. ఏడిచే కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసి, తీవ్రంగా ఆలోచించింది.

సీతకి అర్థం అయింది.

రామకృష్ణ కళ్ళు మూసుకుని, నడిమంచం మీద బాసిపెట్లు వేసుకుని కూర్చుని కొంగజపం చేస్తున్నాడు.

సీతకి ఒళ్ళు మండింది. ఎంత మండిందీ అంటే- నడి ఎండాకాలం మిట్టమధ్యాహ్నం ఒళ్ళంతా బ్లేడుతో గీసుకుని గుంటూరు ఎండుమిరపకాయల కారం దానిమీద వేసి, కొబ్బరిపీచుతో పామినంతగా.

తను గుండెలు పగిలేలా ఏడుస్తుంటే అదేం అనాల్సింది పోయి - ఊరడించాల్సింది పోయి - సానునయంగా దగ్గరకు తీసుకోవాల్సింది పోయి - ఏడుస్తే ఏడువు. నీ ఖర్మ..... మగాడిని - నాకేంటి? అన్న నిర్లక్ష్య ధోజుతో కళ్ళు మూసుకుని కూర్చుంటాడా! అమ్మో! తాగుడు ఎంత చెడ్డది! అప్పుడే వారు మారిపోయారు. ఆఫ్ ట్రాల్ ఆడది- భార్య అంటే అణిగిమణిగి పడివుండేది అనే కదా!

సీత అలా ఆలోచించి, ఏడవటం తనకి తెలియకుండానే మానేసింది. భర్త నిర్లక్ష్య వైఖరి గురించి ఉక్రోషంతో ఆలోచించటం మొదలుపెట్టింది.

రామకృష్ణ మాట్లాడకుండా పడుకున్నాడు.

హ్వా! నేనేనా తక్కువ తింది! - అనుకుంది సీత తనూ పడుకుంది - అదే మంచంమీద ఆ చివరగా జరిగి.

మరో అరగంట తర్వాత-

ఎవరిదోవన వారు హాయిగా నిద్రపోయారు.

# 18

ఉదయం -

ఏడూ పది నిమిషాలు!

రామకృష్ణ, సీతామనోహరి ఎవరిదోవన వాళ్ళు అంత క్రితమే లేచి ఎవరి ముఖం వాళ్ళే కడుక్కున్నారు.
సీత పెద్దగ్లాసుడు పాలలో నాలుగు చెంచాల బూస్ట్ వేసి చిక్కగా కలుపుకుని, వేడి వేడిగా, హాయి హాయిగా తాగి బాత్ రూమ్ లోకెళ్ళి తలుపు వేసుకుంది.

రామకృష్ణ చూశాడు. సీత కాఫీ కాచే ప్రయత్నం చేస్తున్నట్లు ఎక్కడా కనపడలేదు. గ్లాసు, చెంచా లాంటివి చప్పుడు కావటం, ఆ తర్వాత బూస్ట్ వాసన, ఆ తర్వాత సీత బాత్ రూమ్ లో దూరటం గమనించి, నెమ్మదిగా వంట గదిలోకి వెళ్ళాడు.

కాగిన పాలు, ఖాళీ చేసిన బూస్ట్ తాగిన గ్లాసు దర్శనమిచ్చాయి. అమ్మాయిగారి కోపం తగ్గలేదు. అయ్యగారికి

కాఫీ లేవు. ఏం చేస్తాం - చేసుకున్నవారికి చేసుకున్నంత! అనుకుంటూ రామకృష్ణ పెద్దగ్లాసెడు బోర్నవీటా కలుపుకుని తాగాడు.

ఆ తర్వాత -

రామకృష్ణ పేపరు తిరగేస్తూ కూర్చున్నాడు.

సీతామనోహరి లక్స్ సుప్రీం సోపుతో స్నానం చేసి సినీ తారలా మెరిసిపోతూ బాత్ రూమ్ లోంచి బైటపడింది. ఆ తర్వాత విమల్ వారి టెరికోసా చీర ధరించి అందంగా ముస్తాబయి, చిన్న వి.ఐ.పి. సూట్ కేసులో చీరలు, లంగాలు, జాకిట్లు వగైరా సర్దుకుంది.

రామకృష్ణ చూశాడు. కాళ్ళూ, చేతులూ ఆడలేదు. మనసు ఆగలేదు.

దయార్ద్ర హృదయురాలు స్త్రీ- కఠిన పాషాణ హృదయుడు పురుషుడు అని చాలా పుస్తకాలలో కవులు ఘోషించారు. ఒక కవి మాత్రం 'జాలిలేనివారు ఈ ఆడువారు' అన్నాడు. ఆ కవి ఏ సందర్భంలో అన్నా ఇప్పుడు మాత్రం నిజం. సీత పెట్టె సర్దుకుని వెళ్ళిపోతున్నది.

'స్త్రీ క్షమాధరిత్రి అని ఎవడు అన్నది?' అని రామకృష్ణ ఆలోచిస్తూ కూర్చోలేదు. పేపరు అవతల పారేసి సీత దగ్గరకు వచ్చాడు. "ఏమిటి సీతా యిది?" అన్నాడు.

సీత పెట్టె తాళం చెవి మంగళసూత్రాల తాడుకి కట్టుకుంది. అంతేగాని అదేమిటో చెప్పలేదు.

మంగళసూత్రాల తాడువల్ల వుపయోగాలు...... తాళం చెవులు కట్టుకోనుటకు..... పిన్నీసులు పెట్టుకొనుటకు...... డబ్బా మూతలు తీసుకొనుటకు యు...... అని మరొకసారి అయితే రామకృష్ణ జోక్ చేసేవాడే. ఇది జోకులకు అనువైన సమయం కాదు మరి.

సీత మాట్లాడకపోయేసరికి "ఇది అన్యాయం సీతా!" అన్నాడు రామకృష్ణ బాధగా.

"నేను అడ్డు లేకపోతే హాయిగా తాగి తందనాలు ఇంట్లో నే ఆడవచ్చు." గాంభీర్యంగా అని, సూట్ కేసు పట్టుకుని వాకిట్లోకి వెళ్ళిపోయింది సీత.

రామకృష్ణ సీత వెనుకనే వాకిట్లోకి వచ్చాడు.

సీత స్టేషనుకి రిక్షా మాట్లాడుకుని రిక్షా ఎక్కటం వరకు రామకృష్ణ చూసి రయ్యిన ఇంట్లోకి వచ్చి ప్యాంటులో దూరిపోయాడు. క్విక్ గా యింటితాళం వేశాడు. స్కూటర్ మీద ధన్ మని కూర్చుని ముందుకు దూసుకుపోయాడు.

రిక్షా కన్నా ముందే స్కూటర్ స్టేషన్ కి వెళ్ళింది. సీత రిక్షా దిగిం తరువాత రామకృష్ణ పెట్టె అందుకోబోయాడు. సీత పెట్టెని గుంజుకుంది. రామకృష్ణ ఓ వెధవ నవ్వు నవ్వి, స్టయిల్ గా సీతపక్కనే నడిచాడు.

సీత ఏ వూరికి టిక్కట్టు తీసింది గమనించాడు.

"అమ్మయ్య! సీత ఎక్కడికీ వెళ్ళటం లేదు. పుట్టింటికి వెళుతున్నది. కనుక భయపడాల్సింది ఏమీ లేదు. ఓసారి వచ్చి వెళ్ళమని తల్లీ తండ్రీ లెటర్ రాసినా - ఇక్కడ మావారికి ఇబ్బంది. ఏదో ఒక పండక్కి ఇద్దరం కలసి వచ్చి పదిరోజులు వుంటామని తిరుగు టపాలో లెటర్ కొట్టింది. ఇప్పుడు సీత వెళ్ళటం వల్ల వాళ్ళూ సంతోషిస్తారు- సీత అక్కడ నాలుగురోజులు వున్నట్లూ వుంటుంది. నాలుగు రోజులు అయేసరికి సీత చల్లబడుతుంది" అని రామకృష్ణ సంతోషించాడు.

సీత టిక్కెట్టు తీసుకున్న తర్వాత, బండి ఎప్పుడొస్తుందో కనుక్కుంది.

మరో అయిదు నిమిషాలలో నెంబరు టు ప్లాట్ ఫాం కి వస్తుందని చెప్పాడు అతను.

సీత బుకింగ్ దగ్గర నుంచి కదిలింది. ఓరగా ఓ చూపు చూసింది. పక్కన రామకృష్ణ లేడు. ప్లాట్ ఫాం అంతా కలయచూస్తున్న దానిలా పెట్టె పుచ్చుకుని నడుస్తూ అటూ యిటూ, ఆ తర్వాత నలువైపులా చూసింది.

రామకృష్ణ పరిసరాల్లో లేడు.

రామకృష్ణ ఏమన్నా నల్లపూస - కనపడకపోవటానికి ఆ దరిదాపుల్లో లేడు. అంతే.

"హ్వా! వెళ్ళిపోయారు యింటికి. తను ఏవూరు వెళ్ళేది తెలుసుకోటానికన్నమాట తన వెనకనే వచ్చింది! అబ్బ, ఏం తెలివి! తెలివితేటలు అంత ఎక్కువ కాబట్టే తాగి, కట్టుకథలు చెప్పటం దాకా వచ్చారు."

సీత ఆలొచిస్తూ కోపంగా అడుగులు వేస్తూ రెండో నెంబరు ప్లాట్ ఫాం కి వచ్చింది. ఓ వేళ రామకృష్ణ తనకన్నా ముందే వచ్చి అక్కడ వున్నాడేమో అని చూసింది.

రామకృష్ణ లేడు.

"నేను పిచ్చిదాన్ని. నా భ్రమ కాకపోతే వారు ఇక్కడ ఎందుకుంటారు? ఈసరికి ఇంటికి వెళ్ళి వుంటారు." అలా అనుకుంది సీత.

రామకృష్ణ వెళ్ళిపోవటం వల్లనేమో - సీతకి పుట్టెడు నీరసం వచ్చింది.

అదొక థియరీ వుంది మరి.

ఒకడికి మరొకడు శత్రువు. ఆ నెంబర్ వన్ గాడికి నెంబర్ టు గాడిని చంపుదామని వుండేది. ఓరోజు నాలుగు వుతికి చంపుదామని నెంబర్ వన్ గాడు వచ్చేసరికి, నెంబర్ టు గాడు బస్సు యాక్సిడెంట్ లో చచ్చివున్నాడు. అది చూసి నెంబర్ వన్ గాడు భోరు మన్నాడు. "అతను మీ బంధువా?" నెంబర్ వన్ ని అడిగారు ఎవరో. కాదు- అన్నాడు నెంబర్ వన్ యింకా ఘోరంగా ఏడుస్తూ. "మరెందుకయ్యా అంత ఏడుపు?" అని అడిగితే - చచ్చినవాడు నా శత్రువు - అని చెప్పాడుట. "మరి చచ్చిపోయాడు కదా! పీడా వదిలిందని సంతోషించక ఈ ఏడుపెందుకయ్యా?" అంటే - "వాడిని స్వయంగా నా చేతులతో నేను చంపుదామనుకున్నాను కాని వాడు చచ్చాడు" అని అసలు రహస్యం చెప్పి బేర్ మన్నాడు.

అలాగే -

రామకృష్ణ వుండకూడదనుకుంది సీత. అతను నిజంగా కనపడకపోయేసరికి నీరసం, కోపం వచ్చాయి అసలు విషయం- ఏ మూలనో మనసులో రామకృష్ణ వుంటే బాగుండునని వుంది సీతకి.

ట్రైన్ దడ దడ చప్పుడు చేస్తూ వచ్చింది.

సీత మరోసారి ప్లాట్‌ఫాం అంతా కలయ చూసి, ట్రైన్ ఎక్కింది. కిటికీ దగ్గర సీటులో కూర్చుంది.

"ఎక్కడికమ్మా వెళ్ళేది?" ఎదుటి సీట్లో ఆవిడ సీతని అడిగింది.

సీత చెప్పింది.

"మీ వాళ్ళెవరయినా నీతో వస్తున్నారా?"

సీత ఏదో గొణిగింది.

ఆమెకి అర్థం కాలేదు.

సరీగా అప్పుడే రామకృష్ణ ఓ చేత్తో వాటర్ బాటిల్, మరో చేత్తో బరువుగా వున్న ప్లాస్టిక్‌సంచీ పట్టుకుని శ్రీమహావిష్ణువులా ప్రత్యక్షమయ్యాడు.

సీతకెందుకో ఆనందం వేసింది. కాని, కావాలని కోపం తెచ్చుకుని ముఖం పక్కకు తిప్పేసుకుంది.

రామకృష్ణ కిటికీలోంచి చెయ్యి లోపలికి పెట్టి, సీత పక్కనే వాటర్ బాటిల్, సీత ఒడిలో ప్లాస్టిక్‌సంచీ పెట్టాడు. ఒంటరిగా వున్నా మరోసారి అయినా అయితే సీత వాటర్ బాటిల్ ని, ప్లాస్టిక్‌సంచిని అవతలికి తోయటమో, కిటికీలోంచి బైటికి విసిరేయటమో చేసేదే. కాని చెయ్యలేదు.

ఎదుటి సీట్లో కూర్చున్న ఆవిడ మిడిగుడ్లు వేసుకుని వీళ్ళనే చూస్తున్నది అలాగే పక్క సీట్లో వున్న కొంతమంది కూడా కాలక్షేపంగా వీళ్ళనే చూస్తున్నారు

వాళ్ళకి మరింత కాలక్షేపంగా వుండటానికి ఓ కొత్త సీను సృష్టించదల్చుకోలేదు సీత. పైగా పదిమంది చూస్తే సిగ్గుచేటు.

సీత వాటర్ బాటిల్ ని, సంచీని తీసి పక్కగా పెట్టుకుంది.

తను తెచ్చినవాటిని విసిరి ముఖాన కొట్టనందుకు రామకృష్ణకి చాలా సంతోషం కలిగింది.

"సీతా!" అన్నాడు నెమ్మదిగా.

సీత ఊ అనలేదు గాని, ముఖం దించుకుని, గోళ్ళు గిల్లుకుంటూ వుండిపోయింది.

సీతా! ట్రైన్ ఇక్కడే అరగంట లేటు. ఇలా జోగుతూ వెళ్లిందంటే ఎలా చూసినా రెండవుతుంది. నీవసలే ఆకలికి ఆగలేవు. యాపిలు, ద్రాక్ష, చక్రకేళి తెచ్చాను. నీకు చాలా ఇష్టం కదా అని జామ్ బ్రెడ్, ఫ్రూట్ బ్రెడ్, కారంగా తినటానికి సోమాసీలు, చిప్స్ కూడా తెచ్చాను. అన్నీ సంచిలో వున్నాయి. నామీద బెంగతో తినటం మనేసేవు సుమా!" చిలిపిగా చెప్పాడు రామకృష్ణ.

సీత ముఖం కోపంతో ఎర్రబడింది. రామకృష్ణని నమిలి మింగేలా చూద్దామని చివ్వున తలయెత్తింది.

రామకృష్ణ అల్లరిగా నవ్వుతూ చిలిపి కృష్ణుడిలా చూశాడు.

సీత రకీమని తల వాల్చేసుకుంది.

వీళ్ళిద్దరినీ చూస్తున్నవాళ్ళు - పెళ్ళానికి సిగ్గు, భర్తకి సరదా ఎక్కువ - లాంటి అర్థాలతో ఆలోచిస్తున్నారు

"అత్తయ్యని, మామయ్యగారిని అందరిని అడిగానని చెప్పు. అన్నట్లు- రెండు రోజులలో లెటర్ రాయటం మర్చిపోకేం" అన్నాడు రామకృష్ణ.

"సిగ్గు లేకపోతే సరి!" అనుకుంది సీత.

అంతలోనే ఏదో గుర్తుకొచ్చిన వాడిలా రామకృష్ణ అటు పరుగెత్తా డు

అంత కంగారుగా రామకృష్ణ అటువేపు ఎందుకు వెళ్ళాడో సీతామనోహరికి అర్ధం కాలేదు. కిటికీ చువ్వలకి తల ఆన్చి చూస్తే కొంతవరకే ప్లా ట్ ఫాం కనపడింది. కనపడినంతలో రామకృష్ణ కానరాలేదు.

రామకృష్ణ ఎక్కడికీ వెళ్ళినట్లు?

ట్రైన్ బయలుదేరబోతున్నట్లు గా కూత వేసింది.

రామకృష్ణ రాలేదు.

సీతకి అయోమయం అయింది.

రామకృష్ణ ఎక్కడికీ వెళ్ళినట్లు?

మరోసారి కూతపెట్టి ట్రైన్ బయలుదేరింది.

అప్పుడు -

రామకృష్ణ ఎక్కడినుంచో దూసుకొచ్చాడు.

సీతకి ఎందుకో తెలియని ఆనందం కలిగింది.

"నీకు పుస్తకాలంటే యిష్టం కదా! ఆ విషయం గుర్తుకొచ్చింది. ఒంటరి ప్రయాణం మహాబోర్ కదా సీతూ! అందుకే పరుగెత్తా ను. హిగిమ్ బాదమ్స్ ఆ మూల వుంది. నీ పత్రికలు తెచ్చాను. సరే నేను వుంటాను. తొందరగా వచ్చేయి. జాగ్రత్త. టా టా చీరియో....." బండితో పాటే పరుగు లాంటి నడకతో నడుస్తు న్న రామకృష్ణ ట్రైన్ వేగం పుంజుకోవడంతో కిటికీని వదిలేసి దూరంగా జరిగి చేయి ఊపుతూ వుండిపోయాడు.

అప్పుడు తల ఎత్తి చూసింది సీత.

దూరంగా దూర దూరంగా గాలిలో చేయి వూపుతూ వంటరిగా నిలిచిన రామకృష్ణ.

ఏదో స్పందన.

ఏదో అలజడి.

మరేదో తెలియని భావం.

అదేదో కానరాని బాధ.

సీత హృదయం ఏ మూలనో చిన్నగా మూలిగింది.

సీత కిటికీలోంచి బయటికి చేయి పోనిచ్చి టాటా చేపుదామనుకుంది.

కాని-

సీత అలాంటి పని ఏది చెయ్యలేదు.

ట్రైన్ ప్లాట్‌ఫాం దాటింది.

రామకృష్ణ యింక కనిపించడు.

ఎందుకో

సీతకి తెలియకుండానే

సీత కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

## 19

"పిచ్చిపిల్లా!" అంది ఎదుటి సీట్లో ఆవిడ.

సీత వింది కాని తనని కాదనుకుంది.

"మీ ఆయనని వదిలి యిదే మొదటిసారా పుట్టింటికి వెళ్ళటం?" ఆమె ఆప్యాయంగా అడిగింది.

అప్పుడు గ్రహించింది సీత ఆమె మాట్లాడుతున్నది తనతోనే అని. వెంటనే తల మాత్రం వూపింది.

"కళ్ళు తుడుచుకోమ్మా!" అంది మళ్ళీ ఆమె.

అప్పుడు గ్రహించింది సీత. తన కళ్ళ నిండుగా కన్నీరు వుబికినట్లు సిగ్గుపడి గబుక్కున కర్ చీఫ్ తో

కళ్ళద్దు కుంది.

"పిచ్చిపిల్లా! ఇది సహజం. మీ ఆయన చూశావా! ఎన్ని జాగ్రత్తలు చెప్పాడో! మగవాడంటే అలా వుండాలి. ప్రయాణంలో తోచదని పుస్తకాలు తినటానికి పదార్థాలు ఎంత శ్రద్ధగా తెచ్చాడో!" అంది ఆమె.

సీతకి ఏమి మాట్లా డాలో తెలియలేదు.

"మా అల్లు డూ వున్నాడు" అంది వున్నట్లు ండి ఒకామె.

"ఏమిటి?" అంది యివతలి ఆవిడ.

"మా అమ్మాయి సువర్ణ రేఖ......

ఇవతలి ఆమెతోపాటు సీత కూడా ఆ పిల్లని చూశారు.

సువర్ణరేఖ అనబడే ఆ అమ్మాయి చామనచాయ రంగుతో బొద్దు గా వుంది. అమాయకురాలిలా అనిపిస్తు న్నది ముఖం వున్నంతలో కళగానే వుంది.

"కొత్తగా పెళ్లయిందా?" ఆమె అడిగింది.

"ఆ..... పెళ్ళి కార్యం కాపురం అన్నీ అయాయి. మూడు నెలలు అయింది. అల్లు డో పేచీకోరు పెద్దమ్మ. ఇదా నోట్లో నాలుక లేనిది. నల్లగా వుంటావు లావుగా వుంటావు అంటూ అదే పనిగా ఏడిపిస్తు ంటాడు"

ఆమె మాట పూర్తి చేసిందో లేదో వెంటనే సీత అందుకుంది.

"మీ అల్లు డుచదువుకోలేదా?"

"ఎమ్మే చదివాడు. మంచి ఉద్యోగమే చేస్తు న్నాడు."

"పెళ్ళికి ముందు మీ అమ్మాయిని చూడలేదా?"

"అదేమిటమ్మా! చూశాడు మాట్లా డించాడు ఆ తర్వాతనే పెళ్ళి చేసుకున్నాడు."

"మరి పెళ్ళికి ముందు చూసినప్పుడు కళ్ళేమయాయిట? అదే మీరు అడగాల్సింది. చామనఛాయగా వుండటం నలుపు కింద వస్తు ందా? బొద్దు గా వుండటం లావుకింద కోస్తు ందా? మీ అమ్మాయి చూడండి ఎంత కళగా వుందో. మీ అల్లు డుపల్లె టూరిమొద్దు కాదు. సంస్కారం లేని చదువెందుకు? అతనలా మాట్లా డుతుంటే మీరెలా వూరుకున్నారు? అడగాల్సింది. చూసి పెళ్ళి చేసుకున్నావు కదా అని......" సీత రవంత ఆవేశంగ అంది.

"అయ్యో అంత యోగ్యత కూడానా?" ఆమె నిట్టూ ర్చింది.

"అంటే?" సీతకి అర్థం కాలేదు.

"ఉత్త మూడుడు. చదువుకున్న మూడుడితో ఏం మాట్లా డుతాము! అదేంటి బాబూ! చూసే చేసుకున్నావు కదా అని మా ఆయన మామూలుగా అన్నారు. అది తప్పోచ్చింది. నాకు కళ్ళు లేవని ఎక్కిరింప? అని ధాం ధూం అని లేచాడు. ఓ మాట ఎక్కువ మాట్లా డితే తప్పు తక్కువ మాట్లా డితే తప్పు. ఇది నోట్లో నాలుక లేని పిల్ల. ఏదన్నా కావాలన్నా కోరిక వున్నా నోరు తెరిచి అడగదు. బాధ వున్నా చెప్పదు. దీని మనసెరిగి యువతలి వాళ్ళు మెలగాల్సిందే. అల్లు డాతన సౌఖ్యాలు చూసుకునే మూడుడు. అప్పుడేమో నాతో పంపిస్తు న్నాడు మీ అమ్మాయిని సగానికి లావు తగ్గించి పంపించండి నా దగ్గరకు అని చెప్పాడు. ఎలాగో ఏమో?" ఆమె చెప్పుకుని వాపోయింది.

"చదువుకున్న వింత పసువు, సంస్కారం లేని మూడుడు." అనుకున్న సీత "ఇప్పుడు మీరేం చేయబోతున్నారని అడిగింది."

"ఏముంది. పండక్కి పిలిచి అతనికి ఏం కావాలో తెలుసుకుని రెండు వేలో మూడు వేలో పారేసి ఏదో వక

వస్తువుకొనిస్తే సరి."

"అప్పుడు మీ అమ్మాయి లావు తగ్గకపోయినా ఫరవాలేదు?"

"తాత్కాలికంగ ఫరవాలేదు. ఆడదాని బతుకు ఆనాడు ఈనాడు యింతే."

ఆమె ఆ మాట అనంగానే అక్కడున్న ఆడవాళ్ళు నలుగురూ ఈ కాలం అమ్మాయిల కధలు తాము విన్నవి కన్నవి చెప్పటం కాలక్షేపంగ చెప్పుకోటం మొదలుపెట్టారు.

సీత ఆ వింతకధలు ఆశ్చర్యంగ వింటూ కూర్చుంది.

ఆ తర్వాత మధ్య మధ్య వచ్చే స్టేషన్లలో రైలు ఎక్కేవారు దిగేవారు కొత్తవాళ్ళు చోటు చేసుకున్నారు. సీత ఎదుటి సీట్లో కూర్చున్న ఆవిడకూడా దిగిపోయింది. ఆ తర్వాత వచ్చిన వాళ్ళవల్ల కొత్త కబుర్లు కాలక్షేపం లాంటివి సీతకి కలగలేదు.

మధ్యలో పదకొండు గంటలవేళ భర్త కొని యిచ్చిన బ్రెడ్, సోమాసీలు, పళ్ళు తిని కడుపునిండా మంచినీళ్ళు తాగింది. ప్రాణం హాయిగా అనిపించింది సీతకి తన భర్తకి ఎంత ముందు చూపు ఎంత శ్రద్ధ అనుకుంది. అలా అనుకోకుండా వుండాలనుకుంది గాని మాయదారి మనసు వూరుకోలేదు.

రామకృష్ణ ఒక కవరులో అయిదొందలు పెట్టి దానిలో బుల్లి కాగితం మీద రాసిపెట్టాడు. "సీతూ! నీ అవసరాలకి హాయిగా యదేచ్ఛగా వాడుకో, నీ రా.కి."

ఆ కవరుని పళ్ళు పెట్టిన కవరులో పెట్టాడు తెలివిగ.

నోట్లో వున్న కవరుని పెట్టెలోపెట్టి నవల అందుకుంది. సీత. ఆ తర్వాత సీత పరిసరాలు మర్చిపోయి నవలా పఠనంలో మునిగిపోయింది.

నవల చదవటం పూర్తికావటం, సీత దిగాల్సిన స్టేషను రావటం టైము సరీగ సరిపోయింది.

సీత పెట్టె తీసుకుని వాటర్ బాటిల్ చేతబుచ్చుకుని రైలు దిగింది.

అప్పుడు టైము రెండు పది.

తను వంటరిగ పుట్టింటికి రావటం మంచిదా?

దీనిలో మంచి చెడు ఏముంది? ఆడపిల్ల వంటరిగ పుట్టింటికి రాకూడదా?

జరిగిన సంగతి తల్లితండ్రులకి చెప్పాలా అక్కరలేదా?

కాసేపు ఆలోచించింది సీత.

ఈ సంగతి తల్లి తండ్రికి చెప్పకూడదు. ఏదో వకటి నోటికొచ్చింది చెపితే సరి..... అనుకుంది సీత.

స్టేషనులోంచి బైటికి వచ్చి రిక్షా ఎక్కింది సీత.

రిక్షా స్టేషను నుంచి ఊరి వేపు సాగింది.

సీత పుట్టింటికి వచ్చి సరిగా వారం అయింది.

రామకృష్ణ వెంటనే వేయి క్షమాపణలు పదేవేల ముద్దులతో ఓ లెటర్ రాస్తాడనుకుంది.

ఈ వారం రోజుల్లో రామకృష్ణ నుంచి లెటర్ లేదు. ఇహ ముందు సంగతి తెలియదు.

"వారు ఆఫీసు పనిమీద డిల్లీ వెళ్లారు. ఎలా చూసినా రెండు మూడు వారాలు పట్టొచ్చు. ఇంకా ఆలశ్యం

అయితే లెటర్ రాస్తానన్నారు" అలా అబద్ధం ఆడింది సీత.

"పోనీలేమ్మా, మంచిపని చేశావు నీవైనా వచ్చావు." అంటూ తల్లి సక్కుబాయమ్మ సంతోషించింది.

సీత తండ్రి రావుగారు గతంలో గొప్ప సంఘ సంస్కర్త. ఇప్పుడు కాదని కాదు ఈ రోజుల్లో చాలామంది సంఘసంస్కర్తలు కీర్తికోసం తప్ప మనసావాచా వాళ్ళు సంఘం కోసం ఏమీ చేయటం లేదని వాళ్ళ ఆదర్శాలు నేతి బీరకాయలో నెయ్యిలాంటిదని గ్రహించి రావుగారు మందితో కలవటం మానేశారు. పైగా వయసు కూడా పెరిగి ఓపిక తగ్గింది. తన పరిధి వరకు ఆదర్శంగాను తన వరకు నీతి నిజాయితీగ వుంటున్నారు. ఎదుటివారి నెత్తిన బండరాయి వెయ్యకపోవటం కూడా మంచితనంలో ఓ భాగమే.

ఉద్యోగాలు, పెళ్ళిళ్ళతో చూడటానికి సీత బ్రదర్స్ సిస్టర్స్ తలో వూళ్ళో వున్నారు. ఇంటి పట్టున వున్నది రావుగారు, సక్కుబాయమ్మ.

"మా కాపురం చూడటానికి రమ్మంటూ అన్నీ ఉత్తరాలు రాశావా! బైలుదేరదామంటే ఒక్కరోజు కుదరలేదు" అంది సక్కుబాయమ్మ.

"నీకు ఎప్పుడు కుదురుతుందమ్మా! ఎప్పుడూ కుదరదు ఇల్లే స్వర్గం. ఈ ఇంట్లో పనిలేని రోజు ఎప్పుడు!" అంది సీత.

"పెట్టె అమ్మ సిద్ధంగా వున్నా తినే అమ్మకి యోగ్యత ఉండొద్దా అని ఓ సామెత. నా పని అలా శనివారం బీద విద్యార్థుల సంఘానికి వంటచేసి పంపించాలా. సోమ మంగళ వారాలు వారాలబ్బాయిలు మనింట్లో భోజనానికి వస్తారా, బుధ గురు వారాలు......

"ఇది నాకు తెలిసిందే కదమ్మా! ఆదివారం తప్ప అన్నిరోజులూ నీకుపనే. పననేది ఎప్పుడూ వుండేదే వీలు చేసుకోవాలి. వీలుచేసుకోటం అన్నది మన చేతిలో పనేగా!" తల్లి మాటలకి మధ్యలో అడ్డుతగిలి సీత అంది.

"బాగా చెప్పావు మనూ!" అన్నారు రావుగారు. ఆయన కూతురుని "మనూ" అనే పిలుస్తారు.

"నేను ఏం చెప్పినా నవ్వులాటగానే వుంటుంది. మీ తండ్రీ కూతుళ్ళకి" నవ్వుతూ అంది సక్కుబాయమ్మ.

"కాదా మరి..... నాలుగురోజులు నేను యిల్లు చూసుకుంటాను, నీవెళ్లిరా ఎక్కడికైనా అంటే వినదు కదా ఈ సతీ సక్కుబాయి!" రావుగారు అన్నారు.

"మీరు చెప్పేది ఏమన్నా అర్థం వుందా? అవ్వ! మిమ్మల్ని వదిలి నేనొక్కదానిని వెళ్ళి, హాయిగా విశ్రాంతి తీసుకుని రానా! నాకంత స్వార్థం లేదు. ఇల్లు కదిలితే ఇద్దరం కలిసి కదలాలి. లేకపోతే లేదు."

"అదే పనికిరాదన్నాను!" రావుగారన్నారు.

"మీ అంత స్వార్థపరులు ఎక్కడా వుండరు!" అంది సక్కుబాయమ్మ వెంటనే.

"నాన్నగారికి స్వార్థమా?" సీత తెల్లబోయింది.

"ఆ విషయం మీ నాన్నగారినే అడుగు."

"ఏమిటి నాన్నగారూ! అమ్మ అలా అంటున్నది?"

"ఓసారి మాటల సందర్భంలో మీ అమ్మ ఈ సామెత చెప్పింది మనూ! రాజుగారికి ఊరంతా లోకువ అయితే- రాణిగారికి రాజుగారు లోకువట. అలా..... నీవే అర్థం చేసుకో మనూ!" నవ్వుతూ చెప్పారు రావుగారు.

"అంటే ఊరందరూ మిమ్మల్ని మెచ్చుకుంటుంటే, అమ్మ మిమ్మల్ని......"

"మెచ్చుకోటంలేదు. తీసేస్తు న్నది"

"మీ ఇష్టం - మీరెలా అనుకున్నా సరే. నన్ను రెస్ట్ తీసుకోమంటారు. పిల్లల దగ్గరకు వెళ్ళి నాలుగురోజులు

వుండిరా అంటారు. అక్కడికి వారేమో సంఘసేవంటూ కష్టపడాలి, నేనేమో చేతులు కట్టుకు కూర్చోవాలి. ఇదేమన్నా సమంజసంగా వుందా? నేను నా భర్తసేవ చేసుకుంటున్నాను. దీనిలో స్వార్థం ఏముంది? ఇది తప్పేమో ఎవరినయినా యిలా వచ్చి చెప్పమనండి."

"పతి సేవలాంటి మాటలు వాడకు సక్కూ! అమ్మాయి యిక్కడే వుంది. ఈ చాదస్తాల నుంచి అమ్మని మార్చలేకపోయారేమిటి నాన్నగారూ! అంటుంది."

"ఏమీ అనదు. ఆడదాని మెడలో ఆ మూడుముళ్ళు పడ్డ తర్వాత పతి క్షేమమే చూస్తుంది ఏ స్త్రీ అయినా అంతే మన అమ్మాయి విషయమే చూడండి. ఒక్కసారి వచ్చిపోమ్మా, నిన్ను చూడాలని వుందంటే- నే వస్తే మావారికి ఇబ్బంది అని లెటర్స్ తిరిగి రాసింది అసలు మీ తండ్రీ కూతురికి అన్నీ వేళాకోళాలే. నేను, అల్లుడు నోట్లో నాలుక లేనివాళ్ళం దొరికాము కాబట్టి మీరు ఆడింది ఆటగాపాడింది పాటగా సాగుతున్నది." ముచ్చటగా మూతి తిప్పుతూ మురిపెంగా చెప్పింది సక్కుబాయమ్మ.

"నేను, నా కూతురు ఒక పార్టీ!" రావుగారు గొప్పగా అన్నారు.

"నేనన్నది అదేగా!" అంది సక్కుబాయమ్మ.

"మీ అల్లుడికి నోట్లో నాలుక లేదా అమ్మో" ఆశ్చర్యంగా సీత అడిగింది.

"నేను మెతక గాబట్టి, మీ నాన్నగారి ఆటలు, అల్లుడు మంచివాడు కాబట్టి నీ ఆటలు సాగుతున్నాయి" అంది సక్కుబాయమ్మ. ఆమె ఎంత తల్లి అయినా - సీత నోటితొందర, రామకృష్ణ నిదానం తెలుసు.

"చూడండి నాన్నగారు! అమ్మ ఏమంటుందో!" సీత ముద్దుగా ఫిర్యాదు చేసింది

"మనూ! ముందే చెప్పా కదా! అత్తా అల్లుడికి మనిద్దరం లోకువ అని... ఏం చేస్తాం, మనం మంచివాళ్ళమి కాబట్టి పడదాం" అన్న రావుగారు అంతలోనే ప్లేటుమార్చి రామకృష్ణ ఈ కాలంవాడు కాదని..... ఏ దురలవాట్లు లేనివాడని..... బుద్ధిమంతుడని.... ఆదర్శ పురుషుడు అలాగే వుంటాడని..... అదని.....ఇదని.....పొగడటం మొదలుపెట్టాడు.

తానాకి తంధాన అన్నట్లు సక్కుబాయమ్మ కూడా రామకృష్ణ అప్పుడు అట్లా ఇప్పుడు యిట్లా అంటూ పొగిడింది. తల్లీ తండ్రీ కలిసి అల్లుడిని పోటాపోటీగా పొగుడుతుంటే సీత పెదవి కోరుక్కోటం తప్ప ఏమీ చేయలేకపోయింది. వాళ్లకి "మీ అల్లుడు యిట్లా రెండుసార్లు తాగి వచ్చారు బోలెడు అబద్ధాలు ఆడారు" అని చెప్పలేకపోయింది. పైగా వాళ్ళ తీరు ఎలా వుందంటే - తను చెప్పినా నమ్మకపోగా, నవ్వుతారనిపించింది.

ప్రతిరోజూ సీతామనోహరి ఇంట్లో ఫార్స్ చూస్తూనే వుంది మాటల మధ్యలో అటుతిరిగి. ఇటుతిరిగి రామకృష్ణ ప్రసక్తి వచ్చేది. అతడిని ఇంద్రుడు, చంద్రుడు అని పొగిడే వాళ్ళు.

సీతకి ఒళ్లు మండేది. అయితే ఆ ఒళ్లు మంట ఎవరిమీద చూపిస్తుండి నోరుమూసుకోటం తప్పించి.

మాటల సందర్భంలో సక్కుబాయమ్మ చెప్పింది.

"నూటికి తొంభైతొమ్మిది మంది భార్యాభర్తల గుణాలు వేరుగా వుంటాయి. ఒకరు ఎడ్డెం అంటే రెండోవారు తెడ్డెం అంటారు. అక్కడే మొదలవుతుంది హాలాహలం. దానిలోంచే పుడుతుంది అమృతం. అక్కడితో భార్యాభర్తలది విడదీయరాని మధురానుబంధం అవుతుంది."

తల్లీ చెప్పిన మాటలో సరి అయిన అర్థం సీతకి బొత్తిగా అర్థం కాలేదు. కాని ఆమె మరో విషయం చెప్పినప్పుడు ఏదో చూచాయగా అర్థం అయినట్లే అనిపించింది

"నేను కాపురానికి వచ్చిన మొదట్లో మీ నాన్నగారు చేసే ప్రతి పనీ నాకు ఒళ్లు మండేది దగాపడిన చెల్లెళ్ళు తమ్ముళ్ళు అనుకుంటూ ఊరిని ఉద్ధరించకపోతేనేమి? ఎవరి యిది వాళ్ళు చూసుకోలేరా? - అనేదాన్ని. అప్పుడు మీ నాన్నగారు "సక్కూ! ఎవరినో ఏదో ఆశించి నేని అనులు చేయటం లేదు. కాంక్ష నాకంతకన్నా లేదు. నా మనసుకి మంచి అనిపించింది నేను చేస్తున్నాను - అంతే. నాకెందుకు అని మహాత్ముడు లాంటి వాళ్ళు చేతులు ముడుచుకు కూర్చుంటే మనకి స్వాతంత్రం వచ్చేదా?" అని అర్థమయేటట్లు చెప్పేవారు పైగా తనలాగే నన్నూ వుండమని బలవంతం చేసేవారు కాదు, బాధ పెట్టేవారు కాదు. మొదట్లో పట్టించుకోకుండా వున్న నేను మీ నాన్నగారు మనసా వాచా చేస్తున్న కృషికి

ముగ్ధురాలినై, నా అంతట నేనుగా వారి కష్టసుఖంలో పాలు పంచుకున్నాను. మొదట్లో వారి మాట కాదన్నా కదా - అది పట్టుకుని వారు యిప్పుడు తమాషాగా వేళాకోళం చెయ్యటం. అదే నీవు వింటున్నది."

తల్లి చెప్పింది సీతకి కాస్త అర్ధమయీ, కానట్లు అనిపించింది.

దీనిని అర్ధంచేసుకుని కలసిపోవడం అంటారా!

అలా అలా అలవాటు పడిపోవడం అంటారా!

ఈ లెక్కన -

రామకృష్ణ పదిసార్లు తాగి వచ్చిం తరువాత - ఇది వారికి మామూలే అని సరిపెట్టుకోగలుగుతుందా తను! అది వారి అలవాటు అని సర్దుకోగలదా తను! ఊహు, ఇదే విషయం అయితే తను ఎప్పటికి సర్దుకోలేదు. అది వారి అలవాటులే! అని తను మామూలుగా వుండటానికి ఎప్పటికీ అలవాటు పడలేదు.

ఇలా అనుకోగానే సీతకి తృప్తిగా అనిపించింది.

అలా అనుకోగానే, తను అందరిలాంటి దానిని కానని కూడా అనిపించింది.

ఎవరి పిచ్చి వారికి ఆనందం.

ఆ నిమిషాన ఆ విషయం గుర్తుకు రాలేదు సీతామనోహరికి

సౌజన్య అయిదు గంటలవేళ దారుణంగా మరణించింది.

సౌజన్య సీతామనోహరికి బాగా తెలిసిన ఆ వీధిలో వుండే సాంబశివరావుగారి అమ్మాయి.

సౌజన్య మరణం సీతకి షాక్ లా తగిలింది.

సౌజన్య మరణం సహజమయింది కాదు. ఆమె భర్త, అత్త కలసి హత్య చేశారు. ఆమెని చంపి హాయిగా తిరుగుతున్నారు. అది తెలిసి షాక్ తిన్నట్లు ఫీలయింది సీత.

సాంబశివరావు పదివేలు కట్నం మాట్లాడుకుని సౌజన్యను సుగుణాకరరావుకిచ్చి పెళ్ళి చేశాడు. వాళ్ళు ఇరవై వేలు కట్నం అడిగితే, పదివేలకి చివరికి బేరం కుదిరింది. పెళ్ళి అయిం తరువాత ఆ పదివేలు కూడా మామగారి దగ్గరనుంచి లాగటానికి సౌజన్యను చీటికిమాటికి కొట్టి, పుట్టింటికి పంపించేవాడు. పుట్టింటివాళ్ళు డబ్బు ఇచ్చుకోలేక, చిన్న కానుకలని సౌజన్యను తీసుకుని మళ్ళి అక్కడికి వెళ్ళి అతడి కాళ్ళు, గడ్డం పుచ్చుకు బతిమిలాడి అత్తారింట్లో దిగడ్చి వచ్చేవారు. నాలుగు రోజులు ఆగంగానే మళ్ళి మామూలే.

"నీవు డబ్బు తేలేవు - మీ అయ్యా ఇవ్వడు కనుక ఓ శుభముహూర్తాన నీ పీక నులిమాననుకో - నీ అడ్డు నాకు తొలుగుతుంది. నీ అబ్బకి విముక్తి కలుగుతుంది. నేను మళ్ళి ఇరవై వేల కట్నంతో పెళ్ళి చేసుకోవచ్చు." అని సుగుణాకరరావు అనేవాడట. ఈ విషయం తండ్రితో చెప్పి "ఎప్పుడో మా ఆయన, అత్త కలిసి నన్ను చంపుతారు. ఆ రాక్షసుల మధ్య నేనుండలేను నాన్నా! నేను అత్తారింటికి వెళ్ళను. మీకు భారం కాకుండా వుండటానికి నేను ఏదో ఒక పని చేసి నాలుగు డబ్బులు సంపాదిస్తాను" అని సౌజన్య తండ్రి దగ్గర కళ్ళనీళ్ళు పెట్టుకునేదట.

"మొగుడు వదిలేసిన ఆడదానికన్నా రవంత విలువ వుంటుందేమో గాని - మొగుడిని వదిలేసిన ఆడదానికి అసలు విలువ వుండదు. నాలుగు రోజులుపోతే అతనే మారుతాడు. ఓ పిల్లో, పిల్లాడో పుడితే అన్నీ అవే సర్దుకుంటాయని చెప్పి, సౌజన్యని భర్త దగ్గర విడచి వచ్చేవారుట.

అసలు విషయం - సాంబశివరావు లోకానికి వెరసి కాదు ఇంట్లో పెళ్ళికెదిగిన మరో ఇద్దరు కూతుళ్ళు వుండటంతో - ఈ కూతురు భారం కూడా ఎక్కడ వహిస్తానని భయపడి ఒకటి - సౌజన్య భర్తని వదిలేసింది కాబట్టి, తతిమా కూతుళ్ళకి పెళ్ళి అవుతుందో, కాదో నన్న భీతి మరొకటి. దానా దీనా సౌజన్యకి నచ్చజెప్పి అత్తా రింటికి పంపించేవాడు.

ఏం జరిగిందన్నది ఎవరికీ తెలియదు. ఆ రోజు స్టౌ మీద పాలు పెట్టి ఇటు తిరిగిందట. పైట చెంగుకి మంట అంటుకుందిట. కట్టుకున్న చీర నైలేక్స్ ది కావటం వల్ల చీర లాగినా రాక, శరీరానికి అతుక్కుపోయి - దాంతో సౌజన్యకి ఒళ్ళంతా కాలి, అప్పటికప్పుడే చనిపోయిందట.

సుగుణాకరరావు, అతని తల్లి కలసి సౌజన్యని చంపారా?

కావచ్చు-

కాకపోనూ వచ్చు-

కాని-

ఇది మాత్రం జరిగింది. సౌజన్య తల్లి, తండ్రికి తెలిసి ఆ వూరు వెళ్లేసరికి సౌజన్య అంత్యక్రియలు కూడా అయిపోయాయి. నేరస్తులని పట్టటంలో పోలీసు కుక్కలకన్నా పోలీసులు వెయ్యిరెట్లు నయం. వాసన పసిగట్టేసి వచ్చి వాలారు. సుగుణాకరరావు వాళ్ళ చేతులు తడిపాడట. మనకెందుకు వచ్చిన గోల అని ఇరుగు పొరుగు తెలిసిన సంగతులు దాచారు.

ఇదిగాక -

నాన్నా!

రోజు రోజుకీ మావారు పెట్టె బాధలు, అత్తగారి ఆరళ్ళు శ్రుతిమించుతున్నాయి. వీళ్ళు నన్ను చంపేస్తారు. నాచావు వార్త మీకు త్వరలో అందోచ్చు......

అంటూ సౌజన్య స్వయంగా రాసిన లెటరు రెండు రోజులక్రితం సాంబశివరావుకి అందింది.

అది చాలు-

సుగుణాకరరావు పీకకి ఉరితాడులా మారటానికి.

కాని-

సాంబశివరావు ఆ లెటర్ ని పోలీసులకి చూపలేదు. తిమ్మిని బొమ్మిచేయటం ఎర్రటోపిలకి చాలా తేలిక విషయం. వాళ్ళ దగ్గరకు వెళ్ళినందుకు న్యాయం జరక్కపోగా, చేతులు చాచి తడపమంటారు. తనా తడిపే స్థితిలో లేడు పైగా అలా చేయకపోతే వాళ్ళ చుట్టూ తిరిగే గోల అంటూ వుంటుంది కాబట్టి టైం వేస్ట్ - చివరికి ఫలితం అణుమాత్రం కూడా వుండదు. పోయిన కూతురు ఎలానూ తిరిగి రాదు. ఖర్మ అలా కాలింది- మా రాత యిలా తగలబడింది.

సాంబశివరావు ఖర్మసిద్ధాంతం చెప్పి-చేతులు ముడుచుకుని ఓ ఏడ్పు ఏడ్చి వూరుకున్నాడు.

ఈ విషయం మొత్తం సీతామనోహరికి తెలిసింది.

సౌజన్య మరణం కన్నా సౌజన్య మరణం తర్వాత ఏం జరిగిందన్నది సీతకి షాక్ లా తగిలింది.

"ఒక మనిషిని బతికుండగానే నిలువునా కాల్చి చంపితే మనం చూస్తూ మిన్నకుండటమేనా నాన్నగారూ!" సీత ఆవేదనగా అడిగింది.

"కాలం మారింది కాని పనులలో తలదూరి తలలు బొప్పికట్టటం తప్ప కించిత్ ప్రయోజనం లేదు." అక్కడే వున్న సక్కుబాయమ్మ వెంటనే అంది.

రావుగారు మాట్లాడలేదు మిన్నకుండిపోయారు.

"ఏమిటి నాన్నగారూ, మాట్లాడరు?" సీత రెట్టించి అడిగింది.

"న్యాయం జరగనప్పుడు, న్యాయం జరగదని తెలిసినప్పుడు ఎలుగెత్తి అరచినా లాభంలేదు తల్లీ!" రావుగారు నిట్టూరుస్తూ చెప్పారు

సీత ఆశ్చర్యపోయింది.

"మీరేనా నాన్నగారూ, ఈ మాట అన్నది?"

తల తాటించింది రావుగారు.

"మీనుంచి యిలాంటి సమాధానం వస్తుందనుకోలేదు నాన్నగారు!"

వెంటనే సక్కుబాయమ్మ అంది- "మీ నాన్నగారు మటుకు ఏం చేస్తారమ్మ అంది- "మీ నాన్నగారు మటుకు ఏం చేస్తారమ్మా! ఇలాంటి కేసుల్లో ఈ మధ్య రెండింటిలో తల దూర్చారు న్యాయం జరక్కపోగా - 'మీకెందుకండీ మా విషయం?' అంటూ ఎదురు పోట్లాటకి సిద్ధం అయారు"

"అందుకని మనం మాట్లాడకుండా కూర్చుంటామా! ఇదేనా సంఘసేవ?"

"మనూ! సంఘం కూడా సహకరించినప్పుడే సంఘసేవ సాధ్యం అవుతుంది."

"లేదు నాన్నగారూ! మీరు మాట దాట వేస్తున్నారు ఒకతనికి వ్యాధి వచ్చింది. డాక్టర్ ఇంజక్షన్ ఇస్తానంటాడు. రోగి చావు బతుకుల మధ్య వుండి కూడా, భయంతో ఇంజక్షన్ వద్దని గోల చేస్తాడు. అప్పుడా డాక్టర్ రోగి మాట వినాలా - నయానో భయానో నచ్చజెప్పి, ఆ రోగికి ఇంజక్షన్ యివ్వాలా?"

"రోగి కాళ్ళు చేతులూ కట్టివేసి అయినా సరే - డాక్టరు ఇంజక్షన్ ఇవ్వాల్సిందే!" రావుగారు నవ్వుతూ అన్నారు.

సీత ముఖం విప్పారింది.

"సరి అయిన న్యాయం చెప్పారు నాన్నగారూ! మరి సంఘం కుళ్ళినప్పుడు- ఆ కుళ్ళు సంఘాన్ని కడిగేసే పని సంఘ సంస్కర్త చేయొద్దా?"

"చేయాలి."

"మరి......మరి....."

"మనూ! నీ అనుమానం నాకర్థమయింది. డాక్టరు దగ్గరకు రోగి అయినా వెళ్ళాలి - తీసుకెళ్ళనయినా తీసుకెళ్ళాలి. అప్పుడు ఆ డాక్టర్ ట్రీట్ మెంట్ చేయడానికి వీలవుతుంది....."

"డాక్టరు, సంఘసేవకుడు ఒకరేనా?"

"ఒకవిధంగా అవును, మరోవిధంగా కాదు. నిజం చెప్పాలంటే - ఇదివరకు ఈ కుళ్ళు సంఘాన్ని కడగాలంటే నీళ్ళు ఫ్రెష్ గా వుండేవి ఇప్పుడు కుళ్ళిపోయి, దుర్గంధభరితమయిన సంఘాన్ని కడగాలంటే నీళ్ళు కరువయ్యాయి. నీళ్ళు అనే న్యాయం విషపూరితమయినప్పుడు, విషంతో కుళ్ళుని కడిగితే జరిగేది ఏమిటి? ఆలోచించు మనూ! బాగా ఆలోచించు!" రావుగారు శాంతగంభీర స్వరంతో అన్నారు.

సీత ఆలోచనలో పడింది.

"నాన్నగారూ!" కొద్దిసేపు ఆగి సీత పిలిచింది.

"ఏమిటమ్మా?"

"మరి..... మరి....."

"అలా నాన్చకూడదు. ఏదయినా అనుమానం వస్తే అడగటమే మంచిది."

"సౌజన్య పరిస్థితి నాకే వచ్చిందనుకోండి!...."

"రాదు!"

"ఒవేళ వస్తే?"

"నీవు ఎదిరించి నిలవగలవు. ఈ ఇంట్లో స్థానం లేదని చెపితే, నీ బ్రతుకు నీవు బ్రతకగల శక్తి వుంది ఆ పని సౌజన్య చేయలేకపోయింది. మాట బలానికి కూడా ఆమె పక్క ఎవరూ లేకపోయారు సౌజన్య స్థానంలో నీవుండి, నీ కష్టం నాతో వచ్చి చెప్పుకున్నావనుకో - నా స్వార్థం చూసుకుని నిన్ను తరమను. అదీగాక......"

రావుగారు చెప్పుకుపోతుంటే, సక్కుబాయమ్మ అడ్డుతగిలింది- "ఏదో జరిగితే ఏమిటి అన్నమాటలు అనవసరంగా ఇప్పుడు దేనికి? ఏమీ తోచకపోతేసరి- ఆ దరిద్రుడు సుగుణాకరరావుకి, రత్నం లాంటి రామకృష్ణకి పోలికేమిటి? చాలించండి!" విసుక్కుంటూ అంది.

రావుగారు నవ్వారు.

అనవసరం విషయాలు మాట్లాడి తల్లిని బాధపెట్టటం దేనికని - సీత యింక ఆ విషయం వదిలేసింది.

ఆ తర్వాత ముగ్గురూ వేరే విషయాలు మాట్లాడుకుంటూ వుండిపోయారు.

మూడు వారాలూ మూడు నిమిషాలలాగా గడిచిపోయాయి.

అయితే-

గడిచిపోయింది సీతకి కాదు- వారాలకి.

ఏరోజు కారోజు సీత కళ్ళు కాయలు కాచేలా రామకృష్ణ దగ్గరనుంచి లెటర్ కోసం చూసేది.

కార్డుముక్క కూడా రాయలేదు రామకృష్ణ.

పోనీ సీతామనోహరి భర్తకి ప్రేమలేఖ గాని, యోగక్షేమాలు గాని లెటర్ ద్వారా కోరుకోలేదు, తెలియబర్చలేదు. "తప్పుచేసిన ఆయనకే అంత యిదిగా వుంటే - ఏ తప్పూ చేయని నాకెంత యిదిగా వుండాలి?" కోపంతో వుడికిపోతూ అనుకుంది.

"నేను యింట్లో కూడా లేను ఇంక ఆడింది ఆట - పాడింది పాట. రాత్రింబవళ్ళు అన్నిరకాల సీసాకాయలూ యింటికే తెచ్చుకుని హాయిగా తాగుతూ...." అలా ఆలోచిస్తు న్న సీతకి ఆ సమయంలో ఫుల్ బాటిల్ మందుకోట్టిన దేవదాసులా రామకృష్ణ కనిపించాడు.

పగబట్టిన తాచు కసితో తన తోక తానే కోరుక్కున్నట్లు- సీత కోపం పట్టలేక కసి కసిగా మునిపంటితో పెదవి కొరుక్కుంది.

రోజూ హాయిగా భర్తతో వుండి, ఇప్పుడు యిలా భర్తకి దూరంగా వుండాలంటే సీత మనసుకి యిది యిదిగా, అదేదో గుబులుగా అనిపిస్తు న్నది. భర్త దగ్గరనుంచి లెటర్ రానందుకు మరేదోగా అనిపిస్తు న్నది. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పది అయోమయంగా అనిపిస్తు న్నది. దానా దీనా సీతకి మనసు పిచ్చిగా తయారయింది.

"ఏదో చేయకపోతే నిజంగానే పిచ్చి ఎక్కేటట్లు వుంది" అనుకున్న సీత కాస్త ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది.

ఆ యింట్లో ఒకరికోచ్చిన లెటర్స్ మరొకరు చదివే అలవాటు లేదు. రామకృష్ణ నుంచి ఏ లేటరూ రాకపోయినా వచ్చినట్లు నటిస్తు న్నది సీత ఎవరూ చూడనప్పుడు పోస్ట్ వచ్చినట్లు చెప్పి, లెటర్ చదివినట్లు నటించేది అక్కడి విశేషాలు చెప్పేది.

ఆ రోజు-

"అమ్మా! వారు రావటానికి యింకా టైము వుంది కదా! నాకెమీ తోచటంలేదు సావిత్రి అక్కవాళ్ళ వూరు వెళ్ళి వారం రోజులు వుండి వస్తాను" అంది సీత.

"ఇప్పుడు ఒక్కదానివీ అంతదూరం వెళతావా?" అంది సక్కుబాయమ్మ

"బస్సు ఎక్కి వెళ్ళేదానికి ఏమంత దూరం అమ్మా!" అంది సీత.

"అయితే మాత్రం ఈ పక్కన వుందా చింతపూడి?"

"లేదు అమ్మా! అక్క ఎన్నిసార్లు వాళ్ళ వూరురమ్మంది! మనం వెళ్లామా? పిన్ని, బాబాయి ఇద్దరూ చనిపోయారు, సావిత్రి అక్కకు మాత్రం ఎవరు వున్నారు?"

సక్కుబాయమ్మకి ఏం చెప్పాలో తెలియలేదు. సక్కుబాయమ్మ చెల్లెలుకూతురు సావిత్రి. అయితే వయసులో సావిత్రి సీతకన్నా పెద్దది దాంతో సీత సావిత్రికి చెల్లెలుఅయింది.

చింతపూడి చాలా చిన్న పల్లెటూరు అన్న లాంటి వాళ్ళు పట్నంలో వుంటే అక్కడికి వెళ్లక, చింతపూడి లాంటి చిన్నవూరు సీత వెళదామని అనుకోటంలో పెద్ద వింతేమీ లేదు. సావిత్రి మంచిది. అమాయకురాలు సీత అంటే ప్రాణం పెడుతుంది. వాళ్ళ వూరు రమ్మని వందసార్లు చెప్పింది. మూడు నెలలక్రితం ఓ పెళ్ళిలో కలిశారు.

"మావూరు ఎందుకు వస్తావే సీతా! పల్లెటూరివాళ్ళం. పైగా మేముండేది పల్లెటూరు' అంటూ సావిత్రి నవ్వుతూనే నిష్టూరంగా మాట్లాడింది

"అదేంలేదు అక్కా! ఓరోజు చెప్పాపెట్టకుండా హటాత్తుగా మీ వూరు వస్తాను" అంది సీత.

"మా వూళ్ళో సినిమాలు, షికార్లు వుండవు మరదలు పిల్లా! ముంజకాయలు, వేరుశెనగ గుళ్ళు, పెసరకాయలు, మామిడి తాండ్ర దొరుకుతాయి గాని, ఇడ్లీలు మిరపకాయ బజ్జీలు దొరకవు. ఆ తర్వాత నన్నని లాభంలేదు!" సావిత్రి భర్త పుల్లారావు అన్నాడు.

"మీరు తినేదే నాకు పెట్టండి!" నవ్వుతూ అంది సీత.

"ముందు అన్నమాట నిలబెట్టుకుని మా వూరు వస్తే, మరదలుపిల్లకి ఏదిష్టమో అదే పెడతాను" అన్నాడు పుల్లారావు

పుల్లారావు పేరుకి తగ్గట్లు పుల్లలా వుండడు. పల్లెటూరి మనిషి ముఖం బండగా వుంటుంది. లావుగా, మోటుగా ఉంటాడు. ప్రతి మాటా హాస్యంగా మాట్లాడుతాడు. సావిత్రి అతని పక్కన సుకుమారంగా వుంటుంది. అతనెంత ఎక్కువ మాట్లాడుతాడో, సావిత్రి అంత తక్కువ మాట్లాడుతుంది.

సీత ఎప్పుడూ పల్లెటూరిలో వుండి ఎరుగదు. అందుకే కొత్త ప్రదేశం, కాస్త కాలక్షేపంగానూ వుంటుందని- ఎప్పుడూ వెళ్ళని సావిత్రి యింటికి వెళ్లాలనుకుంది. జరిగింది కాస్త మరచిపోవాలంటే, అక్కడే బాగుంటుంది అనిపించింది.

సీత వెళతానని చెప్పింతరువాత సక్కుబాయమ్మ అంది- "ముందుగా లెటర్ రాసి వెళ్ళటం మంచిది."

"ఊహూ! హటాత్తుగా వెళ్ళి అక్కని ఆనందంలో ముంచాలి. అయినా వాళ్లకి లెటర్ ఎందుకమ్మా! ఉద్యోగం, క్యాంపులు, ఊళ్ళు తిరగటం లాంటివి వాళ్ళకెలాగూ లేవు ఓవేళ నే వెళ్ళిన ముహూర్తబలం అంత గట్టిదై వాళ్ళ ఇంటికి తాళం వేసివుంది అనుకో - తిరుగు టపాలో వచ్చి వాలుతాను." సీత నవ్వుతూ చెప్పింది.

"నీ యిష్టం!" అంది సక్కుబాయమ్మ.

"రేపు ఉదయం బస్సుకి వెళతాను."

"అలాగే. దానికి ఏమన్నా పిండివంటలు చేసి ఇస్తాను" అంది సక్కుబాయమ్మ.

మర్నాడు ప్రయాణానికి సీత అప్పటినుంచే సర్దటం మొదలుపెట్టింది.

## 23

బస్సు దిగి ఊళ్లోకి బయలుదేరింది సీత.

చింతపూడి ఓ మోస్తరు పల్లెటూరు బస్సుస్టాండు లాంటి సౌకర్యాలు బొత్తిగా లేవు. ప్రయాణీకులు బస్సుకోసం రోడ్డుపక్కనున్న చింత చెట్లకింద కూర్చుంటారు. మెయిన్ లైన్ మధ్యలో తగిలే వూరు చింతపూడి కావటంతో అటూ ఇటూ పోయే బస్సు సౌకర్యం ఆ వూరి వాళ్లకి వుంది.

పెట్టె బుట్ట లాంటివి మోసేవాళ్ళు ఆ వూళ్ళో వుంటారో లేదో అని సీత చిన్న సూట్ కేసు హ్యాండ్ బ్యాగ్ మాత్రమే తీసుకుంది.

సక్కుబాయమ్మ రవ్వలడ్లు చెగోడీలు చేసి యిచ్చింది.

సీత బజారులో స్వీట్స్ ప్యాకెట్టు యాపిల్స్ కొంది. తన గుర్తుగ ఎవరికైనా చిన్న చిన్న గిఫ్ట్స్ యివ్వటం సీతకి మహా ఇష్టం. డబ్బాలో డబ్బా దిగే స్టీలు డబ్బాలు కిలో పట్టేటంతవి పైనుంచి కిందకి మూడు తీసుకుంది.

సావిత్రికోసం తీసుకున్న ఈ కొద్ది సరుకు తన చీరలు వగైరా ఓ వారానికి సరిపోను మాత్రమే సర్దుకోవటం వల్ల సీతామనోహరికి లగేజీ బరువు మోయ దగ్గంతలోనే తేలికగా వుంది.

రోడ్డు మీదనుంచి ఊరి దాకా నడవటానికి పది నిమిషాలు పట్టింది. వాతావరణ కాలుష్యం లేకుండా ధ్వని కాలుష్యం అసలు లేకుండా చేలపక్క నుంచి ఊరి దాకా నడుస్తుంటే ఎంతో ప్రశాంతంగ హాయిగా వుంది.

"పుల్లా రావుగారి యిల్లెక్కడండి?" ఓ ముసలాయన ఎదురైతే అడిగింది సీత.

"ఏ పుల్లా రావు?" ఆయన సీతని ఎగాదిగా చూస్తూ అడిగాడు.

"ఆ......ఆ......ఏ. పుల్లా రావుగారి గురించేనా అడిగేది!" సీత ఆతృతగా అంది.

"ఏ పుల్లా రావు?"

"అదేనండి. ఏ పుల్లా రావు గురించేనే అడిగేది."

"ఏ పుల్లా రావు?"

ఈ ముసలాడికి పిచ్చా! లేక ఆటలు పట్టిస్తున్నాడా! నఖశిఖ పర్యంతం అలా పరీక్షగా చూస్తే గాని మాటలు రావా! అనుకుంది సీత.

"ఏంటమ్మాయ్! మాట్లాడవ్! ఏ పుల్లా రావని అడిగితే చెప్పవేమిటి!"

"ఏ పుల్లా రావని ఓ పక్క అంటూ మళ్ళీ ఏ పుల్లా రావని అడుగుతారేమిటి?" సీత విసుగు ప్రదర్శించకుండా అడిగింది.

ఊరుగాని ఊరు. పైగా అనువుగాని చోట అధికులమనరాదు అన్నారు. కొత్త ప్రదేశం కొత్త మనుషులు. అందుకే సీత జాగ్రత్తగా మాట్లాడుతున్నది

"ఇంటిపేరు ఏమిటి?" ఈ కొత్త బుల్లెమ్మకి ఏమీ తెలియదు అనుకుంటూ ముసలాయన తెలివిగ అడిగాడు.

పుల్లారావు ఇంటిపేరు సీతకి సరీగ తెలియదు. ఎ. అని మాత్రమే తెలుసు. ఆముదాలవారో అలచందలవారో మొత్తానికి అలాంటి పేరే.

"సరీగ తెలియదండీ! ఎ. అని మాత్రం తెలుసు."

"ఎ. అంటే ఏమిటని.....?"

"అదేకదండీ సరీగ తెలియదనటం? ఇంగ్లీషులో పొడి అక్షరం ఎ అని వస్తుంది"

"అదా విషయం?"

"అదే."

సరీగ అప్పుడే యిరువురికి అర్థమైంది. తామిద్దరూ ఎక్కడ పొరపాటు పడిందీను. ఎ అనే అక్షరం వల్ల ఏ పుల్లారావో తెలియకుండాపోయింది. అసలు విషయం యిరువురికి అర్థం కాంగానే నవ్వుకున్నారు.

"ఎ పుల్లారావని నీవు ఇంగ్లీషులో అడిగితివి. ఏ పుల్లారావని నేను తెలుగులో అడిగాను. ఇదంతా ఏ గొచ్చిన గోలన్నమాట. సరే పూర్తి ఇంటిపేరు లేదు అంటున్నావ్. పోనీ యిదైనా చెప్పు. పాపారావుగారి పుల్లారావా! సూరి పెద్దివారి పుల్లారావా! బుచ్చక్కగారి పుల్లారావా!"

సీత తెల్లబోయింది ముసలాయన చెప్పింది విని.

"ఈ పుల్లా రావులంతా ఎవళ్ళు?"

"వీళ్ళూ మనుషులేమ్మా! చాలా మందికి యిదే పేరు వున్నప్పుడు గుర్తుగ ఫలానావారి పుల్లా రావా! అని అడుగుతుంటాము. దీంట్లో వింతేముంది?"

ముసలాయన చెప్పింది నిజమే యిలా పల్లె టూర్లలోనే కాదు పట్నంలో కూడాను. ఓ వీధిలో నలుగురు శంకరాలు వుంటే వారి వారి ఉద్యోగాలు బట్టి రైల్వే శంకరమా! అని ఓ తోక కలిపి అడగటం సహజం.

సీతా మనోహరికి సావిత్రి మొగుడు పుల్లా రావు అని తెలుసు గాని సూరిపెద్ది వారి పుల్లా రావో బుచ్చక్కగారి పుల్లా రావో తెలియదు. అందుకే తనూ ఓ కొత్త గుర్తు చెప్పింది.

"సావిత్రి మొగుడు పుల్లా రావు" అంది సీత.

"సరి సరి ఆ పుల్లా రావా! సావిత్రి పేరుని బట్టి తెలుసుకున్నాను. అతన్ని అందరం మమూలుగ పుల్లా రావనే అంటాము" అని "పుల్లా రావు ఏమవుతాడు?" అడిగాడు ముసలాయన.

"సావిత్రి మా పిన్నికూతురు. వాళ్లిద్దరూ అక్కా బావ అవుతారు" సీత ఆ చేతిలోంచి ఈ చేతిలోకి పెట్టె మార్చుకుంటూ చెప్పింది.

"అలానా!" అని వాళ్ళింటికి ఎలా వెళ్ళాలో దారి చెప్పాడు ముసలాయన.

"వస్తాను తాతగారూ!" సీత నవ్వుతూ చెప్పి ముందుకు సాగింది.

అదసలే చిన్న పల్లె టూరు రెండు వీధుల అవతలే సావిత్రీ వాళ్ళ యిల్లు. సీత అటూ యిటూ ఇళ్ళు చూసుకుంటూ తనని వింతగ చూస్తున్న మనుషులని చూస్తూ ఇద్దరు పలకరిస్తే వాళ్ళకి జవాబు చెప్పి ముందుకు సాగింది.

సావిత్రి వాళ్ళ యిల్లు ఎలా వుంటుంది అన్నది సీతకి తెలియదు. పెంకుటిల్లు అని మాత్రం తెలుసు. అక్కడ వున్నవన్నీ పెంకుటిల్లు. తనకి ఎదురైన పదేళ్ళ అమ్మాయిని కనుక్కుంది. ఆ పిల్ల యిల్లు చూపించి తుర్రుమంది.

సావిత్రి యింటి ముందుకొచ్చి నిలిచింది సీత.

"అక్కా!" అని పిలుద్దామనుకుంది సీత. తలుపులు వేసి వుండటం వల్ల చిలిపి ఆలోచన పిలుపు మానేసి గొళ్ళెం మీద చేయి వేసింది.

## 24

టక్ టక్.

గొళ్ళెం తలుపుకేసి కొడుతూ చప్పుడు చేసింది సీత.

ఇంట్లో ంచిఅలికిడి కాలేదు.

"టక్, టక్" ఈ తఫా కాస్త గట్టిగ చప్పుడు చేసింది సీత.

"ఎవరది? ఎవరెహే" అన్నాడు పుల్లా రావు ఇంట్లో ంచివిసుగ్గా.

సీతకి నవ్వొచ్చింది మాట్లా డకుండా నుంచోటమేగాక మళ్ళీ చప్పుడు చేసింది గొళ్ళెం.

"తర్వాత వాళ్ళని తిడుదురుగాని, వెళ్ళి ముందు తలుపు తీయండి" ఆ స్వరం సావిత్రిది.

పుల్లా రావు తిట్టినట్లు న్నాడు సావిత్రి ఆ మాట అంది.

తనకి వూరు పేరు రాస్తా తెలుసుగాని ఈ ఇల్లు తెలియదు. తను వాళ్ళ వూరు ఇలా చెప్పాపెట్టకుండా వస్తానని వూహించి వుండరు. అకస్ మాత్ గ దర్శనం యిచ్చిన తనని చూసి వాళ్ళు ముందు తెల్లబోతారు తర్వాత ఎంతో ఆనందిస్తారు.....

సీత తలుపు దగ్గర నుంచుని ఆలోచిస్తు ంటే భళ్ళున తలుపు తెరుచుకుంది.

కొట్టటానికి చేయి పైకి ఎత్తిపెట్టి వుగ్ర నరసింహ అవతారంతో "నీ...." అంటూ ఓ బూతు మాటతో రుస రుసలాడుతూ తలుపు తీసి విసురుగ బైటికి రాబోయిన పుల్లా రావు తెల్లబోయి ఓ అడుగు వెనక్కి వేసి "ఏంటి నువ్వా!" అన్నాడు అత్యద్భుతమైన ఆశ్చర్యం అప్పుడే చూస్తు న్నట్లు.

సీత ముందు తెల్లబోయి అంతలోనే తెప్పరిల్లి నవ్వుతూ తల పంకించింది.

"ఏమేవ్! ఎవరొచ్చారో యిలా వచ్చి చూడు." ఇంట్లో కితిరిగి ఓ గావుకేక వేసి ఆ తర్వాత సీత భుజంమీద చేయివేసి "దా మరదలు పిల్లా! లోపలికి, గుమ్మందగ్గర పేర్లు చెప్పాలా ఏటి?" ఓ వెకిలి నవ్వు నవ్వుతూ అన్నాడు పుల్లా రావు

పుల్లా రావు చనువుగ భుజంమీద చేయివేయటం సీతకి నచ్చలేదు. "ఈ పల్లె టూరి వాళ్ళ తీరే అంత." అనుకుందో లేదో పైట చెంగుకి చేయి తుడుచుకుంటూ లోపలినుంచి సావిత్రి వచ్చింది.

సీతని చూస్తూ నే "అమ్మో అమ్మో నీవేనా! నిజంగ వచ్చావా! ఇవాళ ఎంత మంచిరోజు" అంటూ సావిత్రి పరుగున వచ్చి సీతని కౌగలించుకుంది. "ఎవరెవరు వచ్చారని అడిగింది గబగబా. సావిత్రి ప్రేమ ఆప్యాయత సీతకి ఆనందింపచేశాయి.

"నీప్రేమ కాకులెత్తు కెళ్ళా ఇంట్లో కిఏమన్నా తీసుకెళ్ళేది వుందా? గుమ్మంలోనే అన్ని మాటలా! అయినా అదేంటి నీ చెల్లెలంటే ఎంత ప్రేమ అయితే మాత్రం అంత గట్టిగ నలిపేస్తే ఎలా?" పుల్లా రావు నవ్వుతూ అన్నాడు.

"చీ.....ఊరుకోండి." అంది సావిత్రి ఆ తర్వాత సీత చేతిలోని పెట్టె తీసుకుని లోపలికి ఆహ్వానించింది.

ప్రప్రథమంలో పుల్లా రావు మాటలు వెగటుగ అనిపించాయి సీతకి పల్లెటూరి వాళ్ళు మోటుగ మాట్లాడినా వాళ్లకి ఆప్యాయత అనురాగాలు, ప్రేమాభిమానాలు ఎక్కువని సీత చాలా నవలల్లో చదివింది. అలానే అని పుల్లా రావు విషయంలో సరిపెట్టుకుంది సీత.

"చెప్పాపెట్టకుండా వచ్చావుసరే, అన్న మాట ప్రకారం వచ్చావు నీవూ మరిదిగారూ ఇద్దరూ వస్తే యింకెంత బాగుండేదో?" అంది సావిత్రి.

"నిజమే. రామకృష్ణరావుగారు కూడా వస్తే బాగుండేది" అన్నాడు పుల్లా రావు

మరిదిగారని సావిత్రి రామకృష్ణరావుగారని పుల్లా రావు తన భర్తని గౌరవంగ అనటంతో సీతకి అదో యిదిగ ఆ మాటలు వున్నా ఆనందింపచేశాయి ఈ పల్లెటూరి వాళ్ళు అంతే చిన్న వాళ్ళకి కూడా చదువుకుని ఉద్యోగాలు చేస్తు న్న వాళ్లకి మహా గౌరవం యిస్తారు. మోటు హాస్యాలు అతి చనువు వాళ్ళ తీరే అంత తను పట్టించుకోకూడదు" అనుకుంది సీత.

సీత వచ్చిన సందర్భంలో నానా కంగారుపడుతూ గబ గబ కాఫీ పోసి తెచ్చి ఓ గ్లాసు సీతకి మరో గ్లాసు పుల్లా రావుకి యిచ్చింది సావిత్రి.

సీత హడలిపోయింది "ఇంత కాఫీయే" అంది.

"సరేలే ఈ కాస్త కాఫీకేనా అలా అంటున్నావు! టిఫిని చేద్దా మంటే ఆలశ్యం అవుతుందని......" సావిత్రి నసిగింది.

టిఫెను కొచ్చిన గోల టిఫిని అనటం సీతకి నవ్వొచ్చింది. బలవంతం చేసి సగం కాఫీ తీయించింది.

సీత తీయించిన కాఫీ కూడా తన గ్లాసులోనే పోయించుకుని జుర్రుతూ తాగాడు పుల్లా రావు

చప్పుడు చేస్తూ తిన్నా తాగినా మహా మంట సీతకి. "బావ కాఫీని కుడితి తాగినట్లు అలా చప్పుడు చేస్తూ తాగుతుంటే బావచేత ఆ అలవాటు మాన్పించలేకపోయింది ఏమిటి అక్క?" అనుకుంది సీత.

తను తెచ్చిన పళ్ళు స్వీట్స్ సావిత్రికి యిచ్చింది. స్టీలు డబ్బాలు కూడా అప్పటికప్పుడే యిచ్చింది సీత.

సావిత్రి సంతోషం అంతా యింతా కాదు. సావిత్రికి స్టీలు సామాను అంటే చాలా ఇష్టం. వుండేది పల్లెటూరిలో కాబట్టి అక్కడ అడ్డవాళ్ళకి అందుబాటులో స్టీలు సామాను కొట్టు పాతగుడ్డలకి స్టీలుబొచ్చలు యింకా రాలేదు. ఎవరైనా పట్నం వెళ్ళి వచ్చేవాళ్ళు, కాస్త డబ్బు ఎక్కువ వున్నవాళ్ళు స్టీలుసామాను కొనుక్కొచ్చుకుంటారు. సావిత్రి రెండు కంచాలు, నాలుగు ప్లేట్లు ఒక చెంబు, అరడజను గ్లాసులు, అతికష్టంమీద అప్పుడప్పుడు ఎలాగో అలా కొంది. ఒక్కసారిగా మూడు స్టీలు డబ్బాలు - ఒకదాంట్లో ఒకటి దిగేవి - ముద్దు గా, ముచ్చటగా కుదిమట్టంగా వున్నవి తనకోసం సీత తెచ్చేసరికి ఆమె ప్రాణానికి అవి అమృతభాండాలు లాగానే కనిపించాయి.

"చంద్రిగాడి కొట్టుకి వెళ్ళి టిఫిని ఏమన్నా కొనుక్కువస్తాను." పుల్లా రావు అన్నాడు.

సీత వారించింది - "టిఫెన్ కావాలంటే, నే తెచ్చిన వాటిల్లో ఏదో ఒకటి తినొచ్చు. మళ్ళీ వేరే కొనటం ఎందుకు? అయినా మధ్యాన్నం బస్సు మారేటప్పుడు, బస్సుస్టాండు దగ్గర వున్న హోటల్లో కాఫీ, టిఫెన్ తినే బయలుదేరాను. ఇప్పుడేమీ వద్దు. రాత్రికి తొందరగా భోంచేద్దాం" అంది.

"నువ్వొక్కదానివీ హోటల్ కి వెళ్ళావా?" సావిత్రి ఆశ్చర్యంగా అడిగింది.

"ఒక్కదాన్నే వెళ్ళాను - భయమేముంది?" సీత అంది.

"మరదలుపిల్ల నీలాగా పల్లె టూరిమొద్దు కాదే. పట్నంలో ఉండే ఆడవాళ్ళు ఏదయినా చేయగలరు-

ఎక్కడికయినా దూసుకెళ్ళగలరు." పుల్లా రావు నవ్వుతూ అన్నాడు.

"అలా అని ఎవరు చెప్పారు  బావా?"

"ఒకరు చెప్పాలా ఏమిటి? నీలాగా యిలా వంటరిగా మీ అక్కని ప్రయాణమై రమ్మను చూద్దా ము!" ఎకసేక్కంగా అన్నాడు పుల్లా రావు

"అమ్మో! నేను వంటరిగానా! సరేలెండి - ఈ జన్మకి అయే పనికాదు. సీత అంటే చదువుకున్నది. అన్నీ తెలుసు" అంది సావిత్రి.

ఒంటరిగా ఆడది హోటల్ కి వెళ్ళటం తప్పా? వీళ్ళిద్దరూ మరీ యింత పల్లె టూరిగోడ్డు లా మనిషి ఎదుటే మాట్లా డుతారేమిటి? అనుకుంది సీత. ముఖ్యంగా పుల్లా రావు సావిత్రిని ఒసేయ్, ఏమేవ్ అనటం సీతకి బొత్తిగా నచ్చలేదు. చక్కగా సావిత్రీ! అని పిలిచి చెప్పవచ్చు కదా! పోనీ సావీ! అనొచ్చు కదా!- అనుకుంది. ఎవరి పద్ధతులు వారివి. నాలుగు రోజులు ఉండిపోయేదానిని నాకెందుకు?- అని అప్పటికప్పుడే సరిపెట్టుకుంది.

"మీ ఆయన మావూరు రానన్నాడా ఏమిటి?" పుల్లా రావు అడిగాడు.

"మా వారికి అలాంటి యిది ఏమీలేదు. అర్జంటుగా ఆఫీసు పనిమీద డిల్లీ వెళ్లా రు. నాకు తోచదని వారే ఉపాయం చెప్పారు. పాపం - వాళ్ళు ఎన్నోసార్లు చెప్పాము! మీరు మా ఇంటికి వచ్చారా?" సీత నిష్ఠూ రంగా అంది.

"ఆయనకన్నీ హాస్యాలే - ఏమీ అనుకోకు సీతా!" అంది సావిత్రి.

"బావ హాస్యంగా అంటే నేనూ హాస్యంగా అన్నాను. ఈ మామూలు మాటలు కూడా పట్టించుకుంటానా?" సీత తేలికగా నవ్వేస్తూ అంది.

"విన్నావా మొద్దూ! మా మరదలు చూడు- ఎంత చురుకుగా జవాబు చెప్పిందో!" విరగబడి నవ్వాడు

"నా ముఖం- నాకేం తెలుసు!" అంది సావిత్రి.

పెళ్ళాన్ని పట్టుకుని ఇతరుల ఎదుట ఎద్దు, మొద్దు అంటే ఏ స్త్రీకయినా ఎంత బాధాకరంగా ఉంటుంది? అక్క అలా తేలికగా తీసుకుని ఎలా నవ్వగలిగింది? నేనైతే ఇలాంటి ఒక్క మాట గూడా భరించలేను. అయినా ఇలాంటి విషయాలలో వారెంతో సంస్కారం ప్రదర్శిస్తారు. ఏమేవ్! ఒసేవ్! ఎద్దు, మొద్దు - యిలాంటి మాటలు వారికి రానుకుడా రావు. చక్కగా పేరుపెట్టి పిలుస్తారు. సీతా! సీతూ! మనూ! మనోహరీ! - అలా రకరకాలుగా పిలిచేదే గాక - మరీ మొద్దు ఎక్కువయితే "ఏరా! నామీద కోపమా?" అంటారు.

సీత క్షణకాలం మధురమైన ఆలోచనలో పడింది.

సీత ఏమి అలోచిస్తున్నదో పుల్లా రావుకి తెలియలేదు గాని, సిగ్గు దోబూచులాడుతున్న సీత బుగ్గలు చూస్తూ నోరు తెరుచుకుని అలా కొద్దిసేపు వుండిపోయాడు పుల్లా రావు

సీత ఆ యింటికి వచ్చి గంట దాటిపోయింది.

అప్పటికి కాస్త అక్కడి వాతావరణంకి అలవాటు పడింది సీత.

## 25

ఆ ఉదయం -

సీత నిద్రలేస్తూ నే -

"నేను ఈ వూరు వచ్చి అప్పుడే నాలుగు రోజులా!" అనుకుంది.

ఈ నాలుగు రోజులబట్టి జరిగింది మననం చేసుకుంటూ నిద్రకళ్ళతో, మంచం దిగకుండా ఆలోచిస్తూ అలా వుండిపోయింది సీతామనోహరి.

పుల్లా రావు అమాయకంగా, హాస్యంగా మాట్లా డుతూ కనపడతాడు గాని - జాగ్రత్తగా గమనిస్తే స్త్రీ స్వాతంత్రం ఇష్టంలేని వాడుగా, మొరటు హాస్యాలతో, పల్లె టూరి మొద్దు లా అనిపిస్తా డు.

"పల్లె టూరి వాళ్ల తీరే అంత!" అనుకుంది సీత.

చదువు లేనివాళ్ళకి సంస్కారం ఎక్కడినుంచి వస్తు ంది? ఇంతెందుకు - తనకి, అక్కకి ఎంత భేదం! అక్క సెకండ్ ఫారంకి వచ్చింది. పెళ్ళి చేసేశారు - పిన్ని, బాబాయి కలసి, పెళ్ళి, కాపురం వెంట వెంటనే జరిగిపోయాయి. ఈ పల్లె టూరి బైతుని పెళ్ళిచేసుకుని, ఎ.బి.సి.డి.లు కూడా మరచిపోయింది. అదేమిటి అంటే - ఎప్పుడన్నా పుస్తకం తిరగేసిన పాపానపోతే కదా! అంటుంది.

మొదటినుంచీ చదువుమీద అంతంత శ్రద్ధయే గాబట్టి - ఆ విషయం వదిలేసినా, మరీ జ్ఞానం లేనిదానిలా తయారు కావాలా? కూర చేయటం దగ్గరనుంచి, చీర కట్టు కునే వరకూ భర్తనే అడగాలా! సొంత అభిప్రాయాలు, సొంత నిర్ణయాలు వుండవా? పెళ్ళి అయిన గుర్తుగా మన్ను తిన్న పాములా తయారు కావాలా?

అక్క యిలా మారిపోయింది సరే - బావ ఏమిటి, ఆడంగి రేకులా కబుర్లు! పెదవి కదిపితే బూతులు. సీత అని పేరుపెట్టి పిలవచ్చు కదా! అలా పిలవమని చెప్పినా పిలవడు. మరదలా! లేక మరదలుపిల్లా!- ఈ రెండే పిలుపులు. ప్యాంట్లు ఎలాగూ లేవు కట్టే ది ధోవతి. ధోవతి లోపల డ్రాయరు వేసుకోవచ్చు కదా - డ్రాయరు అన్న మాట ఈ యింట్లో నే లేదు.

దిక్కుమాలిన ధోవతి. అందరి గతీ అంతేనా, యీ మహానుభావుడు తీరు యింతా! సగం దర్శనాలు

కావాల్సిందే. అలా చూసిన అక్క అయినా చెప్పవచ్చు కదా!- చెప్పినా బావ వినడా! ఓసారి మాటల సందర్భంలో వారు చెప్పారు- ఓ రకం మ్యానియా అది. శరీరం మీద గుడ్డలు సరీగా ఉంచుకోరు. అలా అని రేప్ చేయటం, ఆడవాళ్ళతో తిరగటం చేయరు. కాని, ఆడదాన్ని చూడగానే - లేక వాళ్ళు చూడాలనో - కావాలని వంటిమీద గుడ్డలు సరీగా వుంచుకోరు. ఈ జబ్బు వుందని వారికి తెలియదు. కొందరికి తెలుసు- అయినా జాగ్రత్తపడరు.....

"సీతా!" సావిత్రి దగ్గరకు వచ్చి పిలవటంతో, తెలివి తెచ్చుకుంది సీతామనోహరి.

"ఏమిటి?" బద్ధకంగా ఒళ్లిర్చుకుంటూ మంచంమీద నుంచి లేచి కూర్చుంది.

"కళ్ళు పత్తికాయల్లా తెరుచుకుని యింటి వాసాలు లెక్కపెడుతున్నావా, ఆలోచిస్తు న్నావా?" సావిత్రి నవ్వుతూ అడిగింది.

"అదేం లేదు!" అంది సీత.

"తెల్లా రిఎంత సమయం అయిందో తెలుసా?"

"అన్నీ చేసిపెట్టి నోటికి అందించే మా అక్క వుంది. ఇంక నే ఎప్పుడు లేస్తే ఏంటి?"

"అందుకని కళ్ళు తెరుచుకుని కలలు కంటున్నావా?"

"అవును."

"ఏం కలలో వినవచ్చా?"

"తప్పు, వినకూడదు. చాలా సీక్రెట్!"

"మరదలు పిల్ల ఏం కలలు కందో నాకు తెలుసు!" పుల్లా రావుఅన్నాడు.

"నీకు మనసు కూడా చదవటం వచ్చా బావా?" సీత వెంటనే అడిగింది. అడిగిం తరువాత బావ గుణం తెలుసు కదా - ఎందుకడిగాను, బుద్ధిలేక - అనుకుంది.

"ఇహిహి" అని ముందు ఓ వెకిలి నవ్వు నవ్వి "మరదలుపిల్ల కలలోకి భర్తగారు వచ్చుంటారు. ఇద్దరూ ఎడంగా వుండి పదిరోజులు అయింది కదా! రాత్రంతా కలలోకి వచ్చి గిలిగిలి గిలగల చేసి వుంటాడు. తెల్లా రి మెలుకువ వచ్చినా రాత్రి గిలి వదలలేదు." పుల్లా రావు అంటూ సీతని ఎగాదిగా చూశాడు.

"మీ ఆసికాలు మీరూను - వూరుకోండి. ప్రతిదానికీ ఓ వేళా పాళా వుండాలి!" నవ్వుతూనే కోప్పడింది సావిత్రి.

"తస్సచెక్క! వేళాకోళం అర్ధరాత్రిళ్ళు చేయాలేంటే? ఇదేమన్నా బూతు మాటా! బూతు ఆటా!- పగలు కూడదు అనటానికి?" పుల్లా రావు అన్నాడు.

సీత మాట్లా డలేదు ఇలాంటప్పుడు నోరుమూసుకోటం ఉత్తమమని, ఈ ఇంట్లో అడుగుపెట్టిం తరువాత అనుభవంలో తెలుసుకుంది. బ్రష్ మీద పేస్ట్ వేసుకుని పెరట్లో కివెళ్ళింది- ముఖం కడుక్కోటానికి.

"నే చెప్పింది గుర్తుందా?" సీత వెళ్ళిం తరువాత నెమ్మదిగా అడిగాడు పుల్లా రావు

"నాకు అసలు రాదు కదండీ!" అంది సావిత్రి.

"ముక్కలు పట్టుకో, చాలు అన్నా కదా!"

"ఏమో బాబూ! మీ ఇష్టం" అంది సావిత్రి చివరికి.

వాళ్లిద్దరూ సీతకి తెలియకుండా చిన్నగా మాట్లా డుకునేది పేకాట గురించి.

ముగ్గురూ క్రితంరోజు కూర్చుని మాట్లా డుకుంటుంటే పుల్లారావు సీతని అడిగాడు - "తోచనప్పుడు మీ ఆయన, నీవు ఏం చేస్తు ంటారు? మీ ఆయనకి క్లబ్బుకెళ్ళే అలవాటు వుందా?"

"మా వారికి ఏ అలవాట్లూ లేవు. తోచకపోవడం బైటికి వెళ్ళటం అంటూ వుండదు. వారూ, నేనూ కలసి పెకాడుకుంటాము. చస్ ఆడతాము." సీత చెప్పింది.

"నీవు పేకాడతావా!" అదేదో నమ్మశక్యం కాని విషయం అన్నట్లు ముఖంపెట్టి అడిగాడు పుల్లా రావు

"పేకాడటం అన్నది - ఎవరెస్ట్ శిఖరం ఎక్కటంలా కష్టంకాదు!" సీత అంది.

"నాతో ఆడతావా?" లోలోపల జంకుతూనే అడిగాడు పుల్లా రావు

"నీకు పేకాట వచ్చా బావా!"

"సరేలే- మీ బావకి రాని ఆట కూడా వుందా! మధ్య మధ్య రచ్చబండ దగ్గర ఆడుతుంటారు. నాకు తెలియదనుకో - అన్నీ ఆటలూ మీ బావే గెలుస్తు ంటారుట!" అదేదో గొప్ప విషయం అయినట్లు, సావిత్రి మధ్యలో కలుగజేసుకుని చెప్పింది.

"ఇంట్లో పేక లేదు- సాయంత్రం తెస్తా ను. ఓ ఆట ఆడుతావా!" వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అడిగాడు పుల్లా రావు

"అలాగే!"

"ఆటలో ఎప్పుడూ నాదే పైచేయి - ఆనక గింజుకుని లాభంలేదు."

"మాటల్లో కాదు చేతల్లో చూపాలి బావా! నేను మావారు ఆడితే నాదే పైచెయ్యి తెలుసా!"

"ఒసోస్. మీ ఆయన ప్రతాపం అంతవరకే కావచ్చు. నాతో చెయ్యి కలపబోతున్నావు కదా చూద్దాం. పైచెయ్యి ఎవరిదో?"

క్రితంరోజు ఈ మాటలు అయిం తరువాత పుల్లా రావుపేక తెచ్చాడు. పేకాట ఆడదాం అని మాట నీవు ఎత్తు అని పుల్లా రావుఅంటే ఆట నాకు రాదుకదండీ అంది సావిత్రి. ముందు ఆటలో కూర్చుని తర్వాత లేచిపోదువుగానిలే. అన్నాడు అదీ వాళ్ళు మాట్లా డుకునేది

సీత ముఖం కడుక్కుని వచ్చింది.

"గురవమ్మ కాఫీ కొట్టు నుంచి ఇడ్లీ లుపట్టించుకొచ్చాను. పుల్లా రావుచెప్పాడు.

"ఇప్పుడెందుకు బావా! అనవసరంగ. తొందరగ భోం చేస్తు న్నా ము సాయంత్రం ఏదో ఒక టిఫిన్ తింటూనే వుంటిని."

"అదెట్లా. కొత్త చోటికి వచ్చానని అలవాట్లు మానుకుంటే బాగుండదు. బస్తీ వాళ్లకి పరగడుపున కాఫీనీళ్ళు ఉదయాన్నే టిఫిని తినటం అలవాటు గందా! నీవు రేపు వెళ్ళిం తరువాత మా తమ్ముడుగారు నిన్ను చూసి "ఇట్టెట్ట చిక్కిపోయినావ్ సీతా! మా అన్నగారు ఏమి నిండుగ పెట్టలేదా అంటే అవమానం నాకుగాక యింకెవారికి?" పుల్లా రావునొచ్చుకుంటూ చిరుకోపం వెల్లడిస్తూ అన్నాడు.

ఇలాంటప్పుడే సీత వోరపడుతుంటుంది. పల్లె టూరివాళ్ళ ఆప్యాయతలే వేరు. ఏదోచ్చినా పట్టలేరు. అనుకుంది.

మూడు ప్లేట్లలో నాలుగేసి ఇడ్లీ లుపెట్టి రెండు రకాల చేట్నిలు కారప్పొడి నిండుగ వేసి గిన్నెడు నెయ్యి వాటినిండా పోసింది.

అవి యిడ్లీ లులాగా లేవు. బకాసురుడికోసం స్పెషల్ సైజులో అరచేతి వెడల్పున అంగుళంన్నర మందాన తయారు చేసినట్లు వున్నాయి. చింతపండు పచ్చడి అనబడే అల్లంపచ్చడి, కొబ్బరిచట్నీనిండా మిరపతోక్కలు

ఎర్రగ పచ్చగాను కళ్ళు చెదిరే రంగులో కారప్పొడి, చూడ నిండుగానే వున్నాయి.

"నాలుగు యిడ్లీలే!" అంది సీత. వాటిని చూసి దడుచుకుంటు. వాటి ఆకారం అలా వుంది మరి.

"నాలుగు యిడ్లీలకే అలా అంటే ఎలా మరదలు పిల్లా! అందుకే మీ పట్నంవాళ్ళు ఉఫ్ అంటే చాలు గాలికేగిరెలా వుంటారు" పుల్లా రావు నవ్వుతూ అన్నాడు.

"నే అలా వున్నానా?" సీత అంది.

"నీవలా లేవనుకో. అదేంటో పిట్ట మెతుకులు తిన్నా నిండుగ వుంటావ్! నీ అక్కను చూడు ముప్పొద్దుల మూడేసి కంచాలు లాగిస్తుంటుంది. అవునంటావా కాదంటావే!" సన్నగ వున్న సావిత్రిని చూస్తూ అన్నాడు పుల్లా రావు

"సరేలెండి. మీ కన్నీ విచిత్రాలు వింతలు. ముందు ఇది కానీండి" అంటూ యిడ్లీలున్న ప్లేటు అందించింది సావిత్రి.

సీత బలవంతాన తన ప్లేటులోంచి రెండు యిడ్లీలు తీయించింది.

.

"అక్కడ యిడ్లీలు దూదుల్లా వుంటాయి" సీత అంది.

"దూదుల్లా వుంటే ఏం బాగుంటాయ్! కాస్త పంటికి ఆనాలా? పెళ్ళి కెళ్ళినప్పుడు ఓ పెద్ద హోటల్లో తిన్నాలే. మెత్తగ తెగుల్లా రూపాయి బిళ్ళలంత వున్నాయి. అవి మునిగేలా గిన్నెడు పులుసు పోశాడు. పచ్చడి చూద్దామా అంటే చప్పగ చచ్చింది" వాంతి చేసుకునేవాడిలా ముఖం పెట్టి మరీ చెప్పాడు పుల్లా రావు

సీత మళ్ళి నోరెత్తలేదు. "మనిషిని కాల్చుకు తినే జాతికి మైసూర్ పాక్ ఎలా రుచిస్తుంది?" అనుకుంది.

కాఫీ టిఫెన్ కానిచ్చి పుల్లా రావుబయటికి వెళ్ళటంతో అక్కడికో కార్యక్రమం పూర్తి అయింది.

## 26

సావిత్రి వంట చేస్తు న్నది.

వంటింట్లో పీట వేసుకుని కూర్చుంది సీత.

బొంగరంలా తిరుగుతు అన్నీ తనే చేస్తు న్నది సావిత్రి.

"అక్కా!" సీత పిలిచింది.

"ఏం కావాలి! జీడిపలుకులు పెట్టనా!" పళ్ళెంలో వేయించి పెట్టిన జీడిపప్పుని చూస్తూ అడిగింది సావిత్రి.

"ఉదయం తిన్న యిడ్లీలేయింకా అరగలేదు. ఇంక వాటికెక్కడ చోటు వుంది?" నవ్వుతూ చెప్పింది సీత.

"మరీ విచిత్రంగా చెప్పకు. అంత నాజూకు తిండ్లు పనికిరాదు. నాలుగు పనులు చేసుకోటానికి ఓపిక వుండాలా?"

"ఇప్పుడు నాకు ఓపిక లేకేమి?"

"మొన్న నాతోపాటు తిరగలి తిప్పుతానని సరదా పడ్డావు. ఒక్కదానివి రాయిని కదిలించలేకపోతివి?"

సావిత్రి నవ్వింది గుత్తొంకాయకూరలో కారం కూరుతూ

సీతామనోహరి అందంగా నవ్వింది.

"మోటుపనులు చేయలేకపోతే వాళ్ళకి ఓపిక బలం లేనట్లేనా?"

"ఆ....!"

"కాదు."

"కాదు అంటే సరా! ఎలా కాదో చెప్పు."

"ఓపిక బలం అన్నవి శరీరానికి సంబంధించినవి. కూలీవాడు రాళ్ళు కొడతాడు బస్తాలు మోస్తాడు. మావారిలాగా ఆఫీసులో పని చేసేవారు బుర్ర అలసిపోయేలా కలాన్ని బలంగ పట్టుకుని పనిచేస్తారు. కొందరు శరీర శ్రమపడితే మరికొందరు మెదడు అలసిపోయేలా శ్రమపడతారు వారు చేసే ఆయా పనులబట్టి శ్రమ ఓపిక బలం వుంటాయి. పల్లెటూరివాళ్ళ మోటుపనులు వేరు. నీవు రవ్వ కావాలంటే తిరగలి వుపయోగిస్తావు. పిండి రుబ్బాలంటే రోటికి పత్రానికి పని కల్పిస్తావు. అదే నేనయితే మిక్సీ గ్రైండర్ వుపయోగిస్తాను. స్విచ్ వేస్తే చాలు క్షణాలలో పని అయిపోతుంది. అలవాటు అయితే అన్నీ తేలికే" అంది సీత.

"మోటు పనులు అలవాటు లేని సుకుమారీ! శరీర బలం మరి ఎలా వస్తుందిట?" అంది సావిత్రి.

"మీ వూరి ఇడ్లీలుతింటే సరి."

సీతామనోహరి నవ్వుతూ అనేసరికి సావిత్రి కూడా నవ్వింది.

"నాకు తోచటంలేదు. ఒక్క పనీ నా చేత చేయించవు. ఇలా అయితే మా వూరు వెళ్ళిపోతాను." బెదిరింపుగ అంది సీత.

"మరిదిగారిమీద బెంగా!" సావిత్రి వెంటనే అడిగింది.

"నాకలాంటివి ఏమీలేవు."

"బెంగ వుంటే మాత్రం చెపుతావా ఏంటి?"

"నీకయితే చెపుతాలే అక్కా!"

"ఇలాంటి విషయాలు ఆడవాళ్ళయితే చెప్పరుట."

"అలా అని ఎవరన్నారు?"

"ఇంకెవరు మీ బావ. ఆడవాళ్ళ విషయాలన్నీ నాకు తెలుసు అంటుంటారు. మగాళ్ళకన్నా ఆడవాళ్ళకి కోరికలు ఎక్కువట వాళ్ళు పైకి చెప్పరుట."

"ఈ విషయం బావకి ఎలా తెలుసుట?"

"ఆడాళ్ళ విషయంలో వంద విషయాలు తెలుసు ఆయనకి కదిలించి చూడు కథలు కావాల్సినన్ని చెపుతారు." అదేదో సీదా సాదా విషయం అయినట్లు చెప్పింది సావిత్రి.

ఆయన్ని కదిలించక, కదిలించక ఇలాంటి విషయాలలోనే కదిలించాలి. కావాల్సినంత బూతు పురాణం వినిపిస్తాడు. మహానుభావుడు గ్రంథ సాంగుడు కూడా అయి వుంటాడు. అన్ని అలవాట్లు కూడా వుండి వుంటాయి. తీరు చూస్తే అన్ని అలవాట్లు.....

"ఏంటి మాట్లాడవు! ఇంతలోనే దీర్ఘాలోచనలో పడిపోయ్యావు!" సావిత్రి అడిగింది.

"అలవాటు గురించి ఆలోచిస్తున్నాను" సీత చెప్పింది.

"అలవాటా?"

"ఆ...... బావ బీడీలు తాగుతాడు. మధ్య మధ్య చుట్ట తాగుతాడు కదా!"

"అయితే?"

"అది..... అది.... నీకెలా అలవాటు అయింది."

"నాకలవాటా?"

"తాగే విషయంలో కాదు, వాసన భరించే విషయంలో. నేనయితే సిగరెట్టు వాసన కూడా భరించలేను."

"అలవాటు అయితే ఏ పనైనా చేయించవచ్చని చేయవచ్చని ఇందాకనే కనే అనుకున్నాం. పొగవాసన మొదట్లో నాకూ వికారంగానే వుండేది రాను రాను అదే అలవాటు అయింది. పోగవాసనకి నేను ఎవగించుకున్నానని, ఓసారి మీ బావకి ఎంత కోపం వచ్చిందో తెలుసా!"

"ఎంత కోపం వచ్చింది?"

"కోపం పట్టలేక నోటి నిండుగ పొగ పీల్చి ఉక్కిరిబిక్కిరి అయేలా నా ముఖంమీద వూదారు." అదేదో సామాన్యమైన విషయంలాగా చెప్పింది సావిత్రి.

"ఛీ...." ఒక్కసారిగ ఛీత్కారం చేసింది సీత.

"చీ లేదు, ఛా లేదు. మీ ఆయనకి పొగ తాగే అలవాటు వుంటే ఏం చేస్తావ్ సీతా!"

"మానిపిస్తాను."

"అదంత తేలికా!"

"ఆ........ వారు నేను చెప్పినట్లు వింటారు. నేను నొచ్చుకునే పని ఏది చేయరు."

సావిత్రి దీర్ఘ నిట్టూర్పు ఒకటి వదిలింది. లోతుగ గమనిస్తే ఆ నిట్టుర్పులో వేయి అర్ధాలు గోచరిస్తాయి.

"సీతా! నీకు అనుభవం తక్కువ. మీ ఆయన మంచివాడు కాబట్టి నీవు చెప్పినట్లు అలా వింటున్నాడు నీ మనసు నొచ్చుకోకుండా చూస్తు న్నాడు. ఎక్కువమంది మగవాళ్ళు భార్యమాట వినని వారే. భార్యకోసం వాళ్ళ అలవాట్లు సుఖాలు మానుకోరు. భార్య మొండిగ ఎదురు తిరిగితే నాలుగు వుతికి నోరు మూయిస్తారు."

"నేనో విషయం అడుగుతాను. నిజం చెపుతావా అక్కా!"

"అబద్ధం మాత్రం చెప్పను అడుగు."

"బావ ఎప్పుడైనా నీ మీద చేయి చేసుకున్నాడా?"

సావిత్రి ఫక్కున నవ్వింది. "వకసారి ఏమిటి చాలాసార్లు చేయి చేసుకున్నారు."

సీత వక్కసారిగ నిటారుగ అయింది. "భర్త కొడతాడు అని ఎంత తేలికగా చెప్పింది?" అనుకుంది.

"ఏమిటే సీతా! అలా అయిపోయావ్?"

"ఏం లేదు. బావ..... నిన్ను.....కొడతాడా?"

"బాగుందే, దీనిలో అంత ఆశ్చర్యం ఏముంది. భార్యని భర్త కాకపోతే ఎవరు కొడతారు? నా మొగుడు నన్ను కొట్టాడు కాబట్టి వూరుకున్నాను. పరాయివాడు వచ్చి కొడితే పళ్ళు రాలగోడతాను."

"అంతేలే!" అంది సీత. ఇంక ఆ విషయం పెంచదలచలేదు. ఈ చిన్న విషయానికే సీత బుల్లి మనసు కలత చెందింది.

"మీ బావకి చక్రపొంగలి చాలా ఇష్టం. మనసు పడ్డప్పుడే పనైపోవాలంటారు. మంచి నెయ్యితో చక్రపొంగలి చేస్తే ఆ రుచి మధురం అనుకో. ఆయనకి తినాలని బుద్ధి పుట్టింది. చెయ్యమన్నారు- పైగా మరదలు పిల్లకి కూడా మన రుచులు చూపించవద్దా అన్నారు....."

సావిత్రి వంట పూర్తిచేస్తూ చెప్పుకుపోతున్నది.

"భర్త కొట్టటం సహజం - మగాడి జన్మహక్కు అన్నట్లు అక్క ఎంత తేలికగా చెపుతున్నది! తన భర్త కోప్పడితేనే తను భరించలేదే! ఇంక చేయి చేసుకుంటేనా - జీవితంలో ముఖం చూడదు. ఈ విషయంలో బావకి, వారికి ఎంత తేడా! నిజంగా తన భర్త చాలా విషయాలలో బావకన్నా చాలా చాలా విషయాలలో మంచివాడు......."

అలా ఆలోచిస్తున్న సీతకి - రెండుసార్లు తాగొచ్చి, అది బయటపడకుండా ఉండటానికి దొంగవేషాలు, అబద్ధాలు ఆడిన భర్త గుర్తుకువచ్చాడు.

అప్పుడే-

టక్ టక్ మని వీధి తలుపు చప్పుడు అయింది.

"మీ బావ కూడా వచ్చేశారు. ఇంక నీవెళ్ళి స్నానం చెయ్యి. ఉదయం అనగా స్నానం చేయమని చెపితే, తొందరేముంది? అంటివి. నువ్వెళ్ళు" అని చెప్పి, వీధి తలుపు గడియ తియ్యటానికి కంగారుగా వెళ్ళింది సావిత్రి.

ఉదయం టిఫెన్ రాళ్ళలాంటి ఇడ్లీ తినేసరికి సీతకి బరువుగా, బద్ధకంగా ఉండేసరికి స్నానం చెయ్యబుద్ధి కాలేదు. "భోజనం చేయబోయేముందు చేస్తాలే!" అంది.

"వచ్చే, వచ్చే" అన్న సావిత్రి స్వరమూ, గడియ తీస్తున్న చప్పుడూ వినిపించాయి.

సీత నిట్టూర్పు విడుస్తూ సోపు, టవలూ తీసుకుని స్నానాల గదిలో దూరింది.

# 27

"దించు దించు" అన్నాడు పుల్లారావు

"ముక్కలు సరిచూసుకోవద్దా!" అంది సీత- ఉన్న సెట్టు ఎంతకి పూర్తికాకపోవడంతో కొత్త సెట్టు పెడదామా వద్దా అని ఆలోచిస్తూ.

"ఎంతసేపు చూసుకోవాలి? ఏదో ఒకటి కటా బిటి కానివ్వాలి గాని!"

సీత మాట్లాడలేదు ఎంతకీ సెట్టుగాని కళావరు ఎనిమిదిని కింద పారేసింది.

మధ్యాహ్నం భోజనాలు అయిం తరువాత ముక్కలు పరిచాడు పుల్లారావు

"అక్క ఆడితేనే నేనూ ఆడతాను" అంది సీత.

"దానికి ఆట చాతయితే, నేను మీసాలు గోరిగించుకుని. జీవితాంతం పేడిమూతితో వుంటాను" అన్నాడు పుల్లా రావు

"ఏనాడూ నేర్పి వుండవు. లోపం నీదే బావా! చంటి కుర్రాడు కూడా పేకాడగలడు" అంది సీత.

"సరే మరదలు పిల్లా! నీవో పని చెయ్యి. దాన్ని కూడా ఆటలో కుర్చోపెడదాం. నీవు నేర్పిచూడు."

సరేనంది సీత. డంకా పలాను. సెట్లు. ఏ ఆట ఎలా ఆడాలో చెప్పింది. సావిత్రికి అర్థం కాలేదు. పేకని విసనకర్రలా పట్టుకోటమే చాతకాలేదు. అతికష్టం మీద రెండు చేతులతో పట్టుకోగలిగింది కళావరుని ఆటీనంది. డైమండ్ ని పట్టుకుని ఇస్ పెట్ అంది.

"ఈ ఆటకన్నా అష్టాచెమ్మా ఆడటం తేలిక చక్కగ వుంటుంది" అంది సావిత్రి.

"వావనగుంట లాట యింకా బాగుంటుంది. గుంటలో రాళ్ళు వేసుకుంటూ పోవటమే. ముఖం చూడు ముఖం- చీకి పారేసిన తాటి టెంకెలా!" అన్నాడు పుల్లా రావు వ్యంగ్యంగా.

"ఓ పని చెయ్యండి. మీ యిద్దరూ ఆడండి. నేను సీత ముక్కలు చూస్తు ంటాను" అంది సావిత్రి.

వాసన చూస్తే చాలు - వచ్చే ఆట పేకాట అన్నాడు- వెనుకటికో పేకాట ప్రబుద్ధుడు

అదీ నిజమేననిపించింది సీతకి. సరేనంది.

పుల్లా రావు ముక్కలు కలిపి వేశాడు.

సీత, పుల్లా రావు మూడు ఆటలు ఆడారు. సావిత్రికి ఆట అర్ధంకాలేదు గాని, ఆవులింతలు వచ్చాయి.

రోజు సావిత్రి భోజనాల సమయం వరకూ గోడ్డు లా పనిచేసి, భోజనం కాంగానే చాప పరుచుకుని సరీగా రెండు గంటలు నిద్రపోతుంది అది దినచర్యలో ఓ భాగం. భోంచేసి నడుం వాల్చకుండా కూర్చునేసరికి బద్ధకం, నిద్ర వచ్చేశాయి.

"మీరు ఆడుకుంటారో - పాడుకుంటారో నాకు తెలియదు. నేను మాత్రం యింక కూర్చోలేను" అని సావిత్రి కూర్చున్న చాపమీదే నడుం వాల్చింది. మరుక్షణంలో గుర్రు పెట్టేసింది.

పుల్లా రావు సీత ఒక్కో అయిదు పైసలు పెట్టు కుని ఆడటం మొదలుపెట్టా రు. వరసగా మూడాటలు ఓడిపోయి, ఒకాట గెలిచాడు - అదైనా అతికష్టం మీద.

"పేకాటలో నాదే పైచేయి అన్నావు కదా బావా!" గెలిచిన డబ్బులు ఓ పక్కగా పెడుతూ అంది సీత.

"ఓ పక్క చేతులు కట్టేసి, పైచేయి- కింద చేయి అంటే కుదరదు" అన్నాడు పుల్లా రావు

"చేతులు కట్టే శానా?" ఆశ్చర్యపోయింది సీత.

"కాదా?"

"కాదా అంటే నాకర్థం కాదు- నాకర్థమయేలా చెప్పు."

"ఆడేటప్పుడు నా నోట్లో పొగగొట్టం వుండాలి నీవేమో చుట్ట వాసనంటావ్, బీడీ వాసనంటావ్. ఓ ముక్క దించాలన్నా, ఎత్తా లన్నా ముందుగా గుండెలదాకా పొగ పీల్చి వదలాలి. దాంతో బుర్రకి పట్టిన తుప్పు వదిలిపోయి, దాంతో గురి చూసి ముక్కకోట్టటమో, పట్టటమో చేస్తా ను. నేను బీడీ తాగుతూ ఆడితే - నాతో ఆడను అంటివి వాసన కొడితే నీవాడవు ఓ దమ్ములాక్కపోతే నే ఆడలేను." పుల్లా రావు తన పేకాట విజయ రహస్యం చెప్పాడు.

"అదన్న మాట అసలు రహస్యం!" అంది సీత నవ్వుతూ.

"అదే. కావాలంటే వంద రూపాయలు పందెం బీడీ తాగుతూ ఆడి చూపించనా?"

"నీవు చెప్పింది ఒప్పుకున్నా కదా - మళ్ళీ పందెమెందుకులే! బీడీ పేరెత్తితేనే నా మైండ్ పనిచేయదు ఇంక వాసన దాకానా!" అంది సీత.

"సరేలే. ఏం ముక్క కావాలి?"

"ముందు ఏదో ఒక ముక్క వెయ్యి" అంది సీత.

"ఇంద ఆసు ఎత్తు కో, ఎత్తు కో!" పుల్లా రావు ఉషారుగా అన్నాడు.

"నాకు అవసరం లేదు" అంటూ పేకలోకి దిగిపోయింది సీత.

"అమ్మనీయమ్మ- దీని సిగతరగ! గంట నుంచి దీనికోసం చూస్తు న్నా! ఇప్పుడు వచ్చింది" అన్నాడు పుల్లా రావు పెకలోంచి ఎత్తిన ముక్కతో పెద్ద సెట్టు అయింది అదీ ఆ సంతోషం.

పుల్లా రావు ఇస్పేట్ కింగ్ ని దించాడు.

సీత గబుక్కున ఎత్తి, ముక్కల మధ్య సర్దింది.

"ఇందాక ఇస్పేట్ జాకీని దించా కదా! దానిని ఎత్తలేదు గదా అని, రాజుగారిని దించా. వెనకటికి నీలాంటి మరదలు పిల్ల - రాజుని చూసిన కళ్ళతో మొగుణ్ణి చూసి మొట్టిందిట. అలా రాజుని చూడంగానే ఎత్తు కున్నావ్ ఎత్తు ఎత్తు - ఎందాక ఎత్తు తావో అదీ చూస్తా ను....."

పుల్లా రావు ఆట మొదలుపెట్టిన దగ్గరనుంచి ఎత్తు ఎత్తు, దించు దించు అంటూనే వున్నాడు ముక్కవెయ్యి అంటారు, దించు అంటారు. అందులో అసహజమేమీ లేదు. కాని, పుల్లా రావు అనే తీరులో, చూసే చూపులో

ద్వంద్వార్థాలు గోచరిస్తు న్నాయి సీతకి ఆ విషయం ఆలోచిస్తూ కళావరు అయిదుని దించింది. అది ఈ ఆటలో జోకరు. ఆ విషయం కింద ముక్కని పడేస్తూ నే గుర్తించింది చటుక్కున ఆ ముక్కని తీసుకోటానికి ముక్కమీద చేయి పెట్టింది. పుల్లా రావు సీత చేతిమీద క్విక్ గా తన చేతినివేసి అదిమిపెట్టాడు.

"అమ్మమ్మమ్మ - ఎత్తు దామనే ఆశ! నీవు ఎత్తు దామని చూసినా, నేను ఎత్తనిస్తా నా? జారింతరువాత పడాల్సిందే!" అన్నాడు పుల్లా రావు

"ముక్క తీసుకోను గాని, చెయ్యి తియ్యి" అంది సీత చేతిని వెనక్కి లాక్కుంటూ.

పుల్లా రావు చేతిని తీయకుండానే అన్నాడు- "ముక్క ఎత్తవుగా?"

"ఊహూ! బుద్ధి లేక చేయిపెట్టా ను" అంది సీత.

ఒక్కసారి సీత చేతిని గట్టిగా నొక్కి వదిలాడు పుల్లా రావు

ముఖాన నాలుగు ముక్క చివాట్లు పెట్టి, చర్రున లేచి పోదామనుకుంది సీత. అది మర్యాద లక్షణం కాదని, ఆ ఆట ఆది లేద్దా మనుకుంది. సీత ఈ ఆటలో కూడా గెలిచింది.

"ఇంక చాలిద్దా ం" అంది సీత.

"గెలిచి, లేచిపోదాం అంటే కుదరదు మరదలుపిల్లా!" అని వాదన వేసుకున్నాడు పుల్లా రావు

"నాకు అలాంటి వేషాలు లేవు. చాలాసేపటి నుంచి ఆడుతున్నాం కదా - నీకు మధ్యాహ్నం నిద్ర అలవాటు కదా, పడుకుంటావేమోనని....."

"సమవుజ్జీతో ఆడేటప్పుడు నాకు అలుపు రాదు. మరదలుతో ఆటా, మజాకా - పేకాట!"

"నాకు ఆడాలనిపించటం లేదు."

"ఈ కాస్తదానికే అలసిపోయావా? సరే, ముఖం అలా ముడుచుకోకు. ముచ్చటగా మూడు ఆటలు ఆది లేద్దాం. మళ్ళీ రాత్రికి ఆడుకుందాం" అన్నాడు పుల్లా రావు

"ఊ......" అంది సీత - మూడాటలు ఆడి, జిడ్డు ని వదిలించుకునే ఉద్దేశ్యంతో.

ఇరువురూ మళ్ళీ ఆడటం మొదలుపెట్టారు.

సావిత్రి పడి నిద్రపోతూనే వుంది.

రెండో ఆట సగంలో వుండగా - ఇద్దరు ఆడవాళ్ళు పేరంటం పిలవటానికి వచ్చారు.

పుల్లా రావు సీత పేకాడటం విడ్డూ రంగా, వింతగా చూశారు.

సావిత్రిని లేపింది సీత.

గుర్రుపెట్టి నిద్రపోతున్న సావిత్రి బద్ధకంగా కళ్ళు విప్పింది. పేరంటాళ్ళని చూస్తూ నే ఉలిక్కిపడి పైకి లేచింది.

"అంత మొద్దు నిద్రేంటి సావిత్రమ్మ! దొంగలు పడి దోచుకున్నా ఇంతేనా!" అందులో ఒకామె వెకిలి నవ్వు నవ్వుతూ అడిగింది.

"పక్కన మీ అన్నయ్యగారు వుండగా నాకేం భయం?" అంది సావిత్రి.

"దొంగలు అన్నయ్యగారినే దోచుకువేళితే?"

"ఆడ దొంగలా, మగ దొంగలా పిన్నీ - నన్ను దోచుకువేళ్ళేది?" పుల్లా రావు అడిగాడు.

"మగవాళ్ళు దోచుకెళ్ళి నిన్నేం చేస్తారులే. దోస్తే, గీస్తే ఆడ దొంగలే దోయాలి."

"అలా వున్నానా?"

"ఉన్నానా ఏంటి! పిల్లమీద పిల్లనివ్వడానికి ఆడపిల్లల అయ్యలు రెడీగా వున్నారు. నీవు ఊ అనటమే ఆలశ్యం."

"ఊ....." అన్నాడు పుల్లా రావు

"చూశావా చూశావా నీ మొగుడు!" అంది వచ్చినామెలో ఒకామె.

"మధ్యలో నాకెందుకు బాధ! భరించేది ఆయన చేసుకోమను. ఒకరు కాకపోతే వందమందిని" సావిత్రి మురిపెంగ అంది.

"చూశావా పిన్నీ! అదెలా తీసి పారేస్తు న్నదో?" పుల్లా రావుఅన్నాడు.

"సావిత్రమ్మ తీసి పారేసినంత మాత్రాన నీ మగతనానికేమీ తరుగురాదులే" అంది ఆవిడ.

ఇలాంటి మాటలే మరి నాలుగు అయిం తరువాత "ఈ పిల్లె వరు?" దీర్ఘం తీస్తూ అడిగింది వచ్చినామే.

సావిత్రి వివరించింది సీత గురించి.

"కాముడు పెద్దమనిషి అయింది. పేరంటం పిలవటానికి వచ్చాము." చెప్పింది ఆమె.

"అయ్యో, పెద్దమనిషి కాకముందే పెళ్ళి చేద్దా మనుకున్నాడు బాబాయి!" అంది సావిత్రి.

"అదే జరగలేదు. ఏం చేస్తాం" విచారంగ అంది ఆమె.

ఆ తర్వాత నాలుగు మాటలు మాట్లాడి వాళ్ళు వెళ్ళిపోయారు.

"సాయంత్రం పేరంటానికి వెళదాం" సావిత్రి చెప్పింది.

"దూరమా దగ్గరా?" సీత అడిగింది. అలా అయినా ఊరు చూడవచ్చని.

"తూర్పు వీధిలో మొదటి యిల్లే. రోశయ్యగారి పక్క యిల్లు" సావిత్రి చెప్పింది.

"అసలుకే గతిలేదు కోసరేం వేస్తాడు, అన్న సామెతలా ఈ వూరికి తూర్పు ఎటో సరిగా తెలియదు. తూర్పు వీధి రోశయ్యగారి పక్క యిల్లు బాగానే వుంది కొండ గుర్తు" నవ్వుకుంది సీత.

ఈ వూరు వచ్చేముందు సీతామనోహరి అందమైన పల్లెలుగురించి సుందరమైన కలలు కంది. చిన్న చిన్న కొండలు వుంటే ఎక్కాలని. చెరువులో దిగాలని కుంటపొలాల మధ్య తిరుగుతూ పిల్లిపిసరకాయలు పచ్చి కందిగింజలు తినాలని తోటలు దొడ్లు చూడాలని..... వకటికాదు వంద అనుకుంది.

ఇక్కడికి రాగానే

"పల్లెటూరిలో వీధుల్లో తిరిగితే నవ్వుతారు. పేరంటం అప్పుడు, ఎవరింట్లో అయినా మంచో చెడో జరిగితేను ఇల్లు కదులుతాము గాని పక్కింటికి కూడా వెళ్ళము" అని చెప్పింది సావిత్రి.

అంతే

సీత యిల్లు కదలలేదు.

"సాయంత్రం పేరంటానికి వెళదాం" సావిత్రి చెప్పంగానే "అమ్మయ్య ఈ వంకతోనయినా యిల్లు

కదులుతున్నాను" అనుకుంది సీత.

# 28

ఆ సాయంత్రం

సీతా మనోహరి సావిత్రి పేరంటానికి బయలుదేరారు.

ఇప్పుడు వెళ్ళే వాళ్ళ యిల్లు నాలుగు వీధుల అవతల అందువల్ల అక్కడ వీధులని మనుషులని చూడటానికి వీలయింది సీతకి.

"ఎవరు సావిత్రమ్మా! ఈ పిల్ల?" సీతని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తూ దోవలో ఎదురైన చాలామంది అడిగారు.

సీత గురించి సావిత్రి గొప్పగ చెప్పింది.

సీతకి యిదంతా చాలా తమాషాగా అనిపించింది.

సీత సావిత్రి వెళ్ళేసరికి చాలామంది పేరంటాళ్ళు వచ్చారు. వారి మధ్య కబుర్లు కాకరకాయలు దొర్లుతున్నాయి.

మళ్ళీ మొదలు సీత పరిచయం. ఓ సినిమాతారను చూసినట్లు సీతను చూడటం.

కొత్త వింత చూస్తు న్నట్లు జ్యూలో జంతువులని చూసినట్లు వాళ్ళని చూసింది సీత. పేరంటానికి వచ్చిన ప్రతి స్త్రీ తట్టెడు నగలు బుట్టెడు పూలు. పట్టుచీరల గరగరలు దిట్టంగ పెట్టుకున్న కాటుక కొందరైతే రూపాయి బిళ్ళంత కుంకుంబొట్టు నుదుట పెట్టుకుని అమ్మవారిలా వచ్చారు.

పెద్దమనిషి ఈ మధ్యాన్నమే అయిన పదమూడేళ్ళ ఆ అమ్మడి పేరు శ్రీవల్లీ కామాక్షి సుందర రాజమ్మ. అందరూ పిలిచేది కాముడు అని.

బస్తాడు వడ్లు నేలమీదపోసి. అప్పుడే కోసిన తాటి ఆకులు పరిచి నాలుగువేపులా కొబ్బరిచిప్పలు పెట్టారు. ఆ ఆకుల మీద వదిగి కూర్చుని వుంది కాముడు.

పొట్టిగ లావుగ వున్న కాముడు అప్పుడప్పుడు మాట్లా డుతూసిగ్గుతో మెలికలు తిరుగుతు కూర్చుంది.

వాళ్ళ పద్ధతులు అక్కడి వాళ్ళ మాటలు ప్రవర్తన కడు వింతగ వున్నాయి సీతకి! ఆలకిస్తూ కూర్చుంది.

"సరీగ కూర్చోవే కాముడూ! ఇప్పుడు యిదివరకు లాగా కాదు. పెద్దపిల్లవు అయావు తెలుసా?" ఒకామె అంది.

"పెద్దపిల్లను కాదు పెద్దమనిషినయాను ఇహిహి" అంది కాముడు.

"ఇదిగో కాముడూ! అలా మాట్లా డవద్దన్నానా!" తల్లి కోప్పడి "చూశావుగా పిన్ని! దీనికి చెప్పినాఅర్థం కావటం లేదు" అంది ఆమెతో.

"ఆ మూడుముళ్ళూ పడితే అన్నీ అవే సర్దుకుంటాయి" అంది ఆమె.

ఇంతలో మరొకామె వచ్చింది. ఆమెని చూస్తూ నే "రారా వదినా! నీ కోడలు సమర్త పెళ్ళికూతురు అయింది. యింక నీదే ఆలశ్యం. నీవు ఊ..... అంతే పనిలో పని పెళ్ళి ముహూర్తాలు కూడా పెట్టించేద్దా ము" నవ్వుతూ అంది కాముడు తల్లి.

ఊ...... అంటూ సిగ్గుతో మూడు మెలికలు తిరిగింది కాముడు.

ఆ తర్వాత మాటలు కూడా అలాగే సాగాయి.

"కాముడు తీపి తింటుందా?"

"నేను తినను బాబూ! అంతా తీపి తినాలంటే ఎలా సయిస్తు ంది!"

"అలా మాట్లా డకూడదు సౌమత్త పెళ్ళికూతురు చాలా జాగ్రత్తగా వుండాలి. ఆడజన్మకి ముక్తి మోక్షం యిదే మొదలు. ఈ నాలుగురోజులూ తీపి తినకపోతే ముట్టు కుట్టు నెప్పి వస్తు ంది. ఆనక బాధపడి లాభంలేదు."

"సుబ్బరత్నం! అమ్మాయి ఎన్నింటికి పెద్దమనిషి అయింది. శాస్త్రి గారికిచెప్పారా? తిధి వారం అన్నీ మంచివేనా?"

"అన్నీ మంచివేట. సరీగ పన్నెండు అయిదు నిమిషాలకి అయింది."

"ఏం కాదు. సరిగా పన్నెండు ఏడు నిమిషాలకి." కాముడు పెద్ద గొంతు వేసుకుని చెప్పింది.

"నీకు తెలియదు వూరుకో," తల్లి కోప్పడింది.

"సమర్త అయింది ఎవరేంటి?" చేతులు తిప్పుతూ అంది కాముడు.

"చీ.... నోరు మూసుకో." తల్లి కోప్పడింది.

"సమర్త పెళ్ళికూతురిని తిట్టకూడదు." ఓ పెద్ద ముత్తైదువ మూలనుంచి అరిచింది.

అపూర్వమైన పెద్ద ఘనకార్యం చేసినట్లు సదరు కాముడు తనలో తాను మురిసిపోతూ మధ్య మధ్య సిగ్గుతో మెలికలు తిరుగుతూ ముదినాపసాని మాటలు మాట్లాడుతున్నది.

యుక్తవయసు రాంగానే ప్రతి ఆడపిల్లకి జరిగే ఒక సహజమైన విషయానికి పేరంటం పిలిచి అంత ఆర్భాటం చెయ్యటం సీతకి విచిత్రంగ రవంత వెగటుగ అనిపించింది.

ఎప్పుడూ యిల్లు కదలని ఆడవాళ్ళకి ఈ పేరంటం స్వేచ్ఛగా వుందేమో పైగా అక్కడంతా ఆడవాళ్ళే కావటంతో పూర్తిగ సిగ్గు బిడియాలు వదిలేసి మాట్లాడుకోటం మొదలుపెట్టారు.

సమర్తలు ముట్లు పెళ్ళిళ్ళు కార్యాలు, పురుళ్ళు పుణ్యాలు వకటి కాదు. సమస్త విషయాలు వారిమధ్య దొర్లుతున్నాయి. అక్కడ ఎనిమిదేళ్ళ ఆడపిల్లల దగ్గరనుంచి పెళ్ళి కావాల్సిన పెద్దపిల్లల వరకూ ఆడపిల్లలు వున్నారు వాళ్ళల్లో కొందరు పెద్దవాళ్ళ మాటలని నోరు తెరుచుకు వింటున్నారు.

"కోటమ్మ కోడలికి నాలుగురోజులు కష్టపడ్డా కానుపు కాకపోతే మంత్రసాని ధైర్యంచేసి చాలా మెలుకువగ వ్యవహరించి ఎడంచేత్తో పొట్టని కిందకు నొక్కుతూ కుడిచేతిని సగందాకా లోపలికి పోనిచ్చి లోపలున్న పిల్లవాడిని కాలు పట్టుకుని కిందకు గుంజిందట అంతే కాన్పు అయిపోయింది" వివరంగ కళ్ళకి కట్టినట్టు వర్ణిస్తూ చెపుతున్నది వకావిడ.

"అయిదోసారి నెల తప్పిందట మరో మహిళ బాధపడుతూ చెపుతున్నది ఇంతాచేసి ఆమె బాధపడేది తనకి అయిదోసారి నెల తప్పినందుకు కాదు తనకి కూతురికి వకేసారి పురిటి టైము అని..... ఇద్దరూ వకేసారి కని కూర్చుంటే ఎలా అని......

"పట్నంవెళ్ళి రత్నం కొడుకు కత్తెర వేయించుకొచ్చాడుట తెలుసా!"

కత్తెరవేయించుకు రావటం ఏమిటో సీతకి అర్ధం కాలేదు. జాగ్రత్తగ వింది.

"కత్తెరవేయించుకు వస్తే మొగతనం తగ్గుతుందిట కదా!"

"అని అంటారు. మనకేమన్నా తెలుసా పాడా! అయినా ఈ కాలంవాళ్ళకి మరీ పాడు బుద్ధులు పుడుతున్నాయి వకళ్ళు లేక యిద్దరుట. రాఘవయ్య కోడలికి పదముగ్గురు పిల్లలు. వాళ్ళ యిల్లు చూడు ఎంత కళ కళ లాడుతుందో?"

సీతకి అప్పటికి అర్థం అయింది. రత్నం కొడుకు పట్నం వెళ్ళి యింక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకు వచ్చాడు. దానిని వీళ్ళు కత్తెరవేయించుకు రావటం అంటున్నారు యింకా నయం కత్తిరించుకు వచ్చాడు అనలేదు.

పట్నంలో చాలామంది యువతీ యువకులుకో ఎడ్యుకేషన్ మంచిది కాలేజిలో సెక్స్ విజ్ఞానం బోధించాలి అంటారు. పల్లెటూళ్ళలోసెక్స్ పేరెత్తితే తప్పు. వాళ్ళకి సెక్స్ గురించి పూర్తిగ పెద్దవాళ్ళు అయితే తప్ప తెలియదు అనుకుంటారు.

రెండూ తప్పే.

పుస్తకాలు నవలలు సినిమాలు చాలు సెక్స్ అంటే ఏమిటో పూర్తిగ తెలియటానికి. పేరంటం అప్పుడు కల్సుకుని ఆడవాళ్ళు చెప్పుకునే ఈ కబుర్లు చాలు. పసిపిల్లల దగ్గర నుంచి సెక్స్ అర్థం కావటానికి. సిగ్గు బిడియాలనేవి పూర్తిగ వదిలేసి ఈ పై పై సిగ్గులు ఎవరికోసం! అనుకుంది సీత వీళ్ళ మాటలు అవి వింటుంటే సీతకి వెగటుగ అనిపించింది.

"మీనా చదివి మీనా నిమ్మలూరు వెళ్ళటం అక్కడి పద్ధతులు చదివి తనెంత ఆశ పడింది? ఎప్పటికైనా పల్లెటూరువెళ్ళాలి మీనాలోలాగా సరదాగా గడపాలి అనుకుంది. పల్లెటూరిమనుషులు యిలా వుంటారని యద్దనపూడికి తెలియదా! యద్దనపూడి మరి కాస్త అందంగ వర్ణించింది. తతిమ్మా రచయిత్రులూ అంతే పల్లెటూరువాతావరణంని స్వర్గంలా రాసి పారేస్తారు. ఓసారి యద్దనపూడిని ఈ వూరు తీసుకువచ్చి వీళ్ళందరినీ చూపించాలి. లేకపోతే తనన్నా ఆ నిమ్మలూరు అన్న వూరు ఏ మూల వుందో తెలుసుకుని ఆ వూరు అన్నా వెళ్ళిరావాలి." అనుకుంది సీతామనోహరి.

"సువ్వి యనచు పాడరమ్మ సుందరాంగు లెల్ల కూడి. నాతి సమర్త ఆడేనమ్మా! సువ్వీ! సువీ!"

ఇద్దరు ముత్తయిదువులు గళం విప్పి పాడటం మొదలుపెట్టారు.

సీత ఆలోచనలకి దాంతో సడన్ బ్రేక్ పడింది.

ఈ పాట పూర్తి కాంగానే-

లక్ష్మీ సమర్త ఆడెనే. శ్రీలక్ష్మీ సమర్త ఆడెనే. మా లక్ష్మీ సమర్త ఆడెనే మంగళమే, శుభ మంగళమే- మరొకరు ఈ పాట ఎత్తుకున్నారు.

మొత్తానికి అవలీలగా అరడజను పాటలు పాడేశారు. చిమ్మిరి తొక్కటం, బొట్టు, పసుపు, తాంబూలం- అన్నీ వరసగా పూర్తి అయాయి.

పేరంటము పూర్తి అయింది.

సీతామనోహరి, సావిత్రి వాళ్ళతో వెళుతున్నాం అని చెప్పి, అక్కడనుంచి బయలుదేరారు. దారిలో ఎవరో తెలిసిన వాళ్ళు వుంటే, పదినిమిషాలు వాళ్ళింట్లో కూర్చున్నారు. ఆ తర్వాత ఇంటికి వచ్చారు.

ఎన్నో నవలలు చదివినా రాని అనుభవం-

ఎన్నో సినిమాలు చూసినా రాని అనుభవం-

సీతామనోహరికి-

ఒక్క పేరంటంతో వచ్చింది.

పేరంటానికి కట్టుకెళ్ళిన పట్టుచీర మారుస్తూ అడిగింది సావిత్రి-

"ఎలా వుంది పేరంటం?"

సీత చిమ్మిరి ఉండ తింటూ చెప్పింది-

"చాలా......రుచిగా.....వుంది......చి....మ్మిరి....."

## 29

ఆ రాత్రి-

సీతకి ఎంతకి నిద్ర పట్టలేదు.

తూనీగలు చెవిపక్క రొద పెట్టినట్లు- గతం తాలూకా నీడలు, అనుభవాలు ఆలోచనకి రాగా, మనసంతా చిరాగ్గా వుంది సీతకి. మొదట్లో లేదుగాని, రాను రానూ రాత్రి కాంగానే సీతకి రామకృష్ణ గుర్తువస్తున్నాడు. తన సంసారం, ఇల్లూ గుర్తుకొస్తున్నాయి

తను తొందరపడి ఇల్లు విడిచివచ్చిందా!

అది తన ఇల్లు- తన సంసారం. అక్కడే వుండాలి తను.

ఇల్లు విడిచివచ్చి తనింతవరకూ ఏమి సాధించగలిగింది?

తనకి తొందరపాటు ఎక్కువ అని - ముక్కుచివరే ముచ్చటగా కోపం వుంటుందని, డీప్ గా  ఆలోచించకుండా ఎగిరిపడతానని- తన గురించి చాలామంది అంటారు.

తనకి కోపం ఎందుకు వస్తుంది? -

కాని, మాట అంటే వస్తుంది.

తను ఎదుటి వారిమీద ఎందుకు ఎగిరిపడుతుంది? -

తనని అనవసరంగా అపార్థం చేసుకున్నప్పుడు.

"సీతూ! నీ అంత మంచి పిల్ల ఈ ప్రపంచం మొత్తంమీద మరోకతి లేదు. కాకపోతే, నీ అందమయిన ముక్కు చివర కోపిష్టిమారి కోతిపిల్ల కాపురం పెట్టేసింది. అది ఎవరిమీదకి ఎప్పుడెప్పుడు దూకుదామా అని, కళ్ళు పత్తికాయల్లా తెరుచుకుని రెడిగా వుంటుంది."

తనకి ఎప్పుడయినా కోపం వస్తే, ఆ కోపాన్ని పారద్రోలి, తన్ని ప్రసన్నురాలిని చేసుకోటానికి బుగ్గమీద చిరుచిటిక వేసో, ముక్కుచివర మృదువు పెదవులు ఆనించేవారు నానా యాతన పడేవారు. నెమ్మదిగా గిలిగింతలు పెట్టేవారు. అసలే తనకి చక్కిలిగిలి ఎక్కువ. దాంతో తను కిలకిలా నవ్వేసేది.

తనకి పూర్తిగా కోపం తగ్గిన తర్వాత - "నా కోపంతో మిమ్మల్ని బాగా విసిగించానా?" అంటే –

"ఆడపిల్ల సత్యభామలాగా, మధ్య మధ్య చిరుబురులాడుతూ అలకపాన్పు ఎక్కాలి. పతిదేముడు శ్రీకృష్ణుడిని ఆదర్శంగా తీసుకుని, తప్పయింది అని లెంపలేసుకోవాలి. గుంజిళ్ళు తియ్యాలి. మృదువుగా కాళ్ళు పట్టాలి. ఆ చేతులని అలా......అలా...... పైకి.....పై...."

"ఛీ...." అంది సీత.

అయితే సీత ఛీ అంటూ సిగ్గుపడింది అయితే - అది గతంలో నిజంగాను ఇప్పుడు కూడా ఛీ అంటూ సిగ్గుపడింది - అందమయిన ఆనాటి అనుభవాలు గురించి ఆలోచిస్తుంటే అవి మేనిని పులకింతలు పెట్టగానన్న మాట.

ఒక్క క్షణం మధురమైన ఆలోచనలు చేసిన సీత అంతలోనే వాస్తవంలోకి వచ్చింది. "ఓహ్! ఇదంతా అబద్ధమేనా? నేనున్నది బావ యింట్లో కదూ!" హృదయం బాధగా మూలుగుతుంటే అనుకుంది.

వారు తాగినా ఆ కథలు నిజం చెప్పివుండవచ్చు, అబద్ధం చెప్పి వుండవచ్చు. తను అక్కడే వుండి తాడో - పేడో తేల్చుకోవాల్సింది - పరుగెత్తుకు వచ్చేసింది.

స్టేషన్ దాకా వచ్చి, ప్రయాణంలో ఇబ్బంది పడకుండా అవీ ఇవీ కొని యిచ్చాడు కదా!

సీతూ! నీవు వస్తావా! నన్ను రమ్మంటావా! అని లెటర్ రాయవచ్చు కదా!

పెద్ద ప్రేమ కారిపోయినట్లు అవీ ఇవీ కొని యిచ్చాడు. అన్నీ వేషాలు, నాటకాలు.

తను ఈ వూరు వచ్చి వారం కావస్తున్నది. వారు అక్కడికి తనకోసం వచ్చారేమో! లేక లెటర్ రాశారేమో!

తన వూహలన్ని ఏమోలేనా?

వారు రాలేదేమో!

లెటర్ కూడా రాయలేదేమో!

"రాసి వుండరు. వచ్చే మహానుభావుడయినా - రాసే మహానుభావుడయినా ఇన్నాళ్ళ! ఆ మర్నాడే

పరుగెత్తుకు వచ్చేవారు." రామకృష్ణ మీద మళ్ళీ కోపం వచ్చింది సీతకి.

"ఛీ..... వారు తాగబట్టే కదా - తను ఆ కొంపమీద, ఈ కొంపమీద పడాల్సి వచ్చింది! వచ్చి వారం అయింది. వెళతానంటే - ఎప్పుడూ రావు మరో నాలుగు రోజులు వుండమని బలవంతం. ఇక్కడేమో తోచిచావదు. శొంఠికొమ్ములాంటి బావ - చలిమిడి సుద్దలాంటి అక్క..... ఇదే అక్కడ అయితే.....

మళ్ళీ సీత ఆలోచనలు రామకృష్ణ మీదకి పోయాయి.

సీత మనసు మాటిమాటికీ భర్తమీదకి పోవటానికి ఇక్కడికి వచ్చిం తరువాత జరిగిన సంఘటనలే.

ఈ యింట్లో స్నానాల గది చిన్నది. అందుకని సీత గదిలో స్నానం కాగానే అక్కడే లంగా, జాకెట్టు వేసుకుని, తన గదిలోకి వచ్చి చీర కట్టుకుంటుంటే, ఏదో అనుమానం వచ్చి వెనుతిరిగింది. గబుక్కున తలుపులు మూసుకున్నాయి.

ఎవరయినా చాటుగా తనని చూస్తున్నారా?

అలా అయితే, ఆ పాడుపని ఈ యింట్లో చేసేది ఎవరు?

ఇంకెవరు - పుల్లారావుబావ!

ఆ సంఘటన తర్వాత సీత, పుల్లారావుయింట్లో లేని సమయం చూసి స్నానం చేయటం మొదలుపెట్టింది. ఓ వేళ అతను యింట్లో నేవున్న పరిస్థితి ఏర్పడితే - స్నానంచేసి వచ్చి కిటికీలు, గది తలుపులు బిగించుకుని చీర మార్చుకునేది.

మరో సంఘటన -

పుల్లారావుసాయంత్రం ఇంటికి వస్తూ బోలెడు పూలదండలు తెచ్చేవాడు. సావిత్రి పది మూరలు పూలు

పెట్టుకుంటే, సీత వేలెడంత పూలదండని తాచుపామంత జడకి పాము పడగమీద వున్న మణిలా. చిన్నది పెట్టుకునేది.

"అదేంటి, అంత చిన్న దండ పెట్టుకున్నావ్! అరచేతి వెడల్పున బారెడు జడ వుంది. మొత్తం పూలు నీకే చాలవనుకున్నాను. ఇక్కడ ముఖమాటం ఏమిటి?- పెట్టుకో, పెట్టుకో - బాగా పెట్టుకో!" అన్నాడు పుల్లారావు.

"మీబావ నాకోసం పూలు తీసుకురావడం కూడానా. అయ్యో రాత! అలాంటి సరదాలే లేవు. నీవొచ్చావని తెచ్చారు. రెండు మూరల పూలన్నా పెట్టుకో!" అంది సావిత్రి.

సీతకి విషయం అర్ధమైపోయింది. "పూల వాసనకి నాకు తలనొప్పి వస్తుంది అందుకనే పెట్టుకోను" అంది.

"ఎట్టా! చుట్ట వాసన పడదు, బీడి వాసన పడదు సరే- పూల వాసన కూడా పడకపోతే చాలా కష్టమే. ఏ వాసనలూ పడకపోతే చాలా విషయాలలో చిరాకే. మా తమ్ముడుగారు ఎలా భరిస్తున్నారో!" పుల్లా రావుఅదోలా చూస్తూ అన్నాడు.

సంస్కారం అనే మాట అడ్డు రాకపోతే - సీత అప్పటికప్పుడే పుల్లా రావుముఖం పగిలేలా జవాబు చెప్పేదే.

సీత ఈ యింట్లో అడుగుపెట్టిం తరువాత, రోజు మొత్తంమీద ఇలాంటివి రెండు మూడుసార్లు జరుగుతూనే వున్నాయి. అందుకనే సీత ఇక్కడ నుంచి తొందరగా వెళ్ళిపోదామని నిర్ణయించుకుంది.

సీత, రామక్రిష్ణ కాపురం పెట్టి యింకా నెల కాలేదు. ఏదో ఇంటర్వ్యూ నిమిత్తం ఆ వూరు వచ్చి, వాళ్ళింట్లో దిగింది సీత ఫ్రెండ్ గిరిజారాణి.

ఆ రాత్రి-

పక్కగదిలో ఫ్రెండ్ కి పక్కవేసి, తను బెడ్ రూమ్ లో దూరి భర్త పక్కన పడుకోటం సీతకి ఇష్టంలేదు ఇష్టంలేదని చెపితే రామక్రిష్ణకి కోపం వస్తుందేమో!

సీత మధనపడుతున్న వేళ -

"ఆ అమ్మాయిని వంటరిగా అక్కడ పడుకోబెట్టి - మనిద్దరం గదిలో దూరటం బాగుండదు సీతా! పైగా ఆమె నీ డియరెస్ట్ ఫ్రెండ్ అంటున్నావు చక్కగా ఈ రాత్రంతా కబుర్లు చెప్పుకుంటూ పడుకోండి" అన్నాడు రామకృష్ణ.

ఆ మర్నాడు -

"నా ఫ్రెండ్ పదిరోజులు మనింట్లో వుందనుకోండి - ఈ త్యాగం పదిరోజులూ చేస్తారా?" సీత అడిగింది.

"సీతూ! ఇది నేను త్యాగం అనుకోటంలేదు. మర్యాద లక్షణం, సంస్కారం అనుకుంటున్నాను. ఆమె ఇవాళ వచ్చి రేపు వెళుతుంది - లేకపోతే పది రోజులు వుండి వెళుతుంది. నీవు అలా కాదుకదా - జీవితాంతం నా కౌగిలిలో వుంటావు" అన్నాడు రామకృష్ణ.

అలాంటి రామకృష్ణ ఎక్కడ. ఈ పుల్లా రావు ఎక్కడ!

పుల్లా రావుకి సావిత్రికి పడక గది వుంది. ఆ గదిలో మూడున్నర అడుగుల ఎత్తు వున్న తాతలనాటి పందిరిమంచం ఉంది. ఆ మంచానికి నగిషీలు ఉన్నాయి. తలవేపు, కాళ్ళవేపు మంచానికే అద్దాలు బిగించి ఉన్నాయి. మనిషి కాస్త కదిలితే చాలు - మనిషి బరువుకో, వాళ్ళు చేసి కోతిచేష్టలకో "కిర్రు....ర్రు....ర్....." మని రాగం తీస్తుంది.

పడకగది పక్కగదిలో సీత పడుకోటానికి మంచం వేశారు. సావిత్రి, పుల్లా రావు పడకగదిలోనే పడుకుంటున్నారు.

సీత సూక్ష్మగ్రాహి.

"ఇక్కడ పడుకుంటే నాకు గాలి చాలదు, నిద్రపట్టదు. వరండాలో పడుకుంటాను" అంది సీత విసనకర్రకి

గబగబా పని కల్పిస్తూ.

"తూర్పువేపు వరండాలో పడుకో. గాలి బాగా వస్తుంది. ఇక్కడ దొంగల భయం లేదులే. ఇది అసలే వర్షాకాలం. వర్షం వస్తే మాత్రం వరండా చిన్నది అవటంవల్ల జల్లు కొట్టిపూర్తిగా తడిసిపోతుంది. అప్పుడు ఇంట్లోకి వచ్చేసేయి" అంది సావిత్రి.

అప్పటి నుంచి -

వచ్చిన రోజునుంచీ సీత వరండాలో రాత్రిళ్ళు పడుకోటం మొదలుపెట్టింది.

ఈ రోజు రాత్రి -

ఎంతకీ నిద్రపట్టక, రామకృష్ణ గుర్తుకువస్తున్నాడు సీతకి.

పైగా -

రాత్రి ఏడు గంటలవేళ - సీత స్నానాల గదిలోకి వెళ్ళి వస్తుంటే పుల్లా రావు వెనుకనుంచి వచ్చి సీత భుజం గట్టిగా నొక్కిపట్టి "సావిత్రీ!" అన్నాడు.

సీత కెవ్వుమంది.

"అరెరె- నీవా సీతా! అది అనుకున్నాను. ఏమీ అనుకోకు. చీకట్లో చూడక మీద చేయివేశాను. లాంతరు తెచ్చుకోలేకపోయావా?" కంగారుగా అని, ఎవరో తరుముతున్నట్లు అక్కడనుంచి వెళ్ళిపోయాడు పుల్లా రావు

ఆ సంఘటన జరిగిం తరువాత -

సీత గుండె పది నిమిషాలదాకా దడ దడలాడుతూనే వుంది.

ఈ సమయంలో ఇక్కడికి వచ్చి, పెళ్ళాం వంటిమీద చేయివేసే అవసరం బావకి లేదు. ఇది కావాలని, దుర్బుద్ధితో చేసిన పని. తను వచ్చినప్పటి నుంచీ చూస్తూ నే వుంది- ఆ చూపులు, వికారం చేష్టలూను. తనమీద ట్రైలేసి చూశాడు.

బావ తన భుజం మీద చేయి వేయంగానే "ఎవరు?" అని తనంటే "నేనే" అనేవాడు. "అప్పుడు తను మామూలుగ "నువ్వా బావా!" అన్నట్లయితే "అవునే మరదలుపిల్లా చీకట్లో నీ అందాలు చూద్దా మని వచ్చాను" గుస గుసలాడుతూ అని మరికొంచెం ముందుకి జరిగి చేతుల్లో చుట్టేసి ఇంకాస్త ప్రొసీడ్ అయేవాడు. చీ......చీ...... ఇలాంటి పశువుతో అక్క యిన్నాళ్ళు ఎలా కాపురం చేస్తు న్నది? చీ..... చీ......" అనుకుంది సీత.

ఆ యింట్లో పది గంటలకే పడుకోటం అలవాటు.

అప్పుడు సమయం పదకొండు దాటింది.

జరిగిందంతా మననం చేసుకుంటున్న సీతకి ఎంతకి నిద్రపట్టలేదు.

అంతవరకూ ప్రశాంతంగ వున్న వాతావరణం ఒక్కసారిగ మారిపోయింది. దుమ్ము పైకిలేస్తూ తీవ్రంగ గాలి వీచింది. ఉరుములు, మెరుపులు అప్పటికప్పుడే వాన ప్రారంభం అయింది. అంతకంతకూ వాన తీవ్రత కూడా హెచ్చింది.

సీత పడుకున్న మంచం సగం తడిసింది. విసిరిసిరి జల్లు కొడుతున్నది.

"ఇంక లాభం లేదు" అనుకున్న సీత మంచం తెచ్చుకుని యింట్లో వేసుకుంది.

సావిత్రీ వాళ్ళ పడకగది పక్కగదిలో పడుకోక తప్పలేదు.

"వాళ్ళు పడుకొని గాడనిద్ర పోతుంటారులే" అనుకొంది సీత.

కాని -

పుల్లారావు సావిత్రి మెలకువగానే వున్నారు.

# 30

"సీత మహా పతివ్రత పాపం.....!"

ఈ మాట అన్నది ఎవరో కాదు పడక గదిలో వున్న పుల్లా రావు

పక్కగదిలో పడుకున్న సీత వులిక్కిపడింది ఆ మాట విని.

అసలు విషయం.

సీత లోపలికి వచ్చి పడుకుంది గాని నిద్రపట్టలేదు. పడకగదిలో పడుకున్న అక్కా బావ నిద్రపోయారు అనుకుంది. ఏదో దీర్ఘాలోచన చేస్తూ వుండగ "సీత మహా పతివ్రత పాపం" అన్న పుల్లా రావుగొంతు నిశ్శబ్దా న్ని చీలుస్తూ వచ్చి సీత కర్ణభేరిలో దూరింది.

సీతకి తెలుసు భార్యాభర్త మాట్లా డుకుంటుంటే చాటుగా వినటం చాలా తప్పని చెడ్డగుణం అని.

కాని

పుల్లా రావు సీత పేరు ఎత్తాడు

ఆ సీత ఎవరు?

తనేనా?

తనే అయితే మహా పతివ్రత పాపం అని ఎందుకు అంటాడు? బావ నోటివెంట వినవచ్చిన ఆ సీత ఎవరో మరోసారి విని ఆ తర్వాత చెవుల్లో దూది పెట్టు కోటమో లేక లేచివెళ్ళి పడమరవేపు వున్న టిక్కి గదిలో పడుకోటమో చేయాలి" అనుకుంది సీత.

ఒక్క నిమిషం నిశ్శబ్దం.

పడక గదిలోంచి మాటలు వినపడలేదు. తను పొరపాటు పడిందా? సీత అనుకుంటున్న వేళ మళ్ళీ మాటలు వినవచ్చాయి.

సీత అనుమానం నివృర్తి అయింది.

చాటుగ వినటం తప్పే. కాని వినకూడని తప్పుకాదు. ఇలాంటివి వినాలి. వింటేనే కదా మనుషుల గుణాలు తెలిసేది. పైగా పుల్లా రావు మాట్లా డేది సీత గురించే.

సీత వినటం మొదలుపెట్టింది.

పుల్లా రావు పడక గదిలోంచి మాటలు యిలా వినవచ్చాయి. సావిత్రి కూడా మాట్లా డుతున్నది. తమ మాటలు సీత వినటం లేదని నిర్భయంగ మాట్లా డుకుంటున్నారు

"మీ చేల్లె లంటే నీకెంత ప్రేమ?" పుల్లా రావు వ్యంగ్యంగా అన్నాడు.

సావిత్రి మాట్లాడలేదు

"ఇదిగో చూడు పెళ్ళామా? నీ చేల్లెలంటే నీకే కాదు నాకు ప్రేమే. అయితే ఈ విషయం ఆ గుంటది అర్థం చేసుకోవాలి కదా! ఏమంటావ్?"

సావిత్రి మళ్ళీ పెదవి కదపలేదు.

"నువ్వూ మాట్లాడవే సతీ సావిత్రి! నీవూ మహా పతివ్రతవే ఈ యింట్లో నా ప్రాణానికి యిద్దరు మహా పతివ్రతలు......

"ఇంక చాలించండి....."

"ఏమిటి నోరు మూసుకోమంది నన్నేనా?"

"అది కాదు."

"మరేదే మహా పతివ్రతా?"

"ఇప్పటికి రెండు సీసాలు ఖాళీ చేశారు."

సావిత్రి అన్నది విని సీత బిత్తరపోయింది.

పడకగదిలో బావ చేసేది! సీసాలు ముందు పెట్టుకుని వరసగ ఖాళీ చేస్తున్నాడా?

"రెండు కాకపోతే పది సీసాలు ఖాళీ చేస్తాను. నీ బాబుగాడి సొమ్ము అన్నట్లు ఆ బాధ ఏమిటి? నీ చెల్లెలుకి తెలిస్తే బాగుండదని నా కాళ్ళావేళ్ళా పడి బతిమిలాడావని రాత్రి కాంగానే అరగుక్క తీర్థంతో ఈ వారం రోజులూ సరిపెట్టుకున్నాను.

అరకిలో మాంసం వుండలు ఆరు సీసాలు పుచ్చుకోకుండా  నేను ఎప్పుడన్నా వున్నానా అని..... సరిగా వారం ఆగాను. ఇంకా ఎన్నాళ్ళు ఆగాను? మగాడంటే కక్కముక్కలు తినాల పీకదాకా తాగాలి. చేతికి నిండుగ వున్న ఆడదానితో.....

అద్సరే నీ చెల్లెలుఏమిటి మహా పతివ్రతలా వేషాలు వేస్తున్నది? నోట్లో వేలుపెడితే కొరకలేని నంగనాచి టుంగుబుర్రా! తీరు చూస్తుంటే మొగుడిని దగ్గరకు రానిచ్చినట్లు లేదు. దాని వళ్ళు చూశావా? వొంకంగ బింకంగ......

నీవు ఏడిచి చస్తున్నావని....కైమా వుండలు కాసినే తిని రెండు సీసాలే పుచ్చుకున్నాను. చూశావా నీ మొగుడెంత మంచివాడో, ఉహూ నేను కూడా పతివ్రతుడినే. నీ.....లా.....గా....
నన్నమాట....జరుగు....ఆ....కాసేపు కాళ్ళు పట్టు. ఈ మధ్య చుక్కలేక ఊరికే పైకి గుంజేస్తున్నాయి

వకే వక నిమిషం నిశ్శబ్దం.

"గట్టిగ నొక్కలేవా? ముప్పొద్దుల తింటావ్?"

"వంట్లో బాగుండలేదు" సావిత్రి నెమ్మదిగా చెప్పింది.

"నీకేనాడు వంట్లో బాగుండి చచ్చింది కనుక! పక్కఎక్కేసరికి పాతిక రోగాలు గుర్తుకు వస్తాయి. వంట్లో బాగుండకపోతే చేతులకేం చచ్చురోగం వచ్చింది. నా కాళ్ళులాగే కన్నా నీ చేతుల వాపు తీపు ఎక్కువా! భాంచెత్.... అసలు మీ ఆడాళ్ళకి పక్కరోజు విశ్రాంతి ఇవ్వకూడదు. ధూ..... మగాడు ఆడదాన్ని చెప్పు కింద తేలులా చేసేసి నేలకేసి రాసేసి.....

బైట వర్షం పడుతున్నది.

చల్లటి గాలి లోపలికి వస్తున్నది

అయినా -

పుల్లా రావు మాటలు వింటున్న సీతామనోహరికి ముచ్చెమటలు పోస్తు న్నాయి

బావ వెకిలి మనిషి అనుకుంది. పల్లె టూరి మొద్దు అనుకుంది. పరమ మూడుడు అనుకుంది. అంతేగాని మాంసం తిని మందు తాగి పెళ్ళాం ఆరోగ్యం బాగుండకపోయినా మాటలతో చేతలతో పరమ కిరాతకుడిలాగా హింసించే రకం అనుకోలేదు. పైగా భార్యముందు భార్య చెల్లిలిని పట్టు కుని అంతంత అసభ్య పదజాలంతో..... ఓహ్......

సీత యింకా ముందుకు ఆలోచించలేకపోయింది.

"నీ చెల్లె లు యిక్కడికి ఎందుకు వచ్చిందో తెలుసా?" పుల్లా రావు అడిగాడు.

"ఎందుకొస్తు ంది? మన్ని చూడటానికి వస్తు ంది" సావిత్రి అంది.

"పిచ్చి బొందవి అంతకన్నా నీకేం తెలిసి చచ్చులే."

"మనము వాళ్ళూ పెళ్ళిలో కల్సుకున్నాము. ఓ సారి మా వూరు వచ్చి ఓ నెల్లా ళ్ళు వుండి వెళ్లండని ఆహ్వానించాము. ఎప్పుడో అప్పుడు చెప్పాపెట్టకుండా మీ యింటికి వస్తా ము చూడు అంది."

"ఆపు......ఆపు...... ఆడదానికి అంత స్పీడు పనికిరాదు. ఆనాడు ఆ కులుకులాడి ఏమంది! మేము వస్తా ము అంది. అవునా?"

"అవును."

"మరి మేము వచ్చిందా? అది వక్కతీ వచ్చింది."

"మరిదిగారు ఆఫీసు పనిమీద వూరికి వెళ్లారని చెప్పింది కదా!"

"ఛత్. మనిద్దరం వున్నప్పుడు ఆ కొజ్జా నాయాల్ని, ఆ ఆడంగు రేకుల ముత్తయ్యని గారు గీరు అనకు. ఆచ్చోసి వదిలిన బొమ్మలా ఆడది తిరుగుతుంటే దాన్ని అదుపు చేయని మగాడు ఓ మగాడేనా అని....."

"అది...... అది......"

"చెవి పక్కన అలా నసక్కు, అది మహాపతివ్రత అని నీ అభిప్రాయం అదీ నీ ఏడుపు అంతేనా?"

"సీత చాలా మంచి పిల్లండీ!"

"ఛత్, నోరు మూసుకుని వినమన్నానా! అది మొగుడిని వదిలేసి వచ్చింది."

"సీత అలా అని మీతో చెప్పిందా?"

"అమ్మనీయమ్మ. ఏం రోషమే, నీ చెల్లెలిని అంటే దానికి గీర నీకు రోషం. ఇద్దరికిద్దరూ సరిపోయారు. నేనో దేవ రహస్యం చెపుతాను వింటావా?"

"ఊ అనవెంటి?" గసురుకున్నాడు పుల్లారావు

"ఊ......" అంది సావిత్రి.

"మొగుడు మాట ఎప్పుడు ఎత్తినా అదే...... నీ చెల్లెలు.... సీత మహా పతివ్రత వుంది చూశావ్! మాట తప్పిస్తున్నది"

"దానికి సిగ్గు ఎక్కువ."

"నీ బొంద. వెనుకటికి ఇలాంటిదే మొగుడి మొహం చూడటానికి సిగ్గుపడి ముష్టివాడి దుప్పట్లో దూరిందిట. వెధవ కథలు చెప్పకు.

నీ పెళ్ళయి ఇన్నేళ్లయింది. మీ వాళ్ళు ఎవరైనా ఈ వూరు వచ్చారా! ఈ మరదలు మాయలాడి వచ్చిందా? రాలేదు. ఈ రోజు నిన్ను వెతుక్కుంటూ వచ్చి మొగుడు వూసు ఎత్తకుండా....

"పల్లెటూరు ఎప్పుడూ చూడలేదు చూద్దామని వచ్చానని చెప్పింది కదా! కొండలు ఎక్కటం పొలాల్లో తిరగటం ఇష్టమని చెప్పింది" సావిత్రి అంది.

"అవును. నాకు తెలుసు దానికి తిరుగుడు చాలా యిష్టం అని తెలుసు. దీని తిరుగుడు చూసి మొగుడు తన్ని తగలేసి వుంటాడు. ఇక్కడికి వచ్చింది. ఎంత బరి తెగించింది కాకపోతే నాతో కూర్చుని పేక ఆడుతుంది? నీవు గోడ్డులాగా పడి నిద్రపోతున్నావు అప్పుడేం జరిగిందో తెలుసా?"

"ఊహూ!"

"పొరపాటున ఓ ముక్క కింద పడేశాను. దాన్ని మళ్ళీ ఎత్తబోయాను. వెంటనే అది నా చేతిని గట్టిగ పట్టేసుకుని నొక్కుతూ :మా మంచి బావ! బంగారు బావ..... ముక్క నాకు వదిలేస్తాడుగ అంది. వయసులో వున్న ఆడది వరసకి మరదలు పిల్ల చేయి నొక్కేస్తుంటే ఎంతటి మగవాడు అయితే మాత్రం.....

"ఉన్నమాట చెప్పినా నేను ఏమీ అనవని తెలుసు. అబద్దాలు ఆడకండి అది అలాంటి పిల్ల కాదు......" అలా అంటున్న సావిత్రి వక్కసారిగా కేవ్వుమంది.

సావిత్రి పెట్టిన కేకలో బాధ భయం చోటు చేసుకున్నాయి.

"నేను అబద్ధాలు ఆడుతున్నానా?"

"వద్దు వద్దు"

"నేను అబద్ధాలు ఆడుతున్నానా?"

"అబ్బా నొప్పి."

"నేను అబద్ధాలు ఆడుతున్నానా?"

"లేదు లేదు ఆడటం లేదు."

"అది నా చెయ్యి పట్టుకుని పిసికింది."

"అవును. అవును."

"ముందే ఈ చావుచాస్తే ఈ గోల వుండేది కాదుగా! ముందా ఏడుపు ఆపు. ఏడ్చే ఆడదాన్ని నమ్మకూడదు" గట్టిగ కసిరాడు పుల్లారావు

సావిత్రి ఏడుపు ఆపుకోలేక నోరు నొక్కుకుని ఏడుస్తున్నది ఆమె ఏడుపు గది గోడలు చీల్చుకుని బయటికి వస్తున్నది ఆమె ఏడుపులో తరతరాల యుగయుగాల స్త్రీల బాధాపూరిత వేదన భరిత గాథలు వినవస్తున్నాయి

"లోపల ఏం జరిగింది? బాధతో భయంతో అక్కకేవ్వుమంది. వాడు..... వాడు..... ఏం చేశాడు? కొట్టాడా? ఉహూ కొడితే చప్పుడు అయేది. మరి.....మరి.....ఏం చేశాడు?" సీత వణికిపోతూ ఆలోచించింది.

కొద్దిసేపు ఆగి

"నాకు జ్వరం వచ్చింది. ఈ రోజుకి యింక చాలు" అంది సావిత్రి వణుకుతు.

"జ్వరానికి మందు యిస్తా. దా పిచ్చిముండా!"

"వికారంగా వుంది.....రేపు....."

"ఏమిటేవ్ మాటకి మాట చెపుతున్నావ్! వంటికి వాపుతీపు ఎక్కువయినట్లు ంది"

ఆ తర్వాత ఏం జరిగిందో మళ్ళీ మాటలు వినపడలేదు.

పందిరి మంచం మాత్రం మూగబాధ అణుచుకుంటూ మూలిగింది.
కొద్ది సేపు ఆగి

"ఒసేయ్! సావిత్రీ!"

"ఊ....."

"మూలిగినట్లు వుకొట్టక సరీగ ఊకొట్టు."

"ఊ....."

"అదీ అలా...... రేపు నీవో పని చెయ్యాలి."

"చెప్పండి."

తెలిసిన వాళ్ళింట్లో ఎవరో చచ్చారని చెప్పి రేపు మధ్యాహ్నం నీవు రెండు గంటలు యిల్లు విడిచి బయటికి వెళ్ళాలి."

"ఎందుకు?"

"ఎదురు అడగవద్దు. సరే అను."

"సరే. మరి ఎవరూ చావలేదు కదా?"

"చావరు చచ్చారని చెప్పి వెళ్ళాలి. వంటరిగానే వెళ్ళాలి. సీత యింట్లో నేవుండాలి."

"ఎందుకు?"

"ఎదురు అడగవద్దన్నాను. నీవు అక్కడికి వంటరిగానే వెళ్ళాలి. సీత వస్తానని చెపితే రాకూడదని చెప్పు. అలా వెళ్ళి యిలా వస్తానని చెప్పు. అప్పుడు నేను కూడా యింట్లో వుండను."

"నాకు తెలుసు తర్వాత వస్తారు."

"బాగానే గ్రహించావ్. తర్వాత.....?"

"సీత అలాంటిది కాదు."

"నీకు తెలుసా?"

"దాన్ని మీరు గోల చెయ్యొద్దు. నా మీద ప్రేమతో నాలుగురోజులు వుండి వెళదామని వచ్చింది."

"నేను గోల చేయటమెంటే పంది! నీ తిరుగుబోతు తిప్పులాడి చెల్లు లుసమయంకోసం చూస్తు న్నది"

"అది అలాంటిది కాదు. నేను వప్పుకోను. మీరు చావగోట్టినా సరే."

"చీ.....నిన్ను చావగోడతానా? తప్పుకదూ! నాకు నీతులు చెప్పే మహా పతివ్రతవి.....

"వద్దు వద్దు. పిన్నీసు తీయవద్దు....." భయంతో అరిచినట్లే అంది సావిత్రి.

"మరి నాకు ఎదురు చెపుతావా! చెపుతావా అని..... ఊ...... కదలకు...... వింటావుగా చెప్పినట్లు.....!" పుల్లా రావు వికృతంగ నవ్వుతూ కసిగా అంటున్నాడు.

సావిత్రి కెవ్వు కేవ్వుమంది. అయితే నోట్లో ంచికేక బయటికి రాకుండా సావిత్రే తన చేతులతో నోరు నొక్కుకుంటున్నదో పుల్లా రావే నోరు నొక్కుతున్నాడో, ఆ గదిలో ఏం జరుగుతున్నదో దేముడికి తెలియాలి.

కళ్ళముందు ఓ వ్యక్తిని మరో వ్యక్తి గండ్ర గొడ్డలి తీసుకుని ఓసారి చెయ్యి మరోసారి కాలు అంగాంగాలు నరికి విసిరి దూరంగ పారేస్తు న్నట్లు..... అది కళ్లా రా చూస్తు న్నట్లు సీత భయంతో బిగుసుకుపోయింది.

పుల్లా రావు పిన్నీసు ఎందుకు తీశాడు?

పిన్నీసు పెట్టి సావిత్రిని ఏం చేస్తు న్నాడు?

పిన్నీసుపెట్టి గీస్తు న్నాడా?

పిన్నీసుపెట్టి ఏ చేతి మీదో గుచ్చుతున్నాడా?

సీతకి ముచ్చెమటలు పోశాయి. గజ గజ వణుకుతూ మంచానికి అంటిపెట్టు కొని వుండిపోయింది.

కొందరు భర్తలు భార్యలని కొడతారని సీత వింది.

ఇది ఏ రకం హింస?

ఒక పోలీసువాడు దొంగలు పెట్టే హింసా!

దొరికిన శత్రువుని విడవకుండా పెట్టె వింత హింసా?

మిలటరీ వాడికి శత్రుదేశం సైనికుడు దొరికితే వాడిని పెట్టె హింసా!

"వింటావుగా!" పుల్లా రావు అడుగుతున్నాడు.

"వింటాను. వింటాను. వద్దు వద్దు."

"రేపు మధ్యాహ్నం గుర్తుంచుకో."

"అలాగే అలాగే."

"ముందే ఈ ఏడుపు ఏడిస్తే సరిపోయేదిగా? సరే రా."

"ఇంక ఈ పూటకి......

"ఛత్. దరిద్రపు ముండా! ఎక్కిన కైపు దిగిపోయేలా నేను ఈవాళ కక్కముక్కలు నమిలి ఎందుకు తాగానో తెలుసా! తెలుసా అని అడుగుతున్నాను.

"ఉహూ"

"అది యింట్లో తిరుగుతుంటే చూస్తూ వుండలేక తాగాను. అన్నట్లు దానికి ఏ వాసనలు గిట్టవుట. మొగుడు ఏ బాధలు భరించలేక వాసన గొట్టు దాన్ని వదిలేసి సన్యాసుల్లో కలిసిపోయాడు. దాని మొగుడు స్థానంలో నేనే వుంటే ఏం చేస్తానో తెలుసా! ఏ వాసనలు గిట్టవుటే! మగవాసన కూడా గిట్టదా? అని గట్టిగా పీక పట్టుకుంటాను. అప్పుడు అది నోరు వెళ్ళబెడుతుంది, చుట్టపోగ సిగరెట్టు పొగ దాని నోటినిండా వూదుతాను. పొగ ఘాటుకి అది ఉక్కిరిబిక్కిరి అవుతుంటే వెంటనే నేను.....

వింటున్న సీత చర్రున మంచం మీదనుంచి లేచింది. ఇంతవరకు ఎప్పుడు వినరాని మాటలు వినేసరికి కలలో కూడా వూహించనిది పక్క గదిలో ఒక్కసారిగ షాక్ తింది సీత.

"రామంగారు, తమ్ముడుగారు. అది కాదమ్మా సీతా! ఏంటి మరదలు పిల్లా! నీకు సరీగ మర్యాదలు చేయకపోతే తోడల్లు డుగారురేపు నన్నే అంటారు. నీకోసం అవి తెచ్చా! నీకోసం ఇవి తెచ్చా!" అంటూ మర్యాదలు చూపినవాడు చాటుగ పెళ్ళాంతో తిరుగుబోతు అంటాడా, ఇంకా ఎన్నెన్ని మాటలు! ఎంత దుష్ట ఆలోచన! నోటినిండా పొగ వదులుతాడా? పొగ......!

సీతామనోహరి కళ్ళు భగ భగ మండుతున్న నిప్పుల్లా అయాయి.

చర్రున పైకి లేచి తోకచివర నుంచున్న నాగరాణిలా మంచంమీద నుంచి లేచి నిలబడింది.

ఆ క్షణాన సీత.

మహంకాళిలా.

భద్రకాళిలా.

నరరూప రాక్షసుడిని విరుచుకు తినేలా పడక గదివేపు బైలుదేరింది.

మొదట్లో అనుకోని అంత దారుణమైన మాటలు వినటంవల్ల సీత షాక్ తింది. ఆ షాక్ లో భయపడింది గజ గజ వణికింది. తెలియకుండానే కన్నీరు కార్చింది.

ఇప్పుడు సీత అది తట్టుకుని తల ఎత్త గలిగింది.

సీతకి ఆవేశం వస్తే మనిషి కాదు, సాక్షాత్తూ శక్తి స్వరూపిణి. ఆదిశక్తి. అమ్మవారు.

సీత సరాసరి పుల్లా రావుపడక గదిలోకి వెళ్ళి పుల్లా రావుపీక పుచ్చుకుని పైకి లేపి ముఖం బద్దలయేలా ముఖం అంతా పిడికిళ్ళతో మోది చిన్నాభిన్నం చేస్తూ "ఏం కూశావురా గాడ్దె కొడకా! ఏది మళ్ళి పెదవి కదుపు! పొగ వదులుతావా? పొగ తాగటానికి పెదవులు వుండాలి కదరా భ్రాష్టుడా!" అంటూ తన వాడి అయిన గోళ్ళతో పెదవులని చీల్చి పారేస్తూ మరో ఆడదాన్ని వక్రదుష్టితో చూడకుండా కనుగుడ్లు పీకి.....

సీత శివమెత్తిన దానిలా లేచి పడక గది తలుపుదాకా వెళ్ళింది.

లోపలినుంచి -

"దీని తాతలాంటి దానిని చుశానే, ఎక్కడన్నా సరే వకటి గుర్తుంచుకో ఆడదాన్ని మానభంగం మగాడు చేస్తాడుగాని మగాడి మానభంగం ఆడది చెయ్యలేదు. రాక్షసిలాంటి ఆడదైనా సరే లాగి రెండు గూబలు పగలగొట్టి ఎడా పెడా ముఖం పగిలేలా వాయించి......

అంతే.

ఇదేమిటి దీని తాతలులాంటి వాళ్ళే లొంగారు. రేపు నేను చెప్పింది నీవు చేయి. ఈ రాత్రికి ఏం చేస్తాను. దానిని తల్చుకుంటూ నీతో స్వర్గసుఖాలు పొందుతాను. పెదవి కదిపావా పీక నొక్కుతాను. కాసేపు నిన్నే మరదలు పిల్ల అనుకుంటూ

ఆ తర్వాత

పుల్లా రావు నోట్లో ంచిమాటలు రాలేదు. బూతులు తప్ప

సీతా మనోహరి

గప్పున వక్కసారి పెద్దగ వెలిగి ఆరిపోయిన దీపంలా సర్వశక్తులు వక్కసారిగ అంతర్ధానమైన శక్తి విహీనలా గుమ్మం దగ్గరకు వస్తూ నే కుప్పకూలిపోయింది.

సీత దుఃఖం ఆపుకోలేకపోయింది. నిస్సహాయ స్థితిలో గుండెలు అలిసేలా ఎలుగెత్తి ఏడవాలనిపించింది. దోసిట్లో ముఖం దాచుకుని వరండాలోకి పరుగు తీసింది.

బయట.

ధారాపాతంగా వర్షం కురుస్తున్నది.

ఆకాశం ఎడతెరిపి లేకుండా కన్నీరు కారుస్తున్నది

సీత ఆ వర్షంలో తడుస్తూ గట్టిగ రోదించింది.

అరగంట తర్వాత.

వర్షం వెలిసింది.

సీతకి కన్నీళ్లు ఆగాయి.

అప్పటికి సీత ముద్ద ముద్దగా తడిసి చల్లబడిపోయింది. అయినా సీత అలాగే అక్కడే స్తంభానికి ఆనుకుని కూర్చుండిపోయింది.

"వరుణదేవా! నా కళ్ళు తెరిపించావ్! నీకు నా శతకోటి నమస్కారాలు" అనుకుంది సీత.

అవును సీతకేమి తెలియదు. కనుల ముందర కాన వచ్చేది కూడా గుర్తించలేకపోయింది.

గుర్తించిన తర్వాత.

సీత దీర్ఘాలోచన చేస్తూ అలా వుండిపోయింది.

# 31

"సీతా!"

"సీతా! నేనేం చేశానే పిలిచినా మాట్లా డవ్?" సావిత్రి గొంతులో బాధ సుడులు తిరిగింది.

"ఉదయం కాస్త జ్వరం వచ్చింది అన్నావ్. అందుకే ముభావంగా వున్నావనుకున్నాను. ఇప్పుడు.....ఇప్పుడు......

అప్పటికి సీత మాట్లా డలేదు అటుతిరిగి చీరలు మడత పెడుతూ. పెట్టె సర్దుకుంటూ ఉండిపోయింది.

` "ఉదయం బాగానే ఉన్నావు కదే! ఇంతలో ఏమయిందే సీతా! ఆయనేమన్నా అన్నారా? తెలివితక్కువ మొద్దు ని - నేనే తెలివితక్కువగా ఏమన్నా అన్నానా?" సావిత్రి అడిగింది.

"ఉదయం బాగున్నానంటే - ఎందుకు బాగుండను? ఆ భ్రష్టు డి ఎదుట ప్రయాణం అయితే, వెళ్ళనిస్తా డో లేదో అని...... ఈ యింట్లో పచ్చి మంచినీళ్ళు ముట్టు కోటం యిష్టం లేక, చలితో జ్వరం వస్తున్నదని చెప్పి, ముసుగుబిగించి మంచం దిగకుండా పడుకున్నాను.

నీ మొగుడు ఎంత ప్రేమ ఒలకబోశాడు! అయ్యో! జ్వరమా మరదలా! చిలిపి మహాలక్ష్మిలా ఇంట్లో నడుస్తు ంటే మా యింటికే అందం వచ్చింది. జ్వరానికి ఆచార్లు గారి దగ్గర మందు తెస్తా ను. వద్దు, నా దగ్గర మాత్రలు వున్నాయని - ఆ ఒక్కమాటా అనగలిగాను. లేకపోతే ఆ రాక్షసుడు వదలడు జ్వరానికి మందని చెప్పి

ఇంకేదయినా కూడా తెచ్చి మింగిస్తాడు.

నీవు కాఫీ ఇచ్చావు. అయినా నేను తాగలేదు. ఈ యింట్లో మంచినీళ్ళు కూడా తాగనని ఒట్టు పెట్టుకున్న దానిని - కాఫీ ఎలా తాగుతాను? నీవు చూడకుండా అవతల పారబోశాను. కాఫీ తాగకపోతే నాకు తలనొప్పి వస్తుంది - అయినా సరే, పారబోశాను.

ఇప్పుడు బైటికెళ్ళిన నీ మొగుడు - పిండాకూడు తినటానికి పన్నెండు దాటింతరువాత గాని యింటికి రాడు. ఈ లోపలే నేను ఈ వూరు పొలిమేరలు దాటి వెళ్లిపోవాలి......"

ఇలా అని సీత సావిత్రితో చెప్పలేదు అనుకుంది.

ఎన్నిసార్లు పిలిచినా సీత మాట్లాడకపోయేసరికి సావిత్రి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏం జరిగిందో తెలియదు. సీత ప్రయాణమై వెళ్లిపోతున్నది. తన కంటపడకుండా ఆయన ఏమైనా సీతని....."

సీత పెట్టె సర్దటం అయింది. పెట్టెకి తాళం వేసింది.

సావిత్రి వెళ్ళి గబుక్కున సీత చెయ్యి పట్టుకుంది.

"సీతా! ఏమిటే యిది?"

సీత ముఖం తిప్పుకుని చెప్పింది- "నేను వూరికి వెళుతున్నాను."

"ఇంత అర్థాంతరంగా......"

"ఊ...."

"ఏమయిందే నీకు?"

"................."

"ఏం జరిగిందే సీతా?"

"................."

"నీకు కోపం వచ్చినట్లు తెలుస్తూనే వుంది. ఏం జరిగిందని కోపం వచ్చింది? మాకు తెలిసినంతలో మేమేమి పొరపాటు చేయలేదే! ఒవేళ తెలిసీ తెలియక నేనే చేశానేమో - నీకన్నా పెద్దదానినయినా, నీ చేతులు పుచ్చుకుని చెపుతున్నాను - క్షమించవే సీతా!"

సీత మాట్లాడకుండా చేతిని వెనక్కి గుంజుకుంది.

"వారు లేనప్పుడు వెళుతున్నావు. వారికి నేనేం సమాధానం చెప్పను? సీత ఏది అని అడిగితే, ఏం చెప్పను? వారు వచ్చిందాకా వుండి, వారితో చెప్పి వెళ్ళు."

సీత నిదానంగా తల ఎత్తి, హృదయం లోతుల్లోకి చొచ్చుకుపోయేలా సావిత్రి కళ్లల్లోకి గుచ్చి చూస్తూ -

"వారితో చెప్పి వెళ్ళాలా?" అంది వ్యంగ్యంగా.

చేయరాని తప్పు చేసినట్లు - టక్కున సావిత్రి కనురెప్పలు వాలిపోయాయి.

హేళనతో కూడిన చిరునవ్వు సీత పెదవులపై పరుచుకుని, అంతలోనే మాయం అయింది.

సీత బుజానికి బ్యాగ్ తగిలించుకుని, చేతిలోకి పెట్టె తీసుకోబోయింది. చటుక్కున సీత చెయ్యి పుచ్చుకుని ఆపింది సావిత్రి.

"సీతా! నీవు వెళ్ళటానికే నిర్ణయించుకున్నప్పుడు- నేను అడ్డుపెట్టినాఆగవు. నాకు తెలుసు. దయచేసి యిదైనా చెప్పి వెళ్ళు - ఏం జరిగిందని ఇంత అర్జంట్ గా ప్రయాణమై వెళుతున్నావు?"

"రాత్రి మీ మాటలు విన్నాను - చాలా!" కూల్ గా చెప్పింది సీతామనోహరి.

షాక్ తగిలినట్లు - టక్కున చేతిని వెనక్కు లాక్కుంది సావిత్రి.

"నేను వెళుతున్నాను!" సీత పెట్టె చేతిలోకి తీసుకుని చెప్పింది.

నిర్ఘాంతపోయి అలా నిలిచిన సావిత్రి, తెలివి తెచ్చుకుని ఒక్కంగలో వాకిలి సమీపించి, వాకిలికి అడ్డంగా నుంచుంది.

సావిత్రి వాకిలికి అడ్డంగా నుంచున్నందుకు సీత భయపడకపోగా - పక పక నవ్వింది.

"భేష అక్కా! భేష్! అదీ పతిభక్తి అంటే! పూర్వం మహా పతివ్రతలు భర్త తప్పుడు కోరికలు కోరినా ఆనందంగా తీర్చేవారుట........ ఆ కోవలోకి చెందినదానివి నీవు. నీ మొగుడు నన్ను కోరాడు. నీవేమో అతగాడికి అడ్డు రాకుండా - యీ మధ్యాహ్నం ఎవరూ చావకపోయినా, చచ్చారని చెప్పి ఇంట్లోంచిబైటికి వెళ్లిపోతావ్. అప్పుడు...... అప్పుడు....."

నిలబడటానికి శక్తిలేని దానిలా - కింద కుప్పలా కూలబడిపోయి, హృదయవిదారకంగా పెద్దగా ఏడ్చింది సావిత్రి.

సీత తెల్లబోయింది!

పీలగా, పొట్టిగా వుండే సావిత్రి అడ్డుగా, నిలిచినా ఫరవాలేదు - ఒక్కతోపు తోసి బయటికి వెళ్ళగలదు సీత.

సీత అర్భకురాలు కాదు. దుర్భకురాలూ కాదు.

సావిత్రి ఏదన్నా అంటే- ముక్క చివాట్లు పెట్టి నిర్భయంగా వెళ్ళిపోదాం - అనుకుంది సీత. కాని, సావిత్రి అలా ఫెయింట్ అయి పడిపోయినట్లు కూలబడిపోయి ఏడుస్తుండేసరికి సీత తెల్లబోయింది.

"సీతా! ఈ పూట నిన్ను నేనే పంపిద్దామనుకున్నాను" సావిత్రి ఏడుస్తూనే చెప్పింది.

"ఇదో కొత్త నాటకమా?"

"కాదు, నిజం!"

"నిజం! హ్హా! ఎవతన్నా తలకుమాసింది వుంటే చెప్పు - నీ మాట నమ్ముతుంది. నేను ఎలాగూ వెళుతున్నా కదా అని - కట్టుకథ చెపుతున్నావా?"

"ఎలా చెపితే నా మాట నమ్ముతావు సీతా!"

"ఎందుకు నమ్మాలి?"

"నిజం నీకు తెలియాలి. నీవు నమ్మితీరాలి - లేకపోతే నాకు మనశ్శాంతి వుండదు."

"నీ మనశ్శాంతి కోసం - నీవు చెప్పిన కట్టు కథనల్లా నేను నమ్మాలా?"

"సీతా! నీకు తెలియదమ్మా! నేను బతికున్నానని అనుకుంటున్నావు కదూ! ఉహూ! ఏనాడయితే సావిత్రి మెడలో మూడు ముళ్ళూ పడ్డాయో - ఆనాడే ఉరి తియ్యబడింది. ఇది శరీరం కాదు, బతికున్న కట్టె. ఈ కట్టెకి ఆశలు లేవు- కోరికలు లేవు. ఈ మొండి ప్రాణి మూడుసార్లు ఆత్మహత్య చేసుకోటానికి ప్రయత్నిస్తే- నీ ఖర్మ నీవనుభవించాలని చెప్పి, మళ్ళీ ప్రాణం పోశాడు. ఆ భగవంతుడికి కూడా నామీద దయలేదు.

సీతా! ఓ విషయం నీకు తెలుసో, తెలియదో - మొదటిసారిగా ఎద్దు మెడమీద కాడి వేసినప్పుడు, ఆ కాడిని

వదిలించుకోటానికి తల విదిలించి, విదిలించి నానా హైరానా పడుతుంది పరాజయం తప్ప, ఫలితం వుండదు. కాడి బరువుకి మెడంతా పుండు అవుతుంది. ఆ పుండు వెర్రి బాధతో సలుపుతుంటుంది. సలిపినా తప్పదు. కాడి బరువు యింకా యింకా పుండుమీద పడి, ఒరుస్తూ నే వుంటుంది. ఆపై కాయకాసిపోతుంది అలవాటు పడిపోతుంది దానికి. ఆ తర్వాత ఏం జరుగుతుందీ అన్నది నీకు తెలియదు. నాకు తెలుసు. ఎందుకంటే - నేను..... నేను..... ఆ ఎద్దు లాంటి మనిషిని కాబట్టి....."

"అక్కా!" అంది సీత.

సావిత్రి చెప్పిన తీరుకి చలించిపోయింది సీత.

"నిన్ను ఉండమనను సీతా! ఇప్పుడే వెళ్ళిపోదువుగాని- ఆయన వచ్చేలోపలే వెళ్ళిపోదువుగాని కనీసం నేను చెప్పేది విని వెళ్ళు మనశ్శాంతి అనే మాట తప్ప - నేను పొందటం అంటూ ఎప్పుడూ జరగలేదు. నీ విషయంలో కూడా నాకు మనశ్శాంతి లేకపోతే నరకమే! ఆ నరకయాతన నేను తట్టుకోలేను చెప్పనా సీతా! నేను చెప్పింది వింటావా?" సావిత్రి డగ్గుత్తికతో అడిగింది.

అప్పటికే సీత సావిత్రి బాధని చాలా అర్థం చేసుకుంది.

"చెప్పు అక్కా! నీవు చెప్పింది వింటాను. విన్న తరువాతనే వెళతాను"

"నిజంగానా?" సంభ్రమాశ్చర్యాలతో అడిగింది సావిత్రి.

"నిజం!" అంది సీత.

మళ్ళీ ఈ అవకాశం వస్తు ందో, రాదోనన్న ఆదుర్దా మనసులో చోటుచేసుకోగా - సావిత్రి వెంటనే చెప్పటం మొదలుపెట్టింది. ఇలాంటి విషయాలు ఆలస్యం చేయకూడదు.

"సీతా! నేను చెప్పేది జాగ్రత్తగా విను. స్త్రీ ఓ సందర్భంలో సిగ్గుపడుతుంది - మరో సందర్భంలో సిగ్గు

విడిచేస్తుంది. అభిమానవతి అయిన స్త్రీ మాత్రం - తాను నిలువునా కాలి బూడిద అవుతున్నా, అభిమానంతో తన సంసారం విషయాలు గుట్టుగానే దాస్తుంది.

నా సంసారంలో ఈ బాధలు వున్నాయి - అంటూ వీధికెక్కి ఎలుగెత్తి అరిచే ఆడది ఒకతయితే - సంసారం గుట్టుగా లాక్కొస్తుంది మరో ఆడది. గుట్టు రట్టుకానంత వరకూ సంసారంలోని కథలు, గాథలు బయటపడవు. బయట పడింతరువాత ఏముంది- మసిబూసిన మారేడుకాయ! అంతే.

ఈ ఇంటికి చుట్టాలు, పక్కాలు రాకపోకలు తక్కువ. నన్ను ఆదుకునేవాళ్ళూ లేరు - ఆయన్ని అనేవాళ్ళు లేరు. ఎవరూ ఎప్పుడూ ఈ యింట్లో అడుగుపెట్టే పనిలేకపోవటం వల్ల అన్నీ సవ్యంగానే జరిగాయి. లొసుగులు బైటపడే పని కూడా లేకపోయింది.

నేను వూహించలేదు - అకస్మాత్తుగా నీవు వచ్చావు. వచ్చినందుకు నేను సంతోషించానే గాని, విచారించలేదు. ఎందుకంటే - నాకు చెల్లెలువికాబట్టి..... ఇరువురూ వస్తే సంతోషించేదాన్ని.

ఆయన వికారాలు నాకు తెలుసు - అయినా పరాయి ఆడపిల్లల జోలికిరారు అనుకున్నాను. ఇలాంటి విషయంలో ఏమూలో నాకు భయం లేకపోలేదు. అయినా నీవు చదువుకున్నదానివి - పట్నం పిల్లవి. మాటకి మాట జవాబు చెప్పగలవు. ధైర్యంగా ఎదుర్కోగలవు. అదీ నా ధైర్యం!

నీవు యిక్కడ వుంటే ఏ క్షణం ఎలాంటిదో! అలా అని నిన్ను పొమ్మనలేను. నిజం చెప్పి...... ఇక్కడనుంచి నీవు క్షేమంగా వెళ్లిపోవాలి! అది మాత్రం కోరుకున్నాను ఆయన నీతో మాట్లాడుతూ మరో అర్థంతో ఏదో ఒకటి అనేవారు. వారి మాటలకి నీవెక్కడ నొచ్చుకుంటావో అని నేను అడ్డు తగిలి, నవ్వుతూ మాట దాట వేసేదాన్ని.

వారు నీమీద కన్నేశారని నేను గ్రహించాను చాలామంది ఆడపిల్లలని కూడా పాడుచేయటం తెలుసు. అయినా ధైర్యంగా - నీ జోలికి రారు అనుకున్నాను. ఆ ధైర్యంతోనే ఉన్నాను. నిన్న నీవు ఊరికి వెళతాను అని చెప్పావు నేను మాట్లాడలేదుముందు వారే వుండమని బలవంతం చేశారు. నావేపు ఓ చూపు చూశారు. ఆ చూపు విషబాణం లాంటిది. ఆ చూపు నాకు వేయి అర్థాలు తెలియజేస్తాయి.

వారి మాట కాదంటే ఏం జరుగుతుందో నాకు తెలుసు. ఎలాంటి శిక్షకి గురి అవుతానో కూడా తెలుసు. అందుకే..... వెంటనే..... నిన్ను మరో నాలుగురోజులు వుండమని బలవంతం చేశాను. నేను అలా చెప్పాలన్నదే వారి చూపుకి అర్థం. నామాట విని, నీవు ఉండటానికి నిశ్చయించుకున్నావు.

నేను భయపడినంతా అయింది.

మొన్నటి నుంచి ఆయన ప్రవర్తనలో పూర్తి మార్పు వచ్చింది. ఏదో అనర్థకం జరక్కముందే మేలుకోటం మంచిది అనుకున్నాను. "సీతా! నన్నేమీ ప్రశ్నించవద్దు. మీ వూరు వెళ్ళిపో!" అని నోటిదాకా మాట వచ్చేది. బిడియం, సంకోచం, సిగ్గు - ఏదో చెప్పలేను. బహుశా చాతగానితనమేమో! చెప్పాలి అనుకున్నమాట గొంతులోనే వుండిపోయింది. పెదవి దాటను అంది.

నిన్న ఉదయం నుంచే ఆయనలో పూర్తిగ మార్పు వచ్చింది. మృగం పైకి లేస్తు న్నది. కొమ్ములతో పొడవటానికి సిద్ధంగ వుంది. నాకు తెలుసు. ఆపై ఏం జరుగుతుందో, ఎంతదూరం పోతుందో....

ఆయన అనుకున్న ఆడదానిని పొందలేనప్పుడు, పీకదాకా సారాయి తాగి ఆ కైపులో రాక్షస మృగంగా మారి, కోరిక నాతో తీర్చుకుంటూ ఆ ఆడదానితో మాట్లా డినట్లు బూతులతో మాట్లా డుతూ...... ఓహ్! ఆ అసహ్యాన్ని మాటలతో వర్ణించి చెప్పలేను. ఆ అనుభవం ఏ ఆడదానికి వద్దు.

రాత్రి వారు సారాయి సీసాలు తెచ్చుకున్నప్పుడు అలాగే అనుకున్నాను. కాని...... కాని..... ఈ విషయంలో ఆయన పూర్తిగ తెగించారు. ఈ మధ్యాహ్నం నన్ను వారికి అడ్డు రాకుండా బయటికి వెళ్ళమన్నారు. అలాగే అన్నాను. నా చేత అలాగే అనిపించగల శక్తి ఆయన చేతుల్లో వుంది.

"సీతా! రాత్రి నీవు విన్నదంతా నిజమే. కాని..... కాని..... నా చేతులతో ఆయనకి నిన్నెలా వప్పగిస్తా ననుకున్నావు! ఇంతేనా నన్నర్థం చేసుకుంది నీవు?

ఉదయం ఎనిమిది గంటలకల్లా యింట్లో ంచివెళ్ళి పన్నెండు తర్వాతనే కదా తిరిగి ఆయన యింట్లో అడుగుపెట్టేది. ఈ లోపల నీతో ఈ విషయం చెప్పి వూరికి పంపిద్దా మనుకున్నాను. ఈ నిర్ణయం నేను రాత్రే

అలాగే అన్న ఆ నిమిషానే తీసుకున్నాను.

నా నిర్ణయం నీకు తెలియదు. నీవు విన్న సంగతి నాకు తెలియదు. రాత్రి మా మాటలు నీవు వినటం అన్నది జరక్కపోతే, విషయం నా అంతట నేను చెప్పి నిన్ను అర్జంటుగా ఈ నరకం నుంచి తోలేదాన్ని. ఆ అవకాశం నాకు లేకపోయింది. అందుకే నీ దృష్టిలో నీ అక్క కూడా పాపి అయిందమ్మా!

సీతా! నీకు తెలుసో తెలియదో. ఆయన వచ్చేసరికి నీవు వెళ్ళిపోతావు. ఆయన నన్ను అనుమానిస్తారు. పంపింది నేను అయినా బొంకుతాను. రాత్రి సీత మన మాటలు విన్నదటండీ! మన్ని తిట్టి మరీ వెళ్ళింది అంటాను. నాకు తెలుసు నమ్మారు. కోపం పట్టలేక ఏం చేస్తారో తెలుసా? తమాషాగ వుంటుందిలే ఆ శిక్ష. నీవు విని భరించలేవు. చాలా వింత శిక్ష....... తమాషా శిక్ష......"

చెపుతూ చెపుతూ సావిత్రి హిస్టీరియా పేషెంట్ లాగా పెద్దగ నవ్వింది. పడి పడి నవ్వింది.

సీత నోట మాటరానిదాన్లా అవాక్కయి నిలిచిపోయింది.

సావిత్రి అంతలోనే టక్కున నవ్వు ఆపుజేసింది.

"సీతా? నేను చెప్పింది నమ్ముతావు కదూ! నీ అక్క ఎప్పటికీ ద్రోహం చేయదని నమ్ముతావు కదూ? ఈ సావిత్రి చావనన్నా చస్తుందిగాని నీకు అపకారం చేయదు నమ్ముతావు కదూ! ఆయన రాసి రంపాన పెట్టినా భరించే శక్తి వుందిగాని నీవు నమ్మకపోతే మాత్రం భరించలేను సీతా! భరించలేను."

సావిత్రి పెద్దపెట్టున ఏడవటం మొదలుపెట్టింది.

సీత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

సీత అంతవరకు చంకన బ్యాగ్ తగిలించుకుని పెట్టెమీద చేయివేసి అలా నుంచుండిపోయి సావిత్రి చెప్పిందంతా వింది.

సీత బ్యాగ్ ని తీసి పక్కన పెట్టింది. సావిత్రి దగ్గరకు వెళ్ళింది.

"అక్కా! నీ కన్నా చిన్నదాన్ని. నేను తొందరపడ్డా క్షమించే శక్తి నీకుంది" సావిత్రి చేయి పట్టుకుని నెమ్మదిగ అంది సీత.

"సీతా!"

"నేను నిజమే చెపుతున్నాను అక్కా!"

సావిత్రి కళ్ళు అశ్రుపూరితాలు అయాయి.

సీత కళ్ళు జల జల వర్షించాయి.

అయిదు నిమిషాల తర్వాత.

"చాలు సీతా! నాకీ సంతోషం చాలు" అంది సావిత్రి పైట కొంగుతో కళ్ళు అద్దుకుంటూ.

"అక్కా! నీవు నాతో బైలుదేరు. ఈ నరకంలో వుండవద్దు. జీవితాంతం నా దగ్గర హాయిగా వుందువుగాని" ఆవేశంగ అంది సీత.

"అది అయే పనికాదు, నీవు బయలుదేరు." అంది సావిత్రి.

కథల్లో కథానాయికల్లా గా, సినిమాల్లో హీరోయిన్లు లాగా సీత ఆవేశంగ ఏదేదో మాట్లా డింది మనిద్దరం కలిస్తే పుల్లా రావుఏం చేయలేడు. ముఖాన ముక్క చివాట్లు పెట్టి వెళదాం. అసలు యీ బాధలన్నీ ఎవరు పడమన్నారు? నేనైతేనా అందుబాటులో వున్న రోకలి బండగాని కత్తిపీటగాని తీసుకుని ముఖం బద్దలు చేసేదాన్ని. అసలు ఈ బాధలన్నీ ఎలా భరిస్తు న్నావ్? ఎందుకు భరించాలి? చెప్పు అక్కా!

అమాయకురాలా అన్నట్లు చూసి పేలవంగ నవ్వింది.

"నీకు తెలియదు సీతా! అనుభవం నాది అమాయకత నీది. ఎంతో చెపితేగాని నీకర్థం కాదు సీతా! అంతా చెప్పేటంత సమయము లేదు. వక చెడు చేయటానికి పదిమంది కలిసేలా వక మంచిపని చేయటానికి కలవరు. మీ బావ నిన్ను ఊరి పొలిమేరలు దాటనీయకుండా చేయదలుచుకుంటే మాత్రం నీకు న్యాయం జరగదు." అమాయకంగ మాట్లాడే సావిత్రి నిదానంగ మాట్లాడే సావిత్రి గంభీరంగ జీవితానుభవమంతా రంగరించి కాచి వడబోసి తాగి జీర్ణించుకున్న దానిలా అంది.

సీత క్షణం ఆలోచించింది అంతే.

"వెళ్ళొస్తాను అక్కా!"

"వెళ్ళొస్తాను కాదు వెళుతున్నాను అని చెప్పు. రాక రాక చాలా కాలానికి నా యింటికి వచ్చిన చెల్లెలికి నేనేమీ ఇవ్వలేక ఉత్తిచేతులతో పంపిస్తున్నాను" డగ్గుత్తికతో అని "నేను స్వతంత్రంగ చేయగలిగింది. ఇవ్వగలిగింది వకటుంది. అది యిచ్చి పంపుతాను. ఉండు సీతా!" అని సావిత్రి పక్క గదిలోకి వెళ్ళింది.

అక్క ఏం తెచ్చి యిస్తుందో? సీత ఆలోచిస్తూ నుంచుంది.

సావిత్రి కుంకుం బరిణ తీసుకుని వచ్చింది. సీత నుదుట బొట్టు పెడుతూ "నేను నీకు యిచ్చే కానుక యిదే సీతా! చిటికెడు కుంకుమ." అంది.

క్షమించమని అడగటాలు, పాద నమస్కారాలు శరత్ శ్రీకాంత్ లాంటి నవలల్లోను అసలు సిసలైన తెలుగు సినిమాలలోను చూసి, ఛీ..... యిలా ఎవరైనా చేస్తారా? వెర్రి వేషాలు, చాదస్తాలు, అనుకునేది.

అలాంటి సీత.

ఆ క్షణాన.

సావిత్రి కాళ్ళదగ్గర గబుక్కున చేతులు ఆన్చి ఆ చేతులనలాగే పైకి తీసుకుని కళ్ళకద్దు కుంది సీత.

"సీతా!" అంది సావిత్రి.

"నన్నేమీ ప్రశ్నించవద్దు అక్కా!" అంది సీత.

ఆ తర్వాత కొద్ది నిమిషాలకే.

సీతామనోహరి ఆ ఇంట్లో ంచిబయటపడి వేగంగ ముందుకు సాగింది.

అప్పుడు సమయం పది నిమిషాలు తక్కువ పది.

# 32

అతడి పేరు జోగారావు.

ఆమె పేరు చిత్రాదేవి.

వాళ్లిద్దరూ భార్యాభర్తలు. సీతామనోహరి వాళ్ళింటికి వచ్చి రెండురోజులు అయింది. ఈ రెండు రోజులూ ప్రాణం ఎంత హాయిగా వుందో మాటలతో చెప్పలేదు.

ఆ రోజు సీతకి వెంటనే బస్సు అందింది. గోడకి కొడితే వెనక్కి తన్నిన బంతిలా తిరిగి పుట్టింటికి బయలుదేరింది. కాని ఆ బస్సునుంచి మరో బస్సు మారేటప్పుడు గుర్తుకొచ్చి పక్కఊళ్ళోనే చిత్రాదేవి వుండేదని.

సీత స్నేహితురాలు చిత్ర. ఎన్నోసార్లు సీతని తన యింటికి రమ్మని ఆహ్వానించింది. సీతకి వెళ్ళటానికి కుదరలేదు. పని గట్టుకుని వెళ్ళాలంటే బద్ధకం వేసింది. ప్రయాణం మధ్యలో చిత్ర గుర్తుకు వచ్చేసరికి స్నేహితురాలితో సరదాగ గడపోచ్చని ఇటువేపు వస్తున్న బస్సు ఎక్కి చిత్రా వాళ్ళింటికి వచ్చేసింది.

చిత్ర, జోగారావు ఆప్యాయంగా సీతని ఆహ్వానించారు.

చిత్ర పెళ్ళికి సీత వెళ్ళలేదు. అందువల్ల జోగారావుని చూడలేదు ఆ తర్వాత  కూడా చూడటం పడలేదు. ఇప్పుడే మొదటిసారిగ చూసింది.

జోగారావు బిజినెస్ చేస్తున్నాడు. చిన్న అందమైన డాబా ఆధునిక మోడల్ ది వుంది. టి. వి. ఫ్రిజ్. స్కూటరు లాంటివి వున్నాయి. వాళ్ళకింకా పిల్లలు లేరు. అందమైన బొచ్చుకుక్క పిల్లలు రెండు. గుర్రమంత కుక్క మరొకటి వున్నాయి. పెద్ద కుక్క వరండా దాటి యింట్లో కిరాదు. చిన్న కుక్కపిల్లలు గదులుదాటి బయటికి రావు. ఇల్లంతా నీట్ గ తీర్చిదిద్దినట్లు వుంటుంది. ఆ యింట్లో సామానులు ఖరీదైనవే.

"అన్నీ వున్నాయి బాగుంది. వంటావిడని కూడా పెట్టుకోకపోయావా!" ఆ పూట నాలుగు రకాల వంటలు చేసి అలసిపోయిన చిత్రని చూసి సీత అంది.

"వుండేది యిద్దరం. వంట చేసుకోటానికి కూడా మనిషిని పెట్టుకుంటే ఇహ నేను తిరిగే పనిలేదు. తిరగాలి అంటే గుమ్మాలు పెద్దవి చేయించాలి" చిత్ర నవ్వుతూ జవాబు యిచ్చింది.

"పెళ్ళికి ముందు అందంగా నాజుగ్గా వుండేదానివి. ఇదేంటి ఇప్పుడిలా తయారయావ్?"

"ఎలా తయారయానంటావ్?"

"బాగా లావు ఎక్కిపోయావ్. నల్లకప్పు వేశావు. కళ్ళ కింద నల్లని చారలు ఏర్పడ్డాయి. జుట్టు పల్చబడింది."

"నాలుగు ఎబార్షన్లు అయాయి. ఒక ఆపరేషన్ అయింది. ఇప్పుడు నా శరీరంలో వుంది రక్తం కాదే సీతా! మందులు. ఏదో వక మాత్ర వేసుకోంది లేవలేను. తలనొప్పి తగ్గితే కాలునొప్పి, కాలునొప్పి తగ్గితే కన్నునొప్పి వుత్త రోగిష్టి మారిదాన్ని అయాను. మా వారు ఎంత మంచివారో తెలుసా, డాక్టరు యింజక్షన్ యిస్తే నా చెయ్యి నెప్పి చేస్తుందని వారే జాగ్రత్తగా యింజక్షన్ చేస్తారు. అన్నట్లు మా వారు డాక్టరు సొంతంగ వైద్యం చేయగలరు కొన్నాళ్ళు ఆయుర్వేద వైద్యం నేర్చుకున్నారు" చిత్ర చెప్పింది.

సీత ఆ యింటికి వచ్చిం తరువాత కనిపెట్టింది.

ఆ భార్యాభర్తల అపూర్వమైన ప్రేమ. "మీ ఇష్టం అని" చిత్ర "నీ ఇష్టం" అని జోగారావు. వారి మధ్య జోక్స్ తమాషాలు చెప్పనక్కరలేదు.

సీత వచ్చిన రోజు చిత్ర అడిగింది. "రైస్ లోకి మసాలా కోడిగుడ్డు చేయనా, ఆమ్లెట్వేయనా, ఫిష్ వేపుడు వేయించనా?"

సీతకి కనుగుడ్లు వెళ్ళకొచ్చినంత పని అయింది. "మీరు.....మీరు.....మాంసం తింటారా?"

"అదేం ప్రశ్న పిచ్చిమొద్దు. ఈ కాలం మాంసం తినటం కామన్ అయిపోయింది. మావారికి భోజనంలోకిలేంది ముద్ద దిగదు. నాకు యిష్టంలేదని తెలిసి మొదట్లో వారు తినటం మానేశారు. దాంతో మనిషి నలిగిపోయ్యారు. వారి మూగబాధ చూడలేక నేనే బలవంతం చేసి వారిచేత తినిపించాను. మొదట్లో వారు కొనుక్కొచ్చుకుని తినేవారు. తర్వాత నేను వారివరకు వండటం మొదలుపెట్టాను. ఓ రోజు రుచిచూద్దామని బుద్ధిపుట్టింది చీమ తలకాయంత తిని రుచి చూశాను. అంతే ఇప్పుడు ఏనుగు తలకాయ అంత ఆనందంగ తింటున్నాను. మాంసంతో ఎన్నిరకాల వంటలు చేయవచ్చో అన్నిరకాలు నాకు వచ్చు" చిత్ర గొప్పగా చెప్పింది.

ఎందుకయినా మంచిదని ముందే జాగ్రత్తపడుతూ సీత అడిగింది "మీ వారికి డ్రింక్ చేయటం అలవాటు వుందా? ఇంకేమైనా....."

"మాంసంకూడు తిన్నవాళ్ళంతా మహాషులన్నట్లు అదేం ప్రశ్న సీతా! మావారికి దురద అలవాట్లు అంటే మహామంట. ఆఖరికి సిగరెట్టు కూడా ముట్టుకోరు. మాంసం తింటం అంటావా, అది ఫుడ్ కిందకి వస్తుంది" అంది.

"అమ్మయ్య అంతవరకూ నయమే" అనుకుంది సీత.

ఆ రాత్రికి సీతకోసం రెండు రకాల పదార్థాలు, తమకోసం రెండు రకాల ఆధరువులు భోజనంలోకి చేసింది చిత్ర.

మంచి వాగ్ధాటి, నిర్భయంగా మాట్లాడగలశక్తి, ప్రేమ, ఆప్యాయత, మంచితనం, హాస్యప్రియత్వం అన్నీ జోగారావులో వున్నాయి. స్నేహప్రియుడు కూడా. జోగారావు సీత పూర్తిపేరు తెలుసుకుని అన్నాడు.

"చూడండి. దీన్ని సెంటిమెంటు అంటారో చాదస్తం అంటారో నాకు తెలియదు. సీత అన్న పేరు వున్నవాళ్ళంతా అంతో ఇంతో కష్టాలపాలయ్యారని నా అభిప్రాయం. అందుకని మిమ్మల్ని సీతగారు అని పిలవను, మనోహరిగారూ! అంటాను, మీకు అభ్యంతరమా?" అన్నాడు జోగారావు.

"నాకు తెలిసిన సీతపేరు కలవాళ్ళంతా కూడా సుఖంగ వున్నారు. నా పేరులో సీత వుంది, మనోహరి వుంది. మీ యిష్టం ఎలా పిలిచినా పలుకుతాను" అంది సీత.

ఆ తర్వాత సీతామనోహరిగానే పిలవటం మొదలుపెట్టాడు జోగారావు.

"మనోహరిగారూ! అలవాటులేనివి, అయిష్టం కలిగించేవి తినాలంటే ఎవరికయినా కష్టంగానే వుంటుంది. మీరు ముందు భోం చేయండి, తర్వాత మేము చేస్తాము. తోడు కావాలంటే కబుర్లు చెపుతూ కూర్చుంటాను" అన్నాడు జోగారావు.

అతని మర్యాద, మంచితనానికి సీత ముగ్ధురాలు అయింది.

మంచివాళ్ళు మాంసం తినరని ఎక్కడన్నా వుందా? అది వారి అలవాటు. తను బాధపడకూడదని వాళ్ళు

ఎంత జాగ్రత్తపడుతున్నారు! అనుకుంది. "అందరం కలిసి భోంచేద్దాము. మీ పదార్థాలు మీరు తినడం, నా పదార్థాలు నేను తింటాను. చిక్కువుండదు" అంది సీత.

"మేము తినేది చూశారనుకోండి, కడుపులో తిప్పటం మొదలుపెడుతుంది. వాసన పీల్చారనుకోండి వాంతి అయిపోతుంది. వద్దు మనోహరిగారూ! మీరు త్యాగం చేస్తానన్నా మేము త్యాగం చెయ్యము" నవ్వుతూ చెప్పాడు జోగారావు.

సీత భోంచేసిన తర్వాత వాళ్ళు భోంచేశారు.

సీత ఈ యింటికి వచ్చి రెండురోజులు అయింది.

ఈ రెండు రోజులలో -

హాయిగా ఆనందంగా గడిచిపోయింది ఆమెకి.

# 33

"కొద్దిసేపు టి.వి. ఆపి కబుర్లు చెప్పుకుందాం" జోగారావు అన్నాడు.

"అదేమి?" అంది సీత.

"ఆ మధ్యదాకా హాయిగా టి.వి. చూసేవాళ్ళం. వీళ్ళేందుకు టి.వి. ఇంత హాయిగ చూడాలని ఎవరికి కడుపుమండిందో ఏమోమరి ఓ గంటసేపు హైదరాబాద్ రిలే తెలుగు కార్యక్రమాలు చూపిస్తారు. ఆ టైము కూడా

ఎంత మంచిటైము అంటే, పందులు - వాటి జీవన విధానము, వరితెగుళ్ళు, నేలపగుళ్ళు, గొడ్లకి వచ్చే గొడ్లవ్యాదులు ఇవన్నమాట చూపించేది. కలర్ కంపు వదిలేస్తే, వికారంగా ఆకారాలు. పందిపెంట, ఆవుపేడ పిడకలు, చిత్తడినేల ఇవండీ కనిపించేది" జోగారావు వివరించాడు.

"మరీ విచిత్రంగా చెపుతున్నారు, ఓసారి టి.వి. ఆన్ చేయండి చూద్దాం" అంది సీత.

టి.వి. ఆన్ చేశాడు జోగారావు. "ఎవరి కర్మకెవరు కర్తలు మనోహరిగారూ?" అంటు.

టి.వి. ముఖాన కాలెత్తిపెట్టి వీధి కుక్క మూత్రవిసర్జన చేస్తు న్నది అది చూసి సీత "ఛీఛీ ఒక్" అంది. వాంతి మరోక్షణంలో చేసుకునేదానిలా ముఖంపెట్టి.

"అదండీ మనోహరిగారూ! అసలు విషయం" అని చెప్పి జోగారావు టి.వి. కట్టేశాడు.

"జంతువులలో శునకం ప్రత్యేకతకల జంతువు. ముఖ్యముగా మూత్రవిసర్జన చేసే సమయంలో అది ఒక్కబొట్టు కూడా కింద పొయ్యదు. ఏదయినా చూసి దానిపై కాలు ఆన్చి..... ఇలా సుత్తి చెపుతారు" చిత్ర చెప్పింది.

"మీకు రోజూ వాంతులు వికారాలా, ఎన్ని మందులు వాడినా తగ్గటంలేదా, ఎందుకు దేముళ్ళకి మొక్కినా ఇసుమంత ఫలితం కూడా కనపడలేదా, అహ్హహ్హహ్హ.....దీనికో చిట్కా చెపుతాను. మీరు హైదరాబాద్ టి.వి.ని పెట్టుకోకండి, తెలుగు కార్యక్రమాలు చూడండి ఇహ్హి హీహ్హీఅంది చిత్ర.

ముగ్గురు పడిపడి నవ్వుకున్నారు.

"ఫరవాలేదే సీతా! దారిలో పడ్డావు" సీత.

"మీరింకా టి.వి. ఎందుకు కొనలేదు మనోహరిగారూ!" జోగారావు అడిగాడు.

"మా మ్యారేజికి ముందు మావారు టి.వి.కి డబ్బు కొంత కట్టారు. ప్రతినెలా డ్రా తీస్తారు. డ్రాలో ఎవరిపేరు వస్తే వాళ్ళకి టి.వి. వస్తుంది. ఇంకా మూడు డ్రాలు వున్నాయి. ఈ మూడింటిలో ఏది తగలకపోతే మూడునెలల తర్వాతనే మా యింటికి కలర్ టి.వి. వచ్చేది" సీత చెప్పింది.

"మీకు మాయాబజార్ పిక్చర్ యిష్టమా, పాతాళభైరవి యిష్టమా మనోహరిగారూ!" జోగారావు అడిగాడు.

"దేనికదే, రెండూ యిష్టం. ఈ వూళ్ళో ఆడుతున్నాయా?" సీత అడిగింది.

"ఈ వూళ్ళోకాదు, ఈ యింట్లో ఆడతాయి. మా యింట్లో వీడియో కూడా వుంది. ఏ పిక్చర్ వేసి చూపించమంటావు?" చిత్ర అడిగింది.

"రెండు.....రెండూ చూస్తాను" ఆతృతగా అంది సీత.

ఆమెకి అలాంటి సినిమాలు చాలాయిష్టం.

"ఈరోజు హమ్ లోగ్ సీరియల్ వస్తుంది. చాలా బాగుంటుంది, మంచి ఫ్యామిలీ సీరియల్ అది. వార్తలు చూసి, భోంచేసి ఆ తర్వాత పిక్చర్ చూద్దాం" చిత్ర చెప్పింది.

"అలాగే" అంది సీత.

ఆ ఉదయం లేచిన దగ్గర నుంచీ సీతకి అన్నీ సరదాగా గడిచిపోయింది. జోగారావు ఫ్రెండ్స్ ముగ్గురు భోజనానికి వచ్చారు. సరదాగా జోక్స్ కబుర్లు, వాళ్ళున్న రెండున్నర గంటలు రెండు నిమిషాల్లాగ గడిచిపోయింది.

సాయంత్రం సీతతో బజారుకి వెళ్లారు. షాపింగ్ చేస్తుంటే సీతకి తెలిసిన సోమసుందరంగారు కనపడి, వాళ్ళింటికి యిద్దరినీ తీసుకువెళ్ళారు. మర్నాడు రాత్రికి వాళ్ళింట్లో భోం చేయటానికి రమ్మని ఆహ్వానించారు. ఉదయం అయితే ఇంట్లో వాళ్ళుకాలేజేకి, ఆఫీసుకి వెళతారు. రాత్రి భోజనానికి అయితే అంతా సరదాగా కలిసి భోంచేయవచ్చని రాత్రికి ఆహ్వానించారు సోమసుందరంగారు.

రేపు రాత్రికి భోజనం అయితే సీత ఆరుగంటలకి వాళ్ళింటికి వెళ్ళి కాసేపు కబుర్లు చెప్పుకుని అందరూ కలిసి భోంచేసి రాత్రి పదిగంటలకల్లా తిరిగిరావటం అది రేపటి ముఖ్యమైన ప్రోగ్రాం.

షాపింగు, సోమసుందరంగారి ఇంటికి వెళ్ళిరావటం, ఇప్పుడేమో టి.వి. చూస్తూ జోక్స్, రాత్రికి పిక్చరు, ఆ తరువాత కమ్మటి నిద్ర. ఇంక ఆలోచించటానికి టైము ఎక్కడ వుంది!

భోజనం అయిం తరువాత పాతాళభైరవి సినిమా చూశారు ముగ్గురు కలసి. టి.వి. రాంగానే వెంటనే వీడియో కొనుక్కుని నాకు వచ్చిన కేసేట్లన్ని కొనిపెట్టుకుంటే హాయిగ తోచనప్పుడల్లా కోరిన సినిమా యింట్లో నేచూడొచ్చు అనుకుంది సీత.

ఆ రాత్రి -

సీత పడుకుని ఆలోచించటం మొదలుపెట్టింది.

ఈ యింటికి వచ్చిం తర్వాత తనకి ఆలోచించటానికి కూడా సమయం కుదరటంలేదు. నిద్రపోవడానికి మంచం ఎక్కిన తర్వాత రామకృష్ణ గుర్తుకువస్తాడు. సావిత్రి గుర్తుకు వస్తుంది పుల్లా రావుగుర్తుకువస్తాడు. వాళ్ళ గురించి ఆలోచించే లోపలే సీతకి నిద్రాదేవత ఆవరిస్తుంది

ఇక్కడ కూడ -

జోగారావు, చిత్ర వాళ్ళ బెడ్ రూమ్ లో పడుకుంటే, సీత ఇవతలి పక్క రూమ్ లో పడుకుంటుంది.

అలా పడుకోవటం వల్ల సీతకేమి యిబ్బంది కలగలేదు. కాకపోతే ఓమాట అనుకుంది.

'జోగారావు మంచివాడు చాలా విషయాలలో, కాని ఏమిలాభం, పెళ్ళాన్ని విడిచి ఒక్క రాత్రి కూడా వృధాగా నిద్రపోడు. ఈ విషయంలో రామకృష్ణ నిజంగా త్యాగపురుషుడు.'

అలా అనుకుందో లేదో సీతకి నిద్రపట్టేసింది హాయిగ.

రాత్రి ఏడు పది -

సోమసుందరంగారింటికి భోజనానికి వెళ్ళిన సీత భోజనం చేయకుండానే తిరిగి చిత్రవాళ్ళింటికి వచ్చింది.

సోమసుందరంగారు సీతతోపాటు చిత్రని కూడా భోజనానికి పిలిచారు. కాని ఆ ఉదయం నుంచీ చిత్రకి వంట్లో బాగుండలేదు. లేస్తే కాళ్ళు తడబడటం, కళ్ళు తిరగటం, ముచ్చెమటలు దిగజారటం, చాలా డల్ గా అయిపోయింది. ఈరోజు బి.పి. బాగా ఎక్కువయింది. నేను పడుకుని రెస్ట్ తీసుకుంటాను, నీవు భోజనానికి వెళ్ళిరా. నీవు వెళ్ళకపోతే బాగుండదు, సోమసుందరంగారు ఏమన్నా అనుకుంటారు. అని చెప్పి, సీతనొక్కదాన్నీ పంపించింది చిత్ర.

సీత అక్కడికి వెళ్ళేసరికి సోమసుందరంగారి ఫామిలీ మొత్తం అర్జంటుగా వూరికి వెళుతున్నారు. ఆయన తమ్ముడికి స్కూటర్ యాక్సిడెంట్ అయింది. చాలా సీరియస్ గా వుంది వెంటనే బయలుదేరి రమ్మంటూ టెలిగ్రాం వచ్చింది దాంతో అందరూ బయలుదేరి వెళుతున్నారు.

"నిన్ను భోజనానికి పిలిచి, మేము......" సోమసుందరంగారు నొచ్చుకుంటూ ఏదో అనబోయారు.

వెంటనే సీత "నా భోజనానికి ఇబ్బంది ఏముంది? మీ తమ్ముడు క్షేమంగా వుండటం ముఖ్యం. మీరు సంతోషంగా ఊరి నుంచి తిరిగి రావాలి" అంటూ తనకి చాతనైనంత మాట్లాడి తిరిగి చిత్ర వాళ్ళింటికి బయలుదేరింది.

రాత్రి ఏడూ పదికి చిత్ర వాళ్ళింటి ముందు రిక్షా దిగింది సీత.

సీత పావుతక్కువ ఆరు గంటలకి సోమసుందరం ఇంటికి బైలుదేరి వెళ్ళింది. మధ్యలో సరిగా గంట - తిరిగి వచ్చింది.

సీత వెళ్లేముందు - చిత్ర వంట్లో బాగుండక పడుకుని వుంది. చిత్ర లేచిందో లేదో! ఈ వయసులో బి.పి. ఏమిటో - అనుకుంటూ సీత నెమ్మదిగా ఇంట్లో కివచ్చింది. తలుపు తట్టుదామని తలుపుమీద చేయి వేసేసరికి, తలుపు గడియవేసి లేదేమో - తెరుచుకుంది. సీత లోపలికి అడుగుపెట్టింది.

"చిత్రా!" అని పిలుద్దామనుకుని, ఓవేళ నిద్రపోతున్నదేమో - ఎందుకులే అనుకుంటూ బెడ్ రూమ్ వైపు వెళ్ళింది సీత.

"ప్లీజ్ నన్ను చంపొద్దు. ఇలా కొంచెం నా ప్రాణం తీయొద్దు." చిత్ర వేడుకుంటున్నట్లు బాధాపూరిత స్వరంతో అంటున్నది.

"ఛా..... ఛా...... నిన్ను చంపుతానా?" అన్నాడు జోగారావు.

గదిలోపల కాలు పెట్టబోయిన సీత - వాళ్ళ మాటలు వింటూనే గబుక్కున యివతలికి తప్పుకుంది. వాళ్ళ మాటలు తను సరీగా విన్నదా! అనుకుందో లేదో -

"సీత విషయంలో నీకంత పట్టుదల ఎందుకు చిత్రమ్మా!" వ్యంగ్యంగా అంటున్న జోగారావు మాట వినపడింది. వెంటనే సీతకి ఏదో అర్ధమయినట్లే అనిపించింది. నెమ్మదిగా కిటికీ పక్కకి తప్పుకుని, కిటికీ కర్టెన్ కాస్త తొలగించి లోపలికి చూస్తూ చెవియొగ్గింది సీత. మేకవన్నె పులులుంటాయని తెలిసింది కదా!

బెడ్ రూమ్ లోపల -

చిత్ర మంచంమీద పడుకుని వుంది. పక్కనే జోగారావు కూర్చుని వున్నాడు. జోగారావు చేతిలో ఇంజక్షన్ బాటిల్ వుంది. దానిని ఎగరేసి పట్టుకుంటూ ఆడుతూ మాట్లాడుతున్నాడు

సీత నుంచున్నవేపు హాలులో లైటు లేదు. వాళ్ళగదిలో లైటు వుంది. అందువల్ల వాళ్ళకి సీత కనపడదు.

సీతకి మాత్రం వాళ్ళు చక్కగా కనపడుతున్నారు. అప్పటికే ఒక చెడ్డ అనుభవం రుచిచూసిన సీత ఇప్పుడు వెంటనే కళ్ళు తెరిచి పనిగట్టుకుని, చాటుగా వుండి వాళ్ళ మాటలు వినటం మొదలుపెట్టింది.

తొమ్మిది దాటింది. సీత తిరిగి రాదనే ధైర్యంతో వున్న జోగారావు, చిత్ర మామూలుగా మాట్లాడుకుంటున్నారు

"నరాలు గుంజుతున్నాయి. ప్రాణం పోతున్నది. తలంతా పిచ్చి పిచ్చిగా వుంది. ఉండి ఉండి కళ్ళముందు చీకట్లు - ప్లీజ్ క్విక్ గా ఇంజక్షన్ ఇవ్వండి!" చిత్ర బాధతో కాళ్ళూచేతులూ కొట్టుకుంటూ అడిగింది.

"పావుగంట నుంచీ చిలక్కి చెప్పినట్లు చెపుతున్నాను. సరే - మీరు చెప్పినట్లే వింటాను అన్నావా? నీ శరీరం యీ ఇంజక్షన్ కి అలవాటు పడింది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రము ఓ డోస్ మందు నీ ఏనుగు శరీరంలోకి ఎక్కించకపోతే నరకబాధ పడతావు. చావవు కాని, మరణబాధ యాతనతో కొట్టుకు, కొట్టుకు చస్తుంటావు. ఈ బాధంతా ఎందుకు గాని- ఊ అను......" ఇంజక్షన్ బాటిల్ ని చిత్ర కళ్ళముందు వుంచి, తమాషాగా కదిలిస్తూ అడిగాడు జోగారావు.

"ఉదయం కూడా ఇంజక్షన్ చేయలేదు. నా నరాలు గుంజుకుపోతున్నాయి. ఇంజక్షన్ చేయండి- మీ మాట ఎప్పుడు కాదన్నాను నేను. సీత అంటే నా ఫ్రెండ్....."

"నీ ఫ్రెండ్ - ఇంతోటి బోడి ఫ్రెండ్! నీ ఫ్రెండ్ ని రక్షించుకుంటావో - ఈ బాటిల్ ని రక్షించుకుంటావో నీ యిష్టం. ప్రస్తుతం ఇంట్లో రెడీగా వున్నది ఈ ఒక్కటే. నేను ఒన్.....టు.....త్రీ.....అంటాను. త్రీ అనే లోపల ఒప్పుకున్నావా వెంటనే ఇంజక్షన్ యిస్తాను. ఒప్పుకోవా - నీ కళ్ళముందే విసిరి నేలకేసి కొడతాను. ఇదే లాస్ట్ వార్నింగ్ - వన్....టు....

"ఒప్పుకుంటాను." చిత్ర త్రీ అనేలోపల పెద్దగా అరిచింది.

జోగారావు కళ్ళు మిల మిల లాడాయి. "గుడ్! నాకు తెలుసు - నా చిత్ర బంగారు పిల్ల. కాకపోతే అప్పుడప్పుడు కాస్త మొండికేస్తుంటుంది. చూడు చిత్రా! ఎప్పుడూ కూడా మనం - మన మనసుకి ఆనందం కలిగించేది, మన శరీరానికి సుఖాన్ని యిచ్చేది ఏదో అది చూసుకోవాలి. అంతేగాని త్యాగం, సెంటిమెంటు వద్దు.

పరుల సంగతి మనకనవసరం. ఎవరి చావు వాళ్ళు చస్తారు." అలా సరదాగా మాట్లాడుతూ సిరంజీలోకి బాటిల్ లోని మందు మొత్తం ఎక్కించి, చిత్ర చేతి నరంలోకి సూదినేక్కించి ఇంజక్షన్ చేశాడు.

"ఓహ్! ఇప్పుడు వేయి ఏనుగుల బలం వచ్చింది. స్వర్గంలో తెలిపోతున్నట్లు వుంది. ప్రాణం ఎంత హాయిగా వుంది!" చిత్ర అరమోడ్పు కనులేసుకుని ఆనంద తరంగాలలో తేలిపోతూ అన్నది.

"చిత్రా! ఎన్నో రకాల మత్తు మందులు నీ రక్తంలో కలిసి వాతాపిజీర్ణం అయాయి. ఓ.పి.యం, హీరాయిన్, భంగు, చెరస్, ఎల్.ఎస్.డి.- ఎన్ని రకాలు నీకు రుచి చూపించాను! చివరికి వాటన్నిటికన్నా ఖరీదయినది - అపురూపమైనది ఈ మధ్యనే కొత్తగా మార్కెట్ లోకి వస్తున్నది నీకోసం కష్టపడి మరీ తెప్పిస్తున్నానే! ఎవరికోసం - నీ సుఖం కోసమే కదా! ఈ కొత్త మత్తు మందు థ్రిల్లీ - వంద బాటిల్స్ ఎల్లుండే తెప్పించి పూర్తిగా నీకిచ్చేస్తాను....."

"మన ఒప్పందం మరచిపోయావా, బంగారుకొండ! నీ కోరికలు అలా తీర్చాలి - నా కోరికలు నీవు తీర్చాలి. అలా పరస్పరం తీర్చుకుంటూ మనం సుఖపడుతున్నాము. డబ్బుకి డబ్బు, శరీర సుఖానికి సుఖము. బైటవాళ్ళంతా నేను బిజినెస్ లో సంపాదిస్తున్నాననుకుంటున్నారు. నా అసలు సీక్రెట్ బిజినెస్ ఎవరికీ తెలియదు. నీకు తెలిసిందే కదా! సరే - నేను చెప్పింది గుర్తుందా!"

"ఆ.....సునీతను ఎలా బరిలోకి లాగామో - అలా!"

"అదే- ఎలాగో మరోసారి చెప్పు. సునీత స్థానంలో సీతని వూహించుకుంటూ తాత్కాలికంగా ఆనందిస్తాను."

"సునీత జయవర్ధనరావు భార్య. స్నేహంగా మనింటికి వస్తుండేది ఆమెని పొందాలనుకున్నారు మీరు. దానికో ప్లాన్ వేశాము. గుడ్డెద్దు చేలో పడ్డట్లు పడింది సునీత. ఆ తర్వాత.... ఆమెతో...."

"బస్ - నీకు గుర్తుందో లేదో అని అడిగాను. సరే, మళ్ళీ జాగ్రత్తగా విను. అర్జెంట్ గా వూరికి వెళ్ళాల్సి వచ్చింది. రెండు రోజులదాకా రాను అని చెప్పి, రేపు ఉదయం నేనుఇంట్లోంచివెళతాను. నీవు, సీత యింట్లో మిగులుతారు. రక రకాల కబుర్లు చెపుతూ బ్లూ ఫిలుంల సంగతి ఎత్తు. సీత అభిప్రాయం కనుక్కో. ఛీ....ఛీ....

వెధవ బూతుగోల నా దగ్గర ఎత్తకు అందనుకో - మనం కాస్త కష్టపడి దాని ముక్కుకి తాడేసి, మన దారిలోకి లాగాల్సి వుంటుంది.

అలాగాక, నిజంగా బ్లూ ఫిలుంలు వుంటాయిటే, నాకు చూడాలని వుంది అని సీత అందనుకో - మన పని తేలికగా అవుతుంది. మావారు, నేను రహస్యంగా వేసుకుని చూడటానికి ఓ కేసెట్ యింట్లో దాచాము. వారు రాత్రికి వూరు నుంచి రారు. రాత్రికి వేసి చూపిస్తాను అను సీత బ్లూ ఫిలిం చూడాలనే కుతూహలంతో సరే అంటుంది.

థ్రిల్లీ ఇంజక్షను, బాటిల్స్ తో పాటు నీకో టాబ్లెట్- అలాంటి మందుతో తయారయిందే యిస్తాను. ఆ టాబ్లెట్ నీళ్ళలో కలిపో, పాలలో కలిపో సీతకి యివ్వు. టాబ్లెట్‌సీతమీద ప్రభావం చూపుతుంది. లేవాలనుకుంటుంది - పైకి లేవలేకపోతుంది. నరాలు జిల్లు మంటుంటాయి మనసు తేలిపోతుంటుంది. అప్పుడు నీవు బ్లూ ఫిలింవేసి సీతకి చూపు. సరీగా అప్పుడే నేను రంగప్రవేశం చేస్తాను. ఆపై......"

"ఆపై జరిగేది నేను చెపుతాను. ఆ ఫిలుంని అరమోడ్పు కన్నులతో చూస్తున్న సీతని మీరు తేలికగా లొంగదీసుకుంటారు. మీ యిరువురి రాచక్రీడలు నేను కెమెరాలో బందిస్తాను. మర్నాడు తెలివి తెచ్చుకుని ఏడుస్తుంది. ఏడ్చి మొత్తుకున్నా లాభంలేదు- మేము చెప్పినట్లు వినకపోతే నీ బూతు పురాణం ఫోటోలు వూరంతా పంచుతాము అంటాము. సీత చచ్చినట్లు మన మాట వింటుంది. భోజనానికి వచ్చిన మన ఫ్రెండ్స్ ముగ్గురూ మళ్ళీ మనింటికి విందుకి వస్తారు. వాళ్ళు ముగ్గురూ సీత బ్లూ ఫిలింషూటింగ్. మీరు ఫిలిం తీస్తారు. నేను డైరక్షన్ చేస్తాను. నాలుగురోజులు కుక్కలా మనింట్లో వుండి, పందిలా పొర్లి నోరు మూసుకుని వాళ్ళ వూరు వెళుతుంది. మనం ఈ కొత్త కేసెట్ ద్వారా లక్షలు సంపాయిస్తాము. సీతని అనుభవించాలనే మీ కోరిక తీరుతుంది. మన బిజినెస్ మూడు పూలు - ముప్పై ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది నాకు మూడు నెలలకు సరిపోను థ్రిల్లీ బాటిల్స్ ఒక్కసారిగా వచ్చిపడతాయి.

సీత నా స్నేహితురాలు. దానిని అలా ఎందుకో పాడు చెయ్యబుద్ధి కాలేదు. మీ మాట కాదన్నాను. మీరేమో అలవాటుపడిన ఇంజక్షన్ యివ్వకుండా చంపితిరి. నరకం చూశాను - " చిత్ర ఇంజక్షన్ ప్రభావంవల్ల ఆనందంతో తేలిపోతూ చెప్పింది.

"ఈ తపా ఫిలుం కొత్తరకంగా తీద్దాము. ఎంత సెక్స్ అయినా - కొత్తరకం లేకపోతే కొనేవాళ్ళు ఆలోచిస్తున్నారు" జోగారావు అన్నాడు విస్కీని గ్లాసులో పోసుకుని చప్పరిస్తూ.

"కొత్తరకం అంటే?"

"మనిషి, జంతువులు......"

"జంతువులా?"

"మన ఫ్రెండ్స్ కి జంతువుల వేషాలు వేస్తాను. ఎలా అంటే....." జోగారావు వివరించటం మొదలుపెట్టాడు.

తాము వీధిగడియ వేయకుండానే, వేశామనుకుని ధైర్యంగా మాట్లాడుకుంటున్నారు జోగారావు. చిత్ర. వాళ్ళు చేసిన ఆ చిన్న పొరపాటు సీతకి ఉపయోగపడింది.

నరరూప రాక్షసులు, దుష్టులు, దుర్మార్గులు - పలురకాల వాళ్ళు వుంటారని సీత విన్నది గాని - జీవితంలో దుర్మార్గులు, కాముకులు తారసపడలేదు. మొదటిసారిగా పుల్లారావువాళ్ళింట్లో కనీ వినీ ఎరుగని ఆ అనుభవానికి భయకంపితురాలు అయింది. షాక్ తింది. సీతకి యిది ఇప్పుడు జోగారావు వల్ల తెలుసుకుంది. ధైర్యంగా వింది, తెలివిగా ఆలోచించింది అప్పటికప్పుడే.

సీత చడీ చప్పుడు కాకుండా బెడ్ రూమ్ తలుపులు బయట గడియపెట్టింది. దానికున్న తాళం కూడా వేసి తాళం చెవి తాను తీసుకుంది. ఇవతలి గదిలో వున్న ఫోను విషయం ఫరవాలేదు. ఎవరైనా వచ్చి తాళం గాని తలుపులు గాని బద్దలు కొడితేగాని జోగారావు చిత్ర బయటికి రాలేరు.

సీత తన బ్యాగ్ సూట్ కేసు తీసుకుని వీధి తలుపు కూడా తాళం పెట్టి తాళం చెవిని తన ఫర్సులో వేసుకుని ఆ ఇంట్లో ంచిబయటపడింది. ఈ పనులన్నీ సీత చడీ చప్పుడూ కాకుండా చేయటం వల్ల లోపల వున్న వాళ్ళకి అణుమాత్రం కూడా తెలియలేదు. నూరు జీవాలని అవలీలగా తిన్న రాబందు వక్క బాణం వేటుకి చచ్చి పడినట్టు.

వాళ్ళ సుఖాల కోసం ఎందరి ఆడవాళ్ళ జీవితాలనో అవలీలగా తమ గుప్పెటలో బిగించిన జోగారావు చిత్ర చాలా తేలికగ తమ గదిలోనే బందీలు అయిపోయారు.

సీత ఆటో చేసుకుని స్టేషనుకి వచ్చింది.

సీత అదృష్టం మూడు గంటలు ఆలశ్యంగ  వచ్చిన ఓ ట్రైన్ రెడీగ స్టేషనులో వుంది.

మరో పది నిమిషాల తర్వాత.

సీత ఎక్కిన ట్రైను బరువుగ భారంగ ముందుకు సాగింది.

# 35

ఆ ఉదయం.

సీత క్షేమంగ యింటికి వచ్చింది.

నిజం చెప్పి తల్లీ తండ్రిని బాధ పెట్టటం యిష్టం లేక తన ప్రయాణం బాగా జరిగిందని ఏవేవో చెప్పింది సీత.

కుశల ప్రశ్నలు ప్రయాణం విషయం అడిగారు గాని రామకృష్ణ గురించి కబురు గాని లెటర్ విషయం గాని ఏది సీతతో మాట్లా డలేదు చివరికి వుండబట్టలేక సీతే అడిగింది. "వారేం లెటరు రాయలేదా?" అని.

"రాయలేదు మనూ! అదే నేనూ చూస్తు న్నాను!" అన్నారు రావుగారు.

రామకృష్ణ లెటర్ రాయకపోటం సీతకి పిచ్చి పట్టినట్లు అయింది. భోజనం అయిందాకా మామూలుగ వున్న సీత మధ్యాహ్నం తనగదిలో పడుకుని తనివితీర ఏడవటం మొదలుపెట్టింది.

తను బాధ పడుతున్నట్లు గాని ఏడుస్తు న్నట్లుగాని తల్లీ తండ్రికి తెలియకూడదని దిండులో ముఖం నొక్కుకుని కన్నీరు కారుస్తు న్నది సీత.

సక్కుబాయమ్మ నెమ్మదిగ గదిలోకి వచ్చి సీత పక్కనే కూర్చుని తలమీద చేయివేసింది. సీత చటుక్కున తల్లి వడిలో తల దూర్చుకుని చిన్నపిల్లలా బేర్ మంది.

సక్కుబాయమ్మ మౌనంగ తల నిమరటం తప్ప మాట్లా డలేదు

"ఏం జరిగిందో తెలుసా అమ్మా!" వెక్కుతూ అడిగింది సీత.

"మా కంతా తెలుసు మనూ!" ఈ మాట అన్నది సక్కుబాయమ్మ కాదు రావుగారు.

సీత చివ్వున తలపైకి ఎత్తింది. "నాన్నగారూ!" అంది.

"మనూ! లేచి సరీగ కూర్చో. కళ్ళు తుడుచుకో, నే చెప్పేది జాగ్రత్తగ విను" రావుగారు గంభీర్యంగ ఆజ్ఞాపిస్తు న్నధోరణిలో అన్నారు.

సీత లేచి సరీగ కూర్చుంది.

"మనూ! నీవు వచ్చిన మూడోరోజు రామకృష్ణ నుంచి నాకు వివరంగ లెటర్ వచ్చింది. అక్కడేం జరిగిందో ప్రతిమాట రాశాడు. సీత అమాయకురాలు సీత యింకా చిన్నపిల్ల. సీతనేమి అడగవద్దు అనొద్దు. కోపం చల్లా రిం తరువాత సీత మళ్ళీ నా దగ్గరకు వస్తుంది. ఓ వేళ రాకపోతే ఓ నెల ఆగి నేనే అక్కడికి వస్తాను. అంటూ రామకృష్ణ రాశాడు.

రామకృష్ణ మంచివాడు కాబట్టి నీ మనసు నొచ్చుకోకుండా వుండటానికి జరిగింది దాయటానికి ప్రయత్నించాడు. అది తప్పు అయిందా మనూ! నా ఇష్టం నా సంపాదన నేను మగవాడిని తాగుతాను తందనాలాడుతాను. నీ యిష్టమైతే వుండు పోతే పో అంటే ఏం చేయగలవు?"

అవును. తను చేయగలదు? పుట్టింటికి రాగలదు. చావగలదు. లేకపోతే ధైర్యంగ ఏ ఉద్యోగమో చేసుకుంటూ బతకగలదు. ఈ సమాజంలో వెంకట్రావులు దశరధరామయ్యలు, పుల్లా రావులు జోగారావులు. ఎన్ని నర పశువులు. వాళ్ళందరి మధ్య రామకృష్ణ ఎంత మంచివాడు. అలాంటి భర్తని తను......

సీత ఆలోచిస్తున్నది. సీత ఆలోచిస్తు న్నదని తెలియని రావుగారు మెత్త మెత్తగ చివాట్లు పెడుతున్నారు.

"చాల్లెండి మీ వుపన్యాసం. అది వాళ్ళాయన గురించి ఆలోచిస్తు న్నది" నవ్వుతూ అంది సక్కుబాయమ్మ.

"మనూ! ఆలోచిస్తు న్నావా?" రావుగారు అడిగారు.

"అవును నాన్నగారూ! మా వూరికి ఇప్పుడే ప్రయాణమై వెళదామా! సాయంత్రం వెళదామా అని ఆలోచిస్తు న్నాను" సీత సిగ్గుపడుతూ చెప్పింది.

"అదేమిటే సీతా! నీవు వచ్చి రెండు గంటలు కాలేదు అప్పుడే ప్రయాణమా! అదేం కుదరదు నాలుగురోజులు విశ్రాంతి తీసుకుని వెళ్లా ల్సిందే" అంది సక్కుబాయమ్మ.

"చూడండి నాన్నగారూ! మీరెలా చెపితే అలా." అంది సీత.

"మనూ! నీవు నీ సొంత నిర్ణయంమీద బయలుదేరి వచ్చావు. ఎప్పుడు వెళ్ళాలన్నది కూడా నీవే నిర్ణయించుకోటం మంచిది" రావుగారు గంభీర్యంగ అన్నారు.

"సాయంత్రం కాఫీ తాగి వెళతాను" సీత చెప్పింది.

"మంచిది" అన్నారు రావుగారు.

"లేడికి లేచిందే పరుగు" గొణిగింది సక్కుబాయమ్మ.

# 36

సీత రైలు దిగింది.

సీత స్టేషన్ బయటికి రాబోతుంటే రామకృష్ణ స్టేషను లోపలికి రాబోతున్నాడు. ఎదురెదురు పడ్డారు.

"సీతూ!" అన్నాడు రామకృష్ణ ఆశ్చర్యంగ.

"ఏమండీ!" అంది సీత అంతకన్నా ఆశ్చర్యంగ.

"ఊరినుంచా!" అడిగాడు రామకృష్ణ.

"ఊరికా?" అడిగింది సీత.

"నీ కోసం బయలుదేరాను." అన్నాడు రామకృష్ణ.

"మీకోసం వచ్చాను" అంది సీత.

సీత నవ్వింది. రామకృష్ణ నవ్వాడు. ఆ తర్వాత ఆటో ఎక్కేసి ఇరువురు యింటికి వచ్చారు.

ఆ రాత్రి.

"మిమ్మల్ని క్షమించమని అడిగితే బాగుంటుందేమో?" సీత అడిగింది.

"వద్దు లేద్దూ మరీ సిల్లీగ వుంటుంది" అన్నాడు రామకృష్ణ.

సీత నవ్వింది.

రామకృష్ణ నవ్వాడు.

ఆ తర్వాత

తను ఈ యింటికి గడప దాటిన దగ్గరనుంచి మళ్ళీ ఈ రోజు ఈ గుమ్మంలో అడుగుపెట్టిందాకా ఏ నిమిషాన ఏమీ జరిగింది సీత వివరంగ రామక్రిష్ణకి చెప్పింది చెప్పి.....

"నేను జోగారావుకి చిత్రకి యింకా పెద్ద శిక్ష వేద్దామనుకున్నాను. నాకు చాతనైనది చేశాను. అలా కాదు వాళ్ళకి యింకా పెద్ద శిక్ష పడాలి. ఏం చేద్దాం చెప్పండి" అంది సీత.

"ఇలాంటి విషయాలు రేపు చర్చించుకుందాము. ఈ కేసు రేపటికి వాయిదా వేశాను" రామకృష్ణ అన్నాడు.

"భగవంతుడన్నవాడు వున్నాడు కాబట్టే సోమసుందరంగారు ఊరికి బయలుదేరటము నేను వెంటనే ఇంటికి తిరిగి రావటం వల్ల. రెండు ముఖాల మనిషిని చూడటం జరిగింది. నిజంగ యిది భగవంతుడి.......

సీత యింకా ఏదో చెప్పబోయింది. "ఇదియును దైవ నిర్ణయము. మనము నిమిత్త మాత్రులము. ఈ విషయముపై రేపు సావధానముగా చర్చించుకుందాము" అన్నాడు రామకృష్ణ.

"ఆన్నీయు రేపు రేపు అని వాయిదా వేస్తారేమిటి? ఇప్పుడు ఏం చేయాలి ఏమిటి?" సీత చిరుకోపంతో అడిగింది.

"ప్రతిదానికి సమయా సమయములు తగిన సమయములలో వుంటాయి. ఏవి ఎప్పుడో అప్పుడే చూడాలి. ఇప్పుడు మనం చేయవలసింది ప్రయోగము."

"ప్రయోగమా?"

"ఎస్, అనుమానాలు అపార్ధాలతో విడిపోయి. ఆ తర్వాత నిజం తెలుసుకుని భార్యాభర్తలు కల్సుకుంటే ఆ కలయికలోని మధురిమ మాటలతో వర్ణింపజాలము. ఆ అనుభూతి మధురిమ ఏ జంట కా జంట తెలుసుకోవాల్సిందేనని ఓ నవలలో ఓ రచయిత్రి రాస్తే ఓ నాడు మనం చదివి అదెట్లా వుంటుందో చూద్దామనుకున్నాము కదా! అనుమానం అపార్ధం విడిపోవటం కల్సుకోటం అయింది. ఇహ ప్రయోగములోకి ప్రవేశించి చూడనా హిమసుందరీ!" రామకృష్ణ తొందర పడిపోతూ అడిగాడు.

"హిమసుందరా! ఆవిడేవరు?" సీత అడిగింది.

"నువ్వే."

"నా పేరు సీతామనోహరి కదా!"

"అవుననుకో, నిన్ను చూస్తుంటే అలా పిలవబుద్ధి వేసింది పిలిచాను. హిమము అన్నా హిమ, అన్నా మంచు కదా! మంచు చల్లగా వుంటుంది కదా! ప్రస్తుతం అమ్మాయిగారు చల్లబడి తిరిగి వచ్చారు కదా! అందుకని హిమ అన్నాను. అందంగ కనిపించేసరికి సుందరి అన్నాను. వెరసి హిమసుందరీ! అన్నాను తప్పా?"

"తప్పో వప్పో నన్ను కాస్త ఆలోచించనీయండి" అంది సీత.

"ఆలోచిస్తూ కూర్చుంటే అవతల తెల్లా రిపోతుంది" అన్నాడు రామకృష్ణ.

సీత ఏదో మాట్లా డబోయింది.

రామకృష్ణ మాట్లా డనివ్వలేదు.

అంతే.

## ____:సమాప్తం:____

## ENDING COVER PAGE

### హిమసుందరి

### కురుమద్దా లి విజయలక్ష్మి

ఏ రచనన్నైనా తేలికగా రాయొచ్చుగాని, క్రైం రచన చేయటం మహాకష్టం. పదినెలలు మోసి పండంటి బిడ్డను కనడం తేలిక. పసిపిల్లలను సాకటం తేలిక ఏటికి ఎదురీదటం మహాతేలిక. అజ్ఞాతవాసంలో ఉన్న హంతకున్ని పట్టుకోవటం తేలికే కాని ఒక క్రైం రచన చేయటం మటుకు చాలా కష్టం.

ఓ పెద్ద రచయిత్రి వ్రాసిన నాలుగొందల పేజీల పెద్ద నవల చదివిన సీత రచయిత్రిని కావాలనుకోవడం,

అనుకోవటమే తడవుగా ఓ పెన్ నేమ్ ఆలోచించటం "అగ్నిపుత్రి అంటే సీత-సీత అంటే తనే! ఎంత మంచి పెన్ నేమ్ దొరికింది!.

సీతకి చాలా సంతోషం కలిగించి ఆ సంతోష సమయంలో చదివిన క్రైం సాహిత్యాన్ని ప్రక్కకునెట్టి సాంఘికం వ్రాయటానికి ఆయిత్తమైంది.

నవల చదవటం వేరు వ్రాయటం వేరు, వ్రాసే విధానం ఎదుర్కొనే పాత్రల చిత్రణకు ప్రతిరూపము కురుమద్దాలి విజయలక్ష్మిగారి నవలలు.